# ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర

## బి. ఎ. స్పెషల్ తెలుగు
## ద్వితీయ సంవత్సరం, సెమిష్టర్ – 4


**రచయితలు**

**డా॥ జి. గౌరి**
తెలుగు అధ్యాపకులు,
తెలుగు విభాగం,
ఎస్.కె బి.ఆర్ ప్రభుత్వ కళాశాల,
మాచర్ల.

**డా॥ జి. స్వర్ణలత**
తెలుగు అధ్యాపకులు,
తెలుగు విభాగం,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
వినుకొండ.

**డా॥ ఎన్. విజయలక్ష్మి**
తెలుగు అధ్యాపకులు,
తెలుగు విభాగం,
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల.
గుంటూరు.

**డా॥ సిహెచ్. అనిత**
తెలుగు అధ్యాపకులు,
తెలుగు విభాగం,
కె.ఆర్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
అద్దంకి.

**సంపాదకులు,**
**డా॥ వి. నాగ రాజ్యలక్ష్మి**
రిటైర్డ్ ప్రిన్సిపాల్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేబ్రోలు.

**రచయిత మరియు సమన్వయకర్త**
**ఆచార్య ఇరపని మాధవి**
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**సంచాలకులు**
**డా. నాగరాజు బట్టు**
*ఎం.బీ.ఏ., ఎం.హెచ్.ఆర్.ఎం.,ఎం.ఎస్. సి.(సైకాలజీ), ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ.(సోషియాలజీ), ఎం.ఇ. డి., ఎం.ఫీల్., పిహెచ్.డి.*
దూర విద్యాకేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్ – 522 510, గుంటూరు.

**Ph : 0863 - 2346208, 2346222, 2346259 ( Study Material)**
**Website : www.anucde.info**
**e-mail : anucdedirector@gmail.com**

# బి. ఎ. స్పెషల్ తెలుగు

## ద్వితీయ సంవత్సరం   సెమిష్టర్ – 4

# ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర

**తొలి ప్రచురణ : 2023**

**కాపీల సంఖ్య :**

ISBN 978-93-95854-98-6

**© ఆచార్య నాగార్జున యూనివర్శిటి**

ఈ పాఠ్య పుస్తకం ఆచార్య నాగార్జున యూనివర్శిటిలోని దూర విద్యాకేంద్రం నందు ద్వితీయ సంవత్సరం బి. ఎ. విద్యనభ్యసించున్న విద్యార్థుల కొరకు ప్రత్యేకంగాను మరియు పరిమిత పంపిణికై ఉద్దేశించి ముద్రించబడినది.

**ప్రచురణ కర్త :**
**డా. నాగరాజు బట్టు,**
**సంచాలకులు,**
**దూర విద్యాకేంద్రం,**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.**

**ప్రచురించినది :**

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు,పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే 'A' గ్రేడ్ ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికిసంతోషిస్తున్నాను.ప్రస్తుతం గుంటూరు , ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలలకు డిప్లమో, డిగ్రీ , పీజీ స్థాయి విద్యా బోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003 –2004 లో దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్లి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక గల గృహిణులకు ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బీ.కాం., బి. ఎస్ సి. , పీజీ స్థాయిలో ఎం.కామ్., ఎం.ఎస్ సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బీ.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అని సర్టిఫికెట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యను అభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీవిద్యార్థులు, ఉపాధ్యాయులు, నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి ముమ్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవన యాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగ అవకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో–ఆర్డినేటర్లకు, అకాడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్**

**ఉపకులపతి**

**ఆచార్యనాగార్జునవిశ్వవిద్యాలయం.**

బి.ఏ., తదితర ప్రోగ్రాములు

అంశం: స్పెషల్ తెలుగు సెమిస్టర్-4

## 413STL21 - కోర్సు-4 : ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర

యూనిట్ల సంఖ్య: 5 పీరియడ్ల సంఖ్య: 75

---

❖ **అభ్యసన ఫలితాలు:-**

ఈ కోర్సు విజయవంతంగా ముగించాక, విద్యార్థులు క్రింది అభ్యసన ఫలితాలను పొందగలరు.

1. ఆంగ్లభాష ప్రభావం వల్ల వచ్చిన పరిణామాల ఫలితంగా ఏర్పడిన ఆధునిక తెలుగుసాహిత్య స్వరూప స్వభావాలను తెలుసుకోగలరు.
2. సామాజిక మార్పులు సాహిత్యంలో ఎలా ప్రతిబింబించిందీ గ్రహిస్తారు.
3. ఆధునిక సాహితీ ప్రక్రియలను అవగాహన చేసుకోవడంద్వారా, సమాజంపై సాహిత్య ప్రభావాన్ని తెలుసుకోగలరు.
4. మార్క్సిజం కారణంగా ప్రపంచవ్యాప్తంగా వచ్చిన భావవిప్లవాన్ని అవగాహన చేసుకోగలరు.
5. సమకాలీన ఆధునిక కవితాధోరణులను అవగాహన చేసుకోవడం ద్వారా, అస్తిత్వవాదాలపట్ల తమదైన వైఖరిని ఏర్పరచుకోగలరు.

25.2.21

## పాఠ్య ప్రణాళిక

### యూనిట్-I: ఆధునిక కవిత్వం-ఆవిర్భావ వికాసాలు

1. ఆధునిక కవిత్వలక్షణాలు; ఆధునిక కవిత్వంలో ఉద్యమాలు, వాదాలు, ధోరణులు
2. ఆధునిక కవిత్వ ప్రక్రియలు
3. ఆధునిక తెలుగు సాహిత్య దీపధారులు-వీరేశలింగం, గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు

### యూనిట్-II: భావకవిత్వం

4. భావకవిత్వం-నిర్వచనం, లక్షణాలు, భావకవితా శాఖలు
5. భావకవులకు మార్గదర్శి-రాయప్రోలు సుబ్బారావు; భావకవితాపితామహుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి
6. ప్రసిద్ధ భావకవులు, కృతులు-సమీక్ష.

### యూనిట్-III: అభ్యుదయ, విప్లవ కవిత్వాలు

7. అభ్యుదయ కవిత్వం- నిర్వచనం, అంతర్జాతీయ పరిణామాలు, నేపథ్యం;మార్క్సిజం ప్రభావం.
8. శ్రీశ్రీ-మహాప్రస్థానం; ప్రసిద్ధ అభ్యుదయ కవులు-కృతులు-సమీక్ష.
9. తెలంగాణా పోరాట కవిత్వం, విప్లవకవిత్వం

### యూనిట్-IV: వచన కవిత్వం

10. వచన కవిత్వం-ఆవిర్భావ, వికాసాలు
11. నవ్యసంప్రదాయ కవిత్వం-స్వరూప స్వభావాలు, చరిత్ర
12. నయాగరా, చేతనావర్త, అనుభూతి కవులు-కృతులు-సమీక్ష

### యూనిట్-V: సమకాలీన ఆధుని కవితా ధోరణులు

13. స్త్రీవాదకవిత్వం-నేపథ్యం, ప్రధానాంశాలు, వస్తువైవిధ్యం
14. ప్రసిద్ధ స్త్రీవాద కవయిత్రులు-రచనలు
15. దళితవాదం, మైనార్టీవాదం, ప్రాంతీయవాదం

25.2.21

**ఆధార గ్రంథాలు:**


1. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) - ఆచార్య జి. నాగయ్య
2. తెలుగులో కవిత్వోద్యమాలు - సం. ఆవుల మంజులత
3. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు - సం. ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు
4. చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య ముదిగంటి సుజాతారెడ్డి
5. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా.శాస్త్రి


**సూచించబడిన సహపాఠ్య కార్యక్రమాలు:**

1. ఆధునిక కావ్యాలకు ఆంగ్ల మాతృకలను, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన రచనలను విద్యార్థులచేత పరిశీలింపజేయడం.
2. తరగతిలోని విద్యార్థులకు ప్రత్యేకంగా ఒక 'రచయితను' అంశంగా ఇచ్చి, వ్యక్తిగత ప్రాజెక్టులు తయారు చేయించడం.
3. 'ప్రసిద్ధ రచనలు-రచయితలు','కావ్యాలు-కవులు' మొదలైన అంశాల్లో క్విజ్‌పోటీలు నిర్వహించడం.
4. అంతర్జాతీయ పరిణామాల ఆధారంగా వచ్చిన 'మార్క్సిజం' పై బృందచర్చ నిర్వహించడం
5. తెలంగాణా సాయుధ పోరాట నేపథ్యాన్ని చారిత్రికకోణంలో పరిశీలింపజేయడం
6. సమకాలీన అస్తిత్వవాద ఉద్యమాలను ప్రత్యేకంగా పరిశీలింపజేయడం
7. చారిత్రిక, సాంస్కృతికాంశాలకు సంబంధించిన పర్యాటక ప్రదేశాలను సందర్శించడం.

**MODEL QUESTION PAPER** **(413STEL21)**

# B. A. Degree Examination

**Second Year – Fourth Semester**

**Part – II : Special Telugu**

**Paper – IV : ADHUNIKA TELUGU SAHITYA CHARITHA**

**Time : Three hours** **Maximum Marks : 70**

**విభాగము – అ** **(5 x 4 = 20 మార్కులు)**

**ఈ క్రింది వానిలో ఐదింటికి సంక్షిప్త సమాధానాలు వ్రాయండి.**

**ప్రతి సమాధానానికి 4 మార్కులు.**

1) ఆధునిక కవిత ప్రక్రియలు.

2) గిడుగు రామమూర్తి పంతులు.

3) భావ కవిత్వ లక్షణాలు.

4) దేవులపల్లి కృష్ణ శాస్త్రి.

5) విప్లవ కవిత్వం.

6) వచన కవిత్వం.

7) ప్రాంతీయ వాదం.

8) వస్తు వైవిద్యం.

విభాగము – ఆ (5 x 10 = 50 మార్కులు)

**ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు వ్రాయండి.**

**ప్రతి సమాధానానికి 10 మార్కులు.**

9) (a) ఆధునిక కవిత్వ ఉద్యమాలు, ధోరణులను రాయండి.

Or

(b) కందుకూరి వీరేశలింగం సామాజిక సంస్కరణలను తెలిచేయండి.

10) (a) భావ కవిత్వ నిర్వచనం, శాఖలను వివరించండి.

Or

(b) ప్రసిద్ధి భావ కవుల కృతులను విశదీకరించండి.

11) (a) అభ్యుదయ కవిత్వ నిర్వచనం నేపథ్యమును రాయండి.

Or

(b) శ్రీ శ్రీ మహాప్రస్థానమును వివరించండి.

12) (a) వచన కవిత్వం – ఆవిర్భావమును తెలియచేయండి.

Or

(b) నవ్య సాంప్రదాయ కవిత్వం – స్వరూప స్వభావాలను రాయండి.

13) (a) ప్రసిద్ధ స్త్రీ వాద కవయిత్రలను వారి రచనలను తెలిచేయండి.

Or

(b) దళిత వాదమును నిర్వచించుము.

-----------------

# విషయ సూచిక


| పాఠం సంఖ్య | పాఠం పేరు | పేజి సంఖ్య నుండి | వరకు |
|---|---|---|---|
| 1 | ఆధునిక కవిత్వ లక్షణాలు, ఆధునిక కవిత్వంలో ఉద్యమాలు, వాదాలు, ధోరణులు | 1.1 | 1.13 |
| 2 | ఆధునిక కవిత్వ ప్రక్రియలు | 2.1 | 2.21 |
| 3 | ఆధునిక తెలుగు సాహిత్యదీప ధారులు వీరేశలింగం, గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు | 3.1 | 3.7 |
| 4 | భావకవిత్వం – నిర్వచనం, లక్షణాలు, భావ కవితా శాఖలు | 4.1 | 4.15 |
| 5 | భావకవులకు మార్గదర్శి – రాయప్రోలు సుబ్బారావు , భావ కవితా పితామహుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి. | 5.1 | 5.10 |
| 6 | ప్రసిద్ధ భావకవులు, కృతులు – సమీక్ష | 6.1 | 6.11 |
| 7 | అభ్యుదయ కవిత్వం – నిర్వచనం, అంతర్జాతీయ పరిణామాలు, నేపథ్యం, మార్క్సిజం ప్రభావం | 7.1 | 7.10 |
| 8 | శ్రీశ్రీ – మహా ప్రస్థానం, ప్రసిద్ధ అభ్యుదయ కవులు – కృతులు– సమీక్ష | 8.1 | 8.14 |
| 9 | తెలంగాణ పోరాట కవిత్వం, విప్లవ కవిత్వం | 9.1 | 9.12 |
| 10 | వచన కవిత్వం – ఆవిర్భావ వికాసాలు | 10.1 | 10.8 |
| 11 | నవ్య సంప్రదాయ కవిత్వం – స్వరూప స్వభావాలు, చరిత్ర | 11. 1 | 11.6 |
| 12 | నయాగరా, చేతనావర్త, అనుభూతి కవులు – కృతులు – సమీక్ష | 12. 1 | 12.15 |
| 13 | స్త్రీవాద కవిత్వం – నేపథ్యం, ప్రధానాంశాలు, వస్తు వైవిధ్యం | 13. 1 | 13.14 |
| 14 | ప్రసిద్ధ స్త్రీవాద కవయిత్రులు– రచనలు | 14. 1 | 14.9 |
| 15 | దళిత వాదం, మైనార్టీ వాదం, ప్రాంతీయ వాదం | 15. 1 | 15.20 |

## పాఠం - 1

# ఆధునిక కవిత్వం

**విషయ క్రమం:**

**1.1. ఆధునిక కవిత్వం – ఆవిర్భావం**

**1.2. ఆధునిక కవిత్వం – లక్షణాలు**

**1.3. ఆధునిక కవిత్వంలో ఉద్యమాలు, వాదాలు, ధోరణులు**

### 1.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో వచ్చిన అనేక ఉద్యమాలు, వాదాలు, ధోరణుల పట్ల విద్యార్థులకు అవగాహన కలిగించటం.

### 1.1. ఆధునిక కవిత్వం – ఆవిర్భావం:

క్రీ.శ. 1875 నుండి తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడి ప్రారంభమైంది. ఆధునిక యుగంలో పాశ్చాత్యుల సంపర్కంతో, జాతీయతా భావం పెంపొందటం కారణంగా, ఆంగ్ల విద్యావ్యాప్తి జరగటం వలన తెలుగు సాహిత్యంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. క్రీ.శ. 19వ శతాబ్ది ప్రారంభంలోనే తెలుగు సాహిత్యంలో పునరుజ్జీవనం ప్రారంభమైంది. దానికి ఆద్యులు పాశ్చాత్యులే కావటం విశేషం. క్రీ.శ. 1813వ సంవత్సరంలో మద్రాసు సెంట్‌జార్జి కోటలో స్థాపించిన కళాశాలలో తెలుగు భాషా బోధన కూడా ఉంది. క్రైస్తవ మత ప్రచారకులు, ప్రభుత్వోద్యోగం చేసే విదేశీయులు దేశభాషలు నేర్చుకొని వాటికి వ్యాకరణాలను, ఛందశ్శాస్త్రాలను రచించారు. మొట్టమొదట తెలుగుకు శాస్త్రీయ పద్ధతిలో వ్యాకరణం రాసినవాడు “కాంప్‌బెల్”, పండితుల సహాయంతో తాళపత్రాల రూపంలో ఉన్న ప్రాచీన తెలుగు కావ్యాలను పరిష్కరింపజేసి వాటికి టీకలు, టిప్పణులు రాయించి, ఆంధ్రాంగ్ల నిఘంటువును నిర్మించిన సి.పి. బ్రౌన్, బిషప్ ‘కాల్డువెల్’ వంటివారు తెలుగులో నూతనత్వానికి నాంది పలికారు.

తెలుగు సాహిత్యంలో నవ్యయుగ ప్రవర్తక త్రయంగా పరవస్తు చిన్నయసూరి (క్రీ.శ. 1809–1862), కొక్కొండ వెంకటరత్నం (కీ.శ. 1842–1915), కందుకూరి వీరేశలింగం (క్రీ.శ. 1848–1919) లను వ్యవహరిస్తారు. 1853వ సంవత్సరంలో పరవస్తు చిన్నయసూరి “నీతిచంద్రిక” అనే గద్య కావ్యాన్ని రచించాడు. 1858వ సంవత్సరంలో చిన్నయసూరి రాసిన బాలవ్యాకరణం గ్రాంథికాంధ్ర భాషకు ప్రామాణికమైన వ్యాకరణ గ్రంథం. దీనిని అక్షరాలా అనుసరించదలిచిన పండితులు పూర్వ కావ్యాలలోని పాఠాలను దిద్దివేసి తెలుగు సాహిత్యానికి తీరని అపచారం చేశారు. పాఠశాలలో చదవవలసిన నీతిచంద్రిక విద్యార్థులకు కొరకరాని కొయ్య అయింది. దానితో తెలుగు భాషలో సంస్కరణ అవసరమైంది. చిన్నయసూరి బాలవ్యాకరణాన్ని అనుసరిస్తూ పండితులు సంప్రదాయసిద్ధమైన కవిత్వం రాయటం ప్రారంభించారు. అటువంటివారిలో శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, వావిలికొలను సుబ్బారావు, జనమంచి శేషాద్రి శర్మ, పిశుపాటి చిదంబర శాస్త్రి, వడ్డాది సుబ్బారాయుడు, వేదము వెంకటరాయశాస్త్రి, మల్లాది సూర్యనారాయణశాస్త్రి, దాసు శ్రీరామకవి ముఖ్యులు. ఆధునిక కవిత్వానికి పూర్వ కవిత్వానికి ఉన్న వ్యత్యాసం తెలిసే విధంగానూ పూర్వ గ్రంథ విశిష్టతను తెలియజేసేవిధంగానూ తమ రచనలు చేశారు. ఆధునిక కాలంలో వెలువడిన పురాణేతిహాసాలు ఆధునిక సాహిత్య వికాసానికి పరోక్షంగా సహకరించాయి.

కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు చిన్నయసూరిగారి నీతిచంద్రికకు పూరణగా రాసిన విగ్రహతంత్రం, ప్రిన్సాఫ్ వేల్స్ హిందూస్థాన దర్శనము అనే రచన వచనంలోనే రాశారు. వీరు రచించిన 'మహాశ్వేత 'ను తొలి తెలుగు నవలగా భావిస్తారు కొందరు. 20 సంవత్సరాలు ఆంధ్ర భాషా సంజీవని అనే పత్రికను నడిపారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలోని ప్రక్రియలన్నిటిలోనురచనలు చేసి వాటికి ప్రాచుర్యం కల్గించిన సాహితీ స్రష్ట, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగంగారు నవ్యాంధ్ర సాహిత్య యుగకర్తగా కీర్తించబడే విధంగా వీరి రచనలు ఆంధ్ర దేశాన్ని జాగృతం చేశాయి. సాంఘికంగానే కాక సాహిత్యపరంగానూ అనేక సంస్కరణలు చేసి తమ జీవితాన్ని సాహిత్యోద్ధరణకు, స్త్రీ జన సముద్ధరణకు ధారబోశారు.

ఆధునిక తెలుగు సాహిత్య నిర్మాతలుగా కట్టమంచి రామలింగారెడ్డి గారిని, తిరుపతి వేంకట కవులను, వేంకట పార్వతీశ్వర కవులను, గిడుగు రామమూర్తి పంతులు గారిని, గురజాడ వెంకట అప్పారావు గారిని స్మరించుకోవాలి. ఆ బాటలోనే సాగి రాయప్రోలు సుబ్బారావుగారు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, బసవరాజు వేంకట అప్పారావు, నండూరి వేంకట సుబ్బారావు వంటి వారు నవ్యకవిత్వాన్ని పరిపుష్టం చేశారు. ఆ తరువాత కూడా అనేక మంది కవులు భిన్న వాదాలతో, ధోరణులతో ఆధునిక కవిత్వాన్ని వికసింపజేశారు.

## 1.2. ఆధునిక కవిత్వం - లక్షణాలు:

ఆధునిక కవిత్వాన్ని నవ్య కవిత్వం, అభినవ కవిత్వం, భావకవిత్వం అని వ్యవహరిస్తారు. ఆధునిక కాలంలో వచ్చిన కవిత్వమంతా ఆధునిక కవిత్వమే అని కొందరి వాదన. రవీంద్రనాథ్ ఠాగూర్ గారి అభిప్రాయం ప్రకారం ఆధునికత్వమంటే స్వభావాన్ని బట్టి ఆధునికత్వమే కానీ కాలాన్ని బట్టి కాదు. అంటే నవీన గుణములు కల్గిన సమస్త ఆధునిక కవిత్వం నవ్య కవిత్వమవుతుంది. ఆధునిక కవిత్వానికి కొన్ని లక్షణాలున్నాయి.

### 1.2. 1. ఖండ కావ్య ప్రక్రియ:

20వ శతాబ్ది ప్రారంభంలో మొదలైన ఆధునిక కవిత్వంలో ప్రథమ గణ్యమైన ప్రక్రియ ఖండకావ్యం. పాశ్చాత్య విజ్ఞానం కారణంగా సమాజంలో కలిగిన మార్పు, పెద్ద పెద్ద కావ్య రచన చేయటానికి కవులనాదరించే రాజులు లేకపోవటం అనేవి ఈ ఖండ కావ్య ప్రక్రియ ఆవిర్భావానికి కారణాలయ్యాయి. అంతేగాక వేగవంతమైన ఆధునిక జీవితంలో కావ్యాలు చదివేటంత తీరిక, ఓపిక లేని కారణంగా స్వల్పకాలంలో ఎక్కువ ఆనందాన్నిచ్చే కవిత్వం కావలసివచ్చింది. పత్రికలకు కూడా ప్రబంధ రచనలను ప్రచురించే అవకాశం లేకపోవటంతో తమ ఆనందం కోసమే కవిత్వం రాసుకోవటం తప్పనిసరైంది. ఆంగ్ల సాహిత్యంతో ఏర్పడిన పరిచయంతో తెలుగు కవులు ఖండ కావ్య రచనకు పూనుకున్నారు. ఖండకావ్య సృష్టికి ప్రధాన కారణం ఆంగ్ల సాహిత్యంలోని ఖండ కావ్యాలను చదివిన కవులు ముగ్ధులవ్వటమే. ప్రాచీన ఆలంకారికులలో ఖండకావ్య విశిష్టతను గుర్తించినవాడు విశ్వనాథుడు. ఇతడు 'ఖండ కావ్యం భవేత్కావ్యస్యైక దేశాను సారిచ' అని సూత్రీకరించి దీనికి ఉదాహరణగా 'యధా మేఘదూతాదిః' అని వివరించాడు. కవి గుండెను చీల్చుకొని వచ్చు భావధారలకు ఖండకావ్యాన్ని మించిన వాహిక లేదని స్పష్టమవుతుంది. ఈ దృష్టికోణంతో చూస్తే మేఘ సందేశం, గీతగోవిందం, ఋగ్వేదంలోని ఉషస్సూక్తాలు, ఋతు సంహారం, మహా భాగవతంలోని గోపికా గీతలు మొదలైనవన్నీ ఖండకావ్యాలే అవుతాయి. అంటే మహాకావ్యాల నుండి రసవద్ఘట్టాలుగాని, ఏక విషయాన్ని గురించి రాసిన పద్యాలుగాని విడిగా తీస్తే అవి ఖండకావ్యాలవుతాయి.

**1.2.2. ఆత్మాశ్రయ రీతి:**

కవి తాను దర్శించిన సత్యం, శివం, సుందరాలను ప్రకటించేటందుకు రెండు పద్ధతులున్నాయి. ఒకటి వస్త్వాశ్రయ కవితారీతి, రెండవది ఆత్మాశ్రయ కవితారీతి. ఈ విభజన కూడా ఆంగ్ల సాహిత్య సంప్రదాయాలనుసరించి వచ్చిందే. ప్రాచీన కవిత్వమంతా వస్త్వాశ్రయ రీతిలోనే సాగింది. కవి తాను చెప్పాలనుకున్నది నాయికా నాయకుల ద్వారా చెప్పేవాడు. ఈ నాయికా నాయకులు దివ్యులు, దివ్యాదివ్యులు, అదివ్యులని మూడు రకాలు. ప్రాచీన కవులలో శతకకర్తలు తప్ప మిగిలిన అందరూ వస్త్వాశ్రయరీతిని అనుసరించినవారే. ఆత్మాశ్రయ కవితారీతిలో నాయికానాయకుల కల్పన ఉండదు. కవే ఆలంబన. భక్తి గాని, రక్తి గాని, సుఖం గాని, దుఃఖం గాని, ప్రణయం గాని, ప్రళయము గాని కవే స్వయంగా అనుభవించి, ఆలోచించి సూటిగా కవిత్వీకరిస్తాడు. ఆత్మాశ్రయ రీతిలో కవి స్వంత గొడవే కానీ అనంతాలైన లోకవృత్తాలుండవనే విమర్శ కూడా ఉంది. అయితే ఇది సరైంది కాదు. ఎందుకంటే కవి ఎప్పుడూ తనను తాను ఒక శృంగార నాయికగానో, భక్తుడుగానో భావించుకోడు. రాజుగా, పకీరుగా, పాపిగా, భక్తుడుగా, రక్తుడుగా, పరమాత్ముడుగా, రాయిగా, రత్నంగా, విరిగా, గిరిగా ఎన్నో రకాలుగా భావించుకొంటాడు. సీతాకోకచిలుక మొదలు శివుడి సిగపువ్వు దాకా అతడి అనుభూతులను కావ్యగానం చేస్తాడు. కాబట్టి ఆత్మశ్రయరీతిలో కూడా లోక వృత్త ప్రదర్శన, వస్తు వైవిధ్యం ఉంటాయి. అనవసరమైన వర్ణనలు, కథాపూరణలు ఉండవు కాబట్టి చెప్పిందంతా సూటిగా ఉండి బంగారు ముద్దలాగా ఉంటుంది.

ఆత్మాశ్రయ కవిత్వమంతా కవి జీవితంలో తాను అనుభవించి ఉండనవసరం లేదు. తాను చెప్పదల్చుకున్న ప్రత్యేక భావాలను తనవిగా భావన చేసుకొని, అనుభవించి, మధనపడి, మననం చేసుకొని సుందర శబ్దజాలంతో కవి వ్యక్తీకరిస్తాడు. ఆత్మాశ్రయరీతిలో రచన చేసే కవి సామాన్యులు తమ ఇంద్రియాలతో మాత్రమే చూడగలిగే సత్యాన్ని, సౌందర్యాన్ని తన గుండెలో రంగరించుకొని, తనదిగా చేసికొని, వాడిగా, వేడిగా, జవజీవాలతో ప్రకటిస్తాడు. కనుక ఆత్మాశ్రయ కవిత్వానికి, కవి వ్యక్తిత్వానికి పోలికలుంటాయి కానీ రెండూ ఒకటే అని భావించకూడదు. కవిత్వంలోని అనుభూతులతో, భావాలతో, కల్పనలతో కవికి అభేదం ఊహించవచ్చు. సంస్కృత కవిత్వాలలో, ఋక్కులలో ఈ ఆత్మాశ్రయ కవిత్వచ్ఛాయలు కనిపిస్తాయి. వైదిక ఋషులు కూడా ఉషస్సును, పృథ్విని, సూర్యచంద్రులను చూచి ఆశ్చర్యచకితులై వెలిబుచ్చిన భావాలు ఋక్కులలో చూడవచ్చు. అయితే వీటిలో ప్రకటితమైన అభిప్రాయం వ్యక్తి చైతన్యం కాక సాంఘిక చైతన్యంగానే భావించాలి. ఒక ఋషికే పరిమితం కాదది. ఉదాహరణకు పృథ్వీసూక్తం తీసుకుంటే అది ఋషులందరి హృదయాల నుండి వెలువడిన భావ సంపుటి. ఆధునిక కవిత్వంలోని ఆత్మాశ్రయత్వంలో మాత్రం వ్యక్తి చైతన్యమే ప్రధానం.

**1.2.3. వస్తు నవ్యత:**

ప్రాచీన కవిత్వంలో వస్తువు ప్రఖ్యాతమో, మిశ్రమమో అయిఉండటం కారణంగా అందులోని నాయకులు దివ్య పురుషులే అయ్యారు. సామాన్యులున్నా వారు పరమ భక్తులు. ఆధునిక కవిత్వంలో మాత్రం క్రింది వర్ణాలకు చెందిన సామాన్యులే నాయకులు కావటం పెద్ద మార్పు. జానపద గేయాలలో సామాన్యులే నాయికానాయకులుగా ఉన్నా వాటికి కావ్య గౌరవం ఇవ్వలేదు. కనుక వాటిని ప్రస్తావించనవసరం లేదు. కావ్య నాయకులకు నాయికలకు వారి కులం గాక గుణమే ప్రధానమని నవ్య కవిత్వం తేల్చివేసింది. ఉదాహరణకు జాషువా గారి "గబ్బిలము" లోని అస్పృశ్యుడు మేఘసందేశంలోని యక్షుడి స్థానాన్ని ఆక్రమించటం విశేషం. మేఘం స్థానాన్ని గబ్బిలం ఆక్రమించటం మరీ వస్తు నవ్యత. ఇది వస్తు విషయంగా విప్లవాత్మకమైన మార్పు. కాపు వారు, పడవ నడిపే వారు, గొల్ల వారు, అస్పృశ్యులు కావ్య పాత్రపై వారి బ్రతుకుతెరువులకు కావ్య గౌరవం

కలగటాన్ని మించిన వస్తు నవ్యత ఏముంటుంది. సంప్రదాయ కవిత్వంలోని స్త్రీల అంగాంగ వర్ణనలకు కాక స్త్రీ అంతరంగ వర్ణనకే అధిక ప్రాధాన్యత నివ్వటం ఆధునిక కవిత్వంలో చోటు చేసుకున్న మరొక వస్తు నవ్యత. ఆధునిక కవులు అనుభూతి గాఢత్వాన్ని ప్రకటించటానికే తమ ఆలోచనాశక్తిని ఎక్కువగా వినియోగించారు.

**1.2.4. భావ నవ్యత:**

ప్రాచీన కవిత్వంలో భావం కన్నా వస్తువే ప్రధానం. ఇతివృత్త కథనమే ప్రధానంగా భావించినా దానినీ వదలేసి వర్ణనలకే పెద్ద పీట వేయబడింది. భావాలకి కాక రీతులకే అధిక ప్రాధాన్యత నిచ్చాయి కావ్యాలు. ఆ వర్ణనలు కూడా అతిశయోక్తి కావటంతో చదువరులకు విశ్వసనీయం కాక హాస్య స్ఫోరకాలయ్యాయి. చివరకు కరుణ రసాన్ని కూడా అతిశయోక్తిగానే చెప్పటంతో దుఃఖం కాక హాస్యం జనించటం భావశూన్యతకు నిదర్శనం. ఆధునిక కవిత్వంలో వస్తువుకంటే భావానికే అధిక ప్రాధాన్యత కలిగింది. ఊహలతో ఇంద్రజాలం చేయకుండా నవ్య కవులు తమ భావనా బలాన్ని ప్రదర్శించారు. ప్రాచీన కవి సమయాల వంటి వాటిని విడిచి మరీ అవసరమనుకుంటే సరికొత్త కవి సమయాలను వర్ణించారు. ఊహలకన్నా అనుభూతులకే ప్రాధాన్యతనిచ్చారు.

**1.2.5. శైలీ నవ్యత:**

ప్రబంధ కవిత్వం చివరిదశలో గర్భబంధాలు ఎక్కువయ్యాయి. దీర్ఘసమాసాలకు, మారుమూల పదాలకు ప్రాధాన్యత పెరిగి అచ్చమైన తెలుగుపదాలు లేకుండా పోయాయి, ద్వర్థి, త్ర్యర్థి వంటి శ్లేష రచనలు జరిగాయి. యక్షగానంలో తెలుగు పలుకుబడికి ప్రాధాన్యత పెరిగినప్పటికీ అసలైన కవితాత్మ లేకపోయింది. పదాడంబరం రాజ్యం చేస్తున్న సమయంలో నవ్య కవిత్వం భావానికి ప్రాధాన్యతనిచ్చింది. అనవసరమైన పద ప్రయోగం తగ్గింది. పద్యాలలో పద్యాలను కూర్చటాన్ని నవ్య కవిత్వం నిరసించింది. కష్టమైన పదబంధాలు, సమాసాలు తగ్గాయి. చెప్పేది నలుగురికి అర్థం కావాలనే వాదం బయలుదేరింది. సులభశైలిలో రచనలు చేయబడ్డాయి. శైలీసారళ్యం ఆధునిక కవిత్వ లక్షణాలలో ముఖ్యమైనది.

**1.2.6. పద ప్రయోగం:**

ఆధునిక కవులు కొత్త పదాలను ప్రయోగించారు. అంటే పదాలను వారు స్వయంగా సృష్టించారని కాదు. అప్పటి వరకు ప్రాచీన కవులు ప్రయోగించినట్లుగా వాడుకలో లేని పదాలను వదిలివేశారు. ఉదాహరణకు 'కంపు' అనే పదం. దీనికి అసలైన అర్థం సువాసన అని. పువ్వుల కంపు అని తిక్కన, నన్నెచోడుడు ప్రయోగించారు. ప్రాచీన కవులు పాద పూరణ కోసం మానుగ, కొనకొని, ఒనరన్, అలరగ, ధర, ధారుణి వంటి పదాలను ఉపయోగించేవారు. అటువంటి వ్యర్థ పదాలను ఆధునిక కవులు ప్రయోగించటం మానివేశారు. సమకాలీన సమాజంలో వాడుకలో ఉన్న పదాలకే వీరు పట్టం కట్టి నవ్యతను ప్రదర్శించారు. దీనితో వాడుక భాషే కవిత్వ భాష అయ్యింది. సామాన్యుల మాటలలోని 'యాస' కు స్థానం కల్పించారు. ఇది నూతనత్వం.

**1.2.7. దేశి కవిత:**

తెలుగు సాహిత్య ప్రారంభమే మార్గ కవితా రచనతో మొదలైంది. భారతీయ సంగీతంలోని త్యాగరాజ కీర్తనలు, క్షేత్రయ్య పదాలు, యక్షగానంలోని దరువులు శుద్ధమైన దేశి రచనలు. శివ కవుల యుగంలో దేశి రచన సాగినా దానిని మత ప్రాబల్యం మరుగుపర్చింది. ఆ తరువాత దేశిలో రచనలు జరుగలేదు. మధుర తంజావూరు యుగంలో దేశి రచనలకు ఆదరణ లభించినా వాని కవితా గుణాన్ని సంగీతం మరుగుపర్చింది. ఇలాంటి పరిస్థితిలో ఆధునిక కవిత్వం దేశి కవితకు

పట్టం కట్టింది. గురజాడ వంటి మహాకవులు దేశికవితలో అన్ని రసాలు బాగా పండించవచ్చని అనేక గేయాలు రాశారు. ఆ తరువాత వచ్చిన కవులైన రాయప్రోలు, బసవరాజు, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, నండూరి ఆ తర్వాత వచ్చిన శ్రీశ్రీ వంటి కవులు దేశి కవితలో రసవంతమైన అనేక కావ్యాలు, గేయాలు, గీతాలు రచించారు.

**1.2.8. ప్రక్రియా బాహళ్యం:**

ప్రక్రియా బాహుళ్యం ఆధునిక కవితకున్న ప్రత్యేక లక్షణం. పూర్వ కవులు గణిత శాస్త్రం, వైద్య శాస్త్రం వంటి వాటిని పద్యాలలోనే రచించారు. అప్పకవి వంటి వారు అలంకార లక్షణ శాస్త్రాలని పద్యాలలోనే రాశారు. ఆధునిక కవులు దీనిని విడిచి పెట్టారు. కవితాగుణమున్న వాటిని మాత్రమే పద్య గేయాలతో చెప్పారు. నవ్య కవులు చూపిన వైవిధ్యం ఆశ్చర్య జనకం. ఒక్క భావ కవిత్వంలోనే ప్రకృతి కవిత్వం, పల్లీజన కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం, భక్తి కవిత్వం, కథా కవిత్వం, స్మృతి గీతాలు, బాలగేయాలు ఇలా అనేక ప్రక్రియలు చూస్తాము. ఇలాంటి ప్రక్రియా బాహుళ్యం ప్రాచీన కవిత్వంలో కనిపించదు. అందుకే ఇది కూడా ఆధునిక కవిత్వ లక్షణమైంది.

## 1.3. ఆధునిక కవిత్వంలో ఉద్యమాలు-వాదాలు, ధోరణులు:

ఆధునిక కవిత్వంలో పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో అనేక ఉద్యమాలు, వాదాలు, ధోరణులు మొదలయ్యాయి. **కాల్పనికోద్యమం:** 20వ శతాబ్ది ప్రారంభంలో తెలుగు సాహిత్యంలో ప్రబంధ కవితా ధోరణిపై తిరుగుబాటుగా వచ్చిన కవిత్వం "భావ కవిత్వం". భావ కవిత్వంపై ప్రధానంగా ప్రభావం చూపింది కాల్పనికోద్యమం. ఆంగ్ల సాహిత్య చరిత్రలో సంప్రదాయ విధానంపై తిరుగుబాటుగా క్రీ.శ. 18వ శతాబ్దిలో మొదలైన ఉద్యమం కాల్పనికోద్యమం.

ఆత్మాశ్రయ సిద్ధాంతమే కాల్పనికోద్యమానికి మూల సూత్రం. భావుకతయే కాల్పనికులకు మూలతత్త్వం. హేతువు కంటే అనుభూతికి, వాదం కంటే అనుభవానికి కాల్పనికులు ప్రాముఖ్యతనిచ్చారు. తమ హృదయంలో అశాంతికి కారణమైన సంఘటనలను, సున్నితమైన హృదయాన్ని స్పందింపజేసే విషయాలను కవితావస్తువులుగా స్వీకరించారు. ఆత్మానుభూతికే ప్రాధాన్యత ఇవ్వటం వలన ఈ కవిత్వంలో కవే నాయకుడు. కాల్పనికులందరూ ఎక్కువగా ప్రకృతినుండే ప్రేరణ పొందారు. వ్యక్తిగతమైన ప్రకటనల ద్వారా వస్తు రహస్యాలను ప్రదర్శించి వాటి అర్థాన్ని పరమార్థాన్ని ప్రసరింపజేయటమే కాల్పనికుల ముఖ్య ఉద్దేశ్యం. క్రీ.శ. 1798-1832 మధ్యకాలంలో యూరప్‌లో కొత్త రచనలకు దోహదం చేసింది కాల్పనికోద్యమమే. తెలుగు సాహిత్యంలో కాల్పనిక వాదం రాయప్రోలు సుబ్బారావు కవిత్వంతో ప్రారంభమైంది

**1.3.1. భావ కవిత్వం:**

ఆధునిక సాహిత్య చరిత్రలో ఆంగ్ల కాల్పనికోద్యమ మానసపుత్రికగా భావ కవిత్వాన్ని భావించవచ్చు. రాయప్రోలు సుబ్బారావు గారి కావ్యాల్లో 'భావ పదం', 'భావ గీతం' అనే పద ప్రయోగాలు మొదటగా కన్పిస్తాయి. విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణ శాస్త్రి గార్ల రచనల్లో 'భావ గీతం' ప్రయోగించబడింది. ఈ భావ కవిత్వాన్నే మొదట్లో రాయప్రోలు సుబ్బారావు గారు "అభినవ కవిత్వం" అని, దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు "కాల్పనిక కవిత్వం" అనీ, దువ్వూరి రామిరెడ్డి గారు "గీత కవిత్వం" అనీ, నోరి నరసింహశాస్త్రి "నవ్య కవిత్వం' అనీ వ్యవహరించారు. తెలుగు సాహిత్యంలో మొదటగా "భావ కవిత్వం" అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ప్రయోగించారు. తర్వాత అందరూ భావకవిత్వం అనే పదాన్ని వ్యవహరించారు. భావ కవిత్వం పద్య గద్య గేయాలలో దేనిలోనైనా ఉండవచ్చు. ఒక వ్యక్తి తన హృదయగత భావావేశాన్ని ఖండకావ్యంలో వ్యక్తీకరించటమే భావ కవిత్వం.

భావ కవిత్వం ఆత్మాశ్రయమైంది. ప్రతి వ్యక్తిలో ఏదో ఒక సార్వకాలికమైన, సార్వజనీనమైన అనుభవముంటుందని, ఆ అముల్యానుభావాలను ఆశ్రయించి పెరిగిందే భావకవిత్వకుని భావకవులు నిర్వచించారు. కవి మనోధర్మం ప్రతిబింబమే భావకవిత్వం. భావకవిత్వంలో కవితావస్తు స్వరూపాన్ని బట్టి, స్వభావాన్ని బట్టి అత్మాశ్రయ రీతి కవిత్వం, దేశభక్తి కవిత్వం, ప్రకృతి కవిత్వం, సంఘసంస్కరణ కవిత్వం, భక్తి కవిత్వం, స్మృతి కవిత్వం అని ఆరు రకాలున్నాయి. ఇవే కాకుండా ప్రణయ కవిత్వం, మానవతావాద కవిత్వం, స్తుతి కవిత్వం, బాలగేయ కవిత్వం అనే రకాలు కూడా భావకవిత్వంలో కనిపిస్తాయి. భావ కవిత్వంలో ప్రకృతి, ప్రణయం, ప్రబోధమే ప్రాధాన్యత వహించాయి. భావకవులు తమ భావనాలోకంలో మునిగితేలుతూ ఆనందంలో విహరిస్తూ తమ స్వార్థం కోసమే కవిత్వం సృష్టించారు. అందుకని తర్వాతివారు దీనిని విమర్శించారు.

**1.3.2. హేతువాదం:**

హేతువు అంటే కారణం. కారణం లేకుండా ఏ కార్యం జరుగదు. ప్రతి కార్యానికి కారణం తప్పనిసరిగా ఉంటుంది. ఈ కార్యకారణ సంబంధాలని గురించి ఆలోచించేది హేతువాదం. సత్యాన్ని నిక్కచ్చిగా చెబుతూ అది తప్పు ఇది ఒప్పు అని న్యాయ నిర్ణయం చేసేది హేతువాదం. 20వ శతాబ్దికి పూర్వమే ప్రాచీన భారతదేశంలోని దార్శనికులు, గ్రీకు దేశానికి చెందిన అరిస్టాటిల్, సోక్రటీస్, ప్లేటో, చైనాకు చెందిన కన్‌ఫూజియన్ వంటి ప్రముఖ తత్వవేత్తలు తాత్విక చింతన చేశారు. కాలక్రమంలో వచ్చిన అనేక మార్పుల కారణంగా, అనేక మతాలు రావటం వలన మత ఛాందస భావాల వల్ల తాత్త్విక చింతన వెనుకబడింది. ప్రజలకు మతగ్రంథాలే శిరోధార్యం అయ్యాయి. ఇలా ఉండగా యూరప్‌లో శాస్త్ర విజ్ఞానం బయలుదేరింది. దాని కారణంగా మత గ్రంథాల్లోని విషయాలు నిజం కాదని వ్యాప్తి జరిగింది.

జ్ఞాన సముపార్జనకు హేతువు ప్రధాన సాధనం అని చెప్పే ఒక దర్శనం హేతువాదం. హేతువాదం ఒక ఆలోచనా విధానం. హేతువాదం అజ్ఞానాన్ని చీల్చి చెండాడుతుంది. ముఖ్యంగా హేతువాదం శాస్త్రవాదం వైపు నడిపిస్తుంది. హేతువాదం ఒక సిద్ధాంతం కానీ, ఒక వాదం కానీ కాదు, శాస్త్రీయ ఆలోచనా విధానమే హేతువాదం. హేతువును భౌతిక ప్రపంచానికి అన్వయిస్తే భౌతికవాదం, దేవుడికి అన్వయిస్తే నాస్తికవాదం, మానవజాతికి అన్వయిస్తే మానవతావాదంగా రూపాంతరం చెందుతాయి.

భారతదేశంలో హేతువాద బీజాల్ని మొదట ప్రచారం చేసినవారు చార్వాకులు. చారు అంటే అందమైన లేదా విశాలమైన, వాక్ అంటే వాక్కులు కలవారు అంటే చార్వాకులంటే వాడిగా, వేడిగా, సూటిగా, ఘాటుగా వాదన చేసి ఎదుటి వారిని తన శక్తి సామర్థ్యాలతో చిత్తు చేయగల సమర్థులు. వీరు యజ్ఞయాగాదులు, కర్మ, పునర్జన్మ, మంత్రాలు, వర్ణ ధర్మాలు మొదలైన విషయాలపై ధ్వజమెత్తారు. వైదిక మతానికి ఎదురొడ్డి నిలిచారు. వీరు హేతువాద దృక్పథంతో ముందుకు నడిచారు. లోకాయతం అనే ప్రాచీన భారతీయ దర్శనం, బౌద్ధం, జైనం, సాంఖ్యం, న్యాయ వైశేషికాలు హేతువాద భావ వ్యాప్తికి ఎంతగానో కృషిచేశాయి.

తెలుగుదేశంలో హేతువాదం వేమనతో ప్రారంభమైందని చెప్పవచ్చు. త్రిపురనేని రామస్వామి చౌదరి దీనిని ఉద్యమంగా నడిపారు. హితసూచని అనే గ్రంథంలో సామినేని ముద్దుకృష్ణమనాయుడు గారు మూఢ నమ్మకాలపై అనేక అంశాలను ఎలుగెత్తి చాటారు. హేతువాద సాహిత్యం కోసం కృషి చేసిన వారి లోనే అగ్రగణ్యులు, చిరస్మరణీయులు త్రిపురనేని రామస్వామి చౌదరిగారు. ఆధునిక సాహిత్యంలో ప్రారంభమైన హేతువాదమే ఆ తరువాత వచ్చిన అభ్యుదయ, విప్లవ సాహిత్యాలకు బీజాలు వేసింది.

**1.3.3. అభ్యుదయ కవిత్వం:**

అభ్యుదయం అనే మాటకు శుభం, మంగళం అనే అర్థాలు నిఘంటువులో కనిపిస్తాయి. అభ్యుదయం అంటే ప్రగతి. తెలుగు సమాజంలో సమసమాజ నిర్మాణం కోసం ప్రారంభమైంది అభ్యుదయ కవిత్వం. తెలుగు సాహిత్యాన్ని 1935 - 1955 మధ్య కాలంలో అంటే దాదాపు 2 దశాబ్దాలపాటు అభ్యుదయ సాహిత్యం సుసంపన్నం చేసింది. భావ కవిత్వానికి తిరుగుబాటుగా, సామాజిక చైతన్యం లక్ష్యంగా, మార్క్సువాదం ఆత్మస్థానీయంగా, వస్తు ప్రాధాన్యం, వాస్తవిక దృక్పథం, మానవతావాదం, ప్రగతి శీలకమైన మార్పు ప్రధాన లక్షణాలుగా అభ్యుదయ కవిత్వం అవతరించింది.

1905వ సంవత్సరంలో రష్యాలో మొదటిసారిగా పెట్టుబడిదారీ విధానంపై కార్మికవర్గం తిరుగుబాటు చేసింది. 1917వ సంవత్సరంలో సోషలిస్టు వ్యవస్థకు పునాదులు పడ్డాయి. రాజకీయ రంగంలో ఆవహించిన ఈ పరిణామం ప్రభావం కవిత్వంపై చూపింది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత విలువలు తారుమారై యూరప్ దేశాలలో కొత్త ఉద్యమాలు పుట్టాయి. ఫ్రాన్స్‌లో క్యూబిజం, ఇటలీలో ఫ్యూచరిజం, జర్మనీలో ఎక్స్ ప్రెషనిజం, అమెరికాలో ఇమేజిజం ప్రారంభమయ్యాయి. అప్పటి పరిస్థితులకు తిరుగుబాటుగా ఫ్రాన్స్ లో దాదాయిజం అనే కొత్త పోకడ ప్రారంభమైంది. ఇవన్నీ కవిత్వానికి విస్తరించాయి. మంచిని అపహసించి, విచ్చలవిడిగా ప్రవర్తించిన దాదాయిజం నుండి ప్రారంభమైన ఉద్యమం సర్రియలిజం - 1930 తరువాత ఆంగ్ల సాహిత్యంలో ఈ ధోరణులకు వ్యతిరేకంగా అభ్యుదయ భావాలు చోటు చేసుకున్నాయి.

అభ్యుదయ కవిత్వంపై మార్క్సిస్టు సిద్ధాంతం ముద్రవేసిన సమయంలోనే జాతీయోద్యమ ప్రభావంతో ఉత్తేజితులైన కవులు కూడా అభ్యుదయ ధోరణిలో ప్రబోధ గీతాలు రచించారు. ఈ విధంగా జాతీయ అంతర్జాతీయ భావాల సమ్మేళనం జరిగింది. మార్క్సిస్టు భావాలు తెలియని కవులు కూడా ప్రజల బాధామయ గాథలను రసవత్తరంగా చిత్రీకరించారు.

1935వ సంవత్సరం లో భారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. 1943వ సంవత్సరంలో తెలుగు ప్రాంతంలో అభ్యుదయ రచయితల సంఘం ప్రారంభమైంది. ఒక దశాబ్దం అభ్యుదయ కవిత్వం ఉద్యమ వేగంతో ఆంధ్ర ప్రాంతంలోని అన్ని దిక్కులలో విస్తరించింది. నిద్రాణమై ఉన్న జాతిని మేల్కొలిపిన నవ యుగ వైతాళికుడు శ్రీశ్రీ. అభ్యుదయ కవిత్వోద్యమ మూలవిరాట్టు శ్రీశ్రీ. పాశ్చాత్య కవితా ధోరణులను ఆకళింపు చేసుకొనిన శ్రీశ్రీ కి సమకాలీన సమాజ స్థితిగతులతో సంబంధం లేని భావకవుల కవితా ధోరణులు నిస్సారంగా తోచాయి. సామాజిక విప్లవానికి పురోగామిగా సాహిత్య విప్లవం సాగాలన్న దృక్పథంలో నూతన కవితారీతికి స్రష్ట అయ్యాడు శ్రీశ్రీ. శ్రీశ్రీ ది విప్లవాత్మకమైన ప్రగతి వాదం.

శ్రీశ్రీ మరో ప్రపంచం, దేశ చరిత్రలు, మహాప్రస్థానం వెలువడిన తరువాత ఆ మార్గంలోనే తెన్నేటి సూరి, పిలకా గణపతి శాస్త్రి, ఆవంత్స సోమసుందర్, అనిసెట్టి సుబ్బారావు, రెంటాల గోపాల కృష్ణ, బెల్లంకొండ రామదాసు వంటి వారు తమ కవిత్వంతో అభ్యుదయ సాహిత్యాన్ని సుసంపన్నం చాశారు. సామాన్య మానవుడి కష్టాలను చిత్రించటానికి ఉద్దేశింపబడిన అభ్యుదయ కవిత్వం తన లక్ష్యం సాధించకుండానే శక్తిహీనమైంది. తరువాత వచ్చిన దిగంబర, విప్లవ కవిత్వాలకు తగిన ప్రాతిపదికలను అభ్యుదయ కవిత్వం సమకూర్చింది.

**1.3.4. దిగంబర కవిత్వం:**

1955వ సంవత్సరంలో జరిగిన సాధారణ ఎన్నికలలో అభ్యుదయ రచయితలు అభిమానించిన కమ్యూనిస్టు పార్టీ ఓడిపోవటంతో అభ్యుదయ రచయితల సంఘం నిర్వీర్యమై పోయింది. ప్రణాళికల వల్ల కొందరు కోటీశ్వరులు కాగా అసంఖ్యాక ప్రజానీకం పరమ దరిద్రులుగా మారారు. దేశంలో లక్షల మంది నిరుద్యోగులు నిరాశతో వీధుల పాలయ్యారు. అలాంటి

సమయంలో ఆధునిక జీవితాన్ని కప్పివేసిన ముసుగును తొలగించటానికి, తెలుగు కవితారంగంలో ఏర్పడిన స్తబ్ధతను ఛేదించి నూతన చైతన్యాన్ని తీసుకురావటానికి 1965వ సంవత్సరంలో ఆరుగురు యువకవులు తమ అలజడిని కవితారూపంలో ప్రకటించటానికి దిగంబర కవులుగా మారారు. వారు నగ్నముని (మానెపల్లి హృషికేశవరావు), నిఖిలేశ్వర్ (యాదవరెడ్డి), చెరబండరాజు (బద్దం భాస్కరరెడ్డి), మహాస్వప్న (కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు), జ్వాలాముఖి (వీర రాఘవాచార్యులు), భైరవయ్య (మన్మోహన్ సహాయ్). వీరు 1965 నుండి 1968 వరకు మూడు సంవత్సరాలపాటు తెలుగు సాహిత్యంలో గగ్గోలు పుట్టించి, తిరుగుబాటు సాగించి షాక్ ట్రీట్మెంట్ వంటి పద్ధతిలో తనకు నచ్చని వాటిని బూతులు తిడుతూ 3 సంపుటాలను వెలువరించారు. మధ్యమ వర్గానికి చెందిన వీరు ఆవేశంతో తిరుగుబాటు ధోరణిలో తమది ఒక యుగమని ప్రకటించుకున్నారు. సమాజంలో జరుగుతున్న వైరుధ్యాలను శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి పీడిత ప్రజల ఉద్యమాలకు అండగా నిలబడాలనే దృష్టి వీరికి లేదు. మొత్తం సమాజమే కుళ్ళి కంపుకొడుతున్నదని తామేదో విప్లవ దూతలమని చిత్రీకరించుకున్నారు. సమాజంలోని అక్రమాలపై  బండబూతులతో విరుచుకపడ్డారు. గతంలోని మంచి మీద కూడా వీరు తిరుగుబాటు చేశారు.

దిగంబర కవిత ఆలోచనా ప్రధానమైనది. ఆలోచనల తీవ్రతతో సరితూగగల అర్థపుష్టి, భావ స్పందన, రస సృష్టి అందులో జరగలేదనిపిస్తుంది. దిగంబర కవులు వెలువరించిన మూడు సంపుటాలలో రసవంతమైన రచనలతో పాటు జుగుప్సను కలిగించే వచన గేయాలు చోటు చేసుకున్నాయి. దిగంబర కవులు ఆరుగురు ఎవరి దారి వారు చూసుకోవటంతో దిగంబరయుగం అదృశ్యమైంది. కానీ దిగంబర కవులు యువకవులలోని స్తబ్దతను పారద్రోలారు. సమాజాన్ని మార్చటానికి దానిని దూషిస్తే సరిపోదని ప్రజలను మేల్కొలిపే కవిత్వం రాయటానికి సంకల్పించాలని యువ కవులు గుర్తించారు. విప్లవ రచయితల సంఘం ఏర్పడటానికి కారకులయ్యారు. నగ్నముని, చెరబండరాజు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్లు విప్లవ కవులుగా మారారు. అదే పేర్లు కొనసాగించారు.

దిగంబర కవుల ప్రేరణతో పైగంబర కవులు అనే పేరుతో సుగమ్ బాబు, కిరణ్ బాబు, దేవీ ప్రియ, కమలాకాంత్, బల్లా అనే అయిదుగురు యువకవులు మానవతావాదం తమ కవితాతత్వంగా ప్రకటించుకొని 2 కవితా సంపుటాలు వెలువరించారు. వీరిలో కూడా కొందరు విప్లవ రచయితల సంఘంలో చేరారు.

సామాజిక వైరుధ్యం పట్ల అవగాహనా రాహిత్యం కారణంగా సాహిత్య సృజన సాగని కాలంలో దిగంబర కవితోద్యమం జడత్వం తొలగించింది, విప్లవ కవిత్వం ఆవిర్భవించటానికి కారణమైంది.

**1.3.5. విప్లవ కవిత్వం:**

ఒక అభివృద్ధి నిరోధకమైన వ్యవస్థను ధ్వంసంచేసి సమూలంగా కూలదోసి మరో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయడమే విప్లవం. విప్లవం రావాలంటే బల ప్రయోగం లేదా హింస తప్పనిసరిగా చేయవలసి వస్తుంది. విప్లవం ఊరికే రాదు. దానికి శ్రమ, పట్టుదల, త్యాగాలు తప్పనిసరి. ముఖ్యంగా నమ్ముకున్న సిద్ధాంతం పట్ల నిబద్ధత ఉండాలి. అప్పుడే విప్లవం వస్తుంది. తెలుగు సాహిత్యంలో 1970-1990 మధ్యకాలాన్ని విప్లవోద్యమ కాలంగా విమర్శకులు భావించారు.

1970 ఫిబ్రవరి 1, 2 తేదీలలో విశాఖపట్టణంలో జరిగిన శ్రీశ్రీ షష్టిపూర్తి సభకు సుప్రసిద్ధ సాహితీవేత్తలెందరో హాజరయ్యారు. ఆ సమయంలో విశాఖ విద్యార్థుల కరపత్రం "రచయితలకు సవాల్" అనే పేరుతో వెలువడింది. ముప్పై ఏళ్ళుగా సాహిత్యం ఏం చేస్తుంది?, అభ్యుదయం పేరుతో గొంతు చించుకొని అరచినవాళ్ళంతా ఆ పేరుతో కవిత్వాన్ని క్యాష్ చేసుకుంటున్నారు అని రచయితలను తప్పుపట్టారు ఆ కరపత్రంలో. ఆ కరపత్రం సాహితీవేత్తలలో పెద్ద సంచలనం కలిగించింది.

అభ్యుదయ కవులు తమ దుస్థితికి కలవరపడ్డారు. దిగంబరకవులలో మార్పు వచ్చింది. అభ్యుదయ రచయితల సంఘం స్థానంలో ప్రజాపోరాటాన్ని ప్రోత్సహించే మరొక సాహిత్య సంస్థ అవసరమని సాహితీవేత్తలు ఆలోచించారు, తిరగబడి పోరాడమని యువతరాన్ని రగుల్కొలిపారు. వరవరరావు, అశోక్, లోచన్, కిషన్, ఎక్స్రేరే, ఐ, సంజీవరావు, సుధాకర్, సుదర్శన్, యాదగిరిరావు అనే యువకవులు పదిమంది తిరుగబడే కవులు. వీరిలో దిగంబరకవులకున్నంత ఆవేశమున్నా అశ్లీలాలు లేకుండా కవిత్వం రాశారు. అభ్యుదయ కవుల కంటే కూడా విప్లవ కవులు జన జీవితాన్ని అర్థం చేసుకొని కవిత్వాన్ని జనసామాన్యానికి సన్నిహితంగా తీసుకొని వచ్చారని, విప్లవాన్ని ఆహ్వానించిన వారి రచనలు నిస్సందేహంగా మేలైనవని చెప్పవచ్చు.

సాహిత్య సాంస్కృతిక రంగానికే పరిమితం కావలసిన 'విరసం' క్రమంగా దేశంలో చెలరేగిన అతివాద రాజకీయ పక్షాల అభిప్రాయాలకు ముఠాతత్వాలకు తావిచ్చింది. అతివాద రాజకీయ పక్షాలలో వచ్చిన చీలికలు విరసంలో కూడా తలెత్తాయి. ప్రత్యేక తెలంగాణ కొరకు జరిగిన ఆందోళనలో విరసం వైఖరిని ప్రజలు హర్షించలేదు. విప్లవ కవుల రచనలు విని కార్మికులు, శ్రామికులు ఉత్తేజితులై రచనలు చేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. సాహిత్యాన్ని ప్రజల దగ్గరకు తీసుకెళ్ళిన ఘనత విప్లవ కవిత్వానిదే అయినా ప్రజలను ఆవేశపరచి పోరాటం దిశగా నడిపారు, కానీ తాము ఆత్మత్యాగాలకు సిద్ధపడాలని గుర్తించని కారణంగా విప్లవ కవులు ప్రజలు అభిమానానికి దూరమయ్యారు. స్త్రీ వాద దళితవాదాల రాకతో తెలుగు సాహిత్యంలో విప్లవ సాహిత్య ఉద్ధృతి తగ్గింది.

### 1.3.6. స్త్రీవాద కవిత్వం:

ప్రాచీనాంధ్ర కావ్య సాహిత్యంలో స్త్రీ పతివ్రతగా, శీలవతిగా, గుణవతిగా చిత్రీకరించబడింది. దాదాపు ప్రాచీనాంధ్ర సాహిత్యం అంతా పురాణేతిహాసాలకు అనువాదాలు, అనుకరణ కాబట్టి స్త్రీ చిత్రీకరణ విషయంలో పెద్దగా మార్పులు చోటుచేసుకోలేదు. ప్రబంధ యుగం వచ్చేసరికి కవులు స్త్రీని ఆట వస్తువుగా, అంగడిబొమ్మగా చిత్రించారు. రాజుల్ని, వాళ్ళ ప్రియురాళ్ళని కీర్తిస్తూ గోరంతను కొండంతగా చూపుతూ కవులు కావ్యాన్ని రాసి తాము సత్కారాలు పొందారు. రాజుల్ని ఆనందపరచటానికి స్త్రీని నఖశిఖ పర్యంతం అంగాంగ వర్ణనలు చేయడానికే తమ ప్రతిభను వినియోగించారు. ప్రబంధ యుగంలో అక్కడక్కడ సజీవ పాత్రలున్నాయి. దక్షిణాంధ్ర యుగంలోని కవులు కామదృష్టితో స్త్రీ సౌందర్యాన్ని అతిగా వర్ణించారు. స్త్రీని కేవలం ఒక విలాస వస్తువుగానే చూశారు. క్షీణ యుగంలో స్త్రీ యొక్క పరిస్థితి మరీ దిగజారిపోయింది. ఈ యుగంలో, బండబూతులతో బజారు సాహిత్యం వచ్చింది.

సనాతన దురాచారాల వల్ల, మూఢ విశ్వాసాల వల్ల అనాది నుంచి అణగద్రొక్కబడుతున్న స్త్రీని జాగృతం చేసి మేలుకొల్పిన ఘనత కందుకూరి వీరేశలింగంగారికే దక్కుతుంది. ఆ తరువాత గురజాడ స్త్రీకి మహోన్నత స్థానమిచ్చారు. ఆ తరువాత చలం స్త్రీని ఇంకొక విధంగా సృష్టించారు. ఇంక భావకవులు ఊహా ప్రేయసిని సృష్టించుకొని ఆమెనే సందర్శించి, ఆరాధ్యమూర్తిగా, సఖిగా, ప్రేయసిగా, ప్రణయ దేవతగా తలచి, వలచి సాష్టాంగ దండ ప్రణామాలు చేసి మనసారా ఆరాధించి ఆ ఆనందంలో మునిగి తేలియాడారు. కట్టమంచి ముసలమ్మ మరణంతో నాయిక ముసలమ్మ లోక కళ్యాణార్థం మరణిస్తుంది. రాయప్రోలు స్త్రీని వాత్సల్యమూర్తిగా, దాక్షిణ్యములుగా, వివేకవతిగా చిత్రించారు. అడివి బాపిరాజుగారి స్త్రీ పాత్రలు కళాజగత్తులో తేలియాడుతాయి. అభ్యుదయ, విప్లవ కవిత్వంలో స్త్రీ సమస్యలు ప్రతిబింబించే విధంగా అనేక కవితలు వచ్చాయి.

20వ శతాబ్దం ఉద్యమాల యుగం ఆంగ్లేయుల ప్రభావంతో స్త్రీలపై ఉన్న అణచివేతను, లింగవివక్షతను వ్యతిరేకించటం జరిగింది. బాల్య వివాహాలు, సతీసహగమనం మొదలైన వాటిని నిరసిస్తూ స్త్రీ విద్యను ప్రోత్సహిస్తూ సాహిత్యం వచ్చింది. అయితే ఈ సాహిత్యం పురుషుల నుంచే వచ్చింది. స్త్రీల సమస్యలు స్త్రీలే చెబుతూ ఆ తర్వాత రచనలు చేయడం ప్రారంభమైంది.

1975 నుండి ప్రారంభమై కొనసాగిన అంతర్జాతీయ మహిళా దశాబ్దిలో స్త్రీవాదం ఒక బలమైన ధోరణిగా వేళ్ళూనుకొంది. తెలుగు సాహిత్యంలో గొప్ప మార్పును కలిగించింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఫెమినిస్టులు ఎక్కువ భాగం సోషలిస్టు ఫెమినిస్టులుగా చెప్పుకున్నారు. ఓల్గా, జయప్రభ, కొండేపూడి నిర్మల, ఘంటశాల నిర్మల, పాటిబండ్ల రజిని, మహెజబీన్, కల్పన రెంటాల, కుప్పిలి పద్మ, వసంత కన్నాభిరాన్, సావిత్రి, అబ్బూరి ఛాయాదేవి, కొండపల్లి కోటేశ్వరమ్మ, కె.గీత, శిలాలోలిత, వాణీ రంగారావు మొదలైనవారు స్త్రీవాద కవితలను రాశారు. స్త్రీవాద కవిత్వంలో వ్యక్తిగా, రచయిత్రిగా ఉనికి, వివాహ వ్యవస్థ, శారీరక స్పృహ, లైంగిక వివక్ష, మాతృత్వం, సామాజిక జీవితం, కుటుంబ హింస, తిరుగుబాటు చైతన్యం, ప్రపంచీకరణ అనే తొమ్మిది విభాగాలున్నాయి.

స్త్రీ వాదంలో ఉదారవాద ఫెమినిజం, రాడికల్ ఫెమినిజం, సోషలిస్టు ఫెమినిజం, సాంస్కృతిక ఫెమినిజం, కమ్యూనిస్టు ఫెమినిజం, మార్క్సిస్టు ఫెమినిజం. విప్లవాత్మక ఫెమినిజం, భౌతికవాద ఫెమినిజం, పర్యావరణ పరిరక్షణ ఫెమినిజం అనే భిన్న ధోరణులున్నాయి.

**1.3.7. దళిత కవిత్వం:**

తరతరాలుగా, యుగయుగాలుగా అగ్రవర్ణాల చేత అణచివేయబడిన వర్గాలు దళితులు. వీరు సమానత్వానికి, సంపదకు, మర్యాదకు, మన్ననకు ఎన్నో ఏళ్ళ నుంచి దూరమై మన సమాజంలో కనీ వినీ ఎరుగని కటిక దరిద్రాన్ని అనుభవిస్తూ పడరాని పాట్లుపడుతూ, అగ్రవర్ణాల దౌర్జన్యాలకు, దోపిడీలకు నిత్యం బలి అవుతూ, వాళ్ళకే ఊడిగం చేస్తూ ఊరిబయట తలదాచుకొనే స్థితికి నెట్టబడ్డారు. ఆంగ్లేయుల రాక వలన ఎంతో మంది సంఘ సంస్కర్తల ప్రభావం వలన దళితుల జీవితంలో చైతన్యం వచ్చింది. తదనుగుణంగా తెలుగు సాహిత్యంలో దళితాభ్యుదయం చోటుచేసుకుంది.

దళితవాదం, స్త్రీవాదం తెలుగు సాహిత్యంలో దాదాపు ఒకే కాలంలో ఆవిర్భవించాయి. వాటి ప్రారంభం 1975వ సంవత్సరంలో అయితే 1985వ సంవత్సరం నాటికి వాటికి అసలు రూపం వచ్చింది. జాషువా 1920వ సంవత్సరం నుండి రచనలు చేస్తున్నా 1929వ సంవత్సరం వరకు స్వంత గొంతుక ఏర్పడలేదు. తన వ్యక్తిత్వం ప్రతిబింబించే సాహిత్యం పుట్టేసరికి జాషువా ఒక సాహిత్య చైతన్యం అయ్యాడు. భీమన్న దళిత స్పృహ ఉన్న సాహిత్యం స్వాతంత్ర్యానికి ముందుగానే వచ్చింది. స్వాతంత్ర్యం తరువాత ఇనాక్ దళిత భావన ఉన్న సాహిత్యం వెలుగు చూసింది.

మన దేశంలో దళిత సాంఘిక సాహిత్య ఉద్యమాలకు తాత్విక పునాది చాలా ప్రాచీనమైంది. బ్రాహ్మణిజం మీద హిందూ మతవాద తత్వం మీద దాన్ని అనుసరించి వచ్చిన సాంఘిక అసమానతల మీద తీవ్రంగా తిరుగుబాటు చేసిన ముఖ్యమైన ఉద్యమాలు, బౌద్ధం, జైనం, చార్వాకం, వీరశైవం, భక్తి ఉద్యమాలు, హిందూ మతవాద తత్వం మీద ఘాటుగా దాడి చేసిన వ్యక్తులు కూడా ఉన్నారు. ఇందులో ప్రధానమైనవారు పోతులూరి వీరబ్రహ్మం, వేమన, సిద్దప్పలు. వీరు సమాజాన్ని చైతన్యవంతం చేశారు. ఆధునిక కాలంలో జ్యోతిబాపూలే, నారాయణగురు, సాహు మహారాజ్, పెరియార్, ఇ.వి. రామస్వామి నాయకర్ వంటివారు చేసిన పోరాటాలు, ఉద్యమాలు దళిత ఉద్యమానికి కొత్తశక్తినిచ్చాయి.

దళిత సాహిత్యంలో ప్రధానంగా బ్రాహ్మణీయ సంస్కృతిని వ్యతిరేకించేవి, దళిత సంస్కృతిని ప్రతిష్ఠించేవి అనే రెండు లక్షణాలున్నాయి. దళిత నాయకులను స్తుతిస్తూ, సంఘీభావ ఆవశ్యకతను వివరిస్తూ దళితులకు కర్తవ్య బోధ చేస్తూ దళిత

కవిత్వం సృజించబడింది. రిజర్వేషన్‌ల పరిరక్షణ, దళితులకు రాజ్యాధికారం అనే అంశాలను దళిత కవులు తమ కవిత్వం ద్వారా తెలియజేశారు.

1909వ సంవత్సరంలో 'మాలవాండ్రపాట' తో దళిత సాహిత్యం ప్రారంభమైంది. మంగిపూడి వెంకట శర్మగారు, కొండపల్లి జగన్నాధరావుగారు, త్రిపురనేని రామస్వామి చౌదరిగారు, జాలా రంగస్వామిగారు, కర్ణ వీర నాగేశ్వర రావుగారు, జాషువాగారు, గద్దల జోసఫ్‌గారు, మల్లెల దావీదుగారు, బీర్నీడు మోషేగారు, బోయి భీమన్నగారు వంటి వారు దళిత సాహిత్యాన్ని వెలయించారు. మొదట్లో దళితేతరులు రచనలు చేయగా ఆ తర్వాత తమ వెతలు తామే చెప్పుకుంటూ దళితులే రచనలు చేశారు. ఎండ్లూరి సుధాకర్‌గారు, మద్దూరి నగేష్‌బాబుగారు, ఎ.సి. రాములుగారు, నాగప్ప సుందరరాజుగారు, పైడి తెరేష్ బాబుగారు, చల్లపల్లి స్వరూపరాణిగారు, ఎన్. రవికుమార్‌గారు, సుంకర రమేష్‌గారు, ఖాజా, స్కైబాబగారు వంటి అనేకమంది దళిత సాహిత్యాన్ని సృజించారు.

దళిత సాహిత్యం బహుముఖంగా విస్తరిస్తోంది. డా॥ అంబేద్కర్ శతజయంతి సందర్భంగా ఆచార్య వెలమల సిమ్మన్న గారు వ్యవస్థాపక అధ్యక్షులుగా దళిత సాహిత్య పీఠం ఏర్పడింది.

**1.3.8. ముస్లిం వాద కవిత్వం:**

ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన మరో ధోరణి ముస్లింవాద కవిత్వం. తెలుగు సాహిత్యంలో రచనలు చేసిన ముస్లిం కవులు అనేకమందున్నారు. భారతదేశంలో మతతత్త్వం ఎక్కువై హిందూమత ఛాందస్సులు ఇతర మతాలవారిని దూషించడం, కించపరచడం, కొట్టడం చేశారు. 1992 డిశంబర్ 6వ తేదీన బాబ్రీ మసీదును మత ఛాందసులు విధ్వంసం చేశారు. ముస్లిం హృదయాలు గాయపడ్డాయి. ముస్లిం సోదరులందరూ సంఘీభావంతో ఏకమైనారు. ముస్లింలకు జరిగిన అన్యాయాన్ని, అక్రమాలను వ్యతిరేకించడం కోసం కలం పట్టారు. తమ ఉనికికై, హక్కులకై, భద్రతకై ముస్లిం మైనారిటీ కవులు తమ ఆవేదనను అక్షరీకరించారు. తెలుగు సాహిత్యంలో ఇదొక ముందడుగు. ఈ ప్రతిఘటన సాహిత్యం ప్రజాస్వామికమైనది. సార్వజనీనతను కలిగివుంది.

1990వ సంవత్సరం నుంచి ముస్లింవాద కవిత్వ స్పృహ వచ్చింది. 1991వ సంవత్సరంలో "పుట్టుమచ్చ" దీర్ఘకవితతో ముస్లింవాదం పుట్టింది. 1992 డిశంబర్ 6 తర్వాత ముస్లింవాద కవిత్వం పదునెక్కింది. మనం గురించి మనం రాసుకోవాలి అనే స్థితి ఏర్పడింది. ఖాదర్ మోహియుద్దీన్ "పుట్టుమచ్చ" దీర్ఘకవిత తెలుగు సాహిత్య ప్రపంచంలో సంచలనం సృష్టించింది. మైనారిటీల మనోభావాలను ఈ కవిత తెలియజెప్పింది. తమపై వివక్షకు కారణమేమిటని ప్రశ్నించింది. ఆత్మగౌరవంతో జీవించడానికి తగిన అస్తిత్వం తమకుండాలని డిమాండ్ చేసింది. 1997వ సంవత్సరంలో వెలువడిన ముస్లింవాద కవుల తొలి సంకలనం 'జిహాద్'. జిహాద్ అంటే పవిత్ర యుద్ధం. 1998వ సంవత్సరంలో స్కైబాబా సంపాదకత్వంలో 'జల్ జలా' సంకలనం వెలువడింది. 'జల్ జలా' అంటే భూకంపం. స్కైబాబా, అఫ్సర్, ఖాజా, ఖాదర్, మహమూద్, కరీముల్లా మొదలైన కవులు తమ వాదాన్ని వినిపించారు.

ముస్లిం మైనారిటీ వాదం తర్వాత, ముస్లిం స్త్రీవాద కవిత్వం వచ్చింది. ముస్లిం స్త్రీల జీవితంలోని పరదా కన్నీళ్ళను, ప్రాథమిక జీవన సత్యాలని, ప్రత్యక్ష వాస్తవికతను ఇది అద్దం పట్టింది, మొదటిగా పురుష కవులే స్త్రీల బాధల్ని సహానుభూతి స్వరంతో వినిపించారు. ఆ తర్వాత స్త్రీలే తమ వెతల్ని అక్షరీకరించారు. షాజహానా, మహెజబీన్, ఎన్. రజియా వంటి కవయిత్రులు తమ అస్తిత్వం కోసం రచనలు చేశారు.

**1.3.9. బీ.సీ. వాదం:**

భారతదేశంలో అన్ని కులాలకన్నా అధిక సంఖ్యలో జనాభా ఉన్నది వెనుకబడిన తరగుతులలోనే. కానీ ప్రాచీనకాలం నుంచి బీ.సీ.లు సమాజంలో తగిన గుర్తింపు లేక, అవకాశాలు లేక నిరంతరం శ్రమించినప్పటికి శ్రమకు తగిన ఫలితం పొందక వెనుకబడి ఉన్నారు. కొన్ని ప్రాంతాలలో కొన్ని బీ.సీ. కులాలు, ఎస్.సి. కులాల కంటే నీచంగా చూడబడుతున్నారు. షెడ్యూలు కులాలవారికి లభించినన్ని అవకాశాలు వీరికి లేకపోవటం, ఎక్కువ కులాలు ఉండటం కారణంగా తమలో తామే ఐక్యత లేక కలహించుకోవడం కారణంగా వీరు వెనుకబడి వున్నారు. దళిత వాద సాహిత్యం వచ్చిన తర్వాత దళితులలో చైతన్యం పెరిగింది. అలాగే బీ.సీ. లలో కూడా చైతన్యం రావటానికి, వారి అస్తిత్వానికి, గౌరవానికి భంగం కలిగితే ప్రశ్నించటానికి బీ.సీ. వాద సాహిత్యం అవసరం ఎంతైనా ఉంది.

“విదేశీ పాలకుల నుంచి విముక్తి సాధించటం కన్నా సాంఘిక ప్రజాస్వామ్యాన్ని సాధించటమే ప్రధానం” అని మహాత్మా జ్యోతిరావు ఫూలే ఆ రోజుల్లోనే ప్రబోధించారు, అంబేద్కర్ కూడా ఆ బాటలోనే సాగారు. ఆ స్ఫూర్తితో తెలుగు రాష్ట్రంలో దళిత సాహిత్యోద్యమంలో భాగంగానే బీ.సీ. ల సాహిత్యం వెలువడింది. బీ.సీ. వాదం ఫూలే, అంబేద్కర్ సిద్ధాంతాలను స్వంతం చేసుకుంది. 1990వ సంవత్సరం తర్వాత బీ.సీ.వాదంతో కవితా సంపుటాలు వెలువడ్డాయి.

1994వ సంవత్సరంలో దెంచనాల శ్రీనివాస్ “గురి తప్పిన పద్యం” కవితా సంపుటిలో

**“నువ్ తొలిచిన నందీశ్వరులను తలచుకొని**
**లేపాక్షి బసవన్న లేచిపోతాడు**
**త్రాచుల్ని చంపే నీ నైపుణ్యాన్ని చూసి దేశ**
**దేశాల కమెండోలు తలలు దించుకొంటారు.**
**కాలుతున్న గుడిసెల మధ్య దూకే నీ చాకచక్యాన్ని ఏడు ప్రపంచ ఫైరింజన్లన్నీ తగలబడి పోతాయి.**
**నువ్ సృజించిన ఇళ్ళూ, నాగళ్ళూ, వెండి**
**మొలతాళ్ళూ, మట్టి గంగాళాలు, కట్టె శిల్పాలూ**
**ఇత్తడి తాంబాళాలూ, ఇనుప పనిముట్లు, కళా జ్ఞానాల చరిత్ర చెరిపేస్తాయి”.**

అని బీ.సీ. కుల వృత్తుల గురించి తెలిపారు.

సమాజంలో ఏ పని జరగాలన్నా బీ.సీ.ల ఉనికి అవసరం, కానీ ఫలితం శూన్యం. పెత్తనం ఇంకొకరిది.

కొంపెల్లి వెంకట్ గౌడ్ “ముస్తాదులు కదులుతున్నాయి” అనే కవితలో

**“రకం కట్టేది మేమైతే**
**చెట్టు మీద జులుం వాడిది.**
**కల్లు గీసేది మేమైతే**
**ముంత మీద ధర ముద్రించేది వాడు**
**ఆ పై ఆబ్కారోడి నిఘా”** అంటారు. తమ శ్రమను దోచుకుంటున్న దోపిడీదార్లను నిరసించారు.

"వల ఏరెయ్యక ముందే" అనే కవితలో అంబటి వెంకన్న

**"మా పుట్టుకలు మేఘాలై**
**బతుకులు శోక సముద్రమవుతుంటే**
**మా వెనుకట్టి మీద లారీలు పెట్టి**
**మాకు కడుపులే లేనట్టు**
**మా పొట్ట పేగులు కూడా వేపుకుపోతున్నారు**
**దొరలు-దళారులు" అంటూ జాలర్ల వెతలను చిత్రీకరించారు.**
**సీతారాం "రెజ్యూమ్" కవితలో బీ.సీ. కులాల చైతన్యాన్ని**
**"మేమెవరం?**
**చాకర్లం, మంగళ్లం**
**చౌదుసున్నాలు, సన్నాసులం**
**గాడిద బరువుల ముట్టు మూటలం, ఇస్త్రీపెట్టెలం**
**ఆదరణ అంతగా లేని పౌరులం.....**
**ఏమైతేనేం? మేం బీ.సీ.లం"** అంటూ మేల్కొల్పారు.

భారతదేశంలో సామాజిక జీవన చక్రం నడవడానికి మూల కారకులు బీ.సీ.లు. వీరు ప్రతి క్షణం అడుగడుగునా అవమానానికి గురికావడాన్ని బీ.సీ. కవులు నిరసించారు. పగడాల నాగేందర్ "సుద్ధి" కవితలో

**"ఎనకబడ్డ కులాల ధిమికి ధిమికి దరువుల్లో**
**ధ్వజస్తంభాలు దొరల గడీలు కూలుతుంటే**
**పురుడు బోసుకున్న గి నేలంతా**
**తంగేడు పూల వనంలో**
**బాలసంతు పాటై మోగుతుంది"** అని ధ్వజమెత్తారు.

దెంచనాల శ్రీనివాస్, ఆచార్య ననుమాసస్వామి, బాణాల శ్రీనివాసరావు, సిద్ధార్థ, బెల్లి యాదయ్య, ఎం. వెంకట్, తమ్మనబోయిన వాసు వంటి కవులు బీ.సి. వాద కవిత్వాన్ని వెలయించారు. జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో 2001వ సంవత్సరంలో "వెంటాడే కలాలు" అనే బీ.సీ. వాద కవితా సంకలనం వెలువడింది. దళిత వాదం లాగానే బీ.సీ. వాదాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్ళవలసిన బాధ్యత బీ.సీ. కవులపై ఉంది.

**ఆధార గ్రంథాలు:**

1) ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు: ప్రయోగములు - ఆచార్య సి. నారాయణరెడ్డి
2) తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - ఆచార్య వెలమల సిమ్మన్న
3) తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) - ఆచార్య జి. నాగయ్య.

**- ఆచార్య ఇరపని మాధవి.**

**పాఠం - 2**

# ఆధునిక కవిత్వ ప్రక్రియలు

**విషయ క్రమం:**


**2.1.** మినీ కవిత్వం
**2.2.** హైకూ కవిత్వం
**2.3.** నానీ కవిత్వం
**2.4.** రెక్కలు కవితా ప్రక్రియ
**2.5.** నానో కవితా ప్రక్రియ
**2.6.** మెరుపులు కవితా ప్రక్రియ
**2.7.** కిరణాలు కవితా ప్రక్రియ
**2.8.** అబాబీలు
**2.9.** రవ్వలు


## 2.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

ఆధునిక కవిత్వ ప్రక్రియల పట్ల అవగాహన కలిగించటం, సమకాలీన సమాజంలో వీటి ఆవశ్యకత విద్యార్థులకు తెలియపరచటం.

**పరిచయం:** తెలుగు సాహిత్యంలో అనేక కొత్త కొత్త ప్రక్రియలు వచ్చాయి. ప్రాచీన కాలంలో పద్యం, ఆ తరువాతి కాలంలో గేయం ఉండేది. 1930వ సంవత్సరంలో వచన కవిత ప్రారంభమైంది. అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, విప్లవ కవిత్వం ఇవన్నీ వచన కవిత్వంలోనే రాయబడ్డాయి. వచన కవితకు ఆధునిక తెలుగు సాహిత్యంలో విస్తృతమైన వ్యాప్తి జరిగింది. వచన కవిత అనగానే కుందుర్తి గుర్తుకొస్తారు. కుందుర్తిని వచన కవితా పితామహుడుగా వ్యవహరిస్తారు. క్రీ.శ. 1975వ సంవత్సరంలో “మినీ కవిత్వం” వచ్చింది. మినీకవిత్వాన్ని ఎక్కువగా ప్రచారం చేసినవారు రావి రంగారావు గారు. ఆ తరువాత జపాన్ సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి “హైకూ” కవిత్వం వచ్చింది. 1990వ సంవత్సరంలో గాలి నాసరరెడ్డి గారు హైకూ రచన ప్రారంభించారు. 1997వ సంవత్సరంలో “నానీ” కవితా ప్రక్రియ ప్రారంభమైంది. దీనికి ఆద్యులు ఆచార్య ఎన్. గోపిగారు. నానీల తర్వాత “నానోలు” వచ్చాయి. “రెక్కలు” మరో వచన కవితా ప్రక్రియ. గజళ్ళు, రుబాయిలు, కైతికాలు, మెరుపులు, రవ్వలు, కిరణాలు, మిణుగురులు, అబాబీలు ఇలా అనేక ప్రక్రియలలో తెలుగు కవిత్వం ఈనాడు వెల్లివిరుస్తుంది.

## 2.1. మినీ కవిత్వం:

1975వ సంవత్సరంలో ప్రారంభమైన మినీ కవిత్వం 1980వ సంవత్సరం నాటికి ఒక బలమైన ఉద్యమంగా రూపుదాల్చింది. మినీ కవితను ఒక ఉద్యమంగా తెచ్చిన ఘనత రావి రంగారావు గారికే దక్కుతుంది.

### 2.1.1. నిర్వచనం:

సి.నా.రె. : మినీకవిత ఆయు
మెరుపంత
కాని అది ప్రసరిస్తుంది
కాలమంత

సంజీవదేవ్ : మినీ కవిత అనేది ఒక తొలకరి మెరుపు. మెరుపు అనేది మెరిసిన తర్వాత నిలువదు. వెంటనే అదృశ్యం అయిపోతుంది. కాని మినీ కవిత తనను వినిపించి మాయమైపోదు, నిలిచిపోతుంది. కనుక అదొక స్థిరమైన తొలకరి మెరుపు.

ఆరుద్ర : ఎన్ని గజాలు రాశాడన్నది కాదు.
ఎన్ని నిజాలు చెప్పాడన్నది ముఖ్యం.

**2.1.2. మినీ కవిత – లక్షణాలు:**

ఆధునిక కాలంలో వచ్చిన శాస్త్ర సాంకేతిక రంగాల్లో మార్పుల కారణంగా ప్రజల దృక్పథంలో వచ్చిన మార్పు కారణంగా యువకవులు కూడా భావాన్ని సూటిగా బలంగా చెప్పాలనుకోవడంతో పుట్టిన మినీ కవిత ఈ క్రింది లక్షణాలను కలిగి ఉంటుంది.

1. సంక్షిప్తత: వీలైనన్ని తక్కువ పదాల్లో పాదాల్లో చెప్పటం సంక్షిప్తత. అనవసరమైన పదాలు, భాషాడంబరం ఉండదు
2. నవ్య బంధుర శైలి: మినీ కవితలో కవి వాడిన ఒక పదాన్ని తీసివేసి మరో పదంతో పూరించే అవకాశం ఉండదు. అంత ఖచ్చితమైన పదనిర్మాణం మినీ కవిత కలిగుంటుంది.
3. చమత్కారం: హృదయానికి ఆనందానుభూతిని కలిగించే గుణం కలిగుంటుంది.
4. వ్యక్తీకరణలో సూటిదనం: వచన కవితలో కన్పించే లయ కూడా లేకుండా కృత్రిమ అనుప్రాసలు లేకుండా సూటిగా వ్యక్తీకరణ ఉంటుంది.
5. కొత్తదనం: ఇతర కవులు చెప్పిన ఉపమానాలు కాకుండా భావనతో కొత్తదనం ఉండటం.
6. భావ గాంభీర్యం: కవిత చిన్నదిగా కన్పిస్తున్నా ఆలోచించే సహృదయులకు ఎంతో గంభీరభావం స్ఫురించడం.
7. వ్యవహారిక భాష: వాడుక భాషలో రాయబడుతుంది.
8. శీర్షికా ప్రాధాన్యం: శీర్షిక కూడా వ్యర్థంగా ఉపయోగించబడక మరింత భావ విస్తృతికి తోడ్పడేటట్లు ఉంటుంది.

**2.1.3. మినీ కవిత – వర్గీకరణ:**

డా॥ రావి రంగారావు గారు మినీ కవితల్ని ఈ క్రింది విధంగా వర్గీకరించారు.

1. సౌందర్యానుభవ మినీకవితలు
2. నైతిక మినీ కవితలు
3. సాంస్కృతిక మినీ కవితలు
4. ఆధ్యాత్మిక మినీ కవితలు
5. జ్ఞానాత్మక మినీ కవితలు
6. ప్రజాస్వామ్య మినీ కవితలు
7. మానవతా మినీ కవితలు
8. సామాజిక మినీ కవితలు
9. దేశభక్తి మినీ కవితలు

**1. సౌందర్యానుభవ మినీ కవితలు:**

ప్రకృతి సౌందర్యారాధనతోనే కవిత్వం పుట్టింది. మినీ కవిత సౌందర్యాన్ని వివేక నేత్రంతో చూడగలిగే శక్తిని అందిస్తుంది. ప్రకృతి అంతా సౌందర్యమే.

"గుడ్ మార్నింగ్" అనే మినీ కవితలో రావి రంగారావు గారు

**"ఆకాశం ఇచ్చింది**

**ఆకుల్ని,**

**చీకటి తెచ్చింది**

**వక్కల్ని,**

**వెన్నెల కలిపింది**

**సున్నం,**

**తాంబూలం వేసుకుంది**

**సముద్రం...**

**పొద్దున్నే పలకరించాడు**

**భానుడు నవ్వుతూ**

**సముద్రము నవ్వింది**

**పండిన నోటితో"** అని సూర్యోదయాన్ని వర్ణించారు.

రామసూరిగారు "అట్టహాసం" అనే మినీ కవితలో

**"వర్షం కావ్యానికి**

**మెరుపులు కవర్ డిజైన్**

**ఉరుములు ముందుమాట**

**తీరా చినుకైనా**

**పడుతుందో లేదో"** అని ఒక పుస్తకం కవర్ పేజీ, ముందుమాట బాగున్నా లోపల కవితలు చదవదగిన విధంగా ఉన్నాయో, లేదో అనే విషయాన్ని ఇలా వర్షం, మెరువులు, ఉరుములు, చినుకులు అంటూ చెప్పారు.

**2. నైతిక మినీ కవితలు:**

నైతిక సంబంధమైన అంశాలతో కూడినవీ మినీ కవితలు. ఆసు రాజేంద్ర గారి "ఆకాశాన్ని చూసి" కవితలో నీతి బోధ ఉంది.

**"ఆకాశమంత ఉంది కదా అని**

**వాన చినుకు**

**సముద్రాన్ని ఆశ్రయిస్తే**

**దాని బతుకు ఉప్పెనయి పోయింది"** అంటారు రాజేంద్ర.

డబ్బు కోసం మనిషి కుక్కలాగా మారకూడదని రావి రంగారావు గారు

**"డబ్బు**

**దేవుడయ్యేసరికి**

**ఇనుము**

**పెట్టయింది**

**రాయి**

**గోడయింది**

**చెక్క**

**తలుపయింది**

**చివరికి**

**ప్రాణం**

**కుక్కయింది"** అని అంటారు.

**3. సాంస్కృతిక మినీ కవితలు:**

రకరకాల సంస్కృతుల సమ్మేళనం భారతీయ సంస్కృతి. హాని చేసిన వాడిని కూడా క్షమించి మేలు చేసే ఉన్నత సంస్కారం భారతీయుల స్వంతం. అదే విషయాన్ని భగ్వాన్ గారు "కార్మికులు" అనే మినీ కవితలో

**"చేతులు**

**తమ కంఠాలకు**

**దారం ఉరితాడు**

**బిగించినా**

**మల్లెపూలు**

**సురభిళాన్ని**

**వెదజల్లుతూనే వున్నాయ్"** అని అన్నారు.

రావి రంగారావుగారు "నడిచే దీపం" మినీ కవితలో

**"వత్తి చేద్దామని**

**చేతుల్ని కలపగానే**

**నేనే ఒక దీపమై పోయా**

**నా చేతులలో వత్తులు**

**నా హృదయంలో ప్రమిద**

**నా సంకల్పంలో నూనె**

**నా శిరస్సులో అఖండ జ్యోతి"** అంటారు.

**4. ఆధ్యాత్మిక మినీ కవితలు:**

ఆధ్యాత్మికతకు సంబంధించిన మినీకవితలను కె.ఎస్. రమణ, వసీరా, చంద్రసేన్ వంటివారు రచించారు. కె.ఎస్. రమణ గారు "జీవితం" అనే మినీ కవితలో

**"మీ వ్యాకరణం**
**ఎట్లా వుంటేనేం?**
**ఈ వాక్యంలో**
**క్రియే ముఖ్యం నాకు"** అని కర్మ సిద్ధాంతం గురించి చెప్పారు.

మనం చేసే పనిని బట్టి ఫలితం ఉంటుంది.

వసీరా తన కవితలో

**"కాళ్ళు తడవకుండా**
**సముద్రాన్ని దాటగల మేధావియైనా**
**కళ్ళు తడవకుండా**
**జీవితాన్ని దాటలేదు"** అనే జీవిత సత్యాన్ని చెప్పారు.

"కంటి తెలివి" అనే మినీ కవితలో చంద్రసేన్ గారు

**"కన్ను తెరిస్తే జననం**
**కన్ను మూస్తే మరణం**
**రెప్పపాటే గదా ఈ ప్రయాణం"** అంటూ తాత్త్వికతను తెలిపారు.

**5. జ్ఞానాత్మక మినీ కవితలు:**

శాస్త్ర సంబంధమైన విషయాలతో కొంత చమత్కారం జోడించి జ్ఞానాన్ని అందించే విధంగా రాసిన కవితలను భారవి గారు "హారం పెరిగింది" అనే మినీ కవితలో

**"సమాజం అనే**
**భిన్నంలో**
**లవం న్యాయం**
**హారం అన్యాయం"** అంటూ సమాజంలో అన్యాయం పెరిగిందని చెప్పారిలా.

ఆర్. అరుణగారు "ద్వి సంఖ్యామానం" అనే కవితలలో

**"। । ।**
**ఇది విష్ణు మూర్తి నామం**
**జన బాహుళ్యానికి ఆయన**
**7 కొండలవాడు"** అని చమత్కారంగా చెప్పారు.

**6. ప్రజాస్వామ్య మినీ కవితలు:** భారతదేశంలోని ప్రజాస్వామ్యం గురించి రాయబడిన కవితలు ఈ కోవకు వస్తాయి.

"కుక్క" అనే మినీ కవితలో దాసరాజు రామారావు గారు

**"వాడు ఎన్నికలప్పుడు**

**నా యింటి ముందు నిలబడ్డాడు**

**వాడు గెలిచాక**

**నా యింటో కొచ్చి కూర్చున్నాడు**

**వాడు పదవిలోకొచ్చి**

**నా కుండలో కూడెత్తుకెళ్ళాడు"** అంటూ రాజకీయ నాయకులు ప్రజలతో జీవితాలతో ఎలా ఆడుకుంటున్నారో తెలిపారు.

**7. మానవతా మినీ కవితలు:**

మానవతా విలువలకు సంబంధించిన కవితలివి. కన్నా అనంత వెంకటేశన్‌గారు "మానవత" అనే మినీ కవితలో

**"పీడిత జన**

**జీవితాల బూడిదని**

**కన్నీటితో ముద్ద చేసి**

**నాయకుని బొమ్మ చేద్దామనుకున్నా**

**ఎంత ప్రయత్నించినా**

**బక్క చిక్కిన వాడి**

**బొమికల బోనే వస్తుంది"** అంటారు.

**8. సామాజిక మినీ కవితలు:**

సామాజిక అంశాలకు సంబంధించిన కవితలివి. ఇందిరా గాంధీ హత్య కావించబడినపుడు ఆచార్య కొండపల్లి సుదర్శన రాజు గారు

**"ప్రపంచంలో**

**మారణ హోమానికి శ్రీకారం**

**మత జననం**

**అందులో అంతర్భాగమేనోయ్**

**ఇందిర హననం"** అని ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి విద్యావిధానాన్ని గురించి డా|| గుమ్మా సాంబశివరావు గారు

**"రెసిడెన్షియల్" పంజరంలో**

**చిలుకల్ని చూడు**

**అవిశ్రాంత వేద పఠనం"** అని వ్యంగ్యధోరణిలో చెప్పారు.

**9. దేశభక్తి మినీ కవితలు:**

జాతీయాభిమానానికి సంబంధించినవీ కవితలు, "ఆయుధ పూజ" అనే మినీ కవితలో కె. పద్మజ గారు

**"దేశానికి అది "గో గ్రహణం" పట్టింది**

**శమీ వృక్షం ఎక్కి**

**ఆయుధాలు తెచ్చే**

**అర్జునుడు కావాలిప్పుడు"** అని దేశాన్ని రక్షించే వీరులు కావాలనే సందేశాన్ని ఇచ్చారు.

రావి రంగారావుగారు 1981వ సంవత్సరంలో "గుడ్ మార్నింగ్" మినీకవితా సంపుటిని ప్రచురించారు. 2002వ సంవత్సరంలో "అగ్గిపెట్టి "అనే పేరుతో తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ముద్రించారు. రావి రంగారావుగారి ప్రేరణతో అనేక మంది మినీకవితలు రాశారు, రాస్తున్నారు. వారిలో చెప్పుకోదగినవారు పూర్ణచంద్, రామసూరి, దేవదేవన్, ఆసు రాజేంద్ర, భగ్వాన్, చంద్రసేన్, కె.ఎస్.రమణ, రాళ్ళపల్లి సాయి రామకృష్ణ, వసీరా, ఆర్. అరుణ, భారవి, కామర్సు నాగేశ్వరరావు, దాసరాజు రామారావు, నాగభైరవ కోటేశ్వరరావు, గుండాన జోగారావు, కాళోజి, గన్ను కృష్ణమూర్తి, డా॥ ద్వా.నా. శాస్త్రి, జి. సూర్య ప్రకాష్, కన్నా అనంత వెంకటేశన్, నాదెళ్ళ మణి, పర్వతనేని అన్నపూర్ణ, కె.వాణి, కడియాల రాజ్యలక్ష్మి, కె. పద్మజ, జి.వి.ఎమ్. కాళిదాసు, హేమలత, పల్లపోతు దుర్గా ప్రసాదరావు, జోగంటి జగన్నాధం, ఎల్లోరా, డా॥ గంబీరం సుందరరావు, డా॥ గుమ్మా సాంబశివరావు, ఆచార్య భావన్, కందుకూరి శ్రీరాములు, దిక్సూచి, చిలుకూరి కోటేశ్వరరావు, ఆర్. రామారావు, రాళ్ళబండి కవితా ప్రసాద్, శ్రీ కాట్రగడ్డ, జింబో, అలిశెట్టి ప్రభాకర్, కె.వాసుదేవరావు, భీశెట్టి సత్యనారాయణ, కె.బాలుస్వామి, రాయన్, పి.ఆర్. హరినాథ్, డా॥ కొండపల్లి సుదర్శన రాజు మొదలైనవారు.

1980వ సంవత్సరంలో "మినీ కవిత" అనే వ్యాస సంపుటి ప్రచురించబడింది. 1981వ సంవత్సరంలో "మినీ కవితా ప్రదర్శన" ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి వారి సౌజన్యంతో మచిలీపట్నంలో ఏర్పాటుచేయబడింది, "మినీ కవితా విప్లవం" పేరుతో కొల్లూరి తీసుకువచ్చిన యువకవుల మినీ కవితల సంకలనం మినీ కవితకు ప్రాచుర్యం పెంచింది. రంగారావు గారు మినీ కవితలపై రాస్తూ మరో ప్రక్క మినీ కవితలపై విమర్శనాత్మకంగా వ్యాసాలు రాశారు. మినీ కవితలపై విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగేటంతగా అందరికీ అనుసరణయోగ్యమయ్యాయి మినీ కవితలు.

## 2.2. హైకూ కవిత్వం:

హైకూ కవిత్వ ప్రక్రియ జపాన్ ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి వచ్చింది. జపాన్‌లో పుట్టిన ఈ హైకూలకు పునాది "జెన్ బౌద్ధం". జెన్ అంటే ధ్యానం. ధ్యాన చైనాలో "ఛాన్" అయింది. చైనా నుంచి జపాన్ వెళ్ళే సరికి "ఛాన్' 'జెన్' అయ్యింది. జెన్‌తత్వం జపాన్‌లో ప్రవేశించిన కొంతకాలానికి ఆ తాత్త్విక భూమిక ఆధారంగా "హైకూ" కవితా సృష్టి క్రీ.శ. 14వ శతాబ్దంలో జరిగింది. 17వ శతాబ్దంలో 'బషో' హైకూ పితామహుడిగా పేరుపొందారు.

**2.2.1. హైకూ – లక్షణాలు:** హైకూ కవితా ప్రక్రియకు కొన్ని లక్షణాలున్నాయి.

1. ప్రాకృతిక ప్రేరణ
2. పదచిత్రం – అనుభూతి
3. లక్షణ వ్యంజనాభివ్యక్తి

4. ఝటితి స్ఫూర్తి
5. సార్వకాలీనత
6. ఒకే కాలం – ఒకే స్థలం
7. అమూర్త భావాల మూర్తీకరణ
8. అల్పంతో అనల్పాభివ్యక్తి
9. కొత్త కోణంలో ప్రకృతి దర్శనం

హైకూ కవితకు శీర్షిక ఉండదు. మూడు పాదాలు ఒకే భావాన్ని, ఒకే అనుభూతిని ఇచ్చేవిగా ఉంటాయి. ఏ హైకూకి ఆ హైకూ వేరు వేరుగా ఉంటుంది. కొనసాగింపు ఉండదు. అక్షర నియమానికి వచ్చే సరికి జపాన్ భాషలోని ఓన్‌జిని అనుసరించి ఇంగ్లీషు వారి 17 సిలబల్స్‌ను బట్టి 17 అక్షరాల్లో హైకూ రాయాలి (5 + 7 + 5 = 17) పొల్లుతోనూ, పూర్ణబిందువుతో కూడిన అక్షరాన్ని కూడా తెలుగులో ఒక్క అక్షరంగానే గణించాలి. మూడు పాదాల్లో హైకూ చెప్పాలి పాద నియమాన్ని ఉల్లంఘించ కూడదు. కవితా వస్తువుగా ఏ అంశాన్నైనా తీసుకోవచ్చు.

జపాన్‌లో ప్రారంభమైన హైకూ ప్రక్రియ క్రమక్రమంగా ప్రపంచంలోని అన్ని భాషల్లోకి ప్రవేశించింది. భారతదేశంలో హిందీ, గుజరాతీలు హైకూల్ని ఎక్కువగా రాశారు. 1990వ సంవత్సరంలో గాలి నాసరరెడ్డి గారు "హైకూ" రచన ప్రారంభించారు. 1991లో ఇస్మాయిల్ గారు వానాకాలం హైకూలు రాశారు. మొదటిసారిగా 1991వ సంవత్సరంలో డా॥ పెన్నా శివరామకృష్ణ గారు రాసిన "రహస్య ద్వారం" హైకూ సంపుటి ప్రచురించబడింది. తెలుగులో తొలి హైకూ సంపుటి ఇది. ఆ తర్వాత అనేక మంది హైకూ కవితలు రాశారు. వారిలో కొందరు బి.వి.వి. ప్రసాద్, ఇస్మాయిల్, లలితానంద ప్రసాద్, శిరీష, మాకినీడి సూర్య భాస్కర్, కె.రామచంద్రారెడ్డి, ఆకొండి శ్రీనివాస రాజారావు, నల్లా నరసింహ మూర్తి, శంకర వెంకట నారాయణ రావు, పత్తిపాక మోహన్, శ్రీమతి రత్నమాల, జి. గోపాలయ్య, కత్తుల కిషోర్ కుమార్, భగ్వాన్, రావి రంగారావు, ఎన్. శైలజ, శ్రీనివాస గౌడ్, ఆర్.వి. యస్. భరద్వాజ, గణపతి రాజు చంద్రశేఖర రాజు, చిమ్మపూడి శ్రీరామ మూర్తి, బొల్లిముంత వెంకట రమణారావు, తలతోటి పృథ్వీరాజ్, జుగాష్ విలి, ఆర్. ఎల్. స్వామి మొదలైనవారు.

2002వ సంవత్సరంలో అనకాపల్లిలో డా॥ తలతోటి పృథ్వీరాజ్ గారు "ఇండియన్ హైకూ క్లబ్" ఏర్పాటుచేశారు. వీరు హైకూ సాహిత్య మాస పత్రికను కూడా నడిపారు.

**2.2.2. హైకూలకు కొన్ని ఉదాహరణలు:**

**1. ప్రకృతి హైకూలు:**

**"పెద్ద కొండపై**
**ఆకాశాన్ని తాకుతూ**
**ఓ తాటి చెట్టు"** **– డా॥ తలతోటి పృథ్వీరాజ్**

**"రంగు రంగుల సీతాకోకలు**
**ఎగురుతున్నాయి**
**ఒకే రంగు నీడతో"** **– మాకినీడి సూర్యభాస్కర్**

**"కోవెల గోపురం**

కోనేట్లో
కుబుసం విడిచింది" – ఇస్మాయిల్

**2. తాత్విక హైకూలు:**

"రాముని గుడి
రథ చక్రాల కింద
చంద్ర శకలం" – డా॥ పెన్నా శివరామకృష్ణ

"పొంచి ఉంటోంది
నీడల్లే మరణము
జీవం వెనుకే" – డా॥ తలతోటి పృధ్వీరాజ్

**3. సామాజిక హైకూలు:**

"నాడు కొడుకు
హాస్టల్లో నేడు తండ్రి
వృద్ధాశ్రమంలో" – డా॥ గుమ్మా సాంబశివరావు

"కుడితే కుట్టింది
దోమకు అస్పృశ్యత లేదని
రక్త ప్రమాణకంగా చెప్పింది" – శిఖా ఆకాష్

"అడవి లో
దీపం పెడుతున్నాడు
గిరిజనుడు నవ్వుతూ – డా॥ రావి రంగరావు

"నల్లని బురఖా
ముసిరిన చీకటి. – ఆకొండి శ్రీనివాస రాజరావు.

అయితే హైకూ కవితలో కొందరు అక్షర నియమాన్ని పాటించలేదు. ఏదైనా తొలి అనుభూతిని మన మనస్సు 17 చిత్త క్షణాలు మాత్రమే పొందగలదనీ, ఆ తర్వాత ఆ అనుభూతి నిలవదని 17 అక్షరాలు (5 + 7 + 5) నియమంగా పెట్టుకున్నారు. ఈ నియమాలని పాటించినప్పుడే హైకూ నిలువగలుగుతుంది.

## 2.3. నానీ కవిత్వం:

తెలుగు కవిత్వంలో వచ్చిన మరొక ప్రక్రియ "నానీ". నానీల ప్రక్రియకు ఆద్యులు ఆచార్య ఎన్. గోపి గారు. నాలుగు పాదాల్లో అనంతమైన భావాన్ని వ్యక్తం చేసే ప్రయత్నం నానీల రూపంలో ఎన్.గోపి గారు చేశారు. చిన్న పిల్లలను నానీ అని పిలుస్తాం. చిన్న కవితలని నానీలన్నారు. గోపీ గారి ఉద్దేశ్యంలో 'నానీ' అంటే 'నావీ నీవి' అని. హైకూలుండగా నానీలెందుకంటే హైకూ స్టిల్ ఫొటోగ్రఫి లాంటిది, కవిత్వం అంటే చలనం ఉండాలి అందుకే నానీలు అన్నారు గోపి గారు.

### 2.3.1. నానీలు – నిర్వచనం:

**ఆచార్య ఎన్. గోపి:**

**"నావీ నీవీ వెరసి మనవి"**

**శ్రీ ఎన్. ఆర్. భల్లం:**

**"నానీ**

**పువ్వు కాదు**

**పుప్పొడి కాదు**

**మేధోవనంలో కళ్ళు తెరిచే విత్తనం"**

**డా॥ తలతోటి పృథ్వీరాజ్:**

**"మదిలో నానీ నానీ**

**కవితా చిగుళ్ళు తొడిగిన**

**నగ్న భావాలు**

**నానీలు"**

**యశశ్రీ రంగనాయకి:**

**"విఘ్నేశ్వరుడు, వామనుడు**

**అగస్త్యుడు, అద్దంలో కొండ**

**నల్లూరి నేస్తం**

**నానీ"**

**2.3.2. నానీలు – లక్షణాలు:** నానీలకు ఈక్రింది లక్షణాలుండాలని గోపి గారు చెప్పారు.

నాలుగు పాదాలుండాలి, సాధారణంగా రెండేసి పాదాలకు ఒక భావాంశాన్ని యూనిట్‌గా గుర్తించాలి. మొత్తం మీద 20 నుంచి 25 అక్షరాల నిడివి కలిగుండాలి. ఒకోపాదంలో ఇన్ని అక్షరాలు పాటించాలనే నియమం లేదు. శ్రవణ దృష్టిని బట్టే వీటి వింగడింపు. మొత్తం మీద మాత్రం 208 కి తగ్గకూడదు, 25కి మించకూడదు. మొదట భావాంశాన్ని రెండోది సమర్ధించటం లేదా భావ వైరుధ్యాన్ని సమన్వయ పరచడం లేదా కొనసాగింపుగా వుండటం ఇంకా ఈ సంబంధం మారుతూ ఉండవచ్చు.

**2.3.3. నానీ కవిత్వ నిర్మాణం:**

నానీ కవిత్వ నిర్మాణంలో ఐదు రకాలైన పద్ధతులు కన్పిస్తున్నాయి. మొదటి పద్ధతిలో మొదటి రెండు పాదాలు ఒక యూనిట్‌గా, తర్వాతి రెండు పాదాలు రెండవ యూనిట్‌గా ఉంటాయి. మొదటి భావాంశానికి రెండో భావాంశం సమర్ధకంగా ఉంటుంది. రెండవ పద్ధతిలో మొదటి నుంచి నాలుగవ పాదం చివర వరకు చదివితేనే నానీలో కవి చెప్పిన భావం పూర్తిగా అర్ధమవుతుంది. అంటే నాలుగు పాదాలు ఒకే యూనిట్‌గా ఉంటాయి. మూడవ పద్ధతిలో మొదటి పాదం ఒక యూనిట్‌గా, మిగిలిన ముదు పాదాలు రెండవ యూనిట్‌గా ఉంటాయి. నాలుగవ పద్ధతిలో మొదటి మూడు పాదాలు ఒక యూనిట్‌గా, చివరి పాదం ఒక యూనిట్‌గా ఉంటుంది.

**మొదటి పద్ధతికి ఉదాహరణ:**

**"నగరంలో పుట్టడం**
**లోపం కాదు.**
**పల్లెల్లి మర్చిపోవడం**
**పాపం"** **– ఎన్. గోపి**

**రెండవ పద్ధతిలో ఉదాహరణ:**

**"ఉద్యమం**
**రగలకపోతే**
**ప్రతి ఉదయం**
**వృథా అవుతుంది"** **– ఎన్. గోపి**

**మూడవ పద్ధతిలో ఉదాహరణ:**

**"దారం పేరు ఆశ**
**కుట్టి ఉండకపోతే**
**గుండె ఎప్పుడో**
**పగిలి పొయ్యుండేది"** **– ఎన్. గోపి**

**నాలుగవ పద్దతికి ఉదాహరణ:**

**"నీళ్ళు**
**ఏ బ్రహ్మాండాల అంచుల నుంచి**
**వొలికి పడ్డాయో!**
**దోసిలి పట్టండి"** **– ఎన్. గోపి**

**ఐదవ పద్ధతికి ఉదాహరణ:**

**"సముద్రం**
**పెరిగెత్తుతుంది తెలుసా**
**ఎలా?**
**నదుల కాళ్ళతో"** **– ఎన్. గోపి**

**నానీలు – వస్తు వైవిధ్యం:**

మిగిలిన కవితా ప్రక్రియలలో వస్తు వైవిధ్యం ఉన్నట్లే నానీలలోను వైవిధ్యం ఉంది. వస్తు వైవిధ్యాన్ని బట్టి నానీలను 9 రకాలుగా విభజించవచ్చు.

1. ప్రాకృతిక నానీలు: ప్రకృతి సౌందర్యంతో ముడిపడిన నానీలివి.

ఉదాహరణ:

**"చూరులోంచి**

**రాలి పడుతున్నాయి.**

**నీటి చుక్కలు కాదు**

**శబ్దాలు"** – ఎన్. గోపి

2. సామాజిక నానీలు: సామాజికాంశాలను వస్తువుగా తీసుకొని రాసేవివి.

ఉదాహరణ:

**"భూకంపం**

**నిలువెత్తు భవనాలు కూల్చింది**

**కులం మాత్రం**

**అలాగే నిల్చుంది"** – తుమ్మిడి నాగభూషణం

3. తాత్త్విక నానీలు: తత్త్వ ప్రధానమైనవివి.

ఉదాహరణ:

**"బూడిదంటే**

**చులకన ఎందుకు....?**

**అది**

**జీవితపు తుది జాడ...!"** – సోమేపల్లి వెంకట సుబ్బయ్య

4. ఉపదేశాత్మక నానీలు: సందేశాన్ని ఇస్తాయివి

ఉదాహరణ:

**"అనుభవించడానికే కాదు**

**జీవితం**

**ఆ సారాన్ని**

**విప్పి చెప్పడానిక్కూడా"** – ఎన్. ఆర్. భల్లం

5. కవితాత్మక నానీలు: కవిత్వం పాళ్ళు ఎక్కువగా ఉన్నవివి.

ఉదాహరణ:

**"వీడ్కోలెప్పుడూ**

**మౌనమే**

**నిశ్శబ్దంలోకి**

**శబ్దం కుంగిపోతుంది"** – ఎన్. గోపి

6. నిర్వచనాత్మక నానీలు: ఒక పదం గూర్చి వివరణాత్మకంగా, విశదీకరిస్తూ చెప్పేవివి.

ఉదాహరణ:

**"ప్రేమకు**

**అర్థం వెతుక్కున్నావా**

**చూడాల్సింది నిఘంటువు కాదు**

**అమ్మ ముఖం".** – నేతల ప్రతాప్ కుమార్

7. వ్యంగ్య నానీలు: వ్యంగ్యాత్మకంగా విషయాన్ని చెప్పే నానీలివి,

ఉదాహరణ:

**"రాజకీయపు**

**కొంగను చూడు**

**వాగ్దానపు ధ్యానం**

**ఓటరు చేప చిక్కుతుందా?"** – గుమ్మా సాంబశివరావు

8. చమత్కార నానీలు: చమత్కారంగా ఉంటాయి ఇవి:

ఉదాహరణ:

**"పిచ్చుకపై**

**బ్రహ్మాస్త్రం వేస్తావా!**

**అదే**

**దాన్ని ముక్కున కరచుకుపోతే"** – రసరాజు

9. విలక్షణ నానీలు: ద్వా.నా. శాస్త్రి గారు నానీలు, నానీలలో సినారె అనే విలక్షణ నానీలను రాశారు.

ఉదాహరణ:

**"ఎబికె**

**ఆధునిక మాంత్రికుడు**

**ఎన్ని పత్రికలకి**

**పురుడు పోశాడో"** – ద్వా. నా. శాస్త్రి.

**"సినారె వాణికి**

**మైకు సలాము**

**ఆయన ధిషణకి**

**సభ మొత్తం ప్రణామం"** - ద్వా. నా. శాస్త్రి.

ఆచార్య ఎన్.గోపి నానీలను అనుసరిస్తూ, అనుకరిస్తూ అనేక మంది కవులు నానీలు రాశారు, రాస్తున్నారు.

## 2.4. రెక్కలు కవితా ప్రక్రియ:

రెక్కలు ప్రక్రియను అందించిన వారు ఆనాటి పైగంబరకవి యం.కె. సుగమ్ బాబు గారు.

**రెక్కలు – లక్షణం:**

రెక్కలు కవిత ఆరు పాదాల్లో ఉంటుంది. మొదట నాలుగు పాదాలు రాసి చిన్న ఎడం ఇచ్చి మిగతా రెండు పాదాలని రాస్తారు. ఈ ఎడం పాఠకుడి ఊహకు పదునుపెట్టేదిగా ఉంటుంది. అంటే రెక్కలు కవిత రెండు భాగాలుగా ఉంటుందన్నమాట. పై నాలుగు పాదాలు పక్షి శరీరంగానూ, మిగతా రెండు పాదాలు పక్షి రెక్కలుగాను భావించి దీనికి "రెక్కలు" అని నామకరణం చేశారనుకోవచ్చు. చివరి రెండు పాదాలు రెక్కలై ఎగరనిదే సందేశం పూర్తి కాదు. ప్రాచీన సాహిత్యంలోని సీస పద్యంలో లాగా అంటే సీసం తర్వాత ఆటవెలదో, తేటగీతో ఉన్న విధంగా రెక్కలులో చివరి రెండు పాదాలుంటాయి. ఇది హైకూ, నానీల లాగా కాకుండా సిలబల్స్ లేదా అక్షర నియతి కంటే పాదాలు, పదాల నియమానికి కట్టుబడినట్లుంటుంది. ఒకటి నుండి మూడు పదాల వరకు ఒక్కో పాదంలో ఉంటాయి. ఎక్కువ మంది చివరి రెండు పాదాల్లో చివరి పదాన్ని ఒకే పదంతో ముగించటం కనిపిస్తుంది. ఎక్కువమంది ఆరు పాదాలని ఒకటి రెండు పదాలతోనే కవిత్వీకరిస్తున్నారు. దీనివల్ల సంక్షిప్తతతోపాటు కవితకి సూటిదనం వస్తుంది.

సుగమ్‌బాబుగారి "అంతర్యానం" అనే రెక్కలు సంపుటిలోని తొలి రెక్క

**"ఆదికవి ఆక్రందనే**

**తొలి శ్లోకం**

**అలా ఉపశమించింది**

**ఆక్రోశం**

**దుఃఖ పరిహారం**

**కవిత్వం!"**

సుగమ్‌బాబుగారు రచించిన కొన్ని రెక్కలను డేవిడ్ షూల్ మ్యాన్ గారు, ఆవులమంద మోహన్ గారి ఆంగ్లంలోకి అనువదించారు. డా॥ నోముల సత్యనారాయణ గారి సంపాదకత్వంలో అది 2008వ సంవత్సరంలో ప్రచురించబడింది. శ్రీనివాస్ గౌడ్ "వెలుతురు వెలయాలు, పద్మకళ 'దృష్టి', పెద్దూరి వెంకటదాసు, దూర్జటి, షరీఫ్ భాయ్ ముగ్గురు కలిపి 'త్రివేణి రెక్కల శతకం', మల్లవరపు చిన్నయ్య 'ఆమని' వంటివి రచించారు. అనేక మంది కవులు రెక్కలు రాశారు, రాస్తున్నారు.

కొన్ని ఉదాహరణలు:

**"తనలో తలెత్తిన**

**ప్రశ్నలే**

**మురికి దుప్పటిని**

**సిద్ధార్థుని**
**బుద్ధుణ్ణి చేశాయి**

**ప్రశ్నే**
**ప్రభాతం"**
**"మురికి దుప్పటిని**
**లాగి పడెయ్**
**ముఖం బయటపెడితే**
**ఊపిరాడుతుంది**

**ప్రవాహంలో**
**జతకట్టేదే చేప"**
**"తనను తాను**
**గౌరవించుకోలేని వాణ్ణి**
**ఎవరు**
**అవమానించలేరు**

**నక్షత్ర కిరీటం**
**ఆత్మ గౌరవం"**
**"ఎప్పుడైనా వెళితే**
**వాటేసుకుని**
**కంటతడి పెడుతుంది**
**మా ఊరు**

**నా ఏడుపే**
**దాని ఏడుపు"**

ఈ రెక్కలు కవితా ప్రక్రియలో సురేఖ (సుదర్శనరెడ్డి కట్టా), వంగర పరమేశ్వరరావు, నూతక్కి రాఘవేంద్రరావు రచనలు చేశారు. డా॥ కె. రాజశ్రీ వంటి వారు రచనలు చేశారు.

## 2.5. నానో కవితా ప్రక్రియ:

నానోలను వృత్తి రీత్యా ఇంజనీర్ అయిన ఈగ హనుమాన్ గారు ప్రారంభించారు. నానో అంటే సూక్ష్మతి సూక్ష్మం అని అర్థం. చాలా చిన్న కవిత ఇది. మొత్తం 12 అక్షరాలలోనే కవిత ఉంటుంది. ఈ ప్రక్రియ 2003వ సంవత్సరంలో ప్రారంభమైన ప్రక్రియ.

**లక్షణాలు:**

నాలుగు స్వతంత్ర పదాలు, కొనసాగింపు ఉండని పదాలు, వ్యాకరణ సంధి పదాలు ఉండవచ్చు . క్లుప్తత, గాఢత, ఆర్ద్రత ఉండాలి. ఊహించని చమత్కారం ఉండాలి. ధ్వని ప్రధానంగా ఉండాలి. హృదయాన్ని తాకేవిధంగా చెప్పాలి.

**"పచ్చిక**
**రాణి**
**మంచు ముత్యం**
**కిరీటం"** – ఉయ్యల రోహిణి

**"పడవ**
**ఈత**
**తెడ్డు**
**గోస"** – వెంకన్న భాస్కర్

**"పత్తి**
**మీగడ**
**వర్షం**
**కాగడ"**

**"జ్ఞానం**
**అహంకారం**
**ప్రయోజనం**
**శూన్యం"**

ఈగ హనుమాన్, నూతక్కి రాఘవేంద్రరావు, బుద్ధి నాగేశ్వరరావు, డా॥ తిరునగరి, బొబ్బిలి జోసెఫ్, గరికపాటి మణిందర్, మళ్ళ జ్యోతిర్మయి, మాధవరావు పంటి కవులు నానోలు రాశారు, రాస్తున్నారు.

## 2.6. మెరుపులు కవితా ప్రక్రియ:

తెలుగు సాహిత్యంలో వచ్చిన మరొక ప్రక్రియ "మెరుపులు". ఈ మెరుపులు కూడా జీవిత సత్యాన్ని తెలిపేవిగా ఉంటాయి. నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో రెండు పదాలుంటాయి.

**"గురిలేని రాయి**
**చెట్టుకు తాకదు**
**చదవని భాయి**
**ఫలితం చూడదు"**

**"కలాలు అన్ని**

**గన్నులు కావు**

**పట్టుకున్నంత మాత్రాన**

**పేలి పోవు"**

## 2.7. కిరణాలు కవితా ప్రక్రియ:

'కిరణాలు' కొత్త లఘు కవితా రూపం. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో ఒకటి కాని రెండు కాని మూడు కాని పదాలుంటాయి. అక్షర నియమం లేదు.

**"జాగృతి పలికెను గళం**

**చైతన్యం నింపెను కలం**

**గళం కలం ఒకటైతే**

**రాక తప్పదు అభ్యుదయం"**

**"తరం తరం నిరంతరం**

**ఆలోచనల మధ్య అంతరం**

**అక్షర నియమం లేదు.**

**విప్పి చెప్పగలిగితే అంతరంగం**

**మటుమాయం అవదా తారతమ్యం"**

## 2.8. అబాబీలు:

అబాబీల సృష్టికర్త షేక్ కరీముల్లా గారు. "అబాబీలు" అంటే పక్షుల గుంపు. ఒక చారిత్రక స్ఫూర్తితో తన లఘు రూప వచన కవితా ప్రక్రియకు ఈ పేరు పెట్టానని చెబుతున్నారు. ప్రగతిశీల ముస్లిం కవిత్వాన్ని రచిస్తున్న షేక్ కరీముల్లా గారు. దైవ ప్రవక్త ముహమ్మద్ మక్కాలో జన్మించకముందు అక్కడి 'కాబా' (దైవ గృహం) ను ధ్వంసం చేసే ఉద్దేశ్యంతో యెమెన్, అబిసీనియాలకు చెందిన 'అబ్రహా' అనే రాజు తన గజబలంతో దండెత్తి వస్తాడు. బలహీనులైన మక్కావాసులు కాబాను రక్షించమని అల్లాను ప్రార్థించి తలో దిక్కుకు పారిపోతారు. మక్కా ప్రజల దైన్య స్థితిని, ప్రార్థనలను ఆలకించిన దైవం "అబాబిల్' అనే పక్షుల గుంపును అబ్రహా సైన్యం పైకి పంపుతాడు. ఆ పక్షుల గుంపు అబ్రహా సైన్యంపై రాళ్ళ వాన కురిపించి సైన్యాన్ని చీల్చిచెండాడింది. అక్కడ సైన్యాన్ని నేలమట్టం చేస్తాయి. ఈ ప్రస్తావన పవిత్ర ఖురాన్‌లో ఉంది. ఈ 'అబాబిల్' పక్షుల చైతన్యం, ధైర్యం, సామూహికతత్వం ఇప్పుడు అవసరం. ముఖ్యంగా అభద్రతతో కునారిల్లుతున్న ముస్లిం సమాజానికి ఎంతో అవసరం. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న ఫాసిస్టు, ఉగ్రవాద, సామ్రాజ్యవాద భావజాలాలపై అక్షర యుద్ధం అవసరం ఎంతైనా ఉంది. అలాంటి అక్షర యుద్ధం చేసే ప్రతీ అక్షరం తన దృష్టిలో "అబాబిల్" పక్షి అంటున్నారు కరీముల్లా. తెలుగు కవిత్వంలోని ఈ "అబాబిల్" సమస్త పీడిత ప్రజల పక్షాన నిలబడతాయని హామీ ఇస్తున్నారు కరీముల్లా.

**అబాబీల లక్షణం:**

ఈ నూతన వచన కవితా ప్రక్రియలో మొత్తం 5 పదాలుంటాయి. మొదటి వరుసలలో సమస్య, రెండో వరుసలో విషయ విశ్లేషణ, మూడో వరుసలో వివరణ, నాలుగో వరుసలో ఆత్మాశ్రయం, ఐదో వరుసలో సందేశం లేదా వ్యంగ్యాత్మక చమత్కారం. "అబాబిల్" కవితా ప్రక్రియలో తొలి కవితా సంకలనం "బదర్". ఈ 'బదర్' శతకంలాగా వుంది. మకుటం 'కరీము'. శతకం పద్యంలో ఉంటే, అబాబీలు వచన కవిత్వంగా ఉన్నాయి.

ఉదాహరణ:

**"కుర్తాపై అత్తరు వాసన**

**కుక్షిలో కాలిన కమురు వాసన**

**ఆకలిని మించిన దోస్తులేదు**

**కరీము!**

**రాత్రెందుకో పగలబడి నవ్వుతోంది"**

## 2.9. రవ్వలు కవితా ప్రక్రియ:

శ్రీ విశ్వేశ్వర వర్మ భూపతిరాజు గారు ఈ "రవ్వలు" ప్రక్రియకు ఆద్యులు. రవ్వ చిరు కవిత. అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని వెలడిస్తుంది. ఇది నాలుగు పాదాలలో ఉంటుంది. మొదటి మూడు పాదాలు ఒక యూనిట్‌గా, మిగిలిన నాలుగో పాదం విడిగా రాయటం రవ్వల ఎత్తుగడ. ఈ 4వ పాదం జీవిత సత్యాన్ని, పాఠాన్ని ఆవిష్కరించాలి. అక్షరనియతి లేదు.

శ్రీ విశ్వేశ్వర వర్మ "రవ్వల గీత" (2020) లో

**"బాధ్యత**

**మనిషిని కుంగదీస్తే**

**కర్తవ్యం –**

**– మెట్లెక్కిస్తుంది!!"** అంటారు.

బోజంకి వెంకటరవి "రవ్వల రామాయణం" రాశారు. అడ్దూరి వెంకట రమణ, నూతక్కి రాఘవేంద్రరావు, ములుగు విశ్వనాథ శర్మ, గొల్లపల్లి రాఖీ, ఎన్.వి. కృష్ణారావు, అరుణ్ రాజాం, నారాయణ రెడ్డి తదితరులు రవ్వలు రాస్తున్నారు. "పంజరం విడిచిన పిట్టలు" సంపుటిలో అడ్దూరి వెంకట రమణ రవ్వల్ని గురించి రాస్తూ

**"అక్షరాల గుంపు**

**కలం కూర్చింది**

**రవ్వ ప్రయాణం –**

**– చిరు కవిత" అంటారు**

**"జీవన పోరులో**

**ధైర్యం కోల్పోతూ**

**దర్జీ**

**– చింపిరి గుడ్డయ్యాడు!!"**

**"జ్ఞాపకం**

**వెలుతురయింది**

**చీకటిలో –**

**విశ్రాంతి సమయాన !!"**

నూతక్కి రాఘవేంద్రరావు, డా॥ రాంకిషన్ (రాఖీ) వంటి వారు రవ్వలు రచిస్తున్నారు.

ఈ విధంగా ఆధునిక కవిత్వంలో అనేక ప్రక్రియలు చోటుచేసుకున్నాయి. పద్దెనిమిది అక్షరాల్లో ఏక వాక్య కవిత 'ఏక్ తార' ను పద్మశ్రీరాం రూపకల్పన చేశారు. అట్లూరి ప్రసాద్ ద్విపాద కవితలు "మణి మాలిక" ను సృష్టించారు. తాదూరి కపిల – కపిల శ్రీనివాస్ 'బుల్లెట్' ప్రక్రియను, నిమ్మగడ్డ కార్తీక్ మూడు వరుసల కవిత "సిసింద్రీ" ని రూపొందించారు. ససూలు, ముక్కానీలు, మామీలు, హనీలు, టుమ్రీలు, శ్రీనీలు, కైతికాలు, మణిపూసలు, వామీలు, చిమ్నీలు, తాతీలు, దాదీలు, చుక్కలు, వ్యంజకాలు అనేక రకాల కవితా ప్రక్రియలు వచ్చాయి.

ఈ లఘు కవితలన్నీ తెలుగు కవిత్వంలో రూప విస్తృతికి దోహదం చేశాయి. అయితే కవులు గుర్తుంచుకోవలసింది ఒకటే. కవితలో ఏదో ఒక చెమక్కు లేకపోతే కవిత పాఠకుల హృదయాలకి చొచ్చుకు పోలేదు. కవి హృదయ స్పందన నుండి వచ్చిన కవిత మాత్రమే దాని రూపం ఏదైనా ఇతరులను స్పందింపజేయగలుగుతుంది.

**"ఏక వాక్య కవిత" కి ఉదాహరణలు:**

**"ఆకాశంలో తూనీగలా విహరిస్తూ వస్తాను నీకోసమే"**

**"నీ అశ్రువు బహుశా నా కలానికి సిరా చుక్కయ్యింది"**

**"మళ్ళీ ఒక మజిలీ, బతుకులో నవ వసంతం"**

**"త్రిపదలు" కు ఉదాహరణలు:**

| | | |
|---|---|---|
| **"కరి** | **"దేగ** | **"రవి** |
| **మకరి** | **పల్లవం** | **పల్లవం** |
| **చక్రధారి"** | **స్వేచ్ఛాన్వితం"** | **విశ్వయానం"** |

**"ససూలు" కి ఉదాహరణలు:**

| | | |
|---|---|---|
| **"మట్టి గోడంతా** | **"ఆలోచన** | **"గాలి కెందుకో** |
| **పిడకల** | **కుప్పగా చేసి** | **ఇంత** |
| **సింగారింపు** | **ఒంపేసా** | **ఆరాటం** |
| **ఏళ్ళ తరబడి** | **తన ఒంటి నిండా** | **చినుకుల్ని** |

| | | |
|---|---|---|
| అమ్మమ్మ | పరుచుకుంది | నిలువుగా |
| చేతిముద్రలు" | కాగితం" | పడనియ్యదు" |

"సానీలు" కి ఉదాహరణలు: సానీ కవితా రూపకర్త అమరనాథ్ శ్రీరామదాసు.

"అమ్మ:

కదిలే దేవుడి బొమ్మ

ప్రేమ అనే అమృతాన్ని పంచుతుంది".

"సంగీతం:

మనసును కదిలించేది

ఇప్పుడు శరీరాన్ని కదిలిస్తోంది".

"చీకటి:

నిజమైన సోషలిస్టు

దానికి అందరూ సమానమే"

"శ్రీసాలు" కి ఉదాహరణలు:

"ఆకాశం

కిందికి దించుతారట –

అయ్యో, ధరలిక ఎక్కడో

"తేనెబొట్లు" కి ఉదాహరణలు

"గొప్పవాణ్ణి

అనుకోకు

అది

బలహీనత"

"నిగూఢం

విచిత్రం

అనంతానంతం

విశ్వంతరాళం"

"అత్త సణుగుడు

కోడలి లెక్కలోకి రాదు

**అడ్డంకులు ఉన్నవి**

**అధిగమించడానికే".**

**"సకినాల" కి ఉదాహరణ:**

**"మూడు పాదాలల్ల క్లుప్తంగ**

**తెలంగాణ పదాల సడి**

**పల్లె తొవ్వలల్ల తవ్వితెయ్యాల".**

**"ఉల్లాసంగా అనిపిస్త లేదు**

**మనసు గ్గిట్ల యీా దినం**

**జర నువు నగరాదె"**

**"క్లుప్తంగ ఉంటది**

**భావం మస్తుగుంటది**

**సకినాలల్ల సందేశం"**

**ఆధార గ్రంథాలు:**

1) తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు – ఆచార్య వెలమల సిమ్మన్న

2) పంజరం విడిచిన పిట్టలు – అడ్డూరి వెంకట రమణ

3) అబాబీలు – షేక్ కరీముల్లా

4) రెక్కలు – సుగమ్ బాబు

5) తమాషాలు – లఘురూప కవితా వేదికా సంకలనం

**– ఆచార్య ఇరపని మాధవి.**

## పాఠం - 3

# ఆధునిక తెలుగు సాహిత్య దీపధారులు

**విషయ క్రమం:**

**3.1.** **కందుకూరి వీరేశలింగం**

**3.2.** **గిడుగు రామమూర్తి**

**3.3.** **గురజాడ అప్పారావు**

### 3.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

ఆధునిక తెలుగు సాహిత్యానికి దిశానిర్దేశం చేసి, సాహిత్యాన్ని కొత్తదారులలో నడిపించిన కందుకూరి, గిడుగు, గురజాడ సాహిత్య సేవ పట్ల విద్యార్థులకు అవగాహన కలిగించటం.

**పరిచయం:** ఆధునిక తెలుగు సాహిత్యాన్ని అనేక సాహిత్య ప్రక్రియలతో కందుకూరి వీరేశలింగం గారు, వ్యవహారిక భాషోద్యమంతో గిడుగు రామమూర్తి గారు, రచనలో నూతన ప్రయోగాలతో గురజాడ అప్పారావు గారు ప్రజలకు చేరువ చేశారు.

### 3.1. కందుకూరి వీరేశలింగం:

ఫ్రాన్సు దేశంలో వాల్టేరులాగా తెలుగుదేశంలో సంఘసంస్కరణ కోసం తన కలాన్ని కత్తిలా వాడినవారు వీరేశలింగం పంతులుగారు. సాంఘిక దురాచార నిర్మూలనలో, బహుముఖ సాహితీ ప్రక్రియా సృష్టిలో, ఆంధ్ర జాతీయతా ప్రచారంలో వీరేశలింగంగారే పితామహతుల్యులు. ఆధునిక సాహిత్య ప్రక్రియలన్నిటికి స్థితిని, ప్రాచుర్యాన్ని కల్గించిన అఖండ సాహితీ స్రష్ట కందుకూరి వీరేశలింగం గారు. సాంస్కృతిక వికాసానికే కాక సారస్వత విస్తృతికి కూడా సంకేతంగా నిలిచిన వీరేశలింగం పంతులు గారు నవ్యాంధ్ర సాహిత్య యుగకర్త.

ఆంధ్రదేశంలో సాంఘికంగా సాహిత్యపరంగా నూతన జాగృతిని కలిగించిన ప్రథమ వైతాళికుడు వీరేశలింగంగారు. సాహిత్యాయుధాన్ని ప్రయోగించి సమాజాన్ని మేల్కొలపటమే కాక ఆధునికాంధ్ర సాహిత్యానికి నూతన ఒరవడి కలిగించాడు. స్త్రీ విద్యాభివృద్ధికి, వితంతు ఉద్ధరణకు, సాహిత్యాభివృద్ధికి, సంఘసంస్కరణకు తమ జీవితాన్నంతా ధారపోసిన ధన్యజీవి కందుకూరి వీరేశలింగంగారు.

క్రీ.శ. 1874వ సంవత్సరంలో వివేకవర్ధని అనే పత్రికను ప్రారంభించారు. సమాజంలోని లోపాలను వ్యంగ్యాత్మకంగా విమర్శించటానికి సంకల్పించారు. వివేకవర్ధని పత్రికనే కాక, చింతామణి, సతీహిత బోధిని, సత్య సంవర్ధని, సత్యవాది పత్రికలను కూడా నిర్వహించారు. వీరేశలింగంగారు స్థాపించిన ఈ పత్రికలు తెలుగు భాషాభివృద్ధికి, సంఘ సంస్కరణాభిలాషకు ఎంతో సహకరించాయి. వితంతు వివాహాలు సరైనవని ప్రమాణ పూర్వకంగా నిరూపించారు. దురాచారాలను ఖండించటానికి, తప్పనిపించిన దానిని నిర్భయంగా చెప్పటానికి వీరేశలింగంగారు వెనుకడుగు వేయలేదు. సమాజమంతా వ్యతిరేకించినా సరైనదానిని చెప్పటానికి అధైర్యపడలేదు. సమాజంలోని పెద్ద మనుషులు చేసే చెడ్డ పనులను బయటపెట్టడానికి ఎన్నో ప్రహసనాలను రచించారు.

క్రీ.శ. 1880వ సంవత్సరం తమ ఇంటిలో ఇద్దరు వితంతువులకు వివాహాలు జరిపించి ఆదర్శాలు వల్లించటమే కాదు, ఆచరించి చూపగలమని నిరూపించుకున్నారు. స్త్రీ విద్యావ్యాప్తికి కృషి చేశారు. స్త్రీ విద్యను వ్యతిరేకించే పెద్దలతో

వాదించి, వారిని అంగీకరింపజేసి ధవళేశ్వరంలో ఒక బాలికా పాఠశాలను కూడా స్థాపించారు. సంఘ సంస్కరణను దృష్టిలో ఉంచుకొనే సాహిత్య సృష్టి చేసిన వారు వీరేశలింగంగారు. "బ్రహ్మవివాహము" అనే నాటకాన్ని రచించారు. దీనినే 'పెద్దయ్య గారి పెండ్లి పుస్తకము' అని వ్యవహరిస్తారు. 'వ్యవహార ధర్మ బోధిని' అనే నాటకం రచించారు. దానిని ప్లీడరు నాటకం అనీ అంటారు. క్రీ.శ. 1906వ సంవత్సరంలో తన కుల చిహ్నమైన జంధ్యాన్ని విసర్జించి వీరేశలింగంగారు సర్వమానవ సమానత్వాన్ని చాటిచెప్పారు. హితకారిణీ సమాజాన్ని స్థాపించి ప్రజలకుపయోగపడే పనుల కొరకు తన యావదాస్తిని దానం చేశారు. ప్రభుత్వం వీరి సేవలను మెచ్చి క్రీ.శ. 1893వ సంవత్సరంలో "రావు బహద్దరు" బిరుదు నిచ్చింది.

సాంఘిక సంస్కరణలో కాక సాహిత్యరంగంలో కూడా అనేక సంస్కారాలు చేసి వీరేశలింగంగారం సాహిత్యంలో నూతన రీతులకు మార్గదర్శకులయ్యారు. వీరికి చిన్నతనం నుంచే తెలుగు, సంస్కృత భాషలతో చక్కటి పరిచయమేర్పడింది. ఆంగ్ల భాషలో కూడా ప్రావీణ్యం సంపాదించుటచే ఆంగ్ల సాహిత్య ప్రక్రియలన్నిటి పట్ల అవగాహన కలిగింది. ఆ ప్రక్రియలను తెలుగులో ప్రవేశపెట్టారు. ప్రారంభంలో కందుకూరి వీరేశలింగంగారు ప్రబంధ శైలినే ఇష్టపడ్డారు. అందుకే చిన్నతనంలోనే మార్కండేయ శతకం, గోపాల శతకం రాశారు. పూర్వకవుల ప్రభావంతో 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము', 'రసికజన రంజనము' శుద్ధాంధ్రోత్తర రామాయణము', 'శుద్ధాంధ్ర భారత సంగ్రహము' లను రచించారు. 'అభాగ్యోపాఖ్యానము' అనే హాస్య ప్రబంధాన్ని రచించారు. ఇది తెలుగులో వెలువడిన తొలి వికట కావ్యం. కానీ ఈ రచనల వలన సామాన్య ప్రజలకేమీ ప్రయోజనం కలగదని వీరు గ్రహించారు. ప్రబంధ కవిత్వంలోని శబ్దాలంకార ఆడంబరతకు, చిత్రబంధ కవిత్వపు కసరత్తులకు, కామ శాస్త్ర పాండిత్య ప్రదర్శనకు విసిగిపోయిన వీరేశలింగంగారు నిర్జీవమైన కవిత్వానికి తిరిగి ప్రాణ ప్రతిష్ఠ చేయటానికి పూనుకొన్నారు. క్రీ.శ. 1887వ సంవత్సరంలో "సరస్వతి నారద సంవాదము" అనే ఖండకావ్యాన్ని రచించారు. అందులో నాటి నియమాల సంకెళ్ళతో ఆంధ్ర కవితా సరస్వతి పొందుతున్న దురవస్థను

"దయమాలి తుదముట్ట తలకట్లు నిగిడించి, ధీరుడై నన్ను బాధించునొకడు;
పాదంబులోపల పాదంబు లిమిడించి వీరుడై నన్ను నొప్పించు నొకడు;
ప్రాసంబుపై ప్రాసంబు లదరించి, పోటు బంటయి నన్ను పొడుచునొకడు;
బెండు పల్కులు గూర్చి నిండైన నగలంచు, దిట్టమై చెవులు వేధించునొకడు;
ఖడ్గ చక్రాది రూపముల్ గానిపించి, వర్ణముల్ మార్చి నను చిక్కు పరచు నొకడు;
కుమతు లొడలెల్ల విరిచి ప్రాణములు తీయ, బడలి పసలేక శుష్కించి యున్నదాన". అంటూ పలికించారు.

సరస్వతీదేవి విలపిస్తుందంటూ మళ్ళీ అదే రీతిలో సంప్రదాయబద్ధంగానే చెప్పారు. రచనాపరంగా సంప్రదాయవాదిగానే కనిపిస్తారు వీరేశలింగంగారు. అయితే తరువాతి కాలంలో ప్రౌఢకావ్యాలు రాయగలిగిన దక్షత ఉన్నప్పటికీ ప్రజా సామాన్యంలో ప్రచారం కోసమని సరళమైన గద్యరచనలు చేశారు. మొదట్లో చిన్నయసూరిలాగానే ప్రౌఢమైన శైలిలో 'సంధి-విగ్రహము' రచించినా ఆ తరువాత దేశకాల పరిస్థితులకు అనుగుణంగా సరళమైన శైలిని అనుసరించి అనేక గ్రంథాలు రాసి "గద్య తిక్కన" అని పిలిపించుకున్నారు.

పూర్తి వ్యవహారిక భాషను కందుకూరి వీరేశలింగంగారు మొదట్లో ఆమోదించ లేకపోయినా గిడుగు వారి పరిచయంతో వ్యవహారిక భాషలో రచనలు చేయవలసిన ఆవశ్యకతను గుర్తించారు. అందరికీ అర్థమయ్యే వచనంలో తాను రచనలు

చేయటమే కాక మిగిలిన వారికి ప్రభోదించారు. వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సంఘాన్ని స్థాపించి దానికి అధ్యక్షుడిగా వ్యావహారిక భాషా వాదాన్ని పూర్తిగా బలపరిచారు. గద్యంలోనూ నవల, స్వీయచరిత్ర, వ్యాసం, విమర్శ, శాస్త్రం మొదలైన అన్ని ప్రక్రియలలో రచనలు చేశారు. ఆంగ్లంలో 'గోల్డుస్మిత్' రచించిన 'వికార్ ఆఫ్ వేక్ ఫీల్డు' ననుసరించి 'రాజశేఖర చరిత్ర' అనే సాంఘిక నవలను క్రీ.శ. 1978వ సంవత్సరంలో రచించారు. 'గలివర్సు ట్రావెల్సు' అనే ఆంగ్ల రచన ఆధారంగా 'సత్యరాజ పూర్వ దేశయాత్ర' అనే వ్యంగ్య హాస్యాలతో కూడిన సాంఘిక విమర్శ ప్రధానమైన రచన చేశారు.

వీరేశంలింగంగారు నాటక రచన ప్రారంభించి మొదటగా కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలము' ను అనువదించారు. తరువాత ప్రబోధ చంద్రోదయము, మాళవికాగ్నిమిత్రము, రత్నావళి వంటి సంస్కృత నాటకాలను అనువదించారు. చమత్కార రత్నావళి, కల్యాణ కల్పవల్లి, వెనీసు వర్తక చరిత్రము, రాగమంజరి అనేవి వీరి అనువాద నాటకాలు కాగా ప్రహ్లాద, గోగ్రహణము వీరి స్వతంత్ర నాటకాలు.

విక్టోరియా మహారాజ్ఞి చరిత్రము, జీసస్ చరిత్రము వీరు రచించిన జీవిత చరిత్రలు. తమ స్వీయచరిత్రను 1910వ సంవత్సరంలో ప్రచురించారు. వీరి ఉపన్యాసాలన్నీ కూడా వ్యాసాల రూపంలో ముద్రించబడ్డాయి. అంతేకాక వీరేశలింగంగారు అనేక తాళపత్ర గ్రంథాలని పరిష్కరించి ముద్రించారు. నాచన సోమనాథుని ఉత్తర హరివంశము, దశకుమార చరిత్ర, ప్రబోధ చంద్రోదయము, జైమినీ భారతము. హరిశ్చంద్రోపాఖ్యానము అనేవి వీరు పరిష్కరించి ప్రకటించిన గ్రంథాలు. పరిశోధనకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే వీరేశలింగంగారు నన్నయ మొదలు తనవరకు ఉన్న తెలుగు కవులను గురించి 'ఆంధ్ర కవుల చరిత్రము' రచించారు.

వీరేశలింగంగారు శాస్త్రాలను కూడా రచించారు. తర్క సంగ్రహమును తెలుగులో రచించారు. జ్యోతిశ్శాస్త్రము, శరీర శాస్త్రం అనే శాస్త్రాలను సంగ్రహంగా రచించారు. మొత్తం వీరి రచనలు సంగ్రహంగా రచించారు. అన్నీ నూట ఇరవైకి పైగా ఉన్నాయి. చిన్నతనం నుంచే అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ సాంఘిక, సాహిత్య రంగాలలో తనదైన శైలిలో విశేష కృషి చేశారు. కానీ ఇన్ని రచనలు చేసినా ఆధునిక కవిత్వానికి వీరేశలింగం గారిని ఆద్యుడిగా పేర్కొనలేము. భావాల రీత్యా ఆధునికమైనా వీరి రచనాశైలి మాత్రం ఆధునికం కాకపోవటమే దీనికి కారణం.

చిన్నతనం నుంచి మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ తమ ఆచరణ ద్వారా నిరూపించారు. వీరి భార్య రాజ్యలక్ష్మమ్మ గారు వీరి ఆశయ సాధనకు సహాయ సహకారాలు అందించారు. వీరికున్న మరొక బలం వీరి విద్యార్థులు. విద్యార్థుల చేత కళా ప్రదర్శనలు ఇప్పించి సమాజంలోని దురాచారాలని రూపుమాపటానికి సంకల్పించారు. తాము నమ్మిన ఆశయాలపట్ల పూర్తి విశ్వాసం ప్రకటిస్తూ జీవించి ఎందరికో స్ఫూర్తి ప్రదాత అయిన నవయుగ వైతాళికుడు వీరేశలింగం పంతులుగారు.

### 3.2. గిడుగు రామమూర్తి పంతులు:

వ్యవహారిక భాషోద్యమాన్ని నడిపి వాడుక భాష ప్రాధాన్యాన్ని పండితుల నుండి పామరుల వరకు తెలియజెప్పి వ్యవహారిక భాషోద్యమ పితామహుడిగా కీర్తింపబడినవారు గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారు. తన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకునేంతగా తెలుగు భాషకు సేవ చేసినవారు గిడుగు రామమూర్తి గారు. అంతర్జాతీయ భాషావేత్తగా, సాహితీ మూర్తిగా, శాసన పరిశోధకుడుగా, సామాజిక శాస్త్రవేత్తగా, సవర భాషావేత్తగా, నిఘంటు నిర్మాణ కర్తగా, పత్రికా సంపాదకుడిగా, విమర్శకుడిగా, వ్యవహారిక భాషోద్యమ సారథిగా తెలుగు సాహితీ జగత్తులో తనదైన ముద్రవేశారు గిడుగు రామమూర్తి గారు.

రామమూర్తి గారు శాసన పరిశోధకుడిగా అనేక శాసనాలను పరిశోధించారు. శాసనాల ఆధారంగా ఆ ప్రాంతపు ప్రాచీనతను, చారిత్రకంగా ఎవరికీ తెలియని ఎన్నో విషయాలు తెలియజెప్పారు. మొదటగా ముఖలింగం శాసనం పరిశీలించి పరిశోధనా వ్యాసాన్ని రాశారు. అది మద్రాస్ జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్స్ పత్రికలో 1894వ సంవత్సరంలో ప్రచురించబడింది. కొంకుదురు శాసనం, దీర్ఘాసి శాసనాలను పరిశోధించారు.

సవర భాష కోసం గిడుగువారు చేసిన సేవ ఎనలేనిది. సవర భాషోద్యమానికి సంకల్పించి సవరల కోసం ప్రత్యేక పాఠశాలలను నెలకొల్పారు. సవర భాషకు నిఘంటువును కూర్చారు. తమ ఇంట్లో పిల్లలకు ఆశ్రయమిచ్చి సవరభాష నేర్పించారు. సవర భాషోపాధ్యాయులను తయారుచేశారు. సవర భాష నేర్పటం కోసం సవర వాచకాలు రాశారు. సవర భాష నేర్పటం కోసం సవర వాచకాలు రాశారు. సవర పాటలను సేకరించారు. సవర భాష కోసం వీరు చేసిన కృషిలో తమ వినికిడి శక్తిని కోల్పోయారు. గిరిజన ప్రాంతాలలో తిరిగే సమయంలో జ్వరం వచ్చి, అది తగ్గటానికి వాడిన ఔషదాల కారణంగా చెవుడు వచ్చింది. తెలుగు – సవర, సవర – తెలుగు, సవర – ఇంగ్లీషు నిఘంటువులను తయారుచేశారు గిడుగువారు.

కళింగాంధ్రలోని స్కూల్స్ ఇన్స్పెక్టర్ యేట్స్ గారి ప్రేరణతో పి.టి. శ్రీనివాస అయ్యంగారు, గురజాడ అప్పారావుగారి ప్రేరణతో వ్యావహారిక భాషోద్యమానికి సారథ్యం వహించారు. వాడుక భాషలోనే బోధన, పరిశోధన జరగాలని పరిశోధనాత్మకంగా నిరూపించారు. మాట్లాడుకొనే భాషలోనే చదువు మాత్రమే కాదు, రచనలు చేయాలని భావించారు. దీనికోసం సంప్రదాయవాదులతో పోరాడవలసి వచ్చింది. తన వాదనను సహేతుకంగా నిరూపించటం కోసం గిడుగు రామమూర్తిగారు ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేసి సంప్రదాయ కవులు ప్రయోగించిన వాడుక భాషా ప్రయోగాలను ఉదహరిస్తూ వ్యాసాలు రాశారు. వ్యవహారిక భాషోద్యమం కోసం తాను చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి తన జీవితమంతా ఉద్యమానికే ధారపోసిన త్యాగశీలి గిడుగువారు. భారతదేశంలో అక్షరాస్యత పెరగాలంటే వాడుక భాషలోనే బోధన అవసరమన్నారు. వీరి ప్రభావంతో అనేకమంది కవులు వ్యవహారిక భాషలో రచనలు చేయడం ప్రారంభించారు. అది చూసి గిడుగువారు ఎంతో ఆనందించారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం తన సర్వస్వాన్ని ధారపోసిన ధన్యజీవి గిడుగు వారు. పండితుల నిరంకుశత్వాన్ని ధిక్కరించి భాషా సాహిత్యాల సంకెళ్ళని వదిలించిన పిడుగు గిడుగు.

“తెలుగు” మాస పత్రికను నడిపారు. తెలుగు భాషాభిమానుల కోసం ఈ పత్రిక 1919వ సంవత్సరంలో ప్రారంభించారు. రామమూర్తిగారు “గద్య చింతామణి” అనే వచన సంకలనాన్ని 1933వ సంవత్సరంలో ప్రచురించారు. ఇందులో తాళపత్ర గ్రంథాలలో ఉన్న వాడుక భాషా ప్రయోగాలని కూడా ఉదహరించారు. పరవస్తు చిన్నయసూరి రాసిన బాలవ్యాకరణంలోని దోషాల్ని “బాలకవి శరణ్యం” అనే గ్రంథాన్ని వెలువరించారు. భాష ఎలా పరిణామం చెందుతుందో ఇందులో వివరించారు. సమగ్రమైన సాహిత్యాధ్యయనం లేకపోతే భాషకు నష్టం కలుగుతుందని భావించారు గిడుగు రామమూర్తి గారు. సమాజానికి అనుగుణంగా భాషలోనూ మార్పులు జరగాలని ఆశించారు. వీరి కుటుంబం కూడా వీరి ఉద్యమానికి బాసటగా నిలిచింది. వీరు 22-01-1940 న పరమపదించారు. ఈ సందర్భంలో రాయప్రోలు వారు గిడుగుగారి గురించి

**“ఆంధ్ర సామ్రాజ్య విజయధ్వజాంకమైన**
**ఉత్తరపు సరిహద్దున ఉదయమంది**
**దక్షిణపు పొలిమేర నస్తమయ మాయె**
**నీ మహాంశ సమస్తాంధ్ర నిబిడ మగుచు”** అని చెప్పారు.

## 3.3. గురజాడ అప్పారావు:

కందుకూరి వీరేశలింగంగారు, గిడుగు రామమూర్తి పంతులుగారి తర్వాత ఆధునిక తెలుగు భాషా సాహిత్యాల కోసం అంతగా పాటుపడినవారు గురజాడ అప్పారావుగారు. కందుకూరి వీరేశలింగంగారి సాంఘిక విప్లవాన్ని గిడుగు రామమూర్తి గారి భాషా విప్లవాన్ని తనలో సమన్వయించుకొని ఆధునిక తెలుగు సాహిత్య జగత్తులో సరికొత్త విప్లవాన్ని రగుల్కొలిపిన నవయుగ వైతాళికుడు గురజాడ వెంకట అప్పారావుగారు. అప్పారావు గారి చేతి చలువతో, అస్పృశ్యంగా పడి ఉన్న వాడుక భాష అందలమెక్కింది. జీవించినంత కాలం తన లక్ష్యసాధన కోసం నిర్విరామంగా కృషి చేసినవారు గురజాడగారు.

1882వ సంవత్సరంలో తన ఇరవై ఒకటవ సంవత్సరంలో గురజాడగారు ఆంగ్లంలో కవిత్వ రచన ప్రారంభించారు. 'సారంగధర' పేరుతో ఇంగ్లీష్‌లో రాసిన పద్యాలు ముద్రించబడ్డాయి. గురజాడ సంప్రదాయికమైన శైలిలో రచించిన ఖండ కావ్యాలు, మాటల మబ్బులు, పుష్పలావికలు, మెరుపులు, సుభద్ర, ఋత శతకము అనేవి. మాటల మబ్బులతో విజయనగరంలోని అధికారులను అధిక్షేపిస్తూ పద్యాలు రాశారు. పుష్పలావికలులో తొమ్మిది పద్యాలు రాశారు. ఆముక్తమాల్యదలోని పుష్పలావికల వర్ణనల ప్రభావం వీటిపై కనిపిస్తుంది. మెరుపులు పేరుతో రాసిన పద్యాలన్నీ సంస్కృత చాటు శ్లోకాలకు అనువాదాలే. ఋతశతకము కందపద్యాలలో రాశారు. దీనిలో ప్రత్యేకత 'త' ప్రాసము అన్ని పద్యాలలో పాటించటం. సుభద్ర కావ్యం అసంపూర్ణ రచన. ప్రబంధ రీతిలో సాగినదే ఈ రచన.

ఆంగ్ల నాటకాలని, కాల్పనిక సాహిత్యాన్ని చదివిన గురజాడలోని ప్రతిభ కొత్తదారులు తొక్కింది. అప్పటికే వీరేశలింగం, గిడుగు రామమ్మూర్తిగారి ప్రభావం ఉండటంతో 'కన్యాశుల్కం' నాటక రచన చేశారు. ఈ నాటకం నాటకరంగంలో గొప్ప ప్రయోగం. వ్యావహారిక భాషకు పట్టంకట్టిన నాటకమిది. ఈ నాటకం ద్వారా వ్యావహారిక భాష కావ్యోపయోగి అని గురజాడ వారు నిరూపించారు. సాంఘిక జీవన చిత్రణం ద్వారా కొత్తదనం చూపారు.

గురజాడ గారు కవిత్వంలో కూడా నూతన ప్రయోగాలు చేశారు. వీరి ప్రయోగాలు పాల్కురికి సోమనాథుడి ప్రయోగాలను గుర్తుచేస్తాయి. వీరిద్దరూ తమ కాలంలోని వ్యవహార భాషా పదాలకు, పలుకు బడులకు గ్రాంథికత కల్పించివారే. ఈ ప్రయోగాలకు కేంద్ర బిందువు దేశి సాహిత్య పునరుద్ధరణ కాంక్ష. అది గురుజాడ గారు 1910వ సంవత్సరంలో రాసిన 'ముత్యాల సరములు' రూపంలో వ్యక్తీకరించబడింది.

కావ్య వస్తువు విషయంలో గురజాడ గారిపై వర్డ్స్‌వర్తు ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది. వర్డ్స్‌వర్తు గొల్లవాడి కథను తీసుకొని కావ్యం రాసి గొప్ప విప్లవం తెచ్చినట్లుగా గురజాడ గారు 'లవణరాజు కల' లో మాలెతను, 'కన్యక' లో సెట్టికూతురును, 'పూర్ణమ్మ' లో పూజారి కూతురును నాయికలుగా స్వీకరించారు. భావాల విషయంలో కూడా గురజాడగారు నూతనత్వాన్ని చూపారు. సుకుమార భావాలతోనే హృదయ స్పందన కలిగించటానికి ప్రయత్నించారు. ఊహలతో కసరత్తులు చేయించటం, కృత్రిమమైన పదచిత్రాలు సృష్టించటం గురజాడకు నచ్చదు.

**"వెలుగునీటను గ్రుంకె చుక్కలు**
**చదల చీకటి కదలబాలెను**
**యెక్కడనొ వొక చెట్టుచాటున**
**నొక్క కోకిల పలుకసాగెను.**

**మేలుకొలుపులు కోడి కూసెను**

**విరులు కన్నులు విచ్చి చూసెను**

**ఉండి, ఉడిగియు, ఆకులాడగ**

**కొసరెనోయన గాలి వీచెను"**

అంటూ ముత్యాల సరాలలో రాశారు. పూర్ణమ్మ' లో గురజాడ వారి భావనాశక్తి అంచులకు లోతులను ముట్టింది. పూర్ణమ్మ సృష్టియే చిత్రమైంది. ఆమె పుత్తడిబొమ్మ.

"కన్నుల కాంతులు కలవల చేరెను మేలిమి జేరెను మేనిపసల్

హంసల జేరెను నడకల బెడుగులు దుర్గను జేరెను పూర్ణమ్మ"

గురజాడ చిత్రించిన పాత్రలు, చేసిన వర్ణనలు, కల్పించిన వాతావరణం మన కళ్ళముందు సాక్షాత్కరిస్తాయి. స్వాభావిక వర్ణనలు చేసి తెలుగు కవితను కొత్త దారులలో నడిపించారు గురజాడ.

గురజాడ పద ప్రయోగం కూడా విలక్షణమైనది. గురజాడ రచన అల్పసమాసకమే కాదు, కొంతవరకు అసమాసకమనవలెను. వ్యావహారిక పదాలకు సమస్త భావ ప్రకటన సామర్థ్యమున్నదని, అది అన్ని విధాలుగా కావ్యోపయోగి అని నిరూపించారు.

**"మెచ్చనంటావీవు నీవిక**

**మెచ్చుకుంటే మించిపాయెను**

**కొయ్యబొమ్మలె మెచ్చుకళ్ళకు**

**కోమలుల సౌరెక్కునా"**

దీనిలోని పదాలన్నీ వ్యవహారములోనివే. "దేశభక్తి" లో ప్రతిపంక్తిలో ఈ శక్తి కనిపిస్తుంది. వాడుక మాటలతోనే తన భావాన్ని వాడిగా, వేడిగా చెప్పారు.

గురజాడ చేసిన అత్యంత సాహసోపేతమైన ప్రయోగాలలో ముత్యాలసరం ఒకటి. ఒక్క మాత్రా నియనుం తప్ప యతి ప్రాసల నియమం లేని గేయరచన, వాడుక మాటలు ప్రయోగించటం, ఉదాత్త భావాలను వ్యక్తీకరించటం దీని విశేషం. ముత్యాల సరములో నాలుగు పాదాలుంటాయి. మొదటి మూడు పాదాలలో 3 + 4, 3 + 4 = 14 మాత్రలుంటాయి. నాలుగవ పాదంలో 7 మొదలు 14 వరకు ఉంటాయి.

ఈ ఛందస్సులోనే తరువాతి కవులైన రాయప్రోలు, అబ్బూరి, కృష్ణశాస్త్రి, బసవరాజు, కవికొండల, శ్రీశ్రీ మొదలైనవారు అద్భుత గేయాలు రచించారు. గురజాడ ముత్యాల సరాలకు ముందు రాసినవి నీలగిరి పాటలు. వీటిలో నూతనత్వమేమీ లేదు. ప్రాచీన కీర్తనల పరిమళాన్ని అలముకున్న శుద్ధ సంప్రదాయక రచనలు. 1909వ సంవత్సరంలో ఆంధ్రభారతిలో ఇవి ప్రచురించబడ్డాయి.

ఇవి మొత్తం ఆరు పాటలు.

గురజాడని వర్డ్స్‌వర్త్ తర్వాత అంతగా ప్రభావితం చేసిన కవి రవీంద్రనాథ్ ఠాగూర్. గురజాడ, రవీంద్రుడు 1861వ

సంవత్సరంలో అంటే ఒకే సంవత్సరంలో జన్మించిన కవులు. వీరిద్దరూ కాలానికి ఎదురీది నిలిచిన కవులే.

గురజాడ రచనల్లో మానవతా వాదం, సంఘ సంస్కరణ, ప్రణయతత్వం, దేశభక్తి, జాతీయ భావం అనేవి కనిపిస్తాయి. గురజాడ కవిత్వంలో అనేక నూతన ప్రక్రియలకు మార్గదర్శకులై తరువాతి కవులకు తన అడుగు జాడలను వదిలివెళ్ళారు. గురజాడ వారిది ఆధునిక దృష్టి. తెలుగు సాహితీ జగత్తులో చిరస్మరణీయుడు గురజాడ.

**ఆధార గ్రంథాలు:**


1) ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు : ప్రయోగములు - ఆచార్య సి. నారాయణ రెడ్డి

2) తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - ఆచార్య వెలమల సిమ్మన్న

3) తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) - ఆచార్య జి. నాగయ్య


**- ఆచార్య ఇరపని మాధవి.**

## పాఠం - 4

# భావకవిత్వం

**విషయ క్రమం:**

**4.1. భావకవిత్వం – నిర్వచనం**

**4.2. భావకవిత్వం – లక్షణాలు**

**4.3. భావకవితా శాఖలు**

### 4.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

భావకవిత్వోద్యమం గురించి విద్యార్థులకు అవగాహన కలిగించడం, ఆంగ్ల సాహిత్యం, విద్యా విధానం కవుల ఆలోచనల్లో తెచ్చిన మార్పుపై అవగాహన కలిగించటం.

**పరిచయం:** భావకవిత్వం ఒక ఉద్యమంగా దాదాపు మూడు దశాబ్దాల పాటు సాగి ఆంధ్ర సాహిత్యంలో అనేక రచనలు రావటానికి కారణమైంది. 1940వ సంవత్సరం లోపల కవులైనవారు ఎవరైనా దీని ప్రభావం నుంచి బయటపడలేక పోయారు. శేషాద్రి రమణ కవులు, కొమండూరి కృష్ణమాచార్యుల వంటి సంప్రదాయ సాహితీవేత్తలు కూడా భావకవిత్వాన్ని స్పృశించారు. అభ్యుదయ కవిత్వ యుగకర్త అయిన శ్రీశ్రీ సైతం తొలి రోజులలో వెలయించింది భావకవితా ఖండికలే. రాయప్రోలు, విశ్వనాథ, వెంకట పార్వతీశ్వరులు, కృష్ణశాస్త్రి, బసవరాజు, నండూరి, వేదుల, నాయని, పింగళి, కాటూరి, జాషువా, తుమ్మల, తల్లావజ్ఝల, బాపిరాజు వంటి వారందరూ బావకవితా సృష్టికర్తలే. వీరిలో కొందరు సంస్కృత సాహిత్యాన్ని ఔపోసనపడితే మరికొందరు ఆంగ్ల సాహిత్యాన్ని అధ్యయనం చేసినవారు.

### 4.1. భావకవిత్వ నిర్వచనం:

రాయప్రోలు కావ్యాలలో 'భావ పదము', 'భావ గీతము' మొదటిసారిగా కనిపిస్తాయి. తరువాత విశ్వనాథ వారి గిరికుమారుని ప్రేమ గీతాలలో, కృష్ణశాస్త్రి గారి ఊర్వశిలో 'భావ గీతము' ప్రయోగించబడింది. 'భావకవిత్వం' అనే పదాన్ని గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారు ప్రయోగించారు. భావకవిత్వాన్ని నిర్వచించినవారిలో విశ్వనాథ సత్యనారాయణ గారు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు గణనీయులు.

**కవికొండల వెంకటరావు:** భావము యొక్క కవితా స్వభావము భావకవిత్వం.

**ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి:** కవేర్భావః కవిత్వం – భావ ప్రధానం కవిత్వం భావకవిత్వమ్

**శ్రీశ్రీ:** హృదయాలను, మానసాలను కలవరపరుస్తూ అల్లకల్లోలంగా ఘూర్ణిల్లే ప్రమాద ప్రాంతరాలలో కవికి నిరాఘాటంగా విహరించే అధికారం కలదు. అట్టి అతని సంచారాలలో ఏ సన్ముహూర్తానో కావ్యగీతం ఒకటి మెరుగులు తీరిన విలక్షణ రచనా ధోరణిలో వెలుగు చూస్తుంది. ఆ గీతం కవి అనుభవించిన రసస్థాయిని సమగ్రంగా పాఠకునిలో ఆవిష్కరించగలుగుతుంది. ఉత్కృష్ట భావ గీతానికి నా నిర్వచనం ఇది.

**విశ్వనాథ:** కావ్యములు రస ప్రధానములు. ఖండ కావ్యములు భావ ప్రదానములు, కావ్యములందు ప్రతి పద్యము నందు భావముండవచ్చును. కాని కావ్యము సమిష్టి మీద రసాభిముఖముగా పోవును. ఖండ కావ్యములందు భావములు రసవ్యంజకములు కావచ్చును. కాని ఖండ కావ్యములు ప్రధానముగా ఒక భావమును ఆశ్రయించియేయుండును. అందుచేత దీనిని భావకవిత్వము అవవచ్చును.

**పాంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి:** ప్రాచీనుల కార్యములు అఖండకృతులు కావున వారి గ్రంథములలో భావములకు స్థాయి కలిగించి రసస్ఫూర్తిని కలిగించుటకు వీలున్నదని, ఖండ కావ్యములలో పరిమితమైన కావ్య శరీరముండుట వలన రసాంగములగు విభావాదులు సమగ్రంగా గ్రహించడానికి వీలులేదని. ఏదో ఒక భావాన్ని ఆధారము చేసికొని అల్పావకాశంలో పూర్ణంగా రససిద్ధిని చేకూర్చేయత్నం నవ్యులు చేయుదురు.

**సి.నారాయణరెడ్డి:** వస్తుభావ రచనలలో భావమునకు ప్రాధాన్యమిచ్చిన కవిత్వము.

**పాటిబండ్ల మాధవశర్మ:** గాన యోగ్యము, ఆత్మనాయకము, వ్యంగ్య ప్రధానము, ఏకభావాశ్రయమునగు నొక లఘు రచన భావకవిత్వం.

**రాయప్రోలు సుబ్బారావు:** హ్లాదైక మయమైన కావ్యము వలన నర్థింప దగిన పరమ ప్రయోజనము ఆనందము. ఆ ఆనందోపాసన గావించువాడే భావకవి. ఆ కవి యొక్క స్వీయభావమే ప్రధానముగా గలది భావకవిత. భావమనగా కవి అభిప్రాయము.

**ఆవంత్స సోమసుందర్:** కవి భావమే ఇతివృత్తంగా సాగిన కవిత్వం భావకవిత్వం.

**భావకవిత్వ స్వరూపం:**

భావకవిత్వ ప్రధాన గుణం అంతర్ముఖత్వం. ఈ అంతర్ముఖత్వం కారణంగా కవి తన స్వానుభవాలను వాడిగా, వేడిగా చెప్పుటకు వీలు కలుగుతుంది. మనసు పొరలలోని భావరేఖలను శబ్దచిత్రాల ద్వారా వ్యక్తీకరించే ప్రయత్నం చేయటానికి వీలవుతుంది. శబ్దాలకు అభిధ, లక్షణ, వ్యంజన అనే శబ్ద వృత్తులేకాక రంగు, వాసనలు ఉంటాయని భావకవి భావించాడు. శబ్దానికి రంగు, వాసన ఉండుననుట భావకవిత్వంలోని అస్పష్టతను సమర్థించటమే. పదచిత్రాలలోని క్రొత్తదనం, అనుభూతి ప్రకటనంలోని నవ్యతలు భావకవిత్వాన్ని కొంత అస్పష్టం చేశాయి. అంతర్ముఖత్వం కారణంగా స్త్రీ పురుషుల బాహ్య సౌందర్యానికి బదులు ఆత్మ సౌందర్యం, గుణ సౌందర్యం వర్ణింపబడ్డాయి. కవి తనకు కలిగిన సుఖదుఃఖాలను వెర్రిగా వెల్లడించుకున్నాడు. ఒక్కొక్కప్పుడు అవస్థా భేదాన్నిబట్టి అతడికి కొండంత సహనమేర్పడింది. దానికి తోడు దార్శనిక దృక్పథం అలవడింది. చర్మచక్షువుకు కనిపించిన ప్రకృతికాక మనో నేత్రానికి కనిపించిన ప్రకృతియే వర్ణించబడింది. జాతికి సర్వాంగ వికాసం కలిగించే సంప్రదాయసిద్ధమైన సంస్కార దృష్టి ఏర్పడింది. ఆత్మార్పణ తత్వం, ఆరాధనతత్త్వం పాదులు దన్నుకొన్నవి. అంతశ్చేతనలోని చైతన్యం హద్దులు త్రెంపుకొని బయల్పడింది. సామాన్యమైన లౌకిక సంతోషం స్థానాన్ని అలౌకికానందం ఆక్రమించుకొంది. కవి తన వ్యక్తిత్వాన్ని మరిచి ఇతరుల సుఖదుఃఖాలలో లీనమైపోయే స్థితి ఏర్పడింది.

## 4.2. భావకవిత్వం లక్షణాలు:

భావకవిత్వం ఈ క్రింది లక్షణాలు కలిగుంది.

### 4.2.1. స్వేచ్ఛా ప్రియత్వం:

భాష, భావం, ఛందస్సు, అలంకారం, శైలి మొదలైన విషయాల్లో భావకవులు అభివ్యక్తిలో తమ ప్రత్యేకతను చాటుకున్నారు. కావ్యానికి అవసరమైన వస్తువు, భావం, రచన అనే మూడు అంశాల్లో భావకవులు ఎక్కువగా భావానికే ప్రాధాన్యం ఇచ్చారు. ప్రకృతిలోని ప్రతి విషయాన్ని వీరు వర్ణనీయ వస్తువుగా స్వీకరించారు. సంప్రదాయ సాహిత్యంలోలాగా ఛందోబద్ధంగా ఉండనవసరం లేదు కాబట్టి భావకవులు స్వేచ్ఛగా తాము చెప్పదలచుకున్నది చెప్పారు. ఏ నియమాలు, నిబంధనలు వీరి స్వేచ్ఛను అడ్డుకోలేక పోయాయి. కృష్ణశాస్త్రి గారి విశ్వోదయ ఛందస్సు లక్షణానుగుణంగా కంటే లయబద్ధంగా ఉంటుంది. గురజాడ గారు 'ముత్యాలసరం' అనే కొత్త ఛందోరీతుల్ని తెలుగువారికి అందించారు. కవికొండలవారు "వచన గీతిక" అనే

పేరుతో వచన కవిత్వాన్ని రాశారు.

**4.2.2. ఆత్మాశ్రయత్వం:**

ఆత్మాశ్రయ లక్షణం వైపు భావకవులు పయనించారు. తాము అనుభూతి చెందిన భావాలను వ్యక్తీకరించారు. తమ ఊహలు, అనుభవాలకే అధిక ప్రాధాన్యతనిచ్చి ఆత్మాశ్రయ ధోరణిలో రచనలు చేశారు. ఇతివృత్తం కన్నా తమ భావానికి ప్రాధాన్యత నిచ్చారు. ఆత్మానుభవానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. కవే నాయకుడు.

ఉదాహరణకు కృష్ణశాస్త్రి కృష్ణపక్షంలో "నేను" అంటూ

"నేను స్వేచ్ఛా కుమారుడనేను గగన
పథ విహార విహంగమపతిని నేను
మోహన వినీల జలధరమూర్తి నేను
ప్రళయ ఝుంఝూ ప్రభంజన స్వామి నేను" అని చెప్పుకున్నారు.

**4.2.3. మనన ప్రాధాన్యం:**

ఆంగ్ల పండితులు చెప్పిన "Recollected in Tranquility" అనే లక్షణాన్ని అనుసరించి అంతర్ముఖత్వంతో భావకవులు ప్రతిభావంతమైన కవిత్వాన్ని సృష్టించారు. హృదయంలో కలిగిన భావాన్ని తమ ఊహాశక్తిని జోడించి అద్భుతంగా చెప్పారు. భావావేశంతో పాటు భావన జోడించబడి ఆ భావ మననంతో తమ అనుభూతులను సమర్థవంతంగా ఆవిష్కరించారు.

**4.2.4. సాధన ప్రాధాన్యం:**

భావకవులు అంతశ్చేతనంలోని చైతన్యమే ఆయువుపట్టు. వీరు సౌందర్యారాధకులు. వీరిని అతీంద్రియమైన ఆదర్శాలు, అతీంద్రియమైన ప్రణయాలు. వాస్తవిక ప్రపంచంలో కాక ఊహా ప్రపంచంలోనే వీరు విహరిస్తారు. లౌకికమైన విషయాలకంటే కల్పనలకే ప్రాధాన్యత ఎక్కువ. వీరికి నారాశలోనే ఆశ, అసంతృప్తిలోనే ఆనందం, కన్నీటిలోనే పన్నీరు, అత్యాశాయుతమైన భవిష్యత్తే వీరికి పరమావధి.

**4.2.5. ఖండ కావ్యత్వం:**

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో భావకవులు ఖండకావ్య సృష్టి చేశారు. అంతవరకు వచ్చిన కావ్యాలలోలాగా ప్రఖ్యాతమైన వస్తువును వీరు తీసుకోలేదు. కావ్యం అన్నప్పుడు ఇతివృత్త ప్రధానంగా సాగుతుంది. ఇతివృత్తం ఉన్నప్పుడు అది విస్తృత రచనవుతుంది. భావకవిత్వం అలా కాదు కథా రహితమైంది. ముక్తక రచనగా కనిపిస్తుంది. కవిత్వం హృదయాహ్లాదాన్ని కలిగించింది. హృదయ సంబంధమున్నప్పుడు స్వభావాన్ని అనుసరించి సుఖదుఃఖాలను సహజంగా చిత్రించాలి. కానీ ప్రబంధాలు ఆపని చేయక వర్ణనలు, చిత్రవిచిత్ర గతిలో పద ప్రయోగాలకే ప్రాధాన్యతనిచ్చాయి. భావకవిత్వం భావ ప్రాధాన్యత కలిగింది కాబట్టి ఏదో ఒక భావానికే పరిమితమైన కవిత్వం సృజించబడింది. ముందు వెనుక దేనితో అనుసంధానించబడవలసిన అవసరం లేదు కనుక ఖండకావ్య రచన భావకవులకు అనుకూలమైనది.

**4.2.6. ఆరాధనా తత్త్వం:**

అప్పటి వరకు సాగిన అంగాంగ వర్ణనలకన్నా భావకవులు ఆత్మ సౌందర్యాన్ని వర్ణించారు. ఆత్మగుణ విశిష్టతకే భావకవులు ప్రాధాన్యతనిచ్చారు. ప్రకృతిని కూడా మాతృభావంతో ఆరాధించారు భావకవులు. ఊహా ప్రేయసిని సృష్టించి ఆమెని ఆరాధించారు. స్త్రీని విలాస వస్తువుగా కాక ప్రణయదేవతగా ఆరాధించారు.

**4.2.7. మానవతా వాదం:**

కాల్పనికోద్యమ ప్రభావంతో మానవోద్యమ ప్రభావం భావకవిత్వంపై ప్రభావం చూపింది. దీనివల్ల సాటి మానవుల జీవితాలలోని సుఖదుఃఖాలను కవితాత్మకంగా వర్ణించాడు భావకవి. వ్యక్తిగతంగా దేశభక్తి ప్రకటితం కావాడానికి, కవులు కారాగారవాసులవడానికి ఈ మానవతావాదమే దోహదకారి అయ్యింది. అప్పటివరకు ప్రభువులను కీర్తించటం కోసం, ఆనందపరచటం కోసం జరిగిన సాహిత్య సృష్టికి భిన్నంగా కళ కళ కోసం మాత్రమే కాదు, సమాజం కోసం అనే భావన కూడా పెంపొందింది.

**4.2.8. సంక్షిప్తత:**

భావకవిత్వం ఖండకావ్య ప్రక్రియలో సాగటం కారణంగా సంక్షిప్తంగా ఉంటుంది. మరీ చిన్నదీ కాకుండా, మరీ పెద్దది కాకుండా ఉంటుంది రచన. రసావిష్కరణకు ఈ సంక్షిప్తత ఎంతో అవసరం.

**4.3. భావకవితా శాఖలు:**

భావకవిత్వం స్వరూప స్వభావాలననుసరించి వివిధ శాఖలుగా విభజించబడింది.

1. ప్రణయ కవిత్వం
2. ప్రకృతి కవిత్వం
3. ఆధ్యాత్మిక కవిత్వం
4. దేశభక్తి కవిత్వం
5. సంఘ సంస్కరణ కవిత్వం
6. మానవతావాద కవిత్వం
7. స్తుతి కవిత్వం
8. స్మృతి కవిత్వం
9. బాలగేయ కవిత్వం

**4.3.1. ప్రణయ కవిత్వం:**

ప్రణయం అంటే ప్రేమ, స్నేహం అనే అర్థాలతో పూర్వ కవులు వాడారు. అయితే భావకవులు మాత్రం దాదాపు స్త్రీ, పురుషుల మధ్యగల ప్రేమ పరంగానే ప్రణయ శబ్దాన్ని వాడారు. ప్రణయ కవిత్వం, ప్రణయ కావ్యాలు, ప్రణయ భావన, ప్రణయ గీతాలు మొదలైన పదాలలో సూచితమైంది శృంగారానికి పర్యాయమైన అర్థమే. భావకవులు సంయోగ శృంగారాని కంటే వియోగ శృంగారానికే ప్రాధాన్యతనిచ్చారు. వీరి సంయోగ శృంగారం సభ్యతా పరిధిని దాటలేదు. వీరు స్త్రీని కేళి పదార్థంగాకాక సహచరిగా, ప్రేయసిగా, ఇల్లాలుగా భావించారు. భావకవులు చిత్రించిన నాయికా నాయక ప్రణయం శృంగారవధిలోనే స్నేహ మాధుర్యాన్ని చవిచూసింది.

ఈ ప్రణయ కవిత్వం వస్త్వాశ్రయరీతి, ఆత్మాశ్రయరీతి అని రెండు రకాలు. కథ, పాత్రలుంటే అది వస్త్వాశ్రయ ప్రణయ కవిత్వం, అవి లేనివి ఆత్మాశ్రయ ప్రణయ కవితలు.

**వస్త్వాశ్రయ రీతికి సంబంధించినవి:**

భావకవిత్వంలో ఆత్మాశ్రయమే బలమైనది. కానీ కొన్ని వస్తువు కలిగి పాత్ర ముఖతః కవిభావాలు తెలియజేసిన కవిత్వం కూడా ఉంది. రాయప్రోలు 'తృణకంకణం'లో కవి అభిప్రాయాలే పాత్రల ద్వారా తెలియజేయబడింది. ఇందులో చిన్న కథ, రెండు పాత్రలున్నాయి. అబ్బూరి "మల్లికాంబ" కూడా వస్త్వాశ్రయరీతికి చెందినదే. మల్లిక, కమలలు స్నేహితులు. వారి సంభాషణలో ప్రణయతత్త్వం చెప్పబడింది. వెంకట పార్వతీశ్వర కవుల "జలజ మాలిక" లో అన్నపూర్ణకు చిన్ననాటి నుండే తన బావైన చంద్రశేఖరుడితో స్నేహం కుదరటం. కానీ ఆమె వివాహం వేరొకరితో నిశ్చయించడం, చంద్రశేఖరుడు విదేశాలకు వెళ్ళటం, వివాహ పూర్వం ఆమె రజస్వల అయిన కారణంగా కుటుంబాన్ని వెలివేయటం, చివరకు ఆమె మరణిస్తూ బావకు లేఖ రాయటం, ఆ లేఖను చూచి చంద్రశేఖరుడు ప్రకృతిలో లీనమైన ప్రణయస్వరూపిణిగా ఆమెను భావించటం ఇతివృత్తం. దువ్వూరి రామిరెడ్డి గారి "కడపటి వీడ్కోలు" లో శారద అనే ఋషికన్య, గౌతముడనే ఋషి కుమారుడు బాల్య స్నేహితులు. శారదకు గౌతముడిపై ప్రేమ. ఆమె తన ప్రేమను అతడికి చెప్పగా అతడందు కంగీకరించక తనకు ఆమెపై కామ భావము లేదని పవిత్ర ప్రేమ మాత్రమే ఉందనగా ఆమె కడపటి వీడుకోలు ఇమ్మనగా అతడిని కౌగిలించుకోగా ఇద్దరు వాగులో పడిపోతారు. విషాదాంతమిది. కాళ్ళకూరి గోపాలరావుగారి "స్నాన ఘట్టము", రాయప్రోలు వారి "లలిత", "కష్ట కమల", "స్నేహలత' లు ఈ కోవకు చెందిన రచనలు. రాయప్రోలు సుబ్బారావు గారు 'అమలిన శృంగారం' అనే నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

**ఆత్మాశ్రయ రీతికి చెందినవి:**

భావకవులు ప్రేమ అన్నది ప్రాణికి సహజ లక్షణమని భావించారు. భావకవిత్వంలోని ప్రణయావస్థలని పది దశలుగా చెప్పుకోవచ్చు.

**స్వచ్ఛంద ప్రణయం:**

భావకవులు తమ ప్రణయ సమారాధనకు కవితలనే ద్రవ్యంగా వినియోగించారు.

**"సౌరభములేల చిమ్ము పుష్పవ్రజంబు?**
**చంద్రికనేల వెదజల్లు చందమామ?**
**ఏల సలిలంబుపాఱు ? గాడ్పేల విసరు?**
**ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను".** అంటూ...

ప్రకృతిలోని మిగిలినవాటిలాగానే ప్రేమించటం ప్రకృతి సహజమని భావించారు. భావకవులు స్వచ్ఛమైన స్వచ్ఛంద ప్రణయాన్ని తమ జీవిత ధ్యేయంగా పెట్టుకొని అందుకనుగుణమైన ప్రేయసిని అన్వేషించి ఆరాధించారు.

**పూర్వ రాగం:**

తాను ప్రేమించిన తన ప్రేయసి తనకెప్పుడు దక్కునో అని భావకవి ఎదురుచూస్తాడు. విధి అడ్డురాకుండా ఉండాలని దైవాన్ని ప్రార్థిస్తాడు.

**"ప్రకృతి కాంతాధరరసమ్ము వడియగట్టి**
**పోతపోసినట్లొప్పు నొప్పుల గులాబి**
**క్రూర కంటకహతి సొంపు గోలుపోక**
**కన్నులకు విందొనర్చెడు కాలమెపుడో".** అని ఎదురుచూస్తాడు.

ప్రేయసి దర్శనం, భాషణాలతోనే కవి తృప్తి చెందుతాడు.

**సంయోగ దశ:**

పూర్వరాగము తర్వాతి దశ ఇది. ప్రేయసి సమాగమం కోసం కవి తహతహలాడుతుంటాడు. ఈ సంయోగదశలో లోకాన్నే మరిచి ప్రేయసీ ప్రియులు ఒకరినొకరు చూచుకుంటూ స్పృశించుకుంటూ సంయోగానందాన్ని అనుభవిస్తారని భావకవులు చిత్రించారు. భావకవుల సంయోగదశ చుంబనావస్థను దాటిపోలేదు.

**"బింబఫలములబోలు నీ పెదవులెపుడు**
**ఈ యధరమంటే వేడి ముద్దిచ్చె నపుడె**
**అంకితంబయ్యె నా హృదయంబు నీకు**
**నృపతిముద్రాంకితంబైన లేఖయట్లు"** అంటూ...

ఈ సంయోగదశ అపూర్వ మాధుర్యాన్ని వెల్లివిరియించింది.

**ఆశాభంగము – విరహ విప్రలంభం:**

తాను ప్రేమించిన సుందరి తాను కలవక ముందే ఆమె తనకు కాకుండాపోతే ప్రియుడికి కలిగిన ఆందోళనను భావకవిత్వం చిత్రించింది. ప్రేయసి వియోగంతో కవి కృంగిపోయి ప్రేయసీ సమాగమానికి లోకమడ్డువస్తే దానిని నిర్భయంగా నిందిస్తాడు.

**"కంటి రెప్పలు మింటి కప్పుల**
**నంటిపోయె నిరీక్షణంబున**
**ఫాలతలమున రక్తనాడులు**
**భగ్గు భగ్గున మండుచున్నవి"** అంటూ...

తాను రేయింబగళ్ళు ప్రేయసికొరకు ఎదురు చూస్తున్నాడంటాడు భావకవి. భావకవిత్వంలో ఇంకో విలక్షణత భావకవి విప్రలంభ దశలో ఉన్నప్పుడు ప్రకృతిని అసహ్యించుకోడు. ప్రాచీన కవులలాగా మలయ మారుతాన్ని, వెన్నెలను, చంద్రుడిని శత్రువులాగా కాక ప్రియమిత్రులుగా భావిస్తాడు భావకవి.

**విషాద స్థితి:**

విప్రలంభ శృంగారంలో విషాదం తారాస్థాయి నందుకొంది.

**"దారుణపు జీవితంపు టెడారి లోన**
**తీరని పిపాస నేదారి తెన్నులేక**
**నేనే నా దుఃఖ బాష్ప శోణి తలహరుల**
**నే విసుగువేసటలు లేక త్రావినాను"** అంటూ భావకవి

దుఃఖోద్వేగాన్ని ప్రకటించాడు. కవి విచిత్రమైన మనఃస్థితికి లోనై నైరాశ్యాన్ని వరించాడు. "నా మరణశయ్య పరచుకొన్నాను నేనె" అని మరణానికి స్వాగతం పలికాడు భావకవి.

**పలాయన తత్వం: నిరాశావాదం:**

దుఃఖోద్వేగంతో ఉన్న కవికి వాస్తవిక జగత్తు దుఃఖమయంగా కనిపిస్తుంది. ప్రపంచాన్ని అసహ్యించుకుంటాడు.

ఎక్కడికో దూరంగా పారిపోవాలనుకుంటాడు.

**"ఓయి సంధ్యా సమీరణా రేయితోడఁ**
**గారు చీఁకటితోడ దుఃఖమ్ము కూడ**
**పరువు పరువున నా కౌఱ కరుగుదెంచు**
**నీదు నునులేత ఱెక్కల మీద వడిగ**
**నెత్తికొని పోవరాదె నన్నెచటికేని"** అని అర్థిస్తాడు.

**విషాద మాధురి:**

భావకవి దుఃఖాన్ని తనకు తోడునీడగా భావించాడు. విషాదవిషాన్ని ఆనందామృత రసంగా మలచుకొనే శక్తి కలిగిన తర్వాత కవి

**"ప్రేమదాహాన నెడద తపించుకొలది**
**అమృత మొలికింతు స్మితనయనాంచలముల"** అని దుఃఖంలోనే, ఆనందాన్ని ప్రదర్శించాడు.

**ఊహా ప్రేయసి సృష్టి:** దుఃఖంలోనే ఆనందరేఖలను దర్శించి తన మనసులోని విషాదాన్ని విడనాడి ఊహా ప్రేయసిని సృష్టించుకొన్నాడు. ఈ స్థితిలో అతడికి పూర్వ ప్రేయసి గుర్తులేదు. ఈ దశ ప్రణయ కవిత్వంలో సర్వోత్తమమైనది.

**"ఈలోనే నీ కాంతి తనువు నాదేహం దరిసి**
**అలపుగొన్న నా స్వప్న జీవితావరణం మేలుకొలిపి**
**నా హృదయోద్భవనంలో దీపం నిలిపితివే**
**విలసిత లావణ్య శ్రీవై, స్త్రీవై, నీవై**
**నీవెవరైనా నీ పేరేమైనా కానీ**
**నవ నిత్య యౌవనానంద ప్రాణి"** అని ఆలపించాడు.

**ప్రేయసీ పూజ్యత:**

భావకవిత్వంలో ప్రేయసికి పూజ్యస్థానం లభించింది. స్త్రీ అంగ సౌందర్యం కంటే ఆత్మసౌందర్యానికి ప్రాధాన్యత ఇవ్వటంతో స్త్రీ ఆరాధనీయగా కనిపించింది భావకవులకు.

**"దైవతమవీవు నీదు ప్రత్యక్షమునకు**
**గడియ లెంచుచునుందు భక్తుడను నేను"** అని ఆరాధించాడు.

**కులపాలికా ప్రణయం:** భారతీయుల గృహస్థాశ్రమధర్మం ఇంద్రియాతీతమైన అనురాగంతో పెనవేసుకున్నది. భావకవులు కులపాలిక శృంగారాన్ని దివ్యస్థాయికి తీసుకొనిపోయి, దంపతులకు ప్రకృతి పురుషభావం సమన్వయించారు. దాంపత్యంలోని ఔన్నత్యాన్ని చిత్రించారు.

**"ఇది సభక్తిక మర్పిత మిది భవచ్ఛి**
**రంబునను నీదు మోముపై వ్రాలి దేవి**

**శారదాఫాల బాల శశాంకరేఖ**

**వలెఁ జెలంగె నా పూర్వ తపస్సు చేత"** అంటూ

దాంపత్యంలోని ప్రణయాన్ని భావకవులు ఆలపించారు.

**4.3.2. ప్రకృతి కవిత్వం:** ప్రకృతి వర్ణనలు ఈరోజువి కావు. వేదాలలో, ప్రాచీన సాహిత్యంలో కూడా ప్రకృతి వర్ణనలు కనిపిస్తాయి. మనకు కనిపించే జగత్తంతా ప్రకృతే అనుకోవచ్చు. భావకవులు కొంతవరకు వాల్మీకికి సన్నిహితులు, ప్రకృతిని స్వీయ సుఖ దుఃఖ ప్రకటనకు, ఆత్మానుభూతికి ఆలంబనగా స్వీకరించారు. అంటే ప్రకృతి కనులను దాటి వీరి హృదయ నేత్రంలో ప్రవేశించింది. కంటికి కనిపించిన ప్రకృతిని గాక హృదయాన్ని కదిలించిన ప్రకృతినే వీరు వర్ణించారు. వివిధ మానసిక స్థితిగతులలో ప్రకృతి కవి జీవితంలో భాగస్వామి అయ్యింది. ప్రకృతి వారిని దేవతలా చేరదీసి లాలించింది, గురువులా దీవించింది, మిత్రుడిలా ఓదార్పునిచ్చింది. భావకవి ప్రకృతిని మానవులకన్న మిన్న అని భావించాడు. భగవంతుడి సృష్టిలో అద్భుతమైంది ప్రకృతి. ప్రకృతిని ఆరాధిస్తే పరమాత్మను పూజించినట్లే అని భావకవులు భావించారు. ప్రకృతితో తాదాత్మ్యం చెంది

**"ఆకులో ఆకునై – పూవులో పూవునై**

**కొమ్మలో కొమ్మనై – నునులేత రెమ్మనై**

**ఈ యడని దాగిపోనా**

**ఎటులైనా నిచటనే యాగిపోనా"** అంటూ పాడుకున్నారు.

భావకవి ప్రకృతి వర్ణనలలోనూ పల్లీయ ప్రకృతిని, పల్లీజన ప్రకృతిని, కర్షకులను, గోపకులను, ఇతర వృత్తుల వారిని వర్ణించాడు.

**"పొలములన్ రేల గ్రుడ్డివెన్నెలలలోనఁ**

**గుప్పలన్ నూర్చుకాపులు గొంతులెత్తి**

**పదములన్ బాడ దొడగిరి పచ్చపూల**

**జనుపచేలకు ముత్యాల సరులు గూర్చి**

**మిరప పండ్లకు కుంకుకు మెరపుదాల్చి**

**బంతిపూవుల మొగములల్లంత విచ్చి"** అంటూ పల్లె ప్రకృతిని వర్ణించాడు భావకవి.

**9.3.3. ఆధ్యాత్మిక కవిత్వం:**

భావకవులలో భక్తి కవిత్వాన్ని రచించినవారు అనేకమందున్నారు. ప్రకృతినే భగవత్ స్వరూపంగా వర్ణించినవారున్నారు. ప్రకృతి ద్వారా పరమాత్మ సామ్రాజ్యాన్ని కాంక్షించారు. అయితే భావకవులలో అధికులు మధురభక్తి మార్గాన్నే ఆశ్రయించారు. తత్వ ప్రధానమైన కవిత్వం కూడా వెలువడింది. ఈ భక్తి కవిత్వంలో పారమాత్మిక కవిత్వం, మధురభక్తి కవిత్వం, తాత్త్విక కవిత్వం అనే రకాలున్నాయి.

**1) పారమాత్మిక కవిత్వం:** భావకవి సృష్టి ఒక్కటేనని, ఈశ్వరుడొక్కడే అని భావించాడు. తాపత్రయ సంతప్తమైన ఈ లోకంలో పరమాత్ముడే ఏకైకగమ్యమని భావించాడు.

**"సడలు మేనికి వీవన బడలునెడకు**

**తీయనగు నుడి వడులు పూదీవక మృత**

**జీవమిడు వానజడి"** అంటూ దేవుడిని కీర్తించాడు.

దేవుడి ముందు తనను తాను అల్పుడిగా, పాపిగా భావించి

**"ఈ మహాపాపి గర్విష్ఠు నీ కిరాతు**

**గరుణఁ జేరంగదీయకు కాలయవను**

**చేతి గండ్ర గొడ్డండ్రతో చిన్నచిన్న**

**ఖండములుగ నరుకనిమ్ము"** అని తీవ్రంగా బాధపడ్డాడు.

భగవంతుడిపై విశ్వాసం కుదిరిన తర్వాత భక్తుడికి, భగవంతుడికి భేదభావముండదు.

**2) మధురభక్తి కవిత్వం:**

భగవంతుడిని ప్రియుడిగా భావించుకొని తన్ను తాను ప్రేయసిగా భావించుకోవటమే మధురభక్తి. మధురభక్తిలో సర్వాత్మ సమర్పణ, భగవద్వియోగ దుస్సహత్వం ముఖ్యాలు, ఆత్మాశ్రయ రీతిలో భావకవులు తమని తాము గోపికగానో, రాధికగానో భావన చేసుకొని రమ్యాతిరమ్యములైన ఖండ కావ్యాలను, కమ్రగీతులను ఆలాపించారు.

**"పాడు సిగ్గు వీడదాయె ప్రాణేశ ! దేవా! నీ**

**చూడ చక్కనైన మోము చూడలేక వెఱగువడితి"** అని భావకవి నివేదించుకున్నాడు.

**"మ్రోయింపకోయ్ మురళి మ్రోయింపకోయ్**

**తీయతేనియ బరువు మోయలేదీ బ్రతుకు"** అని పాడుకున్నాడు.

**3) తాత్త్విక కవిత్వం:**

భావకవులు తాత్త్విక కవిత్వంలో మృత్యువును ప్రియమైన వస్తువుగా భావించారు. కవి తాను ప్రేయసినని, మృత్యువు ప్రియుడునని తమ ఇద్దరి వివాహం తర్వాత తాను తన ఇల్లు వదిలిపోయి తన నిజమైన ప్రభువును కలుసుకొందునని భావన చేశాడు. మృత్యువును ఈ విధంగా ప్రభుదూతగా స్థాపించటంలో గొప్ప తాత్విక దృక్పథముంది.

**"ప్రాణికోటులఁ బరపారంబుఁ జేర్చు**

**నుడుపంబు నేర్పుతో నడుపంగఁ బ్రకృతి**

**నియమించె నిన్నునో నిశ్చల కర్ణ**

**ధారిణీ! నవమూర్తి"** అని శ్లాఘించాడు.

**4.3.4. దేశభక్తి కవిత్వం:**

భావకవిత్వంలో దేశభక్తి రెండు పాయలుగా ప్రవహించింది. ఒకటి భారత జాతీయాభిమానం, రెండవది ఆంధ్రాభిమానం. స్వాతంత్ర్యకాంక్ష కారణంగానే తెలుగు సాహిత్యంలో దేశభక్తి కవిత్వం వచ్చింది. తెలుగులో వెలువడిన దేశాభిమానకవిత్వంలో ఆంధ్ర దేశాభిమాన సంబంధ కవిత్వమే ఎక్కువగా వచ్చింది.

'జన్మభూమి' గేయంలో రాయప్రోలు సుబ్బారావుగారు జాతీయ భావాన్ని

**"ఏ దేశమేగినా ఎందుకాలిడిన**

**ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన**

**పొగడరా నీ తల్లి భూమి భారతిని**

**నిలుపరా నీ జాతి నిండు గౌరవము"** అని వ్యక్తీకరించారు.

ఈ గేయం తెలుగు సాహిత్యంలో ఎప్పుడులేని కొత్తదనాన్ని ప్రవేశపెట్టిన రచన. గురజాడ 'దేశభక్తి' గేయం దేశీయులలో జాతీయ భావ జాగృతి కలిగించిన గేయాలలో గొప్ప రచన.

**"దేశమును ప్రేమించుమన్నా**

**మంచి అన్నది పెంచుమన్నా"**

ఈ గేయంలోని **"దేశమంటే మట్టి కాదోయ్**

**దేశమంటే మనుషులోయ్"** అనే రెండు పదాలు రాని ఆంధ్రుడు ఉండడు.

భావకవులు రచించిన జాతీయ గీతాలతో "గాంధీ ప్రశస్తి" ని గురించి కీర్తించారు. గాంధీజిని మానవమాత్రుడిగా కాక మహాత్ముడిగా, పరమాత్ముడిగా భావించారు. గాంధీజిని కీర్తించిన కవుల్లో బసవరాజు అప్పారావు గారు ప్రసిద్ధులు.

**"కొల్లాయి గట్టితేనేమి – మాగాంధీ**

**కోమటై పుట్టితేనేమి"**

గాంధీజిని గురించి, రాట్నాన్ని గురించి, స్వరాజ్యాన్ని గురించి, భారత జాతీయోద్యమంలోని అనేక విషయాలను గురించి భావకవుల ప్రచార స్థాయిలో గేయాలు, పద్యాలు రచించారు.

"మాకొద్దీ తెల్ల దొరతనము దేవా" అని గరిమెళ్ళ సత్యనారాయణగారి గేయం పాడని నోరు, వినిపించని కాంగ్రెసు సభ లేదు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారి 'రాంభజన' కీర్తనలు చమత్కార ధోరణిలో రచించిన జాతీయ గీతాలే.

"ముప్పయి కోట్ల ప్రజలు రాంభజన – పంజర బంధమైనారు

బంధాలు త్రెంపుకొని రాంభజన – అవతలపడాలి

గంధిమంత్రమిదేను రాంభజన – స్వరాజ్య మంత్రం

ఒక్కటే మంత్రం రాంభజన – మేలైన మంత్రం"

భారత జాతీయతను ఆత్మాశ్రయరీతిలోనే కాక వస్త్వాశ్రయరీతిలోనూ భావకవులు ప్రబోధించారు. దువ్వూరి రామిరెడ్డి గారి "ద్రౌపదీ సందేశము", చామర్తి రాజశేఖరరావుగారి "పాంచాలీ సాంత్వనము", కరుణశ్రీ గారి "ధనుర్భంగము", పెనుమర్తి వెంకటరత్నంగారి "దీపావళినాడు" తుమ్మలవారి "ఆదర్శవీరుడు" ఈ ఒరవడిలో వచ్చినవే.

ఆంధ్రోద్యమ కవిత్వం జాత్యభిమానం, దేశాభిమానం, భాషాభిమానం మూడు రీతులుగా ప్రవహించింది. తెలుగుదేశం, తెలుగు ప్రజలు, తెలుగు చరిత్ర, తెలుగు జాతి, తెలుగు సంస్కృతి, తెలుగుభాష అంటే భావకవులకు విపరీతమైన అభిమానం.

**"మా భాష**

**మా ఉరుముల భాష**

**మా అమృత ప్రవాహాల భాష**

**మా షడ్రచుల భాష**

**మా మహా మధుర భాష**

**మా భాషే**

**మా ఆంధ్ర భాషే**

**మా తెలుగు భాష**

**మా భాషే ! మా భాషే"**

**4.3.5. సంఘ సంస్కరణ కవిత్వం:**

వీరేశలింగంగారు ప్రారంభించిన బాల్యవివాహ ఖండనం, కన్యాశుల్క నిరసనం మొదలైన వాటితో పాటు ఆ కాలంలో వర్ణ వ్యవస్థా నిరసనం కూడా తలయెత్తింది. కొంతకాలం తర్వాత సంఘవ్యవస్థా నిరసనం ప్రారంభమైంది. దీనికి త్రిపురనేని రామస్వామి చౌదరిగారు మూలపురుషులు. ఇవన్నీ మానవోద్యమ లక్షణాలే. మానవోద్యమం రెండవతరంలో గాంధీయ దృక్పథంగా రూపొందింది.

**1) దురాచార నిరసనం:**

బాల్యవివాహాల నిరసన, వితంతు వివాహాలను సమర్థించటం కోసం భోగరాజు నారాయణమూర్తి వంటి వీర గ్రాంథికవాదులు కూడా రచించారు. గురజాడ 'పూర్ణమ్మ', రాయప్రోలు 'స్నేహలత' లు శుల్కాలకు నిరసనగా రాసిన రచనలు. విగ్రహారాధన నిరసన కూడా భావకవులు చేశారు.

**"శిథిలాలయమ్ములో శివుడు లేడోయి**

**ప్రాంగణమ్మున గంట పలుకలేదోయి**

**దివ్య శంఖము గొంతు తెరువలేదోయి**

**పూజారి గుడి నుండి పోవలేడోయి**

**చిత్ర చిత్ర పూలు చైత్రమాసపుపూలు**

**ఊరూర ఇంటింట ఊరికే పూచాయి**

**శిథిలాలయమ్ములో శిలకెదురుగా కునుకు**

**పూజారి కొకటేని, పూవులేదోయి"**

2) వర్ణవ్యవస్థా నిరసనం కూడా చేశారు భావకవులు

**"గుణములేనివాని దేకులమైతేనేమి**

**తృణమైతేనేమి శ్రీ చరణ మంటునేని**

**ఏ కౌటిల్యము వీని నేర్పరిచిందో కాని**

**చీకటి గదులున్నే జగదీశ్వరాలయములోనే"**

అని పరమేశ్వర సన్నిధానంలో వర్ణ ప్రసక్తి లేదని స్పష్టపరిచారు.

**"ఎల్లలోకము లొక్కయిల్లై**
**వర్ణ భేదము లెల్ల కల్లై**
**వేల నెరుగని ప్రేమబంధము**
**వేడుకలు కురియ**
**మతములన్నియు మాసిపోవును**
**జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును**
**అంత స్వర్గ సుఖంబులన్నవి**
**యవని విల్లసిల్లున్"** అంటూ గురజాడ తమ సంఘ సంస్కరణ దృక్పథాన్ని వెలిబుచ్చారు.

### 4.3.6. మానవతావాద కవిత్వం:

మానవుడే అన్నిటికీ ప్రమాణం అనే సూత్రం ఆధారంగా ఏర్పడిన మానవతావాదం వ్యక్తికీ, జాతికి స్వాతంత్ర్యాన్ని కోరుతుంది. మానవుడి సౌఖ్యాన్వేషణ లక్ష్యంగా, విశ్వకల్యాణమే ప్రయోజనంగా ఉన్న ఈ వాదం అందరినీ ఆకర్షించింది. మానవతావాద కవిత్వం రాసిన భావకవుల్లో గురజాడ, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, వేదుల, జాషువా, తుమ్మల, కరుణశ్రీ మొదలైన వారున్నారు.

**"కులం దాటి, మతం దాటి, కొద్ది గొప్పదాటి**
**సమభోగం, సమభాగ్యం, సమ సంస్కృతి నాటి**
**కొత్త శాంతి, కొత్త కాంతి భరతావని నిండె"** అని నినదించారు.
**"మతమన్నది నా కంటికి మసకైతే**
**మతమన్నది నీ మనసుకు మచ్చైతే**
**మతం వద్దు, గీతం వద్దు, మాయామర్మం వద్దు"** అంటూ మతాన్ని నిరసించారు.

**4.3.7. స్తుతి కవిత్వం:** దేశనాయకుల్ని, మహాపురుషుల్ని, మహా కవుల్ని గురించి రాసిన కవిత్వం ఈ స్తుతి కవిత్వం. వేంకట పార్వతీశ్వరకవులు మొదలైనవారు సమకాలికుల్ని స్తుతిస్తూ రాసిన కవిత్వం ఈ కోవకు వస్తుంది.

**"కరిగిపోయె కఠోర కంఠ రావములెల్ల**
**నీగాన వర్షాన సిఖిల రాష్ట్రములందు**
**రామ నామమ్ములో రంజిల్లు మధురిమము**
**గ్రహియించితిమి భవద్గాన వైవిధ్యాన**
**ఆంధ్ర వాగీశ్వరీ వ్యావహారమున భవ**
ద్రచనా ప్రపంచంబు రుచి చూపినది మాకు" అని

తల్లావజ్ఝల శివశంకరశాస్త్రిగారు త్యాగరాజ శత వార్షిక వర్ధంతి సందర్భంగా కీర్తించారు. విశ్వనాథ సత్యనారాయణగారు ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు భోగరాజుగారిని గురించి

**"నిలువ నీడయులేని నిరుపేద దీర్ఘని**
**శ్వాసమ్ము నీకు వింజామరంబు**
**ఓ విచిత్ర సన్యాసి! నీ వొక్కరుడవె**
**రాజువన్న నిజమ్ముగా రాజువయ్య"** అని స్తుతించారు.

**4.3.8. స్మృతి కవిత్వం:** పాశ్చాత్యుల ఆత్మాశ్రయ కవిత్వంలో ప్రధానమైనది స్మృతి కవిత్వం. దీనినే ఎలిజీ అంటారు. ఎలిజీకి తెలుగులో శోకగీతమని, శోక కావ్యమని అర్థం. వీటినే స్మృతి కవిత్వం, స్మృతి కావ్యమంటారు. ఆప్తుల మరణాల్ని గురించి స్మృతి రూపంగా స్మృతి రూపంగా వెలువడిన ఒక గేయమో, కావ్యమో స్మృతి కవిత్వమవుతుంది. రాయప్రోలు సుబ్బారావుగారు, బసవరాజు అప్పారావు గారు, విశ్వనాథ సత్యనారాయణ గారు, నాయని సుబ్బారావు గారు మొదలైనవారు స్మృతి కావ్యాలను, గీతాలను రచించారు. ఈ స్మృతి కావ్యాలు నాలుగు రకాలు.

1) దేశనాయక స్మృతి
2) సతీ స్మృతి
3) సుతాదిక స్మృతి
4) ఆప్త స్మృతి

**1) దేశనాయక స్మృతి:**

రాజకీయ సాంఘిక కళాది రంగాలలో ప్రసిద్ధులైన వారిని గురించి రాసినవివి. "రవీంద్రుని అస్తమయము" అంటూ రాయప్రోలు వారు రవీంద్రనాథ్ ఠాగూర్ నిర్యాణ సమయంలో రాశారు. గురజాడ అస్తమయం తర్వాత దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు "గీత శకరములు" రాశారు.

**"యుగయుగంబుల నుండి మ్రోగెడు**
**విశ్వగాన వియత్తరంగిణి**
**భంగములనుప్పొంగు"** అని రాశారు గురజాడ.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారి మరణానికి బసవరాజు అప్పారావుగారు

**"ఏల పాడేనింక యమునొకళ్యాణినే**
**లీలా మానవుడు గోపాలుడు లేడాయె"** అని పాడారు.

గాంధీజీ నిర్యాణం తరువాత జాషువాగారు 'బాపూజీ' అనే కావ్యాన్ని రచించారు.

**"భగ్నునమందు సీమ నరపాలురతోడ నెదిర్చి వెన్కకున్**
**దగ్గక రక్తపుంజినుకు నష్టముగాని స్వరాజ్య యుద్ధమున్**
**నెగ్గిచ్చినట్టి భారత ముని ప్రవరుండు క్షమాప్రవాసి, యా**
**ముగ్గిన పండు బోనములు పోయెనె నేడు తుపాకి గుండ్లకున్"**

**2) సతీ స్మృతి:** భార్య మరణించగా రాసినవి. విశ్వనాథ, దువ్వూరి, బాలాంత్రపు వెంకటరావుగారు వంటివారు సతీస్మృతి కావ్యాలు రచించారు. విశ్వనాథ వారి 'వరలక్ష్మీ త్రిశతి' పేర్కొనదగినది.

**"ఓ సఖా ! ప్రియభార్యా వియోగమెఱుఁగ**
**నట్టి మోపూర్వ సత్కృతీ! యకట! నీవు**
**కర్మ శతకంబు చదువకు ! మర్మఘాతి**
**నీ వెఱుగలేవు దానిలోన దగు ...."** అంటూ దుఃఖ తీవ్రతను తెలియజేశారు.

దువ్వూరి రామిరెడ్డి గారు "భగ్న హృదయము" లో

**"హృదయమును దొంగిలించిన రీతిగానె**
**స్మృతిని సైతంబు నీవు హరింపు మతివ"** అని విలపించారు.

**3) సుతాదిక స్మృతి:** పుత్రుడు లేక పుత్రిక మరణించగా రాసినవి.

దువ్వూరి వారు "శిశు వియోగము" లో

**"పూవు రాలిన జిఱుపిందెపూపయైన**
**నంటుకొని యుండునన్న పేరాసనుంటి**
**మృత్యునిశ్వాస పవనంబురేగి సుడిసి**
**భావిఫలమును సుగందుఁ బైకి విసిరి"** అని వాపోయారు.

బసవరాజు అప్పారావుగారు "నిర్యాణ సుఖము" లో

**"బంగారుబొమ్మ నాదు మంగళ ప్రదమ్మ యొంటి**
**రుద్రభూమి కటికనేల నిద్రించెదు నొడలు మరచి"** అని రాశారు.

**"కాపురమొచ్చిన కన్ని పాపాయి**
**ఇల్లు కాళీచేసి వెళ్ళిపోయాడు"** అంటూ భావకవి విలపించాడు.

**4) ఆప్త స్మృతి:** సోదరీ సోదరులు, మిత్రులు మొదలైన ఆప్తుల మరణంతో రాసినవి ఈ కోవకు చెందుతాయి. నాయని సుబ్బారావు గారి 'మాతృ గీతాలు' లో తనకు జన్మనిచ్చిన తల్లి మరణానికి

**"ఎవ్వడా క్రూరకర్ముడెవడు! నీల**
**జలద నిర్ముక్త శైశిర శర్వరీ ప్ర**
**శాంతమలవాటు పడిన నిశాంతమందు**
**అకట నట్టింటి దీపమ్ము నార్పినాడు"** అని ఆలపించారు.

మోటూరి వెంకటరావుగారు పితృమరణానికి 'ఆహుతి' అనే గేయంతో

**"గాలిమేడలు హిమనగమ్ముల**
**గట్టుకొని నా బ్రతుకునేటికి**

**గాజు పెంకులు వోలె ముక్కలు**

**గాగc జితికినది"** అని విలపించారు.

దువ్వూరి వారు "సోదరీ స్మృతి" లో

**"చెల్లెలా! నీవు స్వర్గమ్ముc జేరికొన్న**

**వత్సరంబులుc గడచియుc బ్రకృతియందు**

**నీదు చిహ్నంబులెల్లెడు నింపినావె"** అని ప్రకృతిలో తన సోదరినే చూశారు.

**4.3.9. బాలగేయ కవిత్వం:**

అలతి అలతి మృదు పదాలతో అనల్పమైన భావాన్ని బాలలకు గోరుముద్దల్లా అందించటం ఈ కవిత్వ లక్షణం. పిల్లల హృదయాలలాగానే ఈ గేయాలు అంత సుకుమారంగా, సున్నితంగా, మనోహరంగా ఉంటాయి. తెలుగులో బాలగేయాలు రచించినవారు అనేక మందున్నారు. వారిలో ఒకరు బాపిరాజు గారు.

**"రావమ్మా నా పాప రావమ్మ తల్లీ**

**వచ్చినా అద్దాల వాలి పోవమ్మా**

**చేపొచ్చినా పాలు చెదిరిపోయేను**

**చిరిగిపోయే రవిక జేబులూ రెండు రావమ్మ"!**

బాలగేయాలన్నీ మధురంగా పాడుకోవటానికి, ఆడుకోవటానికి అనువుగా ఉంటాయి.

ఈ విధంగా భావకవిత్వం ముఖ్యంగా తొమ్మిది రకాలుగా విస్తరించింది.

**ఆధార గ్రంథాలు:**

1) ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు: ప్రయోగములు – ఆచార్య సి. నారాయణ రెడ్డి.

2) తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు – ఆచార్య వెలమల సిమ్మన్న.

3) తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) – ఆచార్య జి. నాగయ్య.

**– డా॥ ఎన్. విజయలక్ష్మి**

పాఠం - 5

# భావకవులకు మార్గదర్శి - రాయప్రోలు సుబ్బారావు

# భావకవితా పితామహుడు - దేవులపల్లి కృష్ణశాస్త్రి

**విషయ క్రమం:**

**5.1.** భావకవులకు మార్గదర్శి – రాయప్రోలు సుబ్బారావు

**5.2.** భావకవితా పితామహుడు – దేవులపల్లి కృష్ణశాస్త్రి

## 5.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

భావకవులైన రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రిగార్ల కవిత్వాన్ని పరిచయం చేయటం, విద్యార్థులకు స్ఫూర్తినందించటం.

## 5.1. భావకవులకు మార్గదర్శి – రాయప్రోలు సుబ్బారావు:

క్షీణ ప్రబంధయుగంలో వెర్రితలలు వేసిన రీతి ప్రాధాన్యానికి, శబ్దచిత్రలౌల్యానికి, నిర్వేల శృంగారానికి, నీరస సంప్రదాయ పాలనకు విరుగుడుగా రసగుళికలవంటి రమ్య కావ్యాలను సృష్టించిన కవి రాయప్రోలు సుబ్బారావుగారు. వీరు గురజాడలాగా సంప్రదాయానికి ఎదురు తిరిగినవారు కారు. సంప్రదాయానికి లోబడినవారు కారు. చిన్న వయస్సులో, ఆశుకవితా ప్రవాహం వెంబడి కొంతదూరం కొట్టుకొని పోయినా త్వరలోనే తప్పు తెలుసుకొని యేటికెదురీది క్రమక్రమంగా ప్రవాహ దిశనే మార్చివేసిన నవ్యకవిత్వ యుగకర్తలు వీరు. సామాన్యులను కావ్య పాత్రలుగా చేసి పల్లె ప్రకృతిని కావ్యంలో ప్రవేశపెట్టినవారు. భోగ్యవస్తువుగా కేవల వర్ణ్యవస్తువుగా పరిగణింపబడుతున్న స్త్రీని దేవీపీఠంపై అధిష్ఠించారు, ప్రకృతిని తల్లిగా, దేవతామతల్లిగా సంభావించారు. లఘు కథా కావ్య రచనకు బాటలు వేశారు. దాదాపు ఒక అర్ధశతాబ్దం పాటు కథాకావ్యం, ఖండ కవిత, గేయ కవిత, ప్రేమగాథ, ప్రబోధ కవిత, పల్లీయ కవిత్వం, అభ్యుదయ గీతం మొదలైన అనేక ప్రక్రియలలో రచనలు చేశారు. భావకవిత్వానికి భాష్యాలనదగిన సిద్ధాంత కావ్యాలు రచించారు. ఆచార్య శంకరులకు, రవీంద్రుడికి, ఖయ్యాంకు అనువాదాలు చేశారు.

### 5.1.1. రాయప్రోలుపై ఇతర కవుల ప్రభావం:

సంస్కృత కవులలో కాళిదాసు, భవభూతి రాయప్రోలుని ప్రభావితం చేశారు. ఇంగ్లీషు కవులలో వర్డ్సువర్తు, రాబర్ట్ బ్రిడ్జెస్, షెల్లీ కవుల ప్రభావం వీరిపై ఉంది. రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రభావం కూడా వీరిపై ఉన్నదని వీరి రచనలు చదివితే అర్థమవుతుంది.

### 5.1.2. అనంతర కవులపై రాయప్రోలు వారి ప్రభావం:

'కోకిల స్వామి' గా పిలువబడిన రాయప్రోలు వారు డిగ్రీల కొలమానాలు లేకపోయినా విశ్వవిద్యాలయపు తొలి ప్రాచార్యులయ్యారు. శిష్యప్రశిష్యులను తెలుగు సాహితీమతల్లికి సదా అర్చకులుగా ఆవిర్భవింపజేసిన రసమనస్వి. ఇతర కవులను వీరు ఎంతగానో ప్రభావితం చేశారు. పద్యాలలో లఘు కథా కావ్యరచనకు వీరే మార్గదర్శకులు. అబ్బూరి వారి "మల్లికాంబ" వీరి ఒరవడి కలదే. పింగళి కాటూర్ల 'తొలకరి' లోని ప్రకృతి కవిత్వానికి, జనపద జీవన చిత్రణకు వీరే

మూలపురుషులు. వీరి ప్రభావంతోనే విశ్వనాథ వారి ' ఆంధ్ర ప్రశస్తి', 'ఆంధ్ర పౌరుషము', కొడాలి వారి 'హంపి క్షేత్రము' వంటి కావ్యాలు రచింపబడ్డాయి. భావకవులలో అనేక మంది వీరిచేత ప్రభావితులై కోకిలపై, మేఘుంపై పద్యాలు రాశారు. వీరి 'ప్రవాస రాధిక 'లోని పద్యాల ప్రేరణతోనే వేదుల, దేవులపల్లి వంటివారు మనోహరమైన పద్యాలు రచించారు. విరహవిషాద కవిత్వానికి కూడా వీరి 'పిలుపు' ఆదర్శమై కృష్ణశాస్త్రి, వేదుల, నాయని వంటి వారు ఎన్నో విషాదకావ్యాలు రచించారు. వీరి 'అమరావతి పట్టణమున' వంటి పద్యాల ప్రభావంతోనే విశ్వనాథ, జాషువా, తుమ్మల వంటి వారు జాతీయ కావ్యాలు రచించారు.

**5.1.3. రాయప్రోలు వారి కవిత్వం:**

రాయప్రోలు వారి రచనలలో రమ్యాలోకము, మాధురీ దర్శనము అనేవి లక్షణ కావ్యాలు. లలిత, అనుమతి, భజ గోవిందము, సౌందర్యలహరి, సుందరకాండ, దూత మత్తేభము, మధు కలశము మొదలైనవి అనువాదాలు. తృణ కంకణము, కష్టకమల, స్నేహలత, స్వప్న కుమారము, తెలుగు తోట, ఆంధ్రావళి, జడకుచ్చులు, వనమాల, మిశ్రమంజరి, కన్నెపాటలు మొదలైనవి వీరి స్వతంత్ర కావ్యాలు. వీటన్నిటిలో విషయ ప్రాధాన్యాన్ని అనుసరించి ఈ క్రింది విధంగా విభజించవచ్చు.

**1) ప్రణయ కవిత్వం:**

అతివేల శృంగారం రాజ్యం చేస్తున్న రోజులలో అమలిన శృంగార సిద్ధాంతానికి రాయప్రోలు వారు శ్రీకారం చుట్టారు. శృంగారానికి శుచి అని, దాని స్థాయి భావమైన రతికి ఆనందం అనే వైదికార్థాన్ని స్వీకరించారు. మమత, అనురాగం, ప్రేమ, ప్రణయం, స్నేహం అనే విశేషార్థాలతో శృంగారాన్ని ప్రయోగించారు. బాహ్యలోకంలోని మాతృమూర్తిగా, సోదరిగా, అర్ధాంగిగా, కుమార్తెగా, స్త్రీ మూర్తి పొందే వివిధ పరిణామ దశలను గమనించి తన అమరిన శృంగార సిద్ధాంతాన్ని కొన్ని విభాగాలుగా పేర్కొన్నారు రాయప్రోలుగారు. "స్నానమాడి పెన్నెరులు జాఱముడిచి, నొసల కుంకుమ పాదాల పసుపు మెరయగా, తెల్లటి వస్త్రం కట్టుకొని తులసి పూజించి ధీర రూపము 'మాతృ శృంగారము', పుత్రగాత్ర పరిష్వంగ సుఖంలో మాతృమూర్తి పొందే ఆనందం 'పుత్ర శృంగారం', రతి లేక అనేక అవస్థలలో రుచించేది 'ఆప్త శృంగారం', స్నేహితుడి ఆశాదీపం ఆరకుండా చూసేది 'స్నేహ శృంగారం', సోదరుల మధ్య నెలకొను ప్రేమభావం "సోదర శృంగారం'. ఈ అమలిన శృంగారమే రాయప్రోలు వారి ప్రణయ కవిత్వం అంతా పరచుకొని ఉంటుంది.

రాయప్రోలువారి 'లలిత' లో నాయికానాయకుల విరహంతో ఇతివృత్తం ప్రారంభమవుతుంది. వియోగ శృంగారమే దీనిలో అంతస్సూత్రం. యౌవనంలో ఉన్నవారు సంసారంలోని అనురాగ మాధుర్యాన్ని చూరగొనాలే కాని వైరాగ్యంలో సన్యాసం తీసుకొని అడవుల వెంట పడిపోకూడదని లలితలోని నాయిక చెప్పటంతో దంపతీనిష్ఠమైన ధర్మమే గొప్పదని స్ఫురిస్తుంది. దంపతీ నిష్ఠమైన ప్రణయం ద్వారా ఒక పరమార్థాన్ని ఆశించినపుడు అది పవిత్రమే అని రాయప్రోలు వారి కావ్య సందేశం. "అనుమతి" అనే కావ్యంలో నాయికానాయకుల ప్రేమ విఫలమవుతుంది. అయితే ఆ అలభ్యానురాగాన్నే త్యాగంగా మార్చుకొని మరణించిన ప్రియుడి పిల్లల పట్ల మాతృ ప్రేమను ప్రకటిస్తుంది. ఇందులో కూడా అమలిన శృంగార తత్త్వమే కనిపిస్తుంది.

సంభోగ స్పర్శలేని శృంగారం లిరిక్కులో తీర్చిదిద్దాలనే తీవ్రమైన కాంక్షతో రాయప్రోలు వారు రాసిన తొలి స్వతంత్ర కావ్యం "తృణకంకణము". ఇందులో నాయిక విధివశాన అన్యకాంత అవటంచేత నాయకుడు చిన్న నాటి స్నేహం మరువలేక అవివాహితుడిగా ఉండి విప్రయోగాన్ని అనుభవించాడు. తిరిగి నాయికను చూసినపుడు "సరస సాంగత్య సుఖవికాసములకన్న,

దుస్సహ వియోగ భరమే మధురము సఖియ, బాధలేక వ్యసనరుచి బోధపడదు చీకటులు రాని దీపిక చెలగనట్లు" అని నాయకుడు పలికిన మాటలలో విప్రయోగమే ఉత్తమమనే రాయప్రోలు వారి ఉద్దేశ్యం ధ్వనిస్తుంది. నాయికకు మృదు స్నేహసౌరభం కావాలి కానీ వలపు గంధం కాదు. అందుకే ఆమె

**"కనుల నొండొరులను జూచుకొనుటకన్న**
**మనసు లన్యోన్య రంజనల్ గొనుటకన్న**
**కొసరి యేమోయి యని పిల్చుకొనుటకన్న**
**చెలుల కిల మీద నేమి కావలయు సఖుడ"** అని అంటుంది.

ఈ సందర్భంలో రాయప్రోలు వారు "భావబంధం' గా నాయిక మణిబంధముననున్న పట్టుతోరమును విప్పించి, ప్రేమ మధుర లాంఛనమైన 'తృణకంకణము' ను నాయకునిచే కట్టించి సోదరీ అని పిలిపించారు. తృణకంకణం కావ్యారంభంలో నాయకుడు మోహావేశుడు, కావ్యాంతంలో నాయిక స్నేహాన్ని నిరంతరం కోరుకునే మామూలు స్నేహితుడు మాత్రమే. "పవిత్ర ప్రేమకు వివాహాది వ్యవస్థ లంతరాయము కావని, అంతరంగముల నతుక జాలిన లంకెయే స్నేహమని, దాని నారాధించిన వారికి సంయోగవియోగములు సమవృత్తులేయని ఈ కావ్యమిచ్చిన సందేశము" అని డా॥ సి.నారాయణ రెడ్డి గారు దీనిని సమీక్షించారు.

తమ రచనల ద్వారా ఆనాటి స్త్రీ దుస్థితిని తీర్చటం కోసం ప్రయత్నించారు రాయప్రోలువారు. అందుకే తమ కావ్యాలన్నింటిలో నాయికకే ప్రాధాన్యత నిచ్చారు. రూప వర్ణనకంటే గుణ వర్ణనకే అధిక ప్రాధాన్యమిచ్చారు. సోదర సోదరీ భావమున్న చోట కామ భావం ప్రవేశించి కష్టాంతంగా పరిణమించుట 'కష్టకమల' అనే కథనాత్మక కావ్యంలోని పరమార్థం. కమల తన బాల్యస్నేహితులైన కుమార మాధవుల నిద్దరి ప్రేమను ఆశించింది. కాని అనాసక్తయోగంలో సోదరభావంలో కుమారుని క్షేమ సమాచారం కోరుగున్న కమల అతడి ప్రేమలేఖ వల్ల మానసిక సంఘర్షణకు గురై ప్రాణాలు తీసుకుంటుంది. కమల ముగ్ధ, కనుకనే మొదటి ప్రేమలేఖకే కంగారు పడింది. కుమారునిది తప్పు అనిపించకపోయినా అతడి కారణంగా ఒక కన్య నిండు జీవితం బలైంది. ఈ ప్రబోధమే రాయప్రోలు చెప్పింది.

ఇలాంటి ఉపదేశమే "స్వప్న కుమారము" అనే మరో కావ్యంలో ఆవిష్కరించారు రాయప్రోలు. భోగ్యవస్తువుగా స్వప్నంలో కనిపించిన స్త్రీ క్రమంగా ప్రత్యక్షమవటం ఈ కావ్యంలో రాయప్రోలు వారు ఆశించిన పరమార్థం. కథా కావ్యాలలోనే గాక మరికొన్ని ఖండికలలోను ప్రణయతత్త్వం కనిపిస్తుంది.

**"హేమపాత్రల చందన మెండిపోయె**
**ద్వారములు మోయుచున్నవి హారములను**
**స్నానలందింకె స్నాన కషాయ గంధ**
**మబల యెవని కోసము సగమయి తపింతు"** అంటారు రాయప్రోలు.

**2. ప్రకృతి కవిత్వం:**

నిర్గుణ పరబ్రహ్మను ఉపాసించుట కంటే ప్రత్యక్ష ప్రమాణమైన ప్రకృతిని ఆరాధించుట మేలని రాయప్రోలు వారి సిద్ధాంతం. గ్రామ సౌందర్యం ఇతనిని ఆకర్షించింది. ప్రకృతి శక్తి స్వరూపిణిగా భావించి ప్రణయ సామ్రాజ్య వైభవాన్ని ప్రకృతి

విలాసంలో ప్రత్యక్షంగా చూశారు రాయప్రోలు. "తెనుగు తోట" తెలుగుదేశంలోని ప్రకృతిని చిత్రించిన కావ్యం. ఈ కావ్యంలో "ఆవాహన' అనే శీర్షికన సెలయేరును, గొల్లపిల్లను, లేళ్ళను, కొమ్మలను, పువ్వులను చక్కగా వర్ణించారు.

**3 ఆధ్యాత్మిక కవిత్వం:**

రాయప్రోలు లలితాదేవి భక్తులు. ఆయనది లలితా కుటీరం. ఆజగజ్జనని పాదరవిందాలనే నమ్ముకున్నారు. అందుకే

**"దివ్య సంతతి కెలన భక్తిన్ భజింప**
**ప్రేమ సామ్రాజ్యపాలనా ప్రీణయగుచు**
**నిందు కొలువు తీర్చెడి రమణీయ మూర్తి**
**రాజరాజేశ్వరీ కుమార రక్తి మధుర**
**స్తన్య మోహాంధయగుచు సాక్షాత్కరించు"**

అని తమ ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించాడు. "సౌందర్యలహరి" ని అనువదించాడు. భక్తిలో పరాకాష్ఠ మధురభక్తి. రాధ కృష్ణుడిని అన్వేషించటం ఆత్మపరమాత్మను వెదుకుటయే. ప్రకృతి పురుషుల అద్వైతతత్త్వమే రాధామాధవ భక్తిలోని పరమార్థం.

**4. దేశభక్తి కవిత్వం:**

రాయప్రోలు వారి "ఏ దేశమేగినా ఎందుకాలిడినా, ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన, పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవము" జాతీయభావాన్ని మారు మ్రోగించింది. భారత స్వాతంత్ర్య సమరంతో పాటు చెలరేగిన ఆంధ్రోద్యమానికి కూడా రాయప్రోలు ఊపిరిపోశాడు. ఆంధ్రరాష్ట్రాభిమానం మచ్చలేనిది, స్వచ్ఛమైనది, మరపురానిది. ఆంధ్ర పౌరుషాన్ని రేకెత్తించు కవిత్వంలో ఒక నూతన యుగానికి దారి చూపినవారు రాయప్రోలు.

**"కృష్ణాతరంగ పంక్తిన్ ద్రొక్కి తుళ్ళింతనాంధ్ర నౌకలు నాట్యమాడునాడు**
**ఇంటింట దేశి సాహిత్య దీపములతో నాంధ్ర తేజస్సు రాపాడు నాడు**
**సుకుమార శిల్పవస్తు ప్రపంచమునందు నాంధ్ర నైపుణి పంతమాడునాడు**
**సమర సేనావ్యూహ జయపతాకల క్రింద నాంధ్ర పౌరుషము చెండాడునాడు**
**చూచి సంతోషమున తలలూచి గర్వమాచి ఆంధ్రపుత్రీపుత్రులందగలరు**
**శాంతి అందాక లేదు విశ్రాంతి మనకు కంకణ విసర్జనలకిది కాలమగునె"**

ఆంధ్ర పౌరుషాన్ని కీర్తించిన వీరి రచనలు తదనంతర కవులకు మార్గదర్శకాలయ్యాయి. "ఆంధ్రావళి" అనే శీర్షికన "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అనే సూక్తిని ప్రబోధించారు.

**5. సంఘ సంస్కరణ కవిత్వం:**

రాయప్రోలు వారి సంఘసంస్కరణలాభిషకు వీరి "స్నేహలత" కావ్యం చక్కటి ఉదాహరణ. వరశుల్క నిరసనం, భారతనారి ఆత్మోన్నత్యం ముఖ్య విషయాలుగా గల విషాద మధుర కావ్యం స్నేహలత.

**"కన్నియను పెండ్లియాడునొ, కన్నెతండ్రి, యర్పణము జేయు శుల్కదివ్యాప్సరను**
**పెండ్లియాడునోయకట యీ పెండ్లికొడుకు, అడుగరే యొక్కరయిన నీయార్యసుతుల"**

అని లోకాన్ని ప్రశ్నించారు రాయప్రోలు తమ రచన ద్వారా.

**6. మానవతావాద కవిత్వం:**

రాయప్రోలు వారి మానవతావాద కవిత్వంలో ముఖ్యమైంది అంటరానితనం నిర్మూలించాలనే తత్త్వం.

**"కాలే కడుపుకు గరిటెడుగంజీ, జాతే సిగ్గుక్కు మూరెడు పాత**

**ఎల్లర కందే చల్లని రోజులు, వెలసే విధము వెదకండీ"** అనేది వీరి మానవతావాద సందేశం.

**7. స్తుతి కవిత్వం:**

రవీంద్రుడు, శివశంకరశాస్త్రి, బాపిరాజు, సరోజినీదేవి, సర్వేపల్లి, కృష్ణరామ, నాగేశ్వరులు, రామలింగారెడ్డి లను తమ కవిత్వం ద్వారా స్తుతించారు రాయప్రోలు.

**"హృదయ ద్యుతుల తోడ రేఖింతు రూపాళి**

**నాత్మ శ్రుతిని గల్పి ఆలపించువు గీతి**

**భవదీయ వర్చస్సు బలియు నావరణాల**

**అలసేను కంఠంబు సొలసేను లేఖినియు"** అని రవీంద్రుడిని స్తుతించారు.

**8. స్మృతి కవిత్వం:** రవీంద్రుడు మరణించిన సందర్భంలో "ఆరిపోయినది దివ్య స్నేహ శృంగార దీపంబు నివ్వాళి తీసినట్లు" అని తమ ఆత్మీయతను ప్రకటించారు. తన కుమారుడి గురించి

**"దేవతల కండ్లు కుట్టెను**

**తావక మేధాను రూపరి వరుణ విభూతుల్**

**పూవును కోసిరి పూర్ణము**

**గాకిచ్చి వాసింప నీయకయె నానందా"** అని వాపోయారు.

**కవిత్వంలో నవ్యత:**

రాయప్రోలు గారు వస్తువులో, భావంలో నవ్యత చూపారు. వీరి రచనా శైలి కూడా ప్రసాద మాధుర్య గుణాలు గంగా యమునలలాగా సంగమించిన మధుర శైలి. ప్రాచీన కావ్య రీతిని విడువక వృత్త రచన చేసినా కొన్ని సరికొత్త పదబంధాలను సృష్టించి తమ నవ్యతను కనబరిచారు. ఉదాహరణకు కాంక్షా క్షీరము, బాష్ప దుగ్ధముల్, భ్రమరబాల, నీరదసుత, సందెచిన్నది, నగ్న గీతములు, గర్వ సౌరభము, కంటక కిరీటము, వెన్నెలపూలు, కోడె కోయిలలు, కన్నెతేనియ, కన్నెయెండ, సస్యవయస్సులు, పసి తెమ్మెర, పచ్చి ముచ్చటలు, పచ్చి పువ్వులు, పచ్చి ముగ్గులు, పూల చెఱగులు, నింగి బాలెంత మొదలైనవి.

తెలుగు సాహిత్యంలో భావ కవిత్వం రాయప్రోలు సుబ్బారావు గారి కవిత్వం తోటే ప్రారంభమైంది అనేది అక్షర సత్యం.

## 5.2. భావ కవితా పితామహుడు - దేవులపల్లి కృష్ణశాస్త్రి:

దేవులపల్లి కృష్ణశాస్త్రి పిఠాపురం దగ్గర చంద్రంపాళెంలో పండిత కుటుంబంలో తమ్మన్న శాస్త్రి, సీతమ్మ దంపతులకు 1897 నవంబర్ 1వ తేదిన జన్మించారు. దేవులపల్లి గురువులు కూచి నరసింహం పంతులు, బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం

నాయుడు. విజయనగరం కాలేజీలో బి.ఏ. పూర్తిచేశారు. నండూరి, బసవరాజు, చింతా దీక్షితులు, వేదుల వీరికి ప్రియమిత్రులు. వీరు 'సాహితీ సమితి' లో సభ్యులు– పెద్దాపురం మిషనరీ హైస్కూల్‌లో కొంతకాలం అధ్యాపకుడిగా పనిచేశారు. ఉద్యోగం వదిలి బ్రహ్మసమాజం కార్యక్రమంలో లీనమయ్యారు. నవ్యకవుల కవితల్ని గానం చేస్తూ నలువైపులా తిరుగుతూ భావ కవిత్వోద్యమ ప్రచారకుడిగా గడిపారు. శాంతినికేతన్ చూసి ఇంకా ప్రభావితులయ్యారు. హరిజనులను వెంటబెట్టుకొని హరిజనోద్ధరణ గీతాలు పాడుతూ తిరిగేవారు. 1930వ సంవత్సరంలో పిఠాపురంలో "వేశ్యా వివాహ సంస్థ" స్థాపించి వేశ్యలకి వివాహాలు జరిపించారు. తన పూర్వికులు ఆర్జించిన ఆస్తిని ఇలా ఖర్చుచేసేవారు. 1931వ సంవత్సరం నుంచి కాకినాడ పి.ఆర్. కళాశాలలో పది సంవత్సరాలు ట్యూటర్‌గా పనిచేశారు. నవ్య సాహిత్య పరిషత్ అధ్యక్షుడయ్యారు. 1964వ సంవత్సరం నుంచి మద్రాసులో సినీ గేయ రచయితగా స్థిరపడ్డారు. గొంతు కాన్సర్ కారణంగా స్వరపేటిక తీసివేయగా 1963వ సంవత్సరం నుంచి మూగబోయి కాగితాల మీదే మాట్లాడేవారు. 1980 ఫిబ్రవరి 24న మద్రాసులో దివంగతులయ్యారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, నిశ్రేణి, పల్లకి వంటి ఖండకావ్యాలను; శర్మిష్ఠ, కృష్ణాష్టమి, యమునా విహారి, ఏడాది పొడుగునా, గౌతమి, వేణుకుంజం, ధనుర్దాసు (సంపుటి) వంటి గేయనాటికలను; శ్రీ విప్రనారాయణ అనే యక్షగానాన్ని; అతిధిశాలి, కొత్త కోవెల, రాజఘట్టం, చౌరస్తా, ఋతు చక్రం వంటి సంగీత రూపకాలను; అప్పుడు పుట్టి ఉంటే (వ్యాస సంపుటి), ఏకాంతసేవ పీఠిక, పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వం, బసవరాజు అప్పారావు మధుర స్మృతి (వ్యాసం), అన్నమాచారి, బహుకాల దర్శనం (సంపుటి), పుష్పలావికలు (సంపుటి) రచించారు. 'తిరుప్పావు' ను అనువదించారు. అనేక లలిత గీతాలు, సినీ గీతాలు రచించారు. సినీ గీతాల సంపుటి 'మేఘమాల' గా ప్రచురించబడింది. వీరు హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో సాహిత్య ప్రయోక్తగాను చేశారు.

"కృష్ణశాస్త్రి ఒక గంధర్వ గీతం, నిశ్వాస పారిజాతం. పదశిల్ప విరించి, పాటల పరమేశ్వరుడు, భావుకతా పట్టభద్రుడు. వేదనా మందాకిని. ఆయన స్పర్శతో ప్రాణం గానమయింది. పదం శిల్పమైంది. వరాహక ఘోష వాక్యంలో ఇమిడింది. సాగరం అక్షరంలోకి చొరబడింది" అని డా॥ సి. నారాయణ రెడ్డి గారంటే, "పాండిత్యం కంటె ప్రతిభ నవనవోన్మేషంగా భాసిస్తుంటుంది. కొన్నిటిలో స్వేచ్ఛా ప్రీతి, కొన్నిటిలో విరహ విషాద నిషా, కొన్నింటిలో ప్రకృతితోడి పారవశ్యం, కొన్నింటిలో వేదన, కొన్నింటిలో ఉరకలు వేసే ఉత్సాహం, కొన్నింటిలో దేశభక్తి, కొన్నింటిలో సర్వ మానవ సౌభ్రాతృత్వం, మానవత యెడ మమకారం అన్నింటిలోనూ ఆత్మాశ్రయత కృష్ణశాస్త్రి కావ్యాల్లో మనం గుర్తించే గుణాలు" అంటారు అమరేశం రాజశ్వేర శర్మ.

"ఎవ్వరేమనినా భావకవిత్వమనే దానికి రూపమిచ్చి పెంపొందించిన వాడు" కృష్ణశాస్త్రి. అచ్చంగా భావకవిత్వమే వ్రాస్తాడు. అదే అతని వైశిష్ట్యం... భావకవిత్వమంటే అర్థమయ్యే విషయం కాదు. హృదయానికి అవగతమయ్యే విషయం. నీ హృదయంలో ఏదో తారాడుతుంది. అది బాధగా ఉంటుంది. ఆ బాధలో ఒక సుఖం ఉంటుంది. అది జీవుణ్ణి కదిలిస్తుంది. ఇదమిద్ధమని మనం చెప్పలేంది. అదే భావకవిత్వం అంటే. అది వ్రాయగల వాడొక్కడే. అతని పేరు కృష్ణశాస్త్రి. అతని ననుసరించి చాలామంది వ్రాస్తారు. ఎవ్వరూ అతనినందుకోలేరు. అతని కాంతే ఈ సౌధమంతా వ్యాపించి ఉంది" అంటారు విశ్వనాథ సత్యనారాయణగారు.

భావకవికి పర్యాయ పదం కృష్ణశాస్త్రి. ఆహార్యంలోనూ దేవులపల్లి ప్రత్యేకంగా ఉండేవారు. అనేకమంది దేవులపల్లిని అనుకరించే వారు. ఆంగ్ల కవిత్వంలో కీట్స్, షెల్లీలు ఎలాంటివారో తెలుగు సాహిత్యానికి దేవులపల్లి అటువంటివారు. "ఊహాతీతమైన దేనికో అర్రులు చాచే ఆశాజీవి. ఆశయాలలో, అనుభవాలలో కొత్తదనమూ, విశేష ప్రత్యేకతా ఉన్నవాడు. ప్రేమకై విదాహం

పొందాడు. విరహంలో వేగిపోయాడు. ఈ అనుభవాలను శాశ్వత శిల్పాలుగా నిర్మించాడు. పాటలలో ఈయనను దరిజేరగలవారు లేరు. కవిత్వం కోసం బ్రతుకుతాడు రుచిగలవాడు" అంటారు ముద్దు కృష్ణ. శ్రీ శ్రీ కూడా కృష్ణశాస్త్రి సాహిత్యం మొత్తం ఆపాతమధురమైన ఇక్షు రసార్ణవమే అన్నారు. దేవులపల్లి ప్రభావం నుంచి బయటపడటానికి ఎన్నో ఏళ్ళు పట్టిందన్నారు. దేవులపల్లి మరణించినపుడు శ్రీశ్రీ "షెల్లీ మళ్ళీ మరణించాడు. వసంతం వాడిపోయింది" అన్నారు.

కృష్ణశాస్త్రి నల్లమల అడవులు గుండా రైలులో ప్రయాణం చేస్తూ ప్రకృతి సౌందర్యానికి పరవశించి నూతన భావంతో

**"ఆకులో ఆకునై పూవులో పూవునై**
**కొమ్మలో కొమ్మనై నును లేత రెమ్మనై**
**ఈ యడవి దాగిపోనా**
**ఎట్లైన ఇచటనే యాగిపోనా?"** అని ఆలపించారు.

దేవులపల్లి విషాధానికి సంకేతంగా "కృష్ణపక్షం' రచించారు. ఇందులోని "స్వేచ్ఛాగానం" అనే కవిత దేవులపల్లి ప్రకృతి ప్రియత్వానికి, స్వేచ్ఛాకాంక్షకి, స్వేచ్ఛా విహారానికి సంకేతంగా నిలుస్తుంది.

**"నవ్వివోదురుగాక నాకేటి సిగ్గు?**
**నా యిచ్ఛయే గాక నాకేటి వెఱపు?**
**కలవిహంగమ పక్షముల తేలియాడి**
**తారకమణులలో తారనై మెలగి**
**మాయమయ్యెదను నా మధుర గానమున**
**నవ్వివోదురు గాక నాకేటి సిగ్గు?**
**తెలిమబ్బు తెరచాటు చెలి చందమామ**
**జతగూడి దోబూంచి సరసాల నాడి**
**దిగిరాను దిగిరాను దివి నుండి భువికి"** అంటారు.

దేవులపల్లి భావకవులకి వియోగం, దుఃఖమే ప్రియమైనవి. నిరాశలో, నిరీక్షణలో ఓ అనిర్వచనీయ ఆనందం, సుఖానుభూతి కలుగుతాయని భావిస్తారు. వారి ఆశ కూడా అదే.

**"ఎవ్వరని యెంతురో నన్ను? ఏననంత**
**శోక భీకరతి మిరలోకైక పతిని!**
**నాకు విశ్వాస తాళ వృంతాలు గలవు**
**నాకు కన్నీటి సరుల దొంతరులు గలవు**
**నా కమూల్య మపూర్వ మానందమొసగు**
**నిరుపమ నితాంత దుఃఖంపు నిధులు గలవు**
**ఎవ్వరని యెంతురో నన్ను?"**

**"మూగబోయిన నా గళమ్ము నను కూడ**
**నిదురవోయిన సెలయేటి రొదలు గలవు"**

భావకవిత్వంలోని ఆత్మాశ్రయత కనిపిస్తుందీ కవిత్వంలో. దుఃఖించడం వలన మనసు తేలికవుతుందనే తాత్త్వికత గోచరిస్తుందీ కవితలో. అలాగే దేవులపల్లి "ప్రవాసం" అనే ఖండకావ్యంలో విరహాన్ని అభివర్ణించారు. ప్రేయసి మరణంతో దిక్కుతోచని కవి శోకించి, తపించి తర్వాత పూర్వజన్మ స్మృతితో తాను ఒక గంధర్వుడిగా భావించుకొన్నారు. పూర్వజన్మలోని ప్రేయసి కోసం తానింకా అన్వేషిస్తున్నట్లుగా భావించుకుంటాడు.

**"నా నివాసమ్ము తొలుత గంధర్వలోక**
**మధుర సుషమ మా సుధాగాన మంజు వాటి**
**ఏనొక వియోగ గీతిక**
**ఇది ముగియబోని ఏ యర్థ మెఱుగరాని**
**వేసటేలేని వెఱ్ఱియన్వేషణమ్ము**
**ఈ ప్రవాస యాత్రా రతినిటులె నేను**
**కదలిపోవుదు..."** అని కృష్ణశాస్త్రి భావిస్తారు.

అంతేకాదు ఆ దుఃఖం కవిని కమ్ముకోగా

**"నాకుగాదులు లేవు నాకుషస్సులు లేవు**
**నేను హేమంత కృష్ణానంత శర్వరిని**
**నాకు కాలమ్మొక్కటె కారురూపు**
**నా శోకమ్మ వలెనె, నా బ్రతుకు వలె, నావలెనె"** అని

దుఃఖిస్తారు. ఆ తర్వాత ఆ నిరాశ ఎంతగా పెరుగుతుందంటే మరణ వాంఛ కలిగేటంతగా. భావకవిత్వంలో అదొక స్థితి. ఈ స్థితిలో కవి ఆత్మ త్యాగానికి వెరువడు.

**"ఏను మరణించుచున్నాను ఇటు నశించు**
**నా కొఱకు చెమ్మగిలిన నయనమ్ము లేదు**
**నా మరణశయ్య పఱచుకొన్నాను నేనె**
**నేనె నాకు వీడ్కోలుపు విన్పించినాను"**

కృష్ణశాస్త్రి గారి ఇలాంటి కవిత్వం చూసే "కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ" అన్నారు. ఇలాంటి కవిత్వం ద్వారా కవి ఇస్తున్న సందేశం ఏంటి అనే ప్రశ్న కూడా తరువాతి కవులలో ఉదయించింది. పాఠకుల హృదయాలను కరుణ రస భరితం చేయటం దేవులపల్లి కవిత్వానికున్న శక్తి అనుకోవచ్చు. ఈ దశ తరువాతి దశ ఊహా ప్రేయసి సాక్షాత్కారం. కవికి "ఊర్వశి" సాక్షాత్కరించింది. "దేవులపల్లి ఊర్వశి విశ్వ సౌందర్యానికి ప్రతీక అనే రీతిలో "ఊర్వశి" కావ్యాన్ని రచించారు కృష్ణశాస్త్రి. తన మనస్సును ఎన్నడో సోకిన సౌందర్య ఖండాన్ని, తన హృదయాన్ని ఎన్నడో పలికించిన ప్రేమ శకలాన్ని కలిపి కృష్ణశాస్త్రి గారు

ఊర్వశిని సృష్టించుకొన్నారు. విషంతో, అమృతంతో, చీకటితో, వెన్నెలతో కలిసిన స్త్రీగా ఊర్వశిని గురించి ఆయన ఊహించారు. ఊర్వశి స్త్రీ. ఊర్వశి దేవి. ఊర్వశి మోహినీ హాసమల్లి! వైజయంతీ పరిమళము ! హరిజటా పారిజాతము" అని కడియాల రామమోహనరాయ్ వ్యాఖ్యానించారు.

**"నీవు తొలి ప్రొద్దు నునుమంచు తీవ సోనవు**
**నీవు వర్షా శరత్తుల నిబిడి సంగమమున**
**పొడమిన సంధ్యాకుమారి నీవు**
**అమిర నిశ్వాసముల మా కుములు**
**శర్వరీ వియోగ కపోల పాళికవు నీవె**
**నీవె నిట్టూర్పు, నీవె కన్నీరు, విశ్వ**
**వేదనా మూల్య భాగ్యమీవే నిజమ్ము"** అంటారు కృష్ణశాస్త్రి.

ఊర్వశిని కవి తనివితీరా ఆరాధిస్తాడు. ఆ కరుణామయి, పవిత్రమూర్తి కోసం పరితపిస్తాడు. కృష్ణశాస్త్రి గారే తన "ఊర్వశి" గురించి "నేటి తెలుగు కవికి ఊర్వశి అంటే లోపంలోని ఆనందం కలతలేని శాంతి అమృతం ! ఊర్వశిని ప్రేమిస్తే లోకంలో ఎవరినీ ప్రేమించకుండా ఉండలేమంటాడు నేటి తెలుగు కవి. కనుక ఊర్వశి కోసమే లోకంలో మంటా, వేదనా, బాధా, ఈర్ష, ద్వేషమూ ఏడుపూ ఉంచలేనంటాడు నేటి తెలుగు కవి".

చివరకు తనను దేవుడితో పోల్చుకొని తన కవితాతత్వాన్ని, హృదయాన్ని ఈ విధంగా ఆవిష్కరించుకొన్నారు కృష్ణశాస్త్రి,

**"నావలెనె యాతడున్మత్త భావశాలి**
**ఆగికోలేడు రేగునూహల నొకింత**
**ఇంత చిఱుగీతి యెద వెగిరించునేని**
**పాడుకొనును తాండవనృత్యమాడు కొనును**
**ఏ నెఱుంగుదు నా వలెనే యతండు**
**పాట పదములకై నిత్య పథికుడయ్యె"**

"భావకవులలో కృష్ణశాస్త్రి గారి చేతిలో ప్రాతశబ్దములే క్రొత్త పరిమళములను, క్రొత్త వన్నెలను సంతరించుకొన్నవి. 'ఎలదేటి చిఱుపాట సెలయేటి కెరటాలబడిపోవు విరికన్నె వలపు', 'తొలిప్రొద్దు తెమ్మెర త్రోవలో పయనమై పరువెత్తు కోయిల పాట', 'కారురాతిరి కొసలు', మున్నగు వాని యందలి అచ్చమైన తెలుగు మాటల కూర్పులో, 'కరుణార్ద్ర వీక్షణ పరిమళములు', 'విరహ వీక్షణ భయంకరమాధురులు', 'చండమృత్యు గభీరగర్జారవములు, 'అగమ్య తమస్వినీ గర్భకుహరాలు', 'హేమంత కృష్ణానంత శర్వరి', 'అంగుళీకిసలయచంచలాంచములు', మున్నగు సంస్కృత సమాసములు పోహళింపులో, 'అపూర్వ నవ్యతా భరితమైన కామనీయకము వెల్లివిరియుచున్నది" అంటారు ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు.

కృష్ణశాస్త్రి గారు కృష్ణపక్షము, ప్రవాసము, ఊర్వశిలలో ప్రయోగించిన అతినవ్యమైన పదబంధాలు: నీలంపు సిగ్గు, దరహాసకౌముది, అశ్రుఘరులు, హాసమ్మృదులవాసనలు, కొసరు తేనియలు, నెత్తావి గుసగుసలు, నిర్జీవ నిశ్శబ్దము,

సురభిళాహ్వానములు, కైశిక ధ్వాంత నిశ్శబ్దము, రహస్తీరాలు, నిదుర చెర, నీలినీడ, కారు రాతిరి కొసలు, కార్చిచ్చు మంటయేళ్ళు, వలపుటాకలి, మూగ కనులు, వేదనా సుఖము, అరుణారుణాంధ గీతి, అమవస కన్నీటి పాట, ఇరుల గుసగుసలు, ముదుసలి నిరాశలు, పాట రెక్కలు, తీయతేనియ బరువు, విశ్వవిణాగళము, విరహ విపంచి, సురభి సౌదామిని, నిదుర పొదిగిళ్ళు మొదలైనవి.

కృష్ణశాస్త్రి గారి గేయాలు అధికభాగం ఖండగతిలో నడుస్తాయి. ఈ ఖండ గతి ద్విపదకు, సీసానికి సన్నిహితమైనదవటం చేత దీని ప్రభావానికి భావకవులు లోనయ్యారు. ఈ ఖండగలిలోనే నవ్యత సాధించారు కృష్ణశాస్త్రి.

"నీ కనురెప్ప కొనల నొక చినుకైన కదలనీ"

ఈ విధంగా దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు భావకవిత్వాన్ని ఒక స్థాయికి తీసుకొచ్చి దాని తత్త్వాన్ని లక్ష్యలక్షణ సమన్వితంగా ప్రచారంచేసి తెలుగు సాహితీ లోకంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొన్నారు.

**ఆధార గ్రంథాలు:**

1) ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు – ఆచార్య సి. నారాయణ రెడ్డి

2) తెలుగు సాహిత్య చరిత్ర – ఆచార్య ద్వా.నా. శాస్త్రి

3) తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) – ఆచార్య జి. నాగయ్య

– డా. ఎన్. విజయలక్ష్మి

పాఠం - 6

# ప్రసిద్ధ భావకవులు - కృతులు - సమీక్ష

**విషయ క్రమం:**

**6.1. ఇతర భావకవులు**

**6.2. ప్రసిద్ధ భావకవులు - కృతులు - సమీక్ష**

## 6.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

భావకవుల రచనల పరిచయం విద్యార్థులకు కలిగించడం, భావకవిత్వం ఎంతమందిని ప్రభావితం చేసిందో అవగాహన కలిగించడం.

## 6.1. ఇతర భావకవులు:

రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రిల అడుగుజాడల్లో నడిచి భావకవిత్వం వెలయించిన తెలుగు సాహితీమూర్తులు అనేకమంది ఉన్నారు. భావకవిత్వం ప్రభావానికి లోనుకొని కవే లేరంటే అది అతిశయోక్తి కాదు. శ్రీశ్రీ వంటి కవులు కూడా వారి కవిత్వరచనా ప్రారంభంలో భావకవిత్వం రచించినవారే. అబ్బూరి రామకృష్ణారావు, కవికొండల వెంకటరావు, బసవరాజు వేంకట అప్పారావు, విశ్వనాథ సత్యనారాయణ, పింగళి లక్ష్మీకాంతం - కాటూరి వేంకటేశ్వరరావు, అడవి బాపిరాజు, దువ్వూరి రామిరెడ్డి, నండూరి వేంకట సుబ్బారావు. తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి, నాయని సుబ్బారావు, నోరి నరసింహశాస్త్రి, మల్లవరపు విశ్వేశ్వరరావు, పిలకా గణపతిశాస్త్రి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, చావలి బంగారమ్మ, బసవరాజు రాజ్యలక్ష్మమ్మ, గుర్రం జాషువా, తుమ్మల సీతారామమూర్తి చౌదని, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పుట్టపర్తి నారయణాచార్యులు, జంధ్యాల పాపయ్యశాస్త్రి వంటి కవులు భావకవిత్వాన్ని వెలయించారు. భావకవిత్వంలోని శాఖలలో కొందరు అన్ని శాఖలను స్పృశించి రచనలు చేయగా మరికొందరు కొన్ని శాఖలకే పరిమితమై రచనలు చేశారు.

బసవరాజు, సౌదామిని (బసవరాజు రాజ్యలక్ష్మమ్మ) బంగారమ్మ, వేదుల మొదలైన వారు ప్రణయ కవిత్వం రాయగా, విశ్వనాథ, పింగళి, కాటూరి, దువ్వూరి, కవికొండల, తుమ్మల మొదలైనవారు ప్రకృతి కవిత్వాన్ని రచించారు.

భక్తి కవిత్వాన్ని వేంకట పార్వతీశ్వర కవులు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, బసవరాజు, వేదుల, దువ్వూరి మొదలైనవారు రాయగా, సంఘ సంస్కరణ కవిత్వాన్ని భోగరాజు నారాయణమూర్తి- మంగిపూడి వెంకట శర్మ, గురజాడ, రాయప్రోలు, దేవులపల్లి, జాషువా, తుమ్మల మొదలైనవారు రచించారు. స్మృతి కవిత్వాన్ని వెలయించినవారిలో ముఖ్యులు విశ్వనాథ, దువ్వూరి, నాయని, జాషువా మొదలైనవారు. వేంకట పార్వతీశ్వర కవులు, నాళం కృష్ణారావు, కవికొండల వెంకట్రావు మొదలైనవారు బాలగేయాలు రాశారు. గురజాడ, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, వేదుల, జాషువా, తుమ్మల, కరుణశ్రీ వంటివారు మానవతావాద కవిత్వాన్ని సృజించారు.

భావుకత్వమే కవి లక్షణం కనుక భావకవి కాని కవి ఉండనే అని చెప్పటం అతిశయోక్తి కాదు. భావం, భావావేశం కలిసి భావుకత్వమవుతుంది కనుక ఈ రెండూ లేకుండా కవితా సృజనే అసాధ్యం. రచన ప్రారంభించిన కవులు ఏదో ఒక సందర్భంలో ఏదో ఒక భావకవిత్వ శాఖలో కవిత్వం సృజించారని చెప్పుకోవచ్చు.

## 6.2. భావకవులు - కృతులు - సమీక్ష:

**అబ్బూరి రామకృష్ణరావు:**

రాయప్రోలు మార్గాన్ని పూర్తిగా అనుసరిస్తూ అటు సంప్రదాయవాదులకు ఇటు అభ్యుదయ పథగాములకు వారధిలా రూపొందిన భావకవి ఇతడు. అబ్బూరి రచనలు "ఊహాగానము - ఇతర కృతులు" అనే పేరుతో 1973వ సంవత్సరంలో ప్రచురించబడ్డాయి. ఇందులో జలాంజలి (1914), మల్లికాంబ (1915), పూర్వ ప్రేమ అను కథాకావ్యాలు, ఊహాగానం (1918), కవిత (1954), సన్నుతులు (1966) అనే ఖండ కావ్యాలు, రవీంద్ర నాటకానువాదములు (1962) లు ఉన్నాయి. 'నదీ సుందరి', 'ఎఱ్ఱ గన్నేరు', 'రసపిపాసి, మందార శిశువులు వీరి రచనలు. అబ్బూరి కవితలోని అర్థ గౌరవం, భావనారీతి తరవాతి కవులెందరికో మార్గదర్శకమైంది. వీరి ఖండ కావ్యాలలో 'కాపు పాట', 'తిక్కన మాతృభూమి' అనేది చిరస్మరణీయమైనవి. అబ్బూరివారిది అనితర సాధ్యమైన ఊహనైశిత్యం.

వీరి "మల్లికాంబ" రచన చూస్తే అందులో మల్లికా కమలలు "చిర స్నేహబద్ధలగు చెలులు". వారిలో మల్లిక వివాహిత. కమల ప్రవాసి అయిన తన ప్రియుడి దగ్గర నుంచి వచ్చిన లేఖలను మల్లిక దగ్గర దాస్తుంది. మల్లిక భర్త ఆమెను అనుమానించి, ఆ ఉత్తరాలను రహస్యంగా విప్పి చూచి, అవి తన భార్యకు రాయబడిన ప్రేమలేఖలని భ్రమించి ఆమె మరణానికి కారకుడవుతాడు. తర్వాత కమల వలన యదార్థం తెలుసుకొని పశ్చాత్తప్తుడై ఎక్కడికో వెళ్ళిపోతాడు. వెళ్ళే ముందు ఒక లేఖరాసిపెట్టి వెళ్ళిపోతాడు. ఈ కావ్యంలో కమల, మల్లికల సంభాషలలో ప్రణయత్త్వం చెప్పబడింది. మల్లిక కరుణాంత రంగగా చిత్రించబడింది. 'నీరద కుమారిక' వంటి పద ప్రయోగాలు, కావ్యాంతంలోని లేఖ రాయప్రోలు ప్రభావాన్ని సూచిస్తాయి.

**కవికొండల వెంకటరావు:** 'ఆంధ్రా వర్డ్స్‌వర్త్' గా పేరుపొందినవారు, జానపద కవిత్వంలో ఎక్కువగా కృషిచేసిన వారు కవికొండల వేంకటరావు గారు. వీరు కూల్రిడ్జ్ దొర ప్రభావంతో కవితారంగంలో ప్రవేశించి మొదట ఆంగ్లంలో కవిత్వం రాశారు. ఆ తరువాత తెలుగులో గేయరచనకు పూనుకొన్నారు. 1961వ సంవత్సరంలో వీరి 230 గేయాలు "కవికొండల వెంకటరావు గేయాలు" గా ముద్రించబడ్డాయి. "సంబోధనము - త్యాగము - నైరాస్యము, గీత, శూన్యక, ప్రణయ తత్వము, మబ్బు - గాలి, సిగ్గు - యెగ్గు, పైరగాలి, లీల, సత్కృతి, కాంతి, చిన్నప్పుడు, తాదాత్మ్యము వంటివి 230 గేయాలలో కొన్ని. 'శూన్యత' కవితలో

**"ఈ నిరాడంబర - ప్రేమ మెద దొలుదొల్ల**
**జిత్రించుకొన్నపుడు - చిత్రమేదొ చెప్పనా?**
**ఓ చెలీ ! ఓ చెలీ ! యేమి యనుకొనవుగా నీవు లేనేలేవు !**
**దూరాన నించున్న - నారికేళ శిఖాంత**
**మా వెనుక పొంచున్న - యంబుదపునెదిశాంత**
**మట్టె చూచుచు నుంటి - ఇట్టె యెదో చెయివచ్చి కనులు వ్రేళ్ళను మూసె!"**

అంటారు కవికొండల . శివరాత్రి ప్రభ, ఆశయం మొదలైనవి వీరి రచనలు.

**బసవరాజు వేంకట అప్పారావు:**

గురజాడ తర్వాత గేయకవితా ప్రస్థానాన్ని తీర్చిదిద్దిన వారిలో ముఖ్యుడు బసవరాజు వేంకట అప్పారావు. కావ్యభాషని వ్యవహారిక భాషకు సన్నిహితంగా తెచ్చినవారు బసవరాజు. వీరి జీవితమంతా అలజడులు, ఆవేదనలతో గడిచినట్లుగా అనిపిస్తుంది. వీరి రచనలను చూస్తే. తన పసిపాప మరణించినపుడు ఈ కవి

**"వేదాద్రి శిఖరాన వెలిగొన్న జ్యోతి**
**మినుకుమని కాసేపు కునికి పోయింది**
**.... కాపురమ్మొచిన కన్నె పాపాయి**
**ఇల్లు కాళీ చేసి వెళ్ళిపోయాడు"** అంటూ ఆవేదన చెందారు.

"మామిడి చెట్టును అల్లుకొన్నదీ మాధవీలతొకటీ", "కొల్లాయి గట్టితేనేమి", "మా గాంధి కోమటై పుట్టితేనేమి", "నల్లవాడే గొల్ల పిల్లవాడే", "ఏలా పాడే నింక యమునా కళ్యాణి", "గుత్తి వంకాయ కూరోయిబావా", వంటి గేయాలు వీరిని ప్రజలకు చేరువ చేశాయి. "సెలయేటిగానము', "ప్రేమతత్త్వము", "కోకిల," "నాగులచవితి", "వటపత్రశాయి" మొదలైన రచనలు వీరి కలం నుంచి జాలువారాయి.

సౌదామిని కలం పేరుతో రచనలు చేసిన రాజ్యలక్ష్మమ్మ గారు వీరి సతీమణి. "పరిచిత కంఠము", "ప్రియ నిరీక్షణము", "ప్రణయినీ గీతము", "దురదృష్టము" మొదలైన రచనలు చేసిన భావకవయిత్రి ఈమె.

**విశ్వనాథ సత్యనారాయణ:**

విశ్వనాథ సత్యనారాయణ ప్రథమదశలో అచ్చమైన భావకవి. భ్రష్టయోగి (1916), ఆంధ్ర పౌరుషము (1919), గిరి కుమారుని ప్రేమ గీతాలు (1920–28), మాస్వామి (1923), కిన్నెరసాని పాటలు (1924), కోకిలమ్మ పెళ్ళి (1924), ఆంధ్ర ప్రశస్తి (1926–28), శశిదూతము (1935), శృంగార వీధి (1933), తెలుగు ఋతువులు (1933 - 34), వరలక్ష్మీ త్రిశతి (1934), కేదార గౌళ (1972), గోపికా గీతలు, భ్రమర గీతలు మొదలైనవి విశ్వనాథ వారి భావకవితా సంపుటాలు.

విశ్వనాథ భావకవిత్వపు రచనల్లో 'కిన్నెరసాని పాటలు' ప్రత్యేకమైనది. భద్రాది దగ్గర గల కొండ చుట్టూ తిరిగి ప్రవహించే వాగు పేరు కిన్నెరసాని. ఆ కొండను ఆ నదిని చూచిన తర్వాత విశ్వనాథ వారి మనసులో నది నాయికగా కొండ నాయకుడిగా భాసించాడు. ఇది విశ్వనాథ వారి మనసులో జనించిన రసవత్ కావ్యం. కిన్నెర మొదట మానవ స్త్రీ. తర్వాత వాగుగా మారింది. అత్తపెట్టిన ఆరడికి ఓర్వలేక కిన్నెర అడవి దారి పట్టింది. కిన్నెర భర్తను విడిచి పోయేటప్పుడు అతడు ఆమె జడబట్టి, చేలాంచలంలాగి, పాదానతి చేసినట్లు ధ్వనిస్తుంది.

**"పరుగెత్తెదు నీ వేణి బంధము పూనితి చేతను**
**కరమున వేణికి బదులుగ కాల్వ గట్టె నీటి పొరలు.**
**ఎడమచేత నీ కొంగును ఒడిచి పట్టుకొంటి చెలీ**
**తడి చేతను కొంగులేక తడబడితిని ప్రియురాలా.**
**నీ పాదమ్ములు మోచిన నా ఫాలమ్మున చెమ్మట**
**ఈ పగిడిని వాగువైన నీపై ప్రేమను చూపెడి"**

"కిన్నెరసాని" ని రసహృదయం మేళవించిన ప్రణయ నాయికగా సృష్టించారు విశ్వనాథ.

విశ్వనాథ మొదట కొడాలి ఆంజనేయులు గారితో కలిసి 'సత్యాంజనేయులు' అనే పేరుతో జంటకవిత్వం రచించారు.

ఆంధ్రదేశాభిమానంలో ఆంధ్ర ప్రశస్తి, ఆంధ్ర పౌరుషాలను రచించారు విశ్వనాథ. పూర్వరాజుల శౌర్య ధైర్యాలను, నాటి తెలుగు జాతి వైభవాన్ని కొనియాడారు. పరుల పాలనలో జాతి దుర్గతిని, దైన్యాన్ని అనుభవించటం చూచి

**"తెలుగు నదులెల్ల పొంగెత్తి ప్రశయవారి**

**కెరలిపడి తెన్గునేల ముగించనిమ్ము**

**నేటితో నస్వతంత్రతానియతమైన**

**యీ బ్రదుకు తెన్గువారు భరించలేరు"** అని వాపోయారు.

సతీస్మృతిలో "వరలక్ష్మీ త్రిశతి" అనే వియోగ కావ్యాన్ని రచించారు.

**"ఓ సఖా! ప్రియభార్యా వియోగమెఱుఁగ**

**నట్టియో పూర్వ సత్కృతీ ! యకట ! నీవు**

**కర్మ శతకంబు చదువకు ! మర్మఘాతి**

**నీ వెఱుగలేవు దానిలోని దగు"**

అనే పద్యంలో మరచ్ఛేదకమైన దుఃఖ తీవ్రత ధ్వనింపజేశారు. వరలక్ష్మీ స్వభావచిత్రణ, ఆమె పాతివ్రత్యం గురించి

**"తన ప్రేమలోతు చిక్కని దృగంతచ్ఛటా**

**శ్రీఁ గాని నోటితో జెప్పలేదు**

**తన దుఃఖభారమెల్లను నిశ్చలాపాంగ**

**ములఁగాని నాల్కతో బలుకలేదు"** అంటారు విశ్వనాథ.

**పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు:**

వీరిరువురు కూడా భావకవిత్వ ప్రభావానికి లోనైనవారే. వీరు 'సంక్రాంతి', 'తొలకరి' అనే రచనలను భావకవిత్వాన్ని అనుసరించి రచించారు. "సౌందరనందము" వీరిరువురు జంటగా రచించింది. వీరి 'తొలకరి' పల్లీయ వాతావరణాన్ని చిత్రిస్తుంది. అశ్వఘోషుడి సౌందరనందాన్ని రేఖామాత్రంగా గ్రహించి ప్రాచీన కవిత్వంలోని వర్ణనతో, ఆధునిక భావ చిత్రాలలోని సౌందర్యాన్ని స్వీకరించి 'సౌందరనందము' సృజించారు. ప్రత్యేకంగా కాటూరి వారు "గుడిగంటలు, పౌలస్త్య హృదయము, పన్నీటి జల్లు" అనే కావ్యాలను వేరుగా రచించారు. అలాగే పింగళివారు "మధుర పండిత రాజము" అనే అనువాద కావ్యాన్ని రచించారు.

**అడవి బాపిరాజు:**

భావకవి, చిత్రకారుడు, శిల్పి, సంగీతజ్ఞుడు, నటుడు, నవలా రచయిత, కథానిక రచయిత అయిన అడవి బాపిరాజు లలితకళలలో బహుముఖ ప్రజ్ఞాశాలి. వీరు "శశికళ, గోధూళి, తొలకరి, రాగమాలిక, తరంగిణి కావ్యాలను రచించారు. వీరి గేయాలు నాటి యువతరాన్ని అద్భుతంగా ఆకర్షించాయి. బాపిరాజుగారి 'వరద గోదావరి', 'గంగిరెద్దు' రచనలపై వర్డ్సవర్త్ ప్రభావం కనిపిస్తుంది.

బాపిరాజుగారి స్వప్న దేవత "శశికళ". కలలో తనపైవాలిన అపురూప సుందరిగా "శశికళ" ని చూచి, అమె కోసం ఒక చిన్నలోకాన్నే సృష్టించారు.

**"చంద్రలోకం తూర్పుదెసలో**

**సూర్యలోకం పశ్చిమంలో**

**చిన్న లోకం ఒకటీ ఉన్నదే**

**ఓనా వెన్నెల చిన్నారి పడుచా**

**ఆ లోకమేలే**

**కన్నెరాణివి నువ్వె నువ్వేనే"** అంటారు బాపిరాజు.

**దువ్వూరి రామిరెడ్డి:**

గ్రామీణ జీవితాన్ని కావ్యస్థం చేసిన భావకవులలో ముఖ్యులు కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారు. "నలజారమ్మ అగ్ని ప్రవేశము, కడపటి వీడ్కోలు, కృషీవలుడు" వీరి తొలి కావ్యాలు. 1920వ సంవత్సరంలో "జలదాంగన" రచించారు. ఆ తర్వాత "గులాబితోట, పానశాల" రచించారు.

రామిరెడ్డి గారు రాసిన " పిచ్చి బికారి" అనే ఖండకావ్యం తాత్త్విక దృష్టి గల రచన. పిచ్చి బికారి జిజ్ఞాసువుకు చిహ్నం. అతడికి కనిపించిన స్త్రీ మాయాస్వరూపం. ఆమెతో బికారి

**"నీ జడ కట్టులో నిద్దురవాడి**

**నలిగిన చంపక దళముల మాల**

**బిచ్చంబు పెట్టుమీ పిచ్చి బికారి**

**సంతృప్తి నొందును; చాలించు యాత్ర"** అంటాడు.

వీరి 'పానశాల' కూడా తాత్విక దృక్పథంతో రచించినదే. "కుసుమాశ్రువులు" ఖండకావ్య సంపుటిలో పువ్వులను కోయటం కూడా సహించలేక

**"కన్నుల విందు సేయు సుమకాండముఁద్రుంచి విచిత్రశోభలన్**

**జెన్నొలికించు నీ ప్రకృతిచిత్తము నెత్తురులొల్కఁ జేయనే**

**నెన్నడు బూన; లేఁ బొడుపు టెండలు సోకిన బుల్కరించుపూఁ**

**చిన్నల హత్య చేయఁదలపెట్టుట క్రూరము నన్నుబోటికిన్"** అని అంటారు.

ఇంకా దువ్వూరి ప్రకృతి మహాత్మ్యాన్ని

**"శ్యామలాకాశ ఫలకమునందుఁ దరళ**

**కాంతి వెదజల్లు తారకాక్షరములొనర**

**విశ్వ వైశాల్యబోధక విద్య నేర్తు**

**శర్వరీ గర్భశాంతి యొజ్జగ విధింప"**

అని ప్రకృతే ఉపాధ్యాయిని అని స్పష్టంగా చెప్పారు. ఇంకా 'గతిక' వంటి సామాన్యమైన దానిని తన కవితా వస్తువుగా చేసుకొని

**"ఏను నీవైతివో యెవరికిం దెలియు**

**మున్ను గతించిన పుట్టువులందు!**

**ఈవు నేనౌదునో యెవరెఱుంగుదురం**

**రాబోవు జన్మాల రాకపోకలకు!**

**గుసగుస చెప్పెదు; గునిసియాడెదవు**

**నీలోన వెలిగెడు నిర్మల జ్యోతి**

**వెలికొత్తఁ బోరాట పెట్టుచున్నదియె"** అంటారు.

**నండూరి వేంకట సుబ్బారావు:**

నండూరి అనంత భావుకుడు. మద్రాసు క్రైస్తవ కళాశాలలో 'లా' చదువుతున్నప్పుడు ట్రాం బండిలో కాలేజి నుండి వస్తుంటే వారి నోటి నుండి కూనిరాగంగా మొదలై "గుండె గొంతుకలోన కొట్లాడుతాది కూకుండ నీదురా కూసింతసేపు" అనే పాట వెలువడింది. అదే ఎంకిపాటలకు శ్రీకారం. దాదాపు 78 పాటలై ఎంకి, నాయుడు బావలకు అమరత్వం కలిగించాయి. ఎంకిపాటలలో జానపదుల మాటతీరు కనిపిస్తుంది.

**"యెలక జన్మములోన ఎవరమోనంటి**

**సిగ్గొచ్చి నవ్వింది సిలక నాయెంకి**

**ముందు మనకే జన్మముందోలె యంటి**

**తెల్లతెల్ల పోయింది పిల్ల నా యెంకి**

**యెన్నాళ్లు మనకోలె యీ ముసుగులంటి**

**కంట తడిపెట్టింది జంట నాయెంకి"**

యెంకి మాధురీధురీణమైన దాంపత్య ధర్మానికి ప్రతీక. జానపద స్త్రీ అయినా ఆమెలో పూర్వజన్మ సంస్కరం ఉంది. యెంకి నాయుడు బావలు కేవలం జీవేశ్వరులని పురాణం సూరిశాస్త్రిగారు, శృంగార రసాధిష్ఠాన దేవతలగు రతీమన్మథులని పంచాగ్నుల వంటివారే కొనియాడారు. వేదం వెంకట రాయశాస్త్రిగారైతే రంభా నలకూబరులు అన్నారు. ఎంకి పాటల ప్రభావం దాదాపు మూడు దశాబ్దాల పాటు ఉంది. దేవులపల్లివారైతే స్వయంగా ఊరురా తిరిగి పాడి ప్రచారం చేశారు. ఈ పాటలను అనుసరించి అనేక మంది యువకవులు రచనలు చేశారు.

**తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి:**

శివ శంకరశాస్త్రి గారి సంపాదకత్వంలో 1920వ సంవత్సరంలో 'సాహితి' పత్రిక స్థాపించబడింది. నవ్య సాహిత్య ప్రచారానికి, గిడుగువారి వ్యావహారిక భాషోద్యమానికి ఈ పత్రిక ఎంతో సహకరించింది. అసాధారణ ప్రజ్ఞావంతుడు, బహుభాషావేత్త, మహా సంస్థ అనదగిన శివ శంకరశాస్త్రి విభిన్న ప్రవృతులు కల చింతా భీమశంకరం, చింతా దీక్షితులు, నోరి నరసింహశాస్త్రి, కొడవటిగంటి వెంకటసుబ్బయ్య, త్రిపురారి భట్ల వీరరాఘవస్వామి, వేదుల సత్యనారాయణశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, కొడాలి ఆంజనేయులు, నండూరి సుబ్బరావు, గిడుగు రామమూర్తి, రాయప్రోలు సుబ్బారావు, అడవి బాపిరాజు వంటి వారిని సమితి సభ్యులుగా చేసి నవ్య కవిత్వానికి ఒక స్థిరరూపం తీసుకురావటానికి,

నూతన ప్రక్రియా సాధనకు కృషిచేశారు. శివ శంకరశాస్త్రిగారి ఖండకావ్యము 'హృదయేశ్వరి'. "ఆవేదన, పద్మావతీ చరణ చారణ చక్రవర్తి, దీక్షిత దుహిత, దివ్యలోచనములు, మేడూరి వారి కోడలు, పుష్యపూర్ణిమ మొదలైనవి వీరి రచనలు.

కవి తానొక సుందరిని చూచి ప్రేమించుట, ఆమెను వివాహం చేసుకోవటానికి నిశ్చయించుకోవటం, మొదట ఆమె దానికి అంగీకరించి తర్వాత పరిస్థితుల ప్రభావంతో నిరాకరించటం, కవి విరహ కాతురుడగుట 'హృదయేశ్వరి' కావ్యంలోని వస్తువు.

**వేదుల సత్యనారాయణ శాస్త్రి:**

వీరు శక్తిమంతమైన గీత రచయిత, భావకవి. "గౌతమీ కోకిల" వీరి బిరుదు. వీరిని 'ఆంధ్రాషెల్లీ' గా కీర్తిస్తారు. "దీపావళి", "ముక్తఝరి' వీరి ఖండకావ్య సంపుటాలు. ఎంతటి కష్టమైన భావాన్నైనా వృత్తాలలో చాలా సులభంగా ఇమర్చగలరీయన.

**"మ్రొక్కిన కొలంది కాలితో ద్రొక్కుచున్న**
**ఈ కఠిన లోకమెల్ల బహిష్కృతమ్ము**
**రండు చిమ్మట లార ఈ రాత్రి వేళ**
**నా వలెనె పాడుకొను మీరె నాకు సఖులు"** అని చీకటినే ప్రాణసఖిగా పంపించారు.

**"నేనే మిగిలితి నీ గౌతమీనదీప**
**విత్ర గర్భంబులో మ్రోత పెట్టుచున్న**
**యుగయుగాంతర విశ్వ మహోగ్ర దుఃఖ**
**జీవ గీతాలవృత్తి చెప్పుకొనక"**

అంటూ నిట్టూరుస్తారు. ప్రేమ, సౌందర్యం, నిర్వేదం, కరుణ అనేవి వీరి కవితా వస్తువులు, "దీపావళి" కవిత్వంలోని ప్రతి పంక్తి వీరి గాఢానుభూతి ఫలితమే.

**నాయని సుబ్బారావు:**

జీవితానుభవాలను కావ్యాలుగా రచించిన కవి వేరు. "సౌభద్రుని ప్రణయయాత్ర, ఫలశ్రుతి, మాతృగీతాలు, విషాదమోహనము, సౌందర్యలహరి, వేదనా వాసుదేవము, జన్మభూమి, భాగ్యనగర కోకిల" అనేవి వీరి కావ్యాలు.

వీరి "సౌభద్రుని ప్రణయయాత్ర" లో కావ్యనాయిక వత్సల, కవి ప్రేమించుకున్నారు. వారి చిన్నతనంలోనే ఆమె తండ్రి తన కూతురిని అతడికిచ్చి వివాహం చేస్తానని చెల్లెలికి మాటిచ్చాడు. కాని కొంతకాలానికి తన అభిప్రాయం మార్చుకున్నాడు.

**"చెప్పెనత్తమ్మ చేతిలో చేయివైచి**
**నీ కుమారుని కిచ్చెద నా కుమార్తె**
**ననుచు మును నాన్న; నేడు పేరాసదగిలి**
**తోసి రాజనె చేసిన బాసలన్ని"** అని అనిపించారు కవి.

వత్సలకు బావ అయిన కవి అంటే ప్రేమ. అతడిపై అనురాగం కుమ్మరిస్తుంది. మధ్యలో వియోగం కలిగినా చివరకు ఇద్దరికీ వివాహం జరుగుతుంది. ఈ కావ్యంలో ప్రణయం భగ్నం కాకుండా వివాహం జరగడం ఈ రచన ప్రత్యేకత. వత్సల మొదట ప్రేయసి, తర్వాత ఇల్లాలు.

మాతృ వియోగంలో నాయని సుబ్బారావు, తనకు కలిగిన తీవ్ర వేదనను "మాతృ గీతాలు" గా ఆలపించారు..

**"ఎవ్వడా క్రూరకర్మఠుడెవడు ! నీల**
**జలద నిర్ముక్త శైశిర శర్వరీ ప్ర**
**శాంత మలవాటుపడిన నిశాంతమందు**
**అకట నట్టింటి దీపమ్ము నార్పినాడు"**

**నోరి నరసింహశాస్త్రి:**

సంస్కృతాంధ్ర భాషలలో పండితులు సాహితి, భారతి వంటి పత్రికలలో వీరి ఖండ కావ్యాలు ప్రచురించబడ్డాయి. 'గీత మాలిక' అనే ఖండ కావ్యం గ్రంథరూపంలో వెలువడింది.

**మల్లవరపు విశ్వేశ్వరరావు:**

ఆంగ్ల వంగ సాహిత్యాలను అధ్యయనం చేసి, బ్రహ్మ సమాజపు ఆలోచనలతో, విశ్వకవి రవీంద్రుడి గురుత్వంతో ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సంతరించుకొన్న కవి విశ్వేశ్వరరావుగారు. మొదట్లో రవీంద్రుడు, కృష్ణశాస్త్రి గార్ల ప్రభావానికి లోనైనా క్రమంగా ఆ ప్రభావం నుండి బయటపడి తన స్వంత గొంతును వినిపించారు. వీరి కవితా సంపుటులు "మధుకీల, కళ్యాణ కింకిణి".

**"తెప్పవోలిక చంద్రబింబం తెలిపోతోంది నింగిని**
**అందులో నా ప్రేయసి వుంది కాబోలు"** అని వీరు

ఆలపించిన గీతాల వలన భావకవిగా పేరు తెచ్చుకున్నారు. ప్రకృతి, ప్రణయమే వీరి కావ్య వస్తువులు. వీరి ప్రసిద్ధ కవితలు 'నవాలోకం, సింగారము, గడ్డిపూవు' మొదలైనవి.

**పిలకా గణపతిశాస్త్రి:**

సంప్రదాయ బలంతో నవ్యకవిత్వాన్ని ఆహ్వానించినవారు వీరు. "రత్నోపహారము, ప్రమద్వర, విభ్రాంతా మరుకము" అనేవి వీరి రచనలు. "పాపాలు" అనే గీతంలో

**"పాపాయి చుట్టూ తిరిగి పలకరించండి**
**పాపనో మారైన ఆడించి పొండీ,**
**చిట్టి ఈ వేళేమొ పెట్టిందిపోరు,**
**ఉయ్యాల ఊపగా చెయ్యారు కోదు"** అని తల్లిచేత పలికించి

మాతృహృదయాన్ని ఆవిష్కరింపజేశారు. వీరి 'మాతృ భాగ్యము' అనే గీతం కూడా మరపురానిదే.

**ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి:**

వీరి కవిత్వం భావకవులలో ఒక ప్రత్యేక మార్గానికి చెందింది. వీరు కవిత్వపు లావణ్యాలను, లాలిత్యాలను పరిశీలించి రచనలు చేశారనిపిస్తుంది. "గోదావరి, తెలుగు వీణ" మొదలైనవి వీరి ఖండ కావ్యాలు. వీరు ఎన్ని రచనలు చేసినా వీరి హృదయం పాటలలోనే చక్కగా వ్యక్తీకరించబడింది. శబ్దాన్ని ఔచిత్య శోభితంగా ప్రయోగించాలని వీరు భావించటంతో కవితావేశం కొంత తగ్గిందా అనిపిస్తుంది. కాలస్వభావాన్ని అర్థం చేసుకొని ఉద్యమావేశంలో కొట్టుకుపోక, జీవసారాన్ని గ్రహించిన నేర్పరి.

**చావలి బంగారమ్మ:**

బంగారమ్మగారు రచించిన పదచిత్రాలు కాల్పనిక కవితకు వన్నె తెచ్చాయి. వీటిలో అందంగా ప్రతిబింబించిన మందార పువ్వుని

**"అందాలు తానె చూసింది, నీటిలో చందాలు తానె చెప్పింది నాతోటి**

**వొద్దున్న మందార వొంగి బొట్టెట్టుకుని అందాలు తానె చూసింది" అని**

**వర్ణించారు. అలాగే 'ఆ కొండ' గీతంలో**

**"మంచులో మునిగింది, మాయమై పోయింది**

**ఆకసమున గలసెనో, ఆ కొండ**

**అక్కడే పడి యుండెనో"**

అని ప్రకృతి చిత్రాన్ని కళ్ళకు కట్టారు. 'కప్ప తల్లి పెళ్ళి' గీతం కూడా వీరి రచనే. భాషలో, భావనలో పాండిత్యవాసన సోకని తెనుగుదనం ఈమె స్వంతం.

**తల్లా ప్రగడ విశ్వసుందరమ్మ:**

వీరి కవిత్వంలో స్వచ్ఛమైన కవితా సౌందర్యం, భావనలో సాకు మార్యం కనిపిస్తాయి. తన భర్త తల్లాప్రగడ నరసింహశర్మ గారితో ఆమె స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొని అనేకసార్లు జైలుశిక్ష ననుభవించారు. ప్రకృతిపూజ, దేశభక్తి, స్నేహానురక్తి, సేవాభిలాష, ప్రణయానురక్తి విశ్వసుందరమ్మ కవిత్వానికి వన్నెతెచ్చాయి.

**బసవరాజు రాజ్యలక్ష్మమ్మ:**

బసవరాజు అప్పారావుగారి భార్య ఈమె, వీరి కలం పేరు సౌదామిని. అప్పారావుగారి మరణం తరువాత వీరు వ్రాసిన వియోగ గీతాలు మర్చిపోలేనివి. 'ప్రియ నిరీక్షణము' లో ఈమె

**"చల్లని చిరుగాలి పాట, మెల్లగ వీనులు సోకగ**

**వాకిట నిలబడి అడుగుల చప్పుడైన యప్పుడెల్ల**

**ఆత్రముతో నీవె వచ్చితని, భ్రమపడి చూతు నాథ"** అని

విలపిస్తారు. వీరి కవితలు భావకవిత్వంపై గౌరవం ఇనుమడింపజేసే విధంగా ఉంటాయి.

**గుర్రం జాషువా:**

భావకవిత్వంలోని ఖండకావ్య ప్రక్రియకు ప్రాచుర్యం కలిగించినవారు గుర్రం జాషువా. "హిమ ధర్మార్క పరిణయము, శివాజీ, ఫిరదౌసి, స్వప్నకథ, గబ్బిలము, కాందిశీకులు, నేతాజీ, బాపూజీ, క్రొత్తలోకము, ముంతాజ్ మహల్, ముసాఫరులు. రాష్ట్రపూజ, నా కథ, క్రీస్తు చరిత్ర మొదలైనవి వీరి రచనలు. భావ కవిత్వానికి ప్రాణమైన ఆత్మాశ్రయ లక్షణం, సౌందర్యారాధన, సంస్కరణాభిమానం, ప్రణయతత్త్వ విలాసం, మానవ మహిమాభి వర్ణన జాషువా రచనలలో కనిపించినా వీరిని ద్వితీయ శ్రేణి భావకవిగానే విమర్శకులు భావించారు. జాషువా భావ విప్లవాన్ని మాత్రమే కోరారు, భాషా విప్లవాన్ని కాదు. జాషువా స్వయంగా "ప్రసిద్ధాంధ్ర కవులు మ్రోయించిన కవితా వీణలు నా పసితనంలో నన్నాకర్షించాయి . నేనూ ఒక వీణ మ్రోయించాలి అనుకున్నాను. ప్రయత్నం మీద నాకు లభించినది వీణ కాదు, సితార – అది నా కవిత వినిపించినది ప్రజలకు కాని

ప్రభువులకు కాదు” అని తన కవిత్వం సాధించిన పరమార్థాన్ని వివరించారు. భావకవిత్వానికి ఛందోబద్ధమైన పద్యం తీసుకున్నా భావనలో వీరు ఆధునికులు. ప్రాచీన కవుల లాగా విరహాది వర్ణనలు, మన్మథాది దూషణలు చేయటం వీరికి నచ్చదు. భావకవితలోని అస్పష్ట భావనా బలాన్ని, ప్రేయసీ సమారాధనను

**“కవి సమయంబుఁదప్పి, నుడికారపు సొంపును బాడుసేసి, నీ**
**వెవతుక కోసమో కుమిలి ఏడ్చుచుఁ జక్కని తెల్గుకైత కా**
**యువులు గుదించి, యేమిటి కయోమయముం బొనరింతు వీవు నీ**
**కవనము పాడుగాను, వెడఁగా యిఁక నేనియు రమ్ము దారికిన్”**

అని నిరసించారు జాషువా. ఈ నిరసనమే భావకవిగా వీరికి గుర్తింపు రాకపోవటానికి కారణం కావచ్చు. ఆధునిక భావచేతనతో, సంస్కరణా దృష్టితో మానవత్వపు విలువలను పొందిన కవి జాషువా.

జాషువాలాగానే ద్వితీయశ్రేణి భావకవులుగా పేర్కొనదగిన కవులు అనేకులున్నారు. వారిలో తుమ్మల సీతారామమూర్తి చౌదరి, ఏటుకూరి నరసయ్య, జంధ్యాల పాపయ్య శాస్త్రి, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, పుట్టపర్తి నారాయణాచార్యులు, బెళ్ళూరి శ్రీనివాసమూర్తి మొదలైనవారు కొందరు.

**తుమ్మల సీతారామ మూర్తి చౌదరి:**

వీరు కూడా భాషా వ్యాకరణాలలో సంప్రదాయాభిమానులైనప్పటికీ భావనలో మాత్రం ఆధునికులు. వీరు చిన్నతనంలోనే గాంధీజీ ప్రభావానికి లోనై రాట్నం వడికి, ఖద్దరు అమ్మి స్వరాజ్యోద్యమంలో పాల్గొన్న జాతీయకవి. దేశభక్తులు, అభినవ తిక్కన అని కీర్తించబడినవారు. వీరి రచనల్లో “తెనుగులెంక, పఠిగపంట, ధర్మజ్యోతి, ఆత్మార్పణము, రాష్ట్రగానము” మొదలైనవి ముఖ్యమైనవి.

సంక్రాంతి, తలపులు, పరినాట్లు మొదలైన కావ్యఖండికలు రచించి కృషీవలుల పట్ల తమకు గల అభిమానాన్ని చాటుకున్నారు. ‘పైర పంట, ఉదయగానము, శబల, సర్వోదయగానము, నా కథలు, ఎక్కట్లు’ మొదలైన కావ్యాలను రచించి వీరు ఆధునిక కవితలో సంప్రదాయ రీతికి, అధునాతన భావనకు ప్రాధాన్యతనిచ్చారు. హిందీని, ఇంగ్లీషుని పట్టుకొని వ్రేలాడే తెలుగు వారిని గురించి

**“పోతన్న కలము సొంపుల నెఱుంగకమున్నె**
**తులసి దాసుని కైతతో పనేమి”** అని విమర్శించారు.

“వంగ భస్మము’ అనే శీర్షికతో వీరు రాసిన పద్యాలలో స్వాభిమాన తీవ్రత కనిపిస్తుంది.

**“సిగ్గు సిగ్గు తెల్గు సీమల దత్తు ఠా**
**కూర్, బెనర్జి, సేను, ఘోషు, బోసు**
**రే, యటన్న పేర్లు రేగెను, ప్రెగ్గడ**
**భట్టు, సెట్టి వీడువట్టి పోయె”** అని ఆంధ్రుల విజాతీయ భావనను నిరసించారు.

**రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ:**

వీరు "గాథా సప్తశతి, పరివర్తనము, పెనుగొండ కొండ" అనే రచనలు చేశారు. కవిగాకన్నా విమర్శుడిగా రాళ్లపల్లి వారికి సాహిత్య లోకంలో ప్రత్యేక స్థానం ఉంది. మనన శీలత, సంయమనం, సమ దర్శనం, శిల్పదృష్టి వీరి విమర్శకు శోభను కూర్చాయి.

**పుట్టపర్తి నారాయణాచార్యులు:**

వీరు సరస్వతీ పుత్ర, మహాకవి, పద్మశ్రీ బిరుదాంకితులు. శతాధిక గ్రంథకర్తలు, బహు భాషావేత్తలు, సద్విమర్శకులు. వీరు సంప్రదాయంలో పుట్టి భావకవిగా పెరిగినా అభ్యుదయం వైపు తమ దృష్టిని సారించిన ఆధునికులు. "పెనుగొండ లక్ష్మి, సాక్షాత్కారము, సాధ్యము, శివతాండవము, మేఘదూతము, అగ్నివీణ, శ్రీనివాస ప్రబంధము" మొదలైనవి వీరి తెలుగు రచనలు. వీరి "పెనుగొండ లక్ష్మీ" లో

**"రాయల పాదముద్రలు దలఁ దాల్చి సొం**
**పులు దిద్దు కొన్నట్టి కలికిమిన్న**
**కాపుకైతలకు ద్రాక్షాపాకమును గూర్చి**
**గానంబుఁ జేసిన కవికుమారి**
**వగతుర యెదంద నిప్పుకల్ రగులబెట్టి**
**యుదధి గర్భంబు సుడివడి హోరుమనగ**
**తెనుగు ఢంకాలు మ్రోగిన దివ్యభూమి**
**కనుము తమ్ముడా! జీర్ణంబు గగన మహలు"**

అని పెనుగొండ ప్రాచీన రాజ్య వైభవాన్ని, పరాక్రమాన్ని, కవితా శక్తిని తెలియజేశారు.

**జంధ్యాల పాపయ్య శాస్త్రి:**

భావకవిత్వం కనుమరుగైన తరువాతనే కరుణశ్రీగారి 'ఉదయశ్రీ' వెలువడింది. ఈ ఉదయశ్రీలో విశేష ప్రచారం పొందిన 'పుష్పవిలాపము, అద్వైత మూర్తి, సాంధ్యశ్రీ, ప్రాభాతి, రాట్నసుందరి, కుంతీకుమారి, తపోభంగము, ధనుర్భంగము, ఊర్మిళా కుమారి, సతీసావిత్రి, అనసూయాదేవి, తెనుగు తల్లి, బీదపూజ, సార్థకత, స్వేచ్ఛాపుష్పాలు, అంజలి మొదలైన ఖండ కావ్యాలున్నాయి. వీరి ఖండకావ్యాలలో ప్రణయం, ప్రబోధం అనే భావ కవితా శాఖలు కన్పిస్తాయి. వీరి పద్యాలు నిరక్షరాస్యులకు కూడా సులభంగా అర్థమయ్యే రీతిలో ఉంటాయి. భావనలో లాలిత్యం ఉంటుంది. కరుణశ్రీ భావకవిగా ముద్రపడని భావకవి సంప్రదాయాన్ని, అభ్యుదయాన్ని విడువని కవి కరుణశ్రీ.

వీరేకాక బెళ్ళూరి శ్రీనివాసమూర్తి 'ప్రేమ తపస్విని, అపశ్రుతి' వంటి కావ్యాలను రచించారు. కొడవటిగంటి వెంకటసుబ్బయ్యగారి 'సంధ్యారాగం' అనే ఖండకావ్య సంపుటి 1922వ సంవత్సరంలోనే వెలువడింది. పైన చెప్పబడిన కవులు 1910–1930 మధ్య కాలంలో సాగిన భావ కవితోద్యమానికి సహకరించినవారే.

**ఆధార గ్రంథాలు:**

1) ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు – ఆచార్య సి. నారాయణరెడ్డి.

2) తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) – ఆచార్య జి. నాగయ్య.

**– డా. ఎన్. విజయలక్ష్మి**

## పాఠం - 7

# అభ్యుదయ కవిత్వం

**విషయ క్రమం:**

**7.1. అభ్యుదయ కవిత్వం – నిర్వచనం, లక్షణాలు, ధోరణులు**

**7.2. అభ్యుదయ కవిత్వం – అంతర్జాతీయ పరిణామాలు**

**7.3. అభ్యుదయ కవిత్వం – మార్క్సిజం ప్రభావం**

### 7.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

అభ్యుదయ కవిత్వోద్యమం గురించి విద్యార్థులకు అవగాహన కలిగించడం, మార్క్సిజం గురించి తెలియజేయటం.

### 7.1. పరిచయం:

అభ్యుదయం అనే పదానికి శుభం, మంగళం అనే అర్థాలున్నాయి. ప్రోగ్రెస్ అనే ఆంగ్లపదానికి సమానార్థకంగా అభ్యుదయ అనే పదాన్ని ఉపయోగిస్తాం. భావకవిత్వానికి తిరుగుబాటుగా, సామాజిక చైతన్యం పర్యవసానంగా, మార్క్సువాదం ఆత్మస్థానీయంగా, వస్తు ప్రాధాన్యం, వాస్తవిక దృక్పథం, మానవతావాదం, ప్రగతి శీలకమైన మార్పు ప్రధాన లక్షణాలుగా తెలుగులో అభ్యుదయ కవిత్వం ఆవిర్భవించింది.

#### 7.1.1. అభ్యుదయం కవిత్వం – నిర్వచనాలు:

**పి.వి. రాజ మన్నారు:**

అభ్యుదయ రచన సమకాలికమైన జీవిత పరిస్థితులకు రాజకీయ వాతావరణానికి, ఆర్థిక సమస్యలకు, సమాజ సంఘర్షణలకు, నైతిక సందర్భాలకు, ఐహిక, ఆముష్మిక సిద్ధాంతాలకు వైజ్ఞానిక విశేషాలకు అనుగుణంగా అనుకూలంగా తగినట్టి, అవసరమైన మార్పులతో విలసిల్లెను.

**దేవులపల్లి కృష్ణశాస్త్రి:**

పీడించబడేవాళ్ళూ, పీడించేవాళ్ళూ ఉన్న ఈ వర్గ సమాజం ఉండాలని ఎవరూ కోరరు. రానున్న విధానంలో సాధారణ మానవుడే మకుటధారి. పురోగమిస్తున్న లోకాన్ని ప్రతిఘటించేవారు ఎప్పుడూ అభ్యుదయ వాదులు కాజాలరు. ఈ ధనిక సమాజం పోవాలనుకోవడమే అభ్యుదయం. ఇది మనసులో పెట్టుకొని రాసేది అభ్యుదయ రచన.

**శ్రీశ్రీ:**

అభ్యుదయ రచయితలు తెచ్చిన విప్లవం రసావిష్కరణకు రసాస్వాదనకు సంబంధించింది. సాహిత్యం వొక భోగవస్తువుగా పరిగణించే దృక్పథం మీద వీరు తిరుగబడుతున్నారు. నేటి రచయితకు ప్రజలే ప్రమాణము. కొన్ని కారణాల వల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలను మళ్ళీ సారస్వతోన్ముఖంగా త్రిప్పటానికి నేటి రచయితలు పాటుబడుతున్నారు.

#### 7.1.2. అభ్యుదయ కవిత్వం – లక్షణాలు:

1) సమ సమాజ నిర్మాణం ప్రధాన లక్ష్యంగా ఉంటుంది.

2) సమాజంలో పీడించేవారు, పడించబడేవారు ఉండకూడదు. పీడన ఏ రూపంలోను ఉండకూడదు.

3) కష్టజీవులకు వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కితీరాలి.

4) కులమత భేదాలు అంతరించాలని, మనుషులంతా సమానులేనని నినదిస్తుందీ కవిత్వం.

5) స్త్రీలకు పురుషులతో సమానమైన గౌరవమేకాదు ఆస్తి హక్కు వంటి హక్కులు ఉండాలి.

6) దైవ భావనను విడనాడి మనిషి మనిషిని ప్రేమించే మనవతా భావం ప్రజల్లో వ్యాపించాలి.

**7.1.3. అభ్యుదయ కవిత్వం– ధోరణులు:**

ఆచార్య సి.నా.రె. అభ్యుదయ కవిత్వ ధోరణులను ఈ క్రింది విధంగా పేర్కొన్నారు.

**1. వర్గ సంఘర్షణ:**

అభ్యుదయ కవిత్వానికి వర్గ సంఘర్షణ ప్రథమ గణ్యమైన లక్షణం. దీనిలోనే గత నిరాసం, ప్రస్తుతపు బూర్జువా వ్యవస్థ తిరస్కారం ఇమిడి ఉన్నాయి. "ఏ దేశ చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం" అనిన శ్రీశ్రీ కవిత్వాన్ని అనుసరించి తరువాతి కవులు గతచరిత్రను పర్యాలోకనం చేశారు.

**"నర చరిత్ర కిక్కిరిసిన**
**ప్రళయ సమర సంఘర్షణ**
**జారిన వీరుల రక్తం**
**ఆరని వనితల దుఃఖం"** అనిసెట్టి

శ్రామికుల స్వేద బిందువులను రక్తంగా తాగి ఫ్యాక్టరీలు జీవిస్తున్నాయని పెట్టుబడిదారీ సమాజాన్ని నిరసిస్తూ

**"ప్రతినిత్యం ఫ్యాక్టరీ**
**కూలి యెముకలనెన్నో**
**సున్నంగా చిదుకగొట్టి**
**రక్తంతో రంగరించి**
**ధనస్వామి పాదమ్ముల**
**పారాణిని పూస్తున్నది"** – సోమసుందర్

గత నిరాసము, ప్రస్తుత వ్యవస్థా తిరస్కారంతో పాటు వర్గ సంఘర్షణ తప్పదని మార్క్సు చెప్పిన జోస్యానికి వీరు భాష్యం చెప్పారు.

**"అనాదిగా సాగుతుంది అనంత సంగ్రామం**
**అనాధుడికి ఆగర్భ శ్రీమంతుడికీ మధ్య"** – దాశరథి

అని వర్గ సంఘర్షణను చక్కగా చెప్పారు.

**"భూరి వృక్షం జారి పడ్డపుడే**
**లేత మొక్క పైకి లేస్తుంది**
**పసిడి మేడ ప్రక్కకొరిగినపుడే**
**అడుసు గుడిసె నడువ నేరుస్తుంది"** – నారాయణరెడ్డి

అని వ్యంగ్యంగానూ చెప్పారు.

**2. విప్లవ ప్రభోదం:**

శ్రామికులు, నిరుపేదలు పచ్చిగడ్డి వంటివారు. ఒక్కొక్క గడ్డిపరక ఒక కరవాలమై అభ్యుదయ నిరోధకులను హతమార్చునని అభ్యుదయ కవులు విశ్వసించారు. అందుకు సార్వజనీనమైన విప్లవం రావాలని కోరుకున్నారు.

**"గుండె గుండెకు చిచ్చు మండించి లేవండి**
**గుడిసె గుడిసెకు కోట నిర్మించి లేవండి"** – అనిసెట్టి

అంటూ పీడిత ప్రజలను విప్లవం కోసం ప్రబోధించారు. ఇంకా వీరు

**"యుగధర్మం చైతన్యం – జనహృదయం! పోరాటం**
**తిరుగుబాటు! తిరుగుబాటు! తిరుగుబాటు! బావుటా"**

అని సోమసుందర్ చైతన్య పరిచారు.

**"గాండ్రించిన బెబ్బులిగొంతై**
**తీండ్రించిన బలి పొలికేకై, విడదీసిన పిడికిలి బాకై**
**విదిలించిన సింహపు జూలై, అదిలించిన వీరగర్జయై**
**పగిలించిన ప్రళయంబాంబై, రగిలించిన అగ్నిగోళమై"** అని విజృంభించారు.

విప్లవశక్తులు విజృంభణను గమనించి అభ్యుదయ కవులు పరవశులై "ఎవరాపుదురీశక్తిని ఎవరడ్డుదురీ కత్తిని" అని గానం చేశారు.

**3. వీరగాధాకథనం:**

అభ్యుదయకవులు బూర్జువానెదిరించి, దానిని గడగడలాందించి, చివరకు తమ ప్రాణాలను తృణ ప్రాయంగా విసిరివేసిన విప్లవవీరులను గురించి గానంచేశారు. అల్లూరి సీతారామరాజు, ఠాకూర్ చంద్రసింగ్, భగత్ సింగ్ వంటి వీరుల గురించే కాక తెలంగాణాలో, ఆంధ్రాలో పాలకవర్గాన్ని ప్రతిఘటించి ప్రాణాలొడ్డిన వీరుల గురించి గీతాలు రాశారు. తెలంగాణా పోరంటంలో పాల్గొన్న మాధవరెడ్డి, కొమరయ్య, కామ్రేడ్ లక్ష్మీనరసయ్య, రఘుపతిరెడ్డి, మేరయ్యా, చిన్నారెడ్డి, ఎల్లయ్య, పాపయ్య, మల్లయ్య, సామ్యూలు, లింగయ్య, దస్తగిరి, వినాయకయ్య, కొమరయ్య, అమరయ్య, కాంతయ్య, అనంతయ్య వంటి చరిత్రకెక్కని నెరజోదుల గురించి పాడారు. మార్క్సిజానికి విశ్వ శ్రామిక దృష్టి ప్రధాన లక్ష్యం. కనుక కవులు 'గెరిల్లా' పోరాటానికి సంబంధించిన వర్ణనలు ఈ వీరగాధా కథనంలో భాగాలే. ఈ పోరాటంలో నాయకులే కాక యువకులతోపాటు స్త్రీలు కూడా పాల్గొని శత్రువులను ధిక్కరించి

**"తేతెండి వడిసెలలు రాలు రువ్వండి**
**పోపొండి మెరపపొడి కళ్లు కుప్పండి**
**కాల్చండి లారీలు గోరీలు పూడ్చండి**
**మృత్యువై మనము శవతాండవము నేడు"**

అని భద్రకాళికల వలె తీండ్రించిపోయినట్లు అభ్యుదయ కవులు చిత్రించారు.

గెరిల్లా వీరుల గురించి "అరచేతిలో మృత్యువు" అనే శీర్షికతో గంగినేని

**"జాగ్రత భుజంపై తుపాకీ అదే మన పంచ ప్రాణం**

**మొలలో తూటా బెల్టు ! అదే అదే మన సర్వస్వం"**

**"ఇక్కడ కాదు ముళ్ళు తీసేది నడువు కామ్రేడ్!**

**ఇప్పుడు కాదు కాళ్ళు కుంటడం దళంతో కలిసి పదవయ్యా"**

**"ఇంటి దగ్గర అంతా కులాసా రేపీపాటికి ఈ ప్రాంతం మనది**

**తెలీదా, నిన్న ఆరు పరగణాలు మనవాళ్ళు విముక్తి చేశారు".**

అంటూ ఉద్యమంలోని బాధలు, గెరిల్లాల కష్టాలను చిత్రించారు. గెరిల్లా యుద్ధంలో పాల్గొంటున్న వీరుడు తన ప్రేయసికి

**"విప్లవం జయిస్తుంది, నేను త్వరలో యింటికి వచ్చేస్తాను**

**నాకు స్వాగతం చెప్పడానికి పధ్నాలుగు ప్రపంచాల్ని పిలిపించు"**

అంటూ కర్తవ్యం పట్ల గల అచంచల దీక్షను తెలిపేవిధంగా రాశాడు. ఇంకా ఆ వీరుడు

**"ఉత్తరం ముగించి పగవాడి గుండెకు మరతుపాకి గురిపెడుతున్నా**

**భయపడకు నా పేరు మృత్యుంజయుడు, నా కోసం ఎదురుచూడు"**

అనటం అతడి అకుంఠితమైన ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తీకరిస్తుంది. ఒక వీరమాత తన కుమారుడితో

**"తక్షణం ప్రళయ రుద్రుడవై అంతకు వేయంతల క్రోధంతో**

**విజృంభించి, వారి గుండె రక్తం పిండిరా!**

**ఆమె ఆత్మకు శాంతి ప్రసాదించు"** అని చెప్పింది.

**4. యుద్ధ విముఖత: శాంతి ప్రియత:**

అభ్యుదయ కవులు గెరిల్లా పోరాటాన్ని చిత్రించినంత మాత్రాన వారు యుద్ధ ప్రియులని భావించటానికి వీలులేదు, సామ్రాజ్యవాదులకు, ప్రజాపీడకులకు విరుద్ధంగా జరిగెడి పోరాటాలను, తిరుగుబాటులను వీరు సమధికోత్సాహంతో చిత్రించారు. దాశరథి, గంగినేని వంటి కవులు ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొని ఎదిరించారు. ప్రపంచయుద్ధాలను అభ్యుదయ కవులు నిరసించారు. సామ్రాజ్యవాద తృష్ణతో, అధికార విస్తృతి కాంక్షతో, వర్ణ జాత్యహంకారంతో, ఐశ్వర్యదాహంతో జరిగే ప్రపంచ యుద్ధాలకు విముఖులు వీరు. అందుకే

**"అమృతం పండించే అణు బీజాల నుండి**

**విషపూరిత మృత్యు సస్యాలను మొలిపిస్తున్న**

**శాస్త్రజ్ఞులారా!**

**పరమాణువుల రగిల్చి**

**చరిత్రను పొగచూరనీయకండి"** అని శాస్త్రజ్ఞులను ప్రతిఘటించారు.

"హిరోషిమా" తో రెండవ ప్రపంచయుద్ధంలో జరిగిన దుర్భర విలయకాండను తలచుకొని అశ్రుతర్పణం చేశారు.

**"గుండెలు పగిలిన నగరాల ఆర్త ఘోష**
**ఇంకా వింటూనే ఉన్నాం**
**పచ్చని భూమి తల్లి వక్షస్థలి పుచ్చిపోతుండగా**
**ఇక మీదట చూడలేం"**

అని దైన్యాన్ని, దారుణ వేదనను ప్రకటించారు. చివరకు వజ్ర నిశ్చయులై

**"చితిమంటల యుద్ధానికి**
**ప్రతికవి ఒక ఫైర్ బ్రిగేడ్**
**అణ్వస్త్రపు గ్రీష్మానికి**
**ప్రతి పద్యం మబ్బు ముక్క"** అని ప్రతిజ్ఞ చేశారు.

యుద్ధ విముఖతను ప్రకటించటమే కాక శాంతిని ఎన్నో రీతులుగా ఆరాధించారు, ఆశ్వాసించారు. ప్రశ్నించారు.

**"ఎంత చల్లని కన్నులమ్మా**
**ఎంత ఎఱ్ఱని పెదవులమ్మా**
**వంతలను మరపించు నీదర**
**హాస చంద్రికలేవి శాంతీ"**
**"కాస్త పశ్చిమాద్రి కడకేగి నా బంధు**
**జాలమునకు గూడ శాంతి నేర్పి**
**ఇలను కాచుమోయి ఈ అణు ప్రోద్గత**
**ప్రళయవహ్ని నుండి పక్షిరాజ్ఞి"**

అని కొన్ని పశ్చిమ దేశాలలో పెల్లుబుకుచున్న సమరకాంక్షకు విరుగుడు మందు చూపారు.

**5. సమ సమాజ నిర్మాణము:**

సమాజంలో ఉన్న ఆకలి, దరిద్రం, వ్యాధులు, అసమానత మొదలైనవి తొలగిపోయి, సమాజం వర్గరహిత స్వర్గంగా వెలుగొందాలని అభ్యుదయ కవుల లక్ష్యం. ఈ అభ్యుదయ కవులు క్షామం చూసి ఆకలి పాటలను రాశారు.

**"ఆకలివేస్తోందమ్మా అన్నం పెట్టమ్మా**
**స్వర్ణారుణ సస్యశ్యామలమగు**
**ఈ జగతిని దరిద్రమున ఆకలితో చావలేను"**

అని ప్రజావళి ఆక్రందనలను అక్షరీకరించారు.

**"వృద్ధ జగతి సమాధిపై సమధర్మం ప్రభవించును**
**నిద్దుర చీకటి వెలుపల వేకువ మెలుకువ పుట్టును"**

అని భాష్యం చెప్పారు. సమాజంలో కలిగిన పీడిత వర్గ చైతన్యం నుగ్గడించి పాలక పాలిత భేదంలేని వర్గరహిత స్వర్గం కలుగుతుందని

**"వ్యక్తులు పరిపాలించే శక్తి నశించింది నేడు**

**రక్తంలో అణువణువూ శక్తి గడించింది నేడు"** అంటూ ప్రబోధించారు.

**6. తెలంగాణా విముక్తి:**

భారతదేశానికి స్వరాజ్యం లభించిన హైదరాబాదు మాత్రం నైజాం రాజుల ఇనుప పిడికిలిలో బందీయై ఉంది. హైద్రాబాదు లోని తెలుగు ప్రజల తీయని మాగాణమగు తెలంగాణ విముక్తి కొరకు అభ్యుదయ కవులు గేయాలు, కావ్యాలు రచించారు. తెలంగాణా విముక్తిని తల్చుకున్నప్పుడు కనుల ముందు 'నా తెలంగాణ కోటిరత్నాల వీణ' యని ఎలుగెత్తి వినిపించిన దాశరథి నిలుస్తారు. దాశరథితో పాటు కాళోజీ, సోమసుందర్, రెంటాల, గంగినేని, కుందుర్తి, రమణారెడ్డి వంటి వారు గొంతుకలిపారు.

**"చరిత్ర బొంగరం తిరిగి కిరీటాలు నేలకొరిగి**

**ధరాధిపులు నశిస్తుంటే బరాయెనాం నవ్వాబా**

**పరాక్రమం చూపేవా"**

అని ప్రస్తుత సమాజంలో భూస్వామ్య వ్యవస్థ పతనమైన విషయాన్ని అభ్యుదయ కవులు ఉద్భోధించాడు.

**"చుట్టూ సముద్రం పొంగి**

**నట్టనడి గడ్డను మ్రింగి**

**అంతా ఏకం చేస్తుం**

**దంతా ఒకటౌతుంది"**

అంటూ హైద్రాబాదు నాలుగు వైపుల ఉవ్వెత్తుగా నెగయుచున్న ప్రజా విప్లవాన్ని పీడితజన చైతన్యాన్ని వ్యంగ్యంగా వ్యక్తం చేశారు.

**7. ఆంధ్ర రాష్ట్రోద్యమం:**

రాయప్రోలుతో ప్రారంభమైన ఆంధ్ర రాష్ట్రోద్యమం అభ్యుదయ కవులను గూడ ఉద్రిక్తులను చేసింది. సోమసుందర్, రెంటాల, దాశరథి మొదలైనవారు రాష్ట్ర గీతాలాలపించారు. 1953వ సంవత్సరంలో ఆంధ్ర రాష్ట్రమవతరించుటతో అభ్యుదయ కవులు అనేక గేయాలు రచించారు.

**"విజయీభవ, విజయీభవ, విశాలాంధ్ర జననీ**

**ప్రజలంతా సుఖాలతో బ్రతుకంతా మననీ"**

అని మంగళాశాసనం గావించారీ కవులు.

**"పదవోయి తెలుగువాడా**

**అదెనీ తెలుగుమేడా**

సంకెళ్ళు లేని నేల

సంతోష చంద్రశాల"

అని అభ్యుదయ కవులు సముజ్జ్వల భవిష్యత్తును గానంచేశారు.

## 7.2. అభ్యుదయ కవిత్వం – అంతర్జాతీయ పరిణామాలు:

1917వ సంవత్సరం నాటి రష్యన్ అక్టోబర్ సోషలిస్టు విప్లవం నెలకొల్పిన శ్రామిక వర్గ సమసమాజ నిర్మాణం ప్రపంచ వ్యాప్తంగా కవులనూ, కళాకారులనూ ప్రభావితం చేసింది. ఒక కొత్త సామాజిక నమూనాను రచయితలకు ఆదర్శంగా నిలిపింది. 1919వ సంవత్సరంలో ముగిసిన మొదటి ప్రపంచ యుద్ధ ఫలితాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాలను, సాంస్కృతిక సంక్షోభాల ప్రమాదాలనూ మానవాళికి సూచించాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన 1930 దశకం ఆకలి దశాబ్దంగా గుర్తింపు పొందింది. 1930 – 35 మధ్యకాలంలో ధనికవాద రాజ్యాలు వాటి వలసరాజ్యాలైన ఈజిప్టు, ఇరాన్, క్యూబా, లిబియా, మొరాకో మొదలైనవి ఆర్థిక సంక్షోభంకు తీవ్రంగా గురయ్యాయి. 1905వ సంవత్సరంలో రష్యాలో మొదటిసారిగా పెట్టుబడిదారీ విధానం మీద కార్మికవర్గం తిరుగుబాటు చేసింది. 1917వ సంవత్సరంలో కార్మికులు, పెట్టుబడి శక్తులను పడగొట్టి సోషలిస్టు వ్యవస్థకు పునాదులు వేశారు. రాజకీయ రంగంలో ఆవహించిన ఈ తీవ్ర పరిణామం వలన కవిత్వంలో మార్పు వచ్చింది. ప్రథమ ప్రపంచ యుద్ధానంతరం విలువలు తారుమారై యూరప్ దేశాలలో నూతన ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. ఫ్రాన్సులో క్యూబిజం, ఇటలీలో ఫ్యూచరిజం, జర్మనీలో ఎక్స్‌ప్రెషనిజం, అమెరికాలో ఇమేజిజం బయలుదేరాయి. అప్పటి పరిస్థితులకు తిరుగుబాటుగా ఫ్రాన్సులో 'డాడాయిజం' అనే క్రొత్త పోకడ కళారంగంలో ప్రారంభమైంది. ఇది తర్వాత కవిత్వానికి కూడా విస్తరించింది. మంచిని అపహసించి, విచ్చలవిడిగా ప్రవర్తించిన డాడాయిజం నుండి సుతీక్ష తేజస్సుతో బయలుదేరిన మహోద్యమమే సర్రియలిజం. దీనికి పునాది ఫ్రాయిడ్ మనస్తత్వ శాస్త్రం. 1929వ సంవత్సరంలో ఈ ఉద్యమం ఇంగ్లాండ్‌లో బలపడింది. 1930వ సంవత్సరం తర్వాత ఆంగ్ల సాహిత్యంలో ఈ ధోరణులకు వ్యతిరేకంగా ఆడెన్, స్టీఫెన్ స్పెండరు, డేటాయిస్ వంటి కవులు క్రొత్తబాటలు ఏర్పరచారు. రాజకీయంగా వామపక్షీయులైన వీరు సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగి వర్గరహిత సమాజం నెలకొనటానికి కమ్యూనిజమే మహత్తర సాధనమని నమ్మారు. కవిత్వంలో అభ్యుదయ భావనకు చోటిచ్చారు. ఫ్రాయిడ్ మనో విజ్ఞానశాస్త్రం మార్క్సు ప్రవచనాలు అభ్యుదయ కవితా రీతులకు దోహదం చేశాయి.

అభ్యుదయ కవిత్వం మీద పాశ్చాత్య ప్రపంచంలో ప్రభవించిన మార్క్సిస్టు సిద్ధాంతం ప్రగాఢమైన ముద్రవేసిన సమయంలోనే జాతీయోద్యమ ప్రభావంతో ఉత్తేజితులైన కవులు కూడా అభ్యుదయ ధోరణిలో ప్రబోధ గీతాలు రచించారు. ఇట్లు జాతీయ అంతర్జాతీయ భావవాహినుల సంగమం ఏర్పడింది. మార్క్సిస్టు భావాల ప్రభావం ప్రత్యక్షంగా సోకని కవులు, రచయితలు కూడా ప్రజల బాధామయ గాథలను రసవత్తరంగా చిత్రించారు. క్రీ.శ. 20వ శతాబ్ది ప్రారంభం నుండి రెండవ ప్రపంచ యుద్ధకాలం వరకు తెలుగు సాహిత్యం అన్ని సాహితీ ప్రక్రియలలో ఎంతో సుసంపన్నమైంది. ఈ దశలోనే ఉన్నవ లక్ష్మీ నారాయణగారి మాలపల్లి అను నవల ప్రాదుర్భవించి గ్రామీణ సమాజంలో రగులుతున్న వైరుధ్యాలను, దళిత వర్గాలలో తిరుగుబాటు చైతన్యాన్ని చిత్రించింది. అందులో రష్యాలో జరిగిన బోల్షివిక్ విప్లవం కూడా కనిపిస్తుంది.

## 7.3. అభ్యుదయ కవిత్వం – మార్క్సిజం ప్రభావం:

బూర్జుల చరిత్రకారులు దేశచరిత్రలను వివిధ దేశాలకు మధ్య జరిగిన యుద్ధాలు పరంపరలుగా చిత్రించారు.

రాజుల దండయాత్రలు, రాజకీయవేత్తల చాకచక్యాల సేనానుల అసిధారా ధాళధళ్యాలు చరిత్రలలో ప్రధానంగా వర్ణింపబడ్డాయి. ఒక దేశంపై మరొక దేశపురాజు దండెత్తిపోటానికి ఆ రాజు రాజ్య విస్తరణ కాంక్షయో లేక అవినీతి దృక్పథమో కారణమని చరిత్రలలో రాయబడింది. జాతి గౌరవాన్ని, దేశ ప్రతిష్ఠను నిలుపుకోవటం కోసం కొందరు రాజులు శత్రురాజులలో యుద్ధాలు చేసినట్లుగా చరిత్రలో చిత్రించబడింది. దీనిని మార్క్సిజం సమర్ధించదు.

In the first place; it considers that the real science of history must deal with the peoples, and only with individuals in so far as they represent something much wider than themselves some movement of the people.

ఈ దృక్పథాన్ని అభ్యుదయ కవులు

**"ఏ యుద్ధం ఎందుకు జరిగెనొ**
**ఏ రాజ్యం ఎన్నాళ్ళుందొ**
**తారీఖులు దస్తావేజులు**
**ఇవి కాదోయ్ చరిత్రకర్థం"** – శ్రీశ్రీ

బ్రిటనులో జమిందారీ వ్యవస్థపై ఉద్యమం లేవదీసి ఆ వర్గాన్ని కూలద్రోసిన విప్లవకారుడు క్రాంవెల్. ఈ తిరుగుబాటును చరిత్రకారులు రోమన్ కాథలిక్ మతానికి చెందిన మొదటి చార్లెస్ రాజుకి వ్యతిరేకంగా క్రాంవెల్ జరిపిన పోరాటంగా చిత్రించారు. మార్క్సిజం దీనిని భిన్న దృక్పథంతో పరిశీలిస్తుంది. క్రాంవెల్ కాలంలో అధికారములో ఉన్నది జమిందారీ వర్గం. దానికి నిరసనగా పెట్టుబడిదారీ వర్గం, చిన్న వర్తకులు, రైతులు మొదలైన వారి సహాయంతో చేసిన తిరుగుబాటే క్రాంవెల్ జరిపిన పోరాటం, చార్లెసురాజు వ్యక్తిగత విషయాలలో ఈ తిరుగుబాటుకు ప్రసక్తి లేదు. మార్క్సిజం వ్యక్తుల ఇష్టాయిష్టాలపై ఆధారపడకుండా, వాని వెనుకగల శక్తులను పరిశీలించింది కనుక క్రాంవెల్ చేసిన తిరుగుబాటుని జమిందారీ వ్యవస్థపై పెట్టుబడిదారీవర్గం చేసిన పోరాటమని వ్యాఖ్యానించింది. ఈ అంశాన్నే అభ్యుదయ కవిత్వం

**"ఇతిహాసపు చీకటికోణం**
**అట్టడుగునపడి కాన్పించని**
**కథలన్నీ కావాలిప్పుడు**
**దాచేస్తే దాగని సత్యం"** – శ్రీశ్రీ

అని హెచ్చరించింది. ఇలాంటి చారిత్రక దృక్పథం ఉన్న కారణంగానే చెంగిజ్‌ఖాన్, తామర్లేన్, నాదీర్షా, ఘజ్నీ, ఘోరీ, చివరకు సికందరు వంటి ప్రపంచ విజేతను కూడా నరహంతకులని ఘోషించారు. రణరంగం కానిచోటు ప్రపంచంలో ఎక్కడా దొరకదని, గత చరిత్రంతా రక్తంతోనో లేక కన్నీళ్ళతో తడిసిందని నగ్న సత్యాన్ని తెలిపింది అభ్యుదయ కవిత్వం.

కమ్యూనిస్టు మ్యానిఫెస్టోలో మొదటి వాక్యమే వర్గ సంఘర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తుంది.

"The history of all hitherto existing society is the history of class struggles.

Free man and slave, patrician and plebeian, cord and serf, guild maker and Journeyman, in a

word, oppressor and oppressed stood in constant opposition to another, carried on an uninterrupted, now hidden, now open fight, a fight that each times ended either in a revolutionary reconstitution of society at large, or in the common ruin of the contending classes".

మానవజాతి చరిత్ర సమస్తం వర్గ సంఘర్షణ ఫలితమేనన్న మార్క్సు సిద్ధాంతాన్ని ఔపోసన పట్టి ఆ సారాన్ని

**"పరస్పరం సంఘర్షించిన**
**శక్తులలో చరిత్ర పుట్టెను"**

అని ఒక్కమాటలో అందించింది అభ్యుదయ కవిత్వం.

ఈ పంక్తులలో చెప్పబడిన "పరస్పరం సంఘర్షించిన శక్తులు" మార్క్సు వివరించినవే. ఉత్పత్తి విధానం సమాజంలో వర్గాలను కల్పించింది. చరిత్రలో ప్రతి యుగంలో కష్టించే వాడొకడు, ఫలితాన్ని అనుభవించేవాడొకడు. బానిసయుగంలో బానిస, యజమాని, జమీందారీ యుగంలో రైతు, జమీందారు, పెట్టుబడిదారీ యుగంలో కార్మికుడు, పెట్టుబడిదారుడు. ఈ వర్గాలన్నీ పరస్పర విభిన్న గుణాలు కలిగినవి. కాబట్టి ఘర్షణ తప్పదని మార్క్సు ప్రవచనం. పాలక వర్గమెప్పుడూ పాలితులను పీడిస్తూనే ఉంటుంది.

**"నరజాతి చరిత్ర సమస్తం**
**దరిద్రులను కాల్చుకతినడం"**
**"బలవంతులు దుర్బల జాతిని**
**బానిసలను కావించారు**
**నరహంతలు ధరాధిపతులై**
**చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి"**

పెట్టుబడి దారీ వ్యవస్థలోని దోపిడీ విధానాన్ని నిర్మూలించటానికి విశ్వ శ్రామికులందరు ఏకంకావాలని మార్క్సు ప్రబోధించాడు. ఈ ప్రభావంతోనే శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వాన్ని

**"చీనాలో రిక్షావాలా**
**చెక్ దేశపు గని పనిమనిషి**
**ఐర్లాండ్‌న ఓడకళాసీ**
**అణగారిన ఆర్తులందరూ**
**హాటెన్‌టాట్, జూలూ, నీగ్రో**
**ఖండాంతర నానా జాతులు**
**చారిత్రక యధార్థతత్వం**
**చాటిస్తారొక గొంతుకతో"** అంటూ రచించారు.

మార్క్సు, లెనిన్‌లు ప్రవచించిన శ్రమ శక్తి విలువను అభ్యుదయ కవులు అర్థం చేసుకొన్నారు, తమ కవిత్వంలో స్థానం కల్పించారు.

The exploited class need political rule in order completely to abolish all exploitation, i.e. in the interests of the vast majority of the people, and against the insignificant minority consisting of the modern slave owners the land lords and capitalists"

**"ఘర్మజలానికి, ధర్మజలానికి**

**ఖరీదు కట్టే షరాబు లేడోయ్"**

మార్క్సిస్టు దృక్పథంలో సాహిత్య పరమావధి శ్రామిక వర్గ చైతన్యాన్ని చిత్రించటమే. కళలు, కవిత్వం, తత్త్వం శ్రామికుల సుఖదుఃఖాలను వారి ఆశయాలను చిత్రించుటకే అంకితం కావాలని మార్క్సిస్టుల దృక్పథం. అభ్యుదయ కవిత్వం ఆ భావాల ప్రభావంతోనే

**"నాలో కదలే నవ్య కవిత్వం**

**కార్మిక లోకపు కల్యాణానికి**

**శ్రామిక లోకపు సౌభాగ్యానికి"** – శ్రీశ్రీ

ఈ విధంగా అభ్యుదయ కవిత్వం మార్క్సిస్టు దృక్పథంతో సాగింది.

**ఆధార గ్రంథాలు:**

1) ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు – ఆచార్య సి. నారాయణరెడ్డి.

2) తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు – ఆచార్య వెలమల సిమ్మన్న

3) తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) – ఆచార్య జి. నాగయ్య.

**– డా. జి. గౌరి**

పాఠం - 8

# శ్రీశ్రీ - మహాప్రస్థానం

# ప్రసిద్ధ అభ్యుదయ కవులు

**విషయ క్రమం:**

**8.1. శ్రీశ్రీ**

**8.2. శ్రీశ్రీ – మహాప్రస్థానం**

**8.3. ప్రసిద్ధ అభ్యుదయ కవులు – కృతులు**

## 8.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

శ్రీరంగం శ్రీనివాసరావుగారి కవితా ప్రస్థానం గురించి మిగిలిన అభ్యుదయ కవులను గురించిన అవగాహన విద్యార్థులకు కలిగించటం.

## 8.1. శ్రీశ్రీ:

1940 తర్వాత ఒక దశాబ్దం పాటు ఆంధ్ర సాహిత్యలోకాన్ని ఉత్తేజ పరచిన అభ్యుదయ కవిత్వోద్యమ మూలవిరాట్టు శ్రీరంగం శ్రీనివాసరావుగారు. భావకవిత్వానికి వ్యతిరేకంగా శ్రామికవర్గ చైతన్య మూపిరిగాగల ఒక సరిక్రొత్త కవితారీతికి పాదులువేసిన స్రష్ట శ్రీశ్రీ. వాస్తవికతతోపాటు అధివాస్తవికతను, వ్యక్తి చైతన్యంతోపాటు సంఘచైతన్యాన్ని సమానాధికారంతో ప్రవచించిన ప్రవక్త శ్రీశ్రీ. శ్రీశ్రీ రచనా జీవితాన్ని ప్రథమదశ, పరివర్తన దశ, పరిణతి దశ అనే మూడు భాగాలుగా సినారె విభజించారు.

### 8.1.1. ప్రథమ దశ:

గురజాడ 'ముత్యాలసరాలు' రచించిన సంవత్సరం అంటే 1910వ సంవత్సరంలో శ్రీశ్రీ జన్మించారు. ఆ సంవత్సరమే బరంపురంలో వర్ణాంతరభోజనం ఏర్పాటైంది. తరువాతి కాలంలో గురజాడకు సరైన వారసుడైన శ్రీ శ్రీ ముత్యాల సరాలు రచింపబడిన సంవత్సరమే జన్మించటం విధి చమత్కారం. అక్షరాభ్యాసమైన ఏడున్నర్ధానికే శ్రీశ్రీ కందపద్యం చెప్పారంట. ఆ పద్యంలో యతిప్రాసలు, గణాలు హుళిక్కియట. తర్వాత తండ్రి ఆదేశంతో సులక్షణసారం, అప్పకవీయం, ప్రబంధాలు పఠించాడు. మనుచరిత్రను, శ్రీనాథ రామకృష్ణుల కావ్యాలను లోతుగా పఠించి, వాని ఒరవడిలో పద్యాలు రచించారు. తర్వాత వెంకట పార్వతీశ్వరుల ప్రభావంతో 'అపరాధ పరిశోధక నవలలు' రాశారు.

10 సంవత్సరాలు నిండకముందే శ్రీశ్రీ రచనా వ్యాసంగంలోకి దిగటం గమనించదగిన విషయం. 1920వ సంవత్సరంలో ఆంధ్రదేశంలో సాహితీ సమితి అవతరణతో శ్రీశ్రీ విశాఖపట్టణంలో నారాయణబాబు, కాళూరి నరసింగరావులతో కలిసి కవితా వ్యాసంగం ప్రారంభించారు. క్లిష్ట ప్రాసలతో సాముగరిడీలు చేశారు. 1926వ సంవత్సరంలో పురిపండా, వడ్డాది సీతారామాంజనేయులు, శ్రీశ్రీ కలిసి కవితాసమితి స్థాపించారు.

1928వ సంవత్సరంలోని శ్రీశ్రీ రచించిన భావగీతాలు, పద్యాలు కలిపి "ప్రభవ" పేరుతో కవితా సమితి తొలి ప్రచురణగా వెలువడ్డాయి. ఈ ప్రభవను గమనిస్తే శ్రీశ్రీ భావకవిత్వ ధోరణి స్పష్టంగా అర్థమవుతుంది. భావనలో, పద

ప్రయోగంలో, పద్య రచనలో, వస్తు స్వీకరణలో శ్రీశ్రీ నాటి ప్రసిద్ధ భావకవులను అనుసరించారు. కొన్ని ఉదాహరణలు చూస్తే ఇది అర్థమవుతుంది.

**"గాలి యొసగెడు కొత్త తెక్కలు ధరించి**
**అతి నిరాఘంటముగ విహాయస పథాల**
**నెఱుక పడరాని యెచటికో ఎగసిపోదు"**
**"ఎఱుగవే నన్ను లోక భీకర మహోగ్ర**
**ఫణి విషస్ఫీత మృత్యురూపిణిగ నీవు"**
**"వివిధ సూనవితానశోభిత కుజ ప్ర**
**శస్త సుప్రమదావనస్థలము సాంద్ర**
**చంద్రికా సముజ్జ్వలదివ్యశర్వరీ ప్ర**
**శాంత వేళ సమంచిత సౌఖ్యమొసగె"**

భావకవుల ప్రభావం అంతగా ఉన్నప్పటికీ శ్రీశ్రీ ప్రతిభ కూడా వీటిలో కనిపిస్తుంది. శ్రీశ్రీ శబ్దాలపై పట్టు సాధించారు. అలాగే ఊహా కల్పన కూడా ప్రత్యేకంగానే ఉంటుంది.

**"ఈ నిశీధిని ప్రబల ఝంఝూనిల ప్ర**
**సార విదళిత వృక్ష సంచయ కలితము**
**కులిశ ఘాత ప్రతారణ కుశలకుధర**
**పంక్తి సన్నిభ ఘనపయో వాహయుతము"**

భావకవులు సమాసాలకు కొంచెం భిన్నమైన శైలి ఈ పద్యాలలో కనిపిస్తుంది. "ప్రళయ నర్తనము" అనే శీర్షికతో తాండవ శివుడిని గురించి రాసిన పద్యాలలో తిక్కనాదుల సంప్రదాయం ఒక ప్రక్క స్ఫురింపచేస్తున్నా ఇంకోవైపు నడకలో, భావనలో శ్రీశ్రీ రాయబోతున్న "జగన్నాథ రథచక్రాలు' లోని ప్రళయచిత్రణ పటిమకు బీజప్రాయత గోచరిస్తుంది.

**"కాలాంత ప్రభవార్క కోటిఘృణి సంకాశ ప్రతాపస్ఫుర**
**త్ఫాలాక్షజ్వలదగ్ని దగ్ధ సకల బ్రహ్మాండ భాండుండవై**
**జ్వాలా దీప్త మహా ప్రభావగరిమన్"**

**8.1.2. పరివర్తన దశ:**

1928వ సంవత్సరంలో శ్రీశ్రీకి కొంపెల్ల జనార్దనరావు సహవాసం ఏర్పడింది. జనార్ధనరావు సాహచర్య ఫలితంగా అంతకముందు తాను రాసిన 'ప్రభవ' లోని పద్యాలన్నీ రెండవ శ్రేణికి చెందిన ప్రతిధ్వనులని శ్రీశ్రీ నిర్ణయించుకొని అప్పటి నుండి క్రొత్తదనం కోసం తపించారు. దాని ఫలితంగా 1929వ సంవత్సరంలో "సుప్తాస్థికలు" అనే కవితా ఖండిక వెలువడింది. మానవాస్థికలను వస్తువుగా స్వీకరించుటలో శ్రీశ్రీ ప్రత్యేకత కనిపిస్తుంది.

**"అవి ధరాగర్భమున మనవాస్థికాప**

**రంపరలు, సుప్త నిశ్శబ్ద సంపుటములు**

**అటనొకే దీర్ఘయామిని, ఆనిశాశ్మ**

**శానశయ్యకు ప్రాతః ప్రసక్తిలేదు.**

**ఆ అగమ్యతమో రహస్యాంగణాన**

**తాండవించును మృత్యుశైతల్య మొకటె"**

"ఖండశశి" అనే శీర్షికతో రాసిన మరొక రచన కూడా శ్రీశ్రీ పరివర్తన దశలో మైలురాయి వంటిది.

**"ఖండేందుమూర్తి ! ఆకాశ కర్పరమెల్ల**

**నిండు నీ గ్రుడ్డి వెన్నెల ధూమ ధూపమై"**

శ్రీశ్రీ పరివర్తన దశలో చివరి మైలురాయి వంటిది 1933వ సంవత్సరంలో ప్రచురింపబడిన "విద్యున్మాలికలు".

**"వేటకాని కోలలకు కూలి**

**వేదనల తూలు హరిణాల కండ్లు**

**జాలికి పురుటిండ్లు –**

**దిక్కు దిక్కుల కంపిన దీనంపు చూడ్కులే**

**ఆనాటి**

**ప్రళయతాండవ భయంకర సౌదామినులు"**

ఇది శ్రీశ్రీ రచించిన మొదటి వచన గేయం. అంతవరకు పఠాభి, శిష్ట్లా, నారాయణబాబు వచనగేయాలు రాయలేదు కాబట్టి ఆ నలుగురిలో శ్రీశ్రీయే మొట్టమొదటి వచనగేయాన్ని రాశారని తెలుస్తుంది.

**8.1.3. పరిణతి దశ:** 1930వ సంవత్సరంలో శ్రీశ్రీ టైఫాయిడ్‌తో మంచం పట్టాడు. మానసికంగా, శారీరకంగా అతడిలో 'ఆకలి యుగం' రెక్కలు విప్పింది. భావకవిత్వ ధోరణి ఇంకిపోయి ఒకప్రక్క స్వరాజ్య పోరాటం మరొక ప్రక్క పీడిత ప్రజలు కనిపించారు. అతడిలోని ప్రచండ మధనానికి ఫలితంగా 1933వ సంవత్సరంలో "జయభేరి" వెలువడింది. ఛందస్సులను, భావకవిత్వాన్ని వదిలి క్రొత్త ఛందస్సులో క్రొత్త వస్తువుతో వెలువడిందీ "జయభేరి".

**"నేను సైతం ప్రపంచాగ్నికి**

**సమిధ నొక్కటి ఆహుతిచ్చాను .....**

**..... నేను సైతం భువన భవనపు**

**బావుటానై పైకిలేస్తాను"** అని ఆలపించారు శ్రీశ్రీ.

'జయభేరి' రచన తర్వాత సమాజ జీవితంలోనే సౌందర్యముందని, అతీంద్రియ సౌందర్యం కోసం అర్రులు చాచటం కంటే చుట్టుప్రక్కల ఉన్న సజీవ ప్రకృతిలోనే సుందర కవితా వస్తువులు నిక్షిప్తమై ఉన్నాయని గ్రహించారు. ఈ నూతన దృక్పథంతో పాశ్చాత్య కవులైన స్వింబర్న్, ఏడ్గార్ ఎలెన్‌పో, బ్రౌనింగు, బాడ్లేర్ మొదలైనవారి రచనలను చదవటం ప్రారంభించారు. తన

కావ్య జీవితాన్ని ప్రోదిచేసి, నా ఆదర్శాలను మలచిన ప్రముఖులు అని శ్రీశ్రీ స్వయంగా చెప్పుకున్నారు. విదేశ కవితా రీతులతోపాటు తెలుగులోని శ్రామిక జనుల పాటలను పరిశీలించారు. గురజాడ ముత్యాల సరాలను పరిశోధించి వాని నిగ్గులను కళ్ళకద్దుకున్నారు. 1934వ సంవత్సరంలో 'మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది' అనే చారిత్రాత్మక గేయాన్ని సృజించారు. ఈ గేయమే అభ్యుదయ కవిత్వానికి నాంది గీతంగా మారింది. 'మహా ప్రస్థానం' అనే గేయసంపుటి మకుటాయమానంగా నిలిచిపోయింది.

## 8.2. మహాప్రస్థానం:

'మరో ప్రపంచం' అని ప్రారంభమై 'హోమ జ్వాలల భుగభుగల' తో సమాప్తమైన మహాప్రస్థాన గేయం ఐదు నిముషాల వ్యవధిలో రచింపబడిందని శ్రీశ్రీ స్వయంగా చెప్పుకున్నారు. ఈ గేయం ముగించి మొదట రాసిన 'కదం తొక్కుతూ, పదం పాడుతూ, కాండ్రు కాండ్రుమని గర్జిస్తూ' అన్న పాదాలలో రెండవది తృప్తి కలిగించక పోతే దానిని 'హృదంతరాళం గర్జిస్తూ' అని సవరించి, కొన్ని నెలల తర్వాత దీనిని 'మహా ప్రస్థానం' అనే శీర్షికతో 'జ్వాల' పత్రికలో ప్రచురించారు. ఈ పాటలోని ఆవేశానికి ఈ క్రిందిని ప్రధానంగా ప్రోద్బలం కలిగించాయని శ్రీశ్రీ చెప్పుకున్నారు.

1) ఫ్రెంచి వారి జాతీయగీతం

2) హరీంద్రనాథ్ చటోపాధ్యాయ 'ఘరూహువాహైజంగ్' అనే పాట

3) నజ్రుల్ ఇస్లాం విప్లవగీతాలు

4) ఎడ్గార్ ఎలన్‌పో గేయాలు

5) గురజాడ, కవికొండల గేయాలు

6) 1934 ఫిబ్రవరి 18వ తేదీన 'పో' గంటల ననుకరిస్తూ శ్రీశ్రీ ఒక గేయం రాశారంట.

అందులో

**"హరోం హరోంహర హరహరహరహర**

**హరోంహరా అని పలికే గంటలు"**

అనే పంక్తులు మిగిలిన చరణాలతో తూగకపోవటంతో వాటిని ఉపసంహరించుకొన్నారంట. 2 నెలల తర్వాత ఆ పంక్తులే మరో ప్రపంచ గీతాన్ని పలికించవచ్చు.

7) బరంపురం నవ్య సాహిత్య పరిషత్తులో శివశంకర శాస్త్రి గారు వినిపించిన

**"మారో మారో, మారో మారో**

**ఒకటి రెండు మూడు నాలుగు"**

అన్న శిష్ట్లా గేయం ఒక ప్రోద్బలం కావచ్చు. ఇన్ని ప్రభావాలతో ఈ గేయం వెలువడినప్పటికే ఇది దేనికీ అనుకరణగాని, అనుసరణకానీ గాక స్వతంత్ర గీతంగా నిలిచిపోవటమే దీని గొప్పదనం. శ్రీశ్రీ పేర్కొనిన ఈ ప్రభావాలు ప్రేరక శక్తులు మాత్రమే.

నజురులిస్లాం రాసిన 'విప్లవగీతి' లోని

**"స్వాగతనినాదము లివ్వండి**
**నవయుగ పతాకం రెపరెప మంటున్నది**
**అడ్డులేని తుఫాను విరుచుకపడుతున్నది"**
**"ఓ పురోగామి సైనికా ! నడు !**
**వడివడిగా నడు !**
**..................................**
**నవయుగ స్రష్టలారా! నడవండి ముందుకు**
**విజయం చేపట్టిన వీరులం మనం**
**తీరాలు, పారావారాలూ, దరులూ, గిరులూ**
**అన్నిటిని ఆక్రమిద్దాం మనం"**
(సర్వర్‌ఫిగార్ ఉర్దూ అనువాదానికి సినారే తెలుగుసేత)

వంటి పంక్తులు, 'బిద్రోహి' పూర్తి గేయం శ్రీశ్రీ గేయానికి మూలకందం. ఈ ప్రభావాలను జీర్ణించుకొని తెలుగుతనం కొరవడకుండా మాటలను ఈటెలుగా, బాకులుగా, మంటలుగా మార్చి శ్రీశ్రీ రచించారు. చలం మహాప్రస్థానానికి రాసిన 'యోగ్యతాపత్రం' లో "ఈ గేయం ద్వారా శ్రీశ్రీ యువసైన్యాలకు, నూతన యుగ నిర్మాతలకు నేపథ్య సంగీతము వంటి, Marching Band వంటి కొత్తరకముగా కదను త్రొక్కించు సంగీతము వినిపించిచాడు" అన్నారు. ఇందులోని సైనికులు యుద్ధం చేసేవారు కారు. వీర రక్తం పొంగుతున్న పీడితులు, విశ్వ శ్రామికులు.

ఇందులో చెప్పబడిన 'మరో ప్రపంచం' స్వర్గమో, కైలాసమో కాదు. ధరిత్రి నిండా నిండిన సమసమాజం. ప్రపంచంలోని ఆరవ భాగంలో శ్రామికవర్గ ప్రభుత్వాన్ని ఏర్పరిచి క్రమంగా విశ్వమంతా వర్గరహిత సమాజాన్ని నిర్మించటానికి ఉద్యుక్తమైన సోవియట్ రష్యా ఈ మరో ప్రపంచానికి రేఖారూపంగా నిలిచిన ప్రతీక కావచ్చు. ఈ గేయం తర్వాత 1940వ సంవత్సరం వరకు 'మహా ప్రస్థానం' కవితా సంపుటిలోని గేయాలన్నీ రచించబడ్డాయి. 1934వ సంవత్సరంలో బాటసారి, ప్రతిజ్ఞ, 1937 – 38 లో అభ్యుదయం, వ్యత్యాసం, నవకవిత, 1939 వ సంవత్సరంలో కవితా ఓ కవితా, కేక, 1940వ సంవత్సరంలో జగన్నాథుని రథచక్రాలు మొదలైన ముఖ్య గేయాలు శ్రీశ్రీ రాశారు. 1940వ సంవత్సరం తర్వాత శ్రీశ్రీ అధివాస్తవిక మార్గంలో పడి రుబాయత్, కొంటె కోణాలు, టాంటాం మొదలైన రచనలు చేశారు.

1940వ సంవత్సరం వరకు రచించబడి "మహాప్రస్థానం" లో ప్రచురించబడిన గేయాలలో అధికభాగం మార్క్సిజం గర్భీకరించుకున్న రచనలు. కాబట్టి మహా ప్రస్థానంలోని మార్క్సిస్టు దృక్పథాన్ని తెలుసుకోవాలి. దానికంటే ముందు మార్క్సిజం గురించి తెలియాలి. డార్విన్ పరిణామ సిద్ధాంతం, హెగెల్ భావవాదం – ఈ రెండింటిని ఆధారం చేసుకొని మార్క్సు, ఎంగెల్సు గతితార్కిక భౌతికవాద సిద్ధాంతాన్ని నెలకొల్పారు.

**గతితార్కిక భౌతికవాదం:**

హెగెల్ అనే జర్మన్ తత్త్వవేత్త గతితార్కిక సిద్ధాంతానికి పునాదివేశాడు. ప్రపంచంలోని ప్రతి వస్తువు మార్పుచెందునని, పరస్పరం సంబంధం లేని ప్రాణులు, పదార్థాలు, సంఘటనలు లేవని నిరూపించాడు. అనవరత పరిణామ శీలకమైన

ప్రపంచానికి మూలం 'భావం' అని ఇతడి అభిప్రాయం. ఇతడి సిద్ధాంతాలకు భావవాదం ప్రాతిపదిక. తన పూర్వికుల లాగా కాక ఇతడు స్థలంతో పాటు కాలం కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నాడు. ప్రతిపదార్థం పరస్పర వైరుధ్యంతో కూడుకున్నదని, సంఘర్షణయే పదార్థాల ప్రధాన ధర్మమని నిరూపించాడు. మార్క్సు, ఎంగెల్సులు హెగెల్ లోని భావవాద ధోరణులను విడిచి అతడి గతితార్కిక పద్ధతిని మాత్రం స్వీకరించారు. వీరిది గతితార్కిక భౌతిక వాదం.

బాహ్య ప్రకృతిలో జరిగే మార్పులే సామాజిక పరివర్తనకు మూలహేతువులని వీరు నిరూపించారు. భౌతిక శక్తుల ప్రభావం మన ఆలోచనలపై ప్రసరించిన తర్వాతనే మనం ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నిస్తామన్నారు. ప్రపంచం పదార్థ నిర్మితం. మానవుడి సమస్తావయవాలు పదార్థ నిర్మితాలే. సమస్తాంగాలతో ముఖ్యమైంది "మెదడు". ఈ మెదడు కూడా పదార్థ నిర్మితమే. మానవుడి క్రియాశీలితకిది కీలకస్థానం. సమస్తాలోచనలకు, వివేకానికి ఇది కేంద్రబిందువు. దీనికతీతంగా ఆత్మ అనేది లేదు. పదార్థానికి చలనం, చైతన్యం నైసర్గిక గుణాలు. స్వభావరీత్యా పదార్థం గతిశీలకమైంది. దానిని నడిపించునవి ప్రకృతి శక్తులే కాని దైవిక శక్తులు కావు. మానవ జీవితం పదార్థంలోని ద్వంద్వ శక్తుల సంఘర్షణ ఫలితంగా రూపుదిద్దుకుంటుంది. కనుక భావం స్వతంత్రమైనదనే హెగెల్ వాదం సమంజసమైందికాదు. దీనిని మార్క్స "హెగెల్ అభిప్రాయంలో ఆలోచనాక్రమం మనోభావమనే పేరుతో ఒక స్వతంత్ర శక్తిగా వ్యవహరిస్తుంది. అదే వాస్తవ జగత్తుకు మూలం. మనోభావం యొక్క బాహ్య స్వరూపమే వాస్తవ జగత్తు కాని నా అభిప్రాయంలో వాస్తవ జగత్తు యొక్క ప్రతిబింబమే మనోభావం. అది ఆలోచనల రూపంలో బహిర్గతమవుతూ ఉంటుంది" అని స్పష్టపరిచాడు.

మార్క్సు ఈ గతితార్కిక భౌతిక వాదానికి మూడు సూత్రాలు ప్రతిపాదించాడు.

1) పరస్పర విరుద్ధ శక్తుల మధ్య సంఘర్షణ

2) విరోధ వైరుధ్య సూత్రం

3) పరిమాణం గుణంగా మారుపద్ధతి.

ఈ మూడు కలిసి ఏర్పడిన గతితార్కిక భౌతికవాదానికి వర్గకలహ సిద్ధాంతం గుండె లాంటిది.

**మహా ప్రస్థానంపై మార్క్సిస్టు సిద్ధాంతాల ప్రభావం:**

శ్రీశ్రీ "దేశ చరిత్రలు" అనే గేయం గతితార్కిక భౌతికవాదానికి నిలువుటద్దం లాంటిది. దేశచరిత్రలోని అంతర్యాన్ని కుండబద్ధలు కొట్టినట్లుగా శ్రీశ్రీ వెల్లడించారు.

**"ఏ దేశ చరిత్ర చూచినా**
**ఏమున్నది గర్వకారణం**
**నరజాతి చరిత్ర సమస్తం**
**పరపీడన పరాయణత్వం"**
**"నైలునదీ నాగరికతలో**
**సామాన్యుని జీవనమెట్టిది**
**తాజమహల్ నిర్మాణానికి**
**రాళ్ళెత్తిన కూలీలెవ్వరు"**

అంటూ మార్క్సిజాన్ని స్పష్టంగా వెల్లడించారు.

**"ధనవంతుల పన్నాగాలూ**
**ఇంకానా! ఇకపై చెల్లవు"**

అని పెట్టుబడిదారీ వర్గాన్ని ప్రతిఘటించారు.

**"శ్రమ నిష్ఫలమై, జని నిష్ఠురమై**
**నూతిని గోతిని వెదకేవాళ్ళు-**
**అనేకులింకా అభాగ్యులంతా**
**అనాథులంతా, అశాంతులంతా**
**దీర్ఘశ్రుతిలో తీవ్రధ్వనితో**
**విప్లవశంఖం వినిపిస్తారోయ్"**

అని లెనిన్ చెప్పిన భాష్యాన్ని వినిపించారు శ్రీశ్రీ. తన కవిత్వాన్ని శ్రామికుల, పీడితుల కొరకే సమర్పిస్తానని శ్రీశ్రీ శపథం చేశారు. తన కవితా వస్తువులు కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం అని చెప్పుకొన్నారు.

**"కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం**
**జాలరి పగ్గం సాలెల మగ్గం**
**శరీర కష్టం స్ఫురింపజేసే**
**గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి**
**సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు"**

అని తనగీతికి భావం, భాగ్యం, ప్రాణం, ప్రణవమని ఉద్ఘాటించారు. సమాజం యొక్క సుశిక్షితమైన గతిలోనే సౌందర్యం ఇమిడి ఉంది. ఆగతి శ్రమ వల్లే సాధ్యమని, శ్రమయే సౌందర్యమని కాడ్వెల్ స్పష్టపరిచాడు.

ఈ మార్క్సిస్టు దృక్పథాన్నే శ్రీశ్రీ

**"శ్రమైక జీవన సౌందర్యానికి**
**సమానమైనది లేనే లేదని"** ఉద్ఘోషించారు.

నవ కవిత్వం

**"కదలేదీ కదలించేదీ**
**మారేదీ మార్పించేదీ"** కావాలన్నారు.

వాస్తవికత పేరుతో జీవితంలోను, ప్రకృతిలోను ఉన్న దుర్గంధాన్ని గురించి మాత్రమే రాసి, చీకట్లను మాత్రమే చిత్రించి చేతులు దులుపుకోవటం మార్క్సిజం ఒప్పుకోదు. అది వాస్తవికతావాద లక్ష్యం కూడా కాదు. శ్రీశ్రీ వాస్తవికతా వాదానికి సంబంధించిన కవి. అందుకే కుక్క పిల్ల, సబ్బు బిళ్ళ, అగ్గి పుల్ల, రొట్టె ముక్క, అరటి తొక్క మొదలైనవి కవితామయమే అని ప్రబోధించారు. శ్రీశ్రీ వస్తు నవ్యత చూపించారు, భావనవ్యత చూపారు.

**"ఆకాశపు టెడారిలో కాళ్లుతెగిన**

**ఒంటరి ఒంటెలాగుంది జాబిల్లి"**

అన్న శ్రీశ్రీ ఊహాచిత్రం అతి నవ్యమైంది. గదిలో దీపాన్ని

**"చీకటి బోనులో సింహములా నిల్చున్నది**

**కత్తి గంటు మీద నెత్తుటి బొట్టు లాగున్నది"** అని వర్ణించారు.

శ్రీశ్రీ శబ్దాలపై పట్టు సాధించాడు. శ్రీశ్రీ శబ్దాలను గర్జింపజేశారు.

**"కదం త్రొక్కుతూ**

**పదం పాడుతూ**

**హృదంతరాళం గర్జిస్తూ**

**పదండి పోదాం"**

శ్రీశ్రీ ఆది ప్రాసలను, అంత్యప్రాసలను ప్రయోగించారు.

**"నా విసరిన రస విస్మృమర కుసుమపరాగం"**

**"స్మరిస్తే పద్యం**

**అరిస్తే వాద్యం**

**అనల వేదిక ముందు అస్రనైవేద్యం"**

**"సఖుల వలన పరిచ్యుతులు**

**జనుల వలన తిరస్కృతులు**

**సంఘానికి బహిష్కృతులు"**

**8.3.1. తొలితరం అభ్యుదయ కవులు:**

భావకవిత్వంపై తిరుగుబాటు చేసిన తొలితరం కవులలో ముఖ్యులు శ్రీ శ్రీ కాక శిష్టా ఉమామహేశ్వరరావు, పఠాభి, శ్రీరంగం నారాయణబాబు, ముద్దుకృష్ణ, పురిపండా అప్పలస్వామి, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, పాలగుమ్మి పద్మరాజు మొదలైనవారు.

వచన కవితకు ఆద్యుడిగా పేర్కొనదగినవాడు శిష్టా ఉమామహేశ్వరరావు, అతడు 1930 నుంచి రచించిన వచన గీతాలు 1938వ సంవత్సరంలో "నవమి చిలుక", "విష్ణుధనువు" అనే రెండు కావ్య సంపుటాలుగా వెలువడ్డాయి. శిష్టా తన కవిత్వాన్ని "ప్రాహ్లాద కవిత్వం" అని పేర్కొన్నారు. ఈ "ప్రాహ్లాద కవిత్వం పూర్వ కవిత్వం కాదు, భావ కవిత్వం కాదు. నూతనములో బహు నూతన కవిత్వం" అని ప్రకటించుకున్నారు. ప్రాహ్లాద కవిత్వం ఆరిపోయే దీపాన్ని రగుల్చుతుంది, పరుగెత్తే పామరుణ్ణి నిలేస్తుందని తన కవిత్వ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు శిష్టా! నవమి చిలుక గ్రామ జీవితంలోని వివిధ సంఘటనల ఆధారంగా ఉదయించిన కావ్య సంపుటి. విష్ణుధనువులో ప్రేమ సిద్ధాంత ప్రవచనం ముఖ్య ధ్యేయం. పురాణ వ్యక్తులనే నూతనంగా సమన్వయించారు. విష్ణు ధనువులో ఛందస్సును ప్రయత్నపూర్వకంగా వికృతం చేశారు. కొన్ని

పద్యఖండాలను, కొన్ని మాత్రాబద్ధ గేయ ఖండాలను, కొన్ని వచనాలను ఇష్టం వచ్చినట్లు పేర్చారు. వచన గేయం విషయంలో శ్రీశ్రీ వంటి వారికి మార్గదర్శకుడయ్యాడు. కవిత్వ మార్గాన్ని సుగమం చేశారు కాని కొత్త బాట వేయలేదు.

పఠాభి పూర్తి పేరు తిక్కవరపు పట్టాభి రామిరెడ్డి. 1938వ సంవత్సరంలో పఠాభి కలకత్తాలో చదువుకుంటున్నప్పుడు ఆ నగరంలో విలయతాండవం చేసిన ఆకలి, దారిద్ర్యం, విలువలు కోల్పోయిన మనుష్యులను కనులారా చూశాడు. అపుడతడికి రవీంద్రుడి సౌందర్య భావన, భావకవుల తియ్యటి తలపులు అర్థరహితంగా తోచాయి. పాతవిలువలను ధ్వంసం చేస్తూ పఠాభి "ఫిడేలు రాగాల డజన్" అనే పేరుతో 12 వచన గేయాలను రాశాడు. నా ఈ వచన పద్యాలనే దుడ్డుకర్రల్తో పద్యాల నడుముల్ విరుగదంతాను. చిన్నయసూరి బాల వ్యాకరణాన్ని చాలదండిస్తాను" అని పఠాభి తెలుగు ఛందస్సుపై, వ్యాకరణంపై దాడిచేశాడు. "అనుసరిస్తాను నవీన పంథా కానీ, భావకవిన్ మాత్రము కాన్నే, నేనహంభావ కవిని" అని ప్రకటించుకున్నాడు. పఠాభి పన్చాంగం (1964) తెలుగులో సరికొత్త ప్రయోగం. శబ్దార్థ శ్లేషలను సమకాలిక సమాజాన్ని వర్ణించటానికి ఉపయోగించిన కవి పఠాభి. "కళకళ కొరకే" అనే సిద్ధాంతాన్ని బలపరిచిన కవి పఠాభి. భాషాచ్ఛందస్సులలోనే కాక వస్తువులలో కూడా ప్రయోగాలు చేశారు పఠాభి. నగర జీవన చిత్రణకు నాంది పలికాడు. ఆధునిక జీవితంలోని వివిధ ఘట్టాలను గురించి కవిత్వం రాయటంలో ప్రథముడితడే. ఫ్రాయిడ్ ప్రతిపాదించిన సెక్సు ప్రాధాన్యతను తెలుగు కవిత్వంలో తొలిసారిగా ప్రవేశ పెట్టింది ఇతనే.

భావకవిత్వంలోని ఆదర్శవాదంపై తిరుగుబాటు చేసి వాస్తవికతావాదాన్ని ప్రతిపాదించిన కవి శ్రీరంగం నారాయణబాబు. ఇతను శ్రీశ్రీతో పాటు విప్లవశక్తులను ఆహ్వానించిన పురోగామి కవి. "చాకలాడు, సంత బయలు, కుక్క, గాడిద, కుళ్ళు కాలువ, ఫేక్టరీకూత, మర ఫిరంగి, మందుగుండు బీదవాడు, భిక్షువర్షీయసీ – అన్నీ అవేమిటి ఇవేమిటి లోకంలో ఉన్నవన్నీ కవితా వస్తువులే" అని 'సంఘర్షణ' కు రాసిన 'ప్రవర' లో చెప్పుకున్నారు. "రుధిరజ్యోతి" నారాయణబాబు రాసిన గేయ కవితా సంపుటి. నారాయణబాబు 'దేశమాత' గేయ ఖండికలో 'చాలీచాలని చిరిగిన చీర' తో 'గుక్కెడు అన్నం గుక్కెడు నీళ్ళు' కొరకు తపించే భిక్షుక స్త్రీని వస్తువుగా స్వీకరించాడు. 'కావలి' అనే గేయంలో కాష్ఠజ్వాలలను, ఆరినచితిని రాబందులను గ్రహించారు. విశాఖపట్టణం అనే గేయంలో నగరంలోని రాచబాటతోపాటు ఇరుకు సందులలోని విషయాలను వర్ణించాడు. 'కదన కుతూహలరాగం' అను గేయంలో నారాయణబాబు మహోద్వేగంతో విప్లవ శంఖాన్ని పూరించారు. "రుధిర జ్యోతిర్ జ్వలనా లలనా ప్రియుండ విప్లవ ఋషిని విద్రోహి కవిని" అని చెప్పుకున్నారు. నారాయణబాబు వాస్తవికతను, అధివాస్తవికతను రెండిటిని సమన్వయం చేసుకొన్న అతి నవ్యుడు. ఆంగ్ల కవిత్వంలోని 'ఇమేజిజం' ప్రభావం గల తెలుగుకవి ఇతనొక్కరే.

వచన గేయ రచనలో శిష్ట్లాతో పాటు ముద్దుకృష్ణ కూడా శ్రీశ్రీ కి మార్గదర్శకుడు. వచన కవిత్వం నాదరించి, దానికొక వేదికను ఏర్పరచి ప్రోత్సహించింది ముద్దుకృష్ణ నడిపిన 'జ్వాల' పత్రిక. జ్వాల మొదటి సంపాదకీయంలో "ప్రపంచమంతా ఒక యిల్లుగా మానవజాతి అంతా ఒక కుటుంబంగా మారిపోయే రోజులు వస్తున్నవి... మనం కూపస్థంగా వుండడం వల్లనో, పురాతన మగత చేతనో, రక్తంలో నీరసం చేతనే, నూతన తేజస్సుకు గుడ్లగూబలమౌతున్నాము. యువకుల దృష్టికి ఒక కొత్త తేజస్సు, ఒక కొత్తదారి కనబడుతూ వున్నది. ధర్మాలలో, సంఘంలో, భావాలలో, భాషలో మార్పురాక తప్పదు. దీనికి అడ్డు వీల్లేదు. వచ్చినా ఆగదు. పిరికితనానికి ముక్తి లేదు. అందుచేత నచ్చని పాత బంధాలను తెంపివేయడానికి ఎంతైనా సాహసిస్తాము. నచ్చిన కొత్తదనానికి దూకుతాము. భయపడము. తప్పు అవుతుందేమో అని జంకము" "ఒక రేయి" అనే గేయంలో ముద్దుకృష్ణ ఆదర్శవాదాన్ని నిరసించి వాస్తవికత వైపు మరలాలని వ్యంగ్యంగా ప్రబోధించాడు. అతడి "శాంతి' వచన గేయం ప్రసిద్ధమైంది.

పురిపండా అప్పలస్వామి మొదట బావకవిత్వాన్ని రచించినా క్రమక్రమంగా శ్రీశ్రీ సాహచర్యంతో జాగృతుడై అభ్యుదయ కవిఅయి భావకవులపై తిరుగుబాటు చేసిన యువకవులకు బాసటయై నిల్చారు. 'దైవం' అనే గేయంలో పురిపండా అంధ విశ్వాసాల పట్ల తీవ్ర నిరసనం వ్యక్తం చేశాడు. "గుడిలోన దైవమా ఆలింపవోయి, గుడిలోన దైవమా పైకి రావోయి" అని దైవాన్ని సంభోధించి 'మాల మెట్టిన నేల, మాలమెట్టిన సీమ మైలపడినది' అనే కుహనాభక్తుల నుండి బయటపడి వారిని ఉద్ధరించుమని హెచ్చరించారు. 'అనల పతాకం' అనే గేయం శ్రీశ్రీ మహాప్రస్థాన గేయంతో ప్రభావితమైంది. అందులో పీడిత ప్రజాకోటిని పురిపండా మేల్కొలిపారు.

జాతీయమార్గగామియైన పురిపండా అప్పలస్వామి సాంఘిక దురన్యాయంపై పంజా విప్పిన సింహం. 'పులిపంజా' 40 ఖండ కావ్యాల సంపుటి. అన్ని కవితా ఖండాలలో ప్రస్ఫుటంగానో, ప్రచ్ఛనంగానో విప్లవ భావముంది. 'ఇది విప్లవ సంకేతం, చిరవాంఛిత సంక్షోభం' అని పురిపండా వారే ఈ పేరులోని సంకేతార్థాన్ని సూచించాడు. 'భారతదేశం మాదేశం' అనేది చైనా దురాక్రమణని ఖండించే గేయం. 'పద్మనాభం' అనే గేయంలో ప్రాచీన వీరగాథాస్మరణముంది. 'అనల పతాకం' మొదలైన గేయాలలో శ్రీశ్రీ కవితాచ్ఛాయలున్నాయి. 'సంధ్యా వందనం', 'విశ్వజనీనం', 'స్వర్గానికి – నరకానికి', 'ప్రేత భూమి' మొదలైన అనేక ఖండికలపై అధివాస్తవికతా ప్రభావం కలదు. 'పులిపంజా' లో నాస్తికత పరవళ్ళు త్రొక్కుచున్నది.

'పేరడీ' ల రచనతో తెలుగు సాహిత్యంలో సుస్థిరస్థానాన్ని సంపాదించుకొన్న కవి, విమర్శకుడు జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి, 'ఆశ్వాసాంతం, ఆసుపత్రి కోకిల' అనేవి అతడి రచనలలో ప్రసిద్ధమైనవి. గత స్మృతులను నెమరువేస్తూ జలసూత్రం క్రొత్తకు స్వాగతం చెప్పాడు. 'ఆసుపత్రి కోకిల' జలసూత్రం ఊహావైచిత్రికి చక్కటి నిదర్శనం. అతడి కవిత భావకవిత్వాన్ని అభ్యుదయ కవిత్వాన్ని కలిపే కొలికిపూస.

పాలగుమ్మి పద్మరాజు రచించిన 'పురిటిపాట, చీకటి, మనమైత్రి' అనే గేయాలు ఆధునిక కవిత్వంలో మిక్కిలి రసవంతమైనది. వచన కవిత్వాన్ని వచనం నుండి వేరుచేయుటలో పాలగుమ్మి పద్మరాజు శక్తి అమోఘమైంది.

**8.3.2. శ్రీశ్రీ మార్గానుమాయులైన అభ్యుదయ కవులు:**

కష్టజీవులకు, కార్మిక జనులకు మహోదయాన్ని, నవయుగోదయాన్ని తోపింపజేసి సాంఘిక విప్లవాన్ని కోరిన అభ్యుదయ కవి తెన్నేటిసూరి. వీరి 'అరుణరేఖలు' లోని మాతృగీతి, మహోదయం, కన్నీటి కాలువ, వట్టిబయలు, స్వర్గానికి రోడ్డు, నీకవి, తిండి కావాలి, ప్రపంచ విప్లవం, కీలుగుఱ్ఱం అనే గాయాలు ఒక్కొక్కటి ఒక్కొక్క విస్ఫులింగం.'మానవ స్వాతంత్ర్య మాగ్నకార్టాలైన రక్తాక్షరాలతో వ్రాలు చేసేశాను' అని కష్టజీవుల స్వేచ్ఛకై అతడు పరితపించాడు. 'విశ్వకారాగార వీధిలో చెరవడ్డ విశ్వకార్మికులార, నిగళబద్ధుల్లార... లెండోయి, లెండోయి, బ్రతికి లేవండోయి' అని ఉత్సాహాన్ని రగుల్కొలిపాడు. 'బ్రతుకంతా భారం, క్రూరం, ప్రమాదాల తీరం, ఘోరం, పుట్టటమే మహాపాతకం, చావే యిక మేలనుకుంటూ నిరుత్సాహ పడకండోయ్' అని బాధలలో ఉన్న వారిని ఓదార్చి 'యుగయుగాల మానవ కథనం స్వర్గానికి రోడ్డేస్తున్న' దని అభయమిచ్చాడు. 'తిండి కావాలోయి, తిండి కావాలోయి, మండేటి పేగులకు తిండి కావాలోయ్' అని ఆకలి కేకలను వినిపించాడు, శ్రామికుల పక్షాన నిల్చున్న కవుల నాదరించమని "నీకవిని బ్రతికించుకోవాలిరా" అని హితవు చెప్పాడు. 'సాహిత్య సమవ కారం' అనే రచనలో తెన్నేటిసూరి సమకాలిక కవుల లోపాలను, బలహీనతలను హేళన చేశాడు. అభ్యుదయ కవిత్వ యుగంలో సాంఘిక విప్లవాన్ని కోరిన కవి తెన్నేటి సూరి.

పిలకా గణపతి శాస్త్రి భావకవిత్వానికి సంబంధించిన అనేక ఖండ కావ్యాలను రాశారు. "హోరని గాలి దుమారం లెగిరెన్, భోరని ధారావర్షము కురిసెన్, వీధులలో ఎవరో ఆనీడలు ఆకలితో ఏవేవో ఘోషలు అమ్మ మాదా కబళం తల్లీ అమ్మా పిల్లల మన్నం తల్లీ" అని ఆర్తితో రాసిన 'మాదాకబళం' మాత్రం అభ్యుదయ కవితకు తలమానికమైంది. 'వాన' అనే గేయంలో కూడ పిలకా గణపతి శాస్త్రి వాన హాయిగా కురిసెను గానీ కానీలేని దరిద్రుల కన్నీళ్ళెన్నో నీళ్ళల్లో ప్రవహిస్తున్నాయి గదా ఓ కవితా! అనియు 'చాలని బియ్యపు నూకల కోసం కూలిజనంతో ఎఱ్ఱని కంకర ధూళి పేడిలో గర్జిద్దామే నేలంతా వణికేదాకా చిరవేదనలలో కరిగి సురిగిపోదాం' అని అభ్యుదయాన్ని అందించాడు.

'జన్మెత్తిన మానవునకు, జీవితమె పరమధనం, అయితే అది ఒకమారే. అతని కొసగబడిన వరం' అని పలికిన ఆవంత్స సోమసుందర్ అభ్యుదయ కవులలో ప్రముఖుడిగా గణింపదగినవాడు. తెలంగాణా పోరాటానికి సంబంధించిన వీరి వజ్రాయుధములోని 'సమధర్మం, బాడుగ గోబీలు, ఆకలి నాలుకలన్నీ' అనే గేయాలు అతడి కవితాశక్తికి ప్రజల నిదర్శనాలయ్యాయి. అందులోని తీవ్రవాద రాజకీయాలు యువకులను ఆకర్షించాయి. అందులో భగత్‌సింగ్ త్యాగాన్ని 'తొలి తారకతేజం, యువవీరుని తేజం, క్రాంతికాల జాగృతియై, లోకం ముంచెత్తివైచె' అని సోమసుందర్ వర్ణించారు. వజ్రాయుధము తరువాత సోమసుందర్ రాసిన 'మిణుగురులు, సోమరసం, సుందరకాండ, మేఘరంజని' మొదలైన రచనలు అభ్యుదయ భావాలకు భిన్నమైనవి. వీటిలో సోమసుందర్ ప్రకృతి వర్ణనలు, తాత్త్వికచింతన విలక్షణమైనవి. తన జన్మస్థలమైన పిఠాపురం ప్రకృతి సౌందర్యానికి 'ఊరుమారింది' లో వర్ణించారు. 'వెన్నెలలో కోనసీమ' శీర్షికకు తగినట్లే ఆంధ్రదేశపు సౌందర్యసీమను కమనీయంగా వర్ణించారు. 'అనల కిరీటం' అనే రచనలో మాత్రం అభ్యుదయ భావాలు, కాల్పనికరీతి కలగలిశాయి. అందులోని 'చీకటిని ద్వేషిస్తాను' అనే గేయంలో సోమసుందర్ కవితాశక్తి వ్యక్తమవుతుంది. సోమసుందర్ రచించిన 'కాహళి' ఆంధ్రోద్యమానికి సంబంధించిన గేయ రచన. సోమసుందర్ వచనకవితలో చక్కటి సూక్తులను పొదిగారు. అతడి ఫాక్టరీ గేయం రక్తాన్ని మరిగిస్తుంది. సమకాలిక సంఘటనలకు స్పందించకపోతే పాఠకులు కవిని మరిచిపోతారనే భావనతో అతడు ప్రేరణ లేకుండానే కావ్య రచనకు పూనుకొన్నారు. వాడుక భాషలో సంస్కృత సమాసాలను, భావకవులు ఉపయోగించిన పడికట్టు పదం ఉపయోగించుట వలన సోమసుందర్ శైలిని జటిలం చేశాడు. సోమసుందర్ వచన కవితా మార్గం విలక్షణమైంది.

అనిసెట్టి సుబ్బారావు రచించిన 'అగ్ని వీణ' అభ్యుదయ కవిత్వంలో పేర్కొనదగింది. 'ఎవరి పిల్లలోయి మీరు', 'బిచ్చగాడి పాట' మొదలైన గేయాలలో అనిసెట్టి భావతీవ్రతను, ధారాశుద్ధిని వెలువరించాడు. "భయం, భయం బ్రతుకు భయం... అన్నా మనకీ లోకం పన్నిన పద్మవ్యూహం, ఆశలతో బ్రతుకీడ్చే అస్థిపంజరాలు మనం, ఆవేదన హితమయ్యే ఆశాజీవులం మనం. గతమంటే కారువెగటు రేపంటే తగని భయం" అని సామాన్యుడి దుర్భర జీవితం, నిస్సహాయ స్థితిని అనిసెట్టి రమణీయంగా వర్ణించారు. ఈ లోకపు శాసనాలు ఎంగిలాకులిస్తాయి, ఇనుప కమ్ములిస్తాయి' అని పరిస్థితులు బాలలను బిచ్చగాళ్లుగా నేరస్థులుగా చేయుటను గురించి ఆక్రోశించారు. అనిసెట్టి గేయాలు కర్తవ్యోన్ముఖులను చేసే భావాలతో నిండి ఉంటాయి. శౌంఠి, రీక్షావాలా మొదలైన రూపకాలతో అనిసెట్టి సుబ్బారావు మూకాభినయంతో ప్రదర్శించటానికి వీలైన కవిత్వాన్ని రచించారు. అభ్యుదయోద్యమం నిర్వీర్యమైన తర్వాత అనిసెట్టి సినిమారంగంలో స్థిరపడ్డారు.

రెంటాల గోపాలకృష్ణ రచించిన 'సంఘర్షణ, సర్పయాగం' అనేవి అభ్యుదయ భావాలు గల ఉత్తమ కావ్యాలు. వీరి 'పల్లకీ బోయీలు' అనే గేయం సామాన్య పాఠకులనే కాక కవితా రసజ్ఞులను కూడా ఆకట్టుకుంది. 'ఇంటిదానికి జరం, పోయిలో నుప్పెయ్యలేదు. సద్దీలేక దొరగారి సావిట్లో ఉంటాను' అని అని వెట్టిచాకిరితో సతమతమవుతున్న మేనా మోయు

బోయీల దీన స్థితి జాలిగొలుపుతుంది. 'అదిగో అరుణ పతాకం, పేదవారికి ప్రాణం, పీడిత ప్రజ కాధారం' అని రెంటాల మార్క్సిస్టు సిద్ధాంత దృక్పథంతో వ్రాశారు. 'సంభవామి యుగేయుగే' లో ఆ ధర్మం ప్రవర్తిల్లిన చోట అభ్యుదయ కవిగా అవతరిస్తానని చెప్పాడు. 'నగరంలో రాత్రి, శివధనువు' అనే వీరి గేయాలు కూడా సుప్రసిద్ధమైనవే. అభ్యుదయోద్యమంలో కవిగా మేల్కొని ఉద్యమం ఆగిపోయిన తర్వాత సుప్తిలో మునిగిన కవి రెంటాల గోపాలకృష్ణ.

'ఉదయని' అనే కావ్య సంకలనంతో గంగినేని వెంకటేశ్వరరావు అభ్యుదయకవిగా ప్రసిద్ధిగాంచాడు. మార్క్సిస్టు సిద్ధాంత బలంతో, పోరాటపు అనుభవంతో గంగినేని వెంకటేశ్వరరావు రచించిన 'అరచేతిలో మృత్యువు ఓ రాత్రీ, ఎర్ర సముద్రం' మొదలైన గేయాలు అభ్యుదయ కవులకు ఆదర్శం అయ్యాయి. గంగినేని కవితలో రాజకీయ సిద్ధాంత అవగాహన కవితా శిల్పం మేళవించాయి. గంగినేని 'ఎర్ర సముద్రం'లో 'దినగండాలు దాటలేక, దరిద్ర మహాజనావళి, మండి రణ జండా ఎత్తినది' అని ఎర్రజండా రెపరెపలు కష్టజీవుల కడుపు మంటలుగా వర్ణించాడు.

బెల్లంకొండ రామదాసు 'నయాగరా' కవులలో ప్రముఖులు. 'కల్పన' కవితా సంకలనానికి సంపాదకులలో ఒకరు. అతడు రచించిన గేయాలు చాలా తక్కువ. ఆధర్మ నిలయమైన లోకాన్ని దహించాలని అతడు ఆవేశపడ్డారు. శ్రామిక లోకపు స్వర్గాన్ని కోరి కవిత్వం చెప్పారు. 'భూత శాల వదలి, వర్తమాన విషవర్తులాన్ని ఛేదించుకుని, భావికాలపు నల్లటి ముసుగు ధరించి, పెడతాను మరి, సెలవు – వినిపించెనెదో మెల్లని పిలుపు. మూయండి నా వెనుక విశ్వపు తలుపు' అని పలికిన రామదాసు కవి అర్థాంతరంగా తనువు చాలించారు.

కవిత్వం రాజకీయాలు వేరుకాదని, సాహిత్యవేత్తల జీవితం దంత శిఖరాలలో కాదని ఆచరణలో నిరూపించిన కవి కె.వి. రమణారెడ్డి. వీరి 'అడవి, భువనఘోష, అంగార వల్లరి' కావ్యాలలో అభ్యుదయ భావాలు పొడచూపాయి. సమాజ శ్రేయస్సుని కోరిన కవిత్వంలో రాజకీయాలు ప్రచారముండక తప్పదని నమ్మినవారిలో ముఖ్యుడు. రమణారెడ్డి, సంస్కృత పదాలను అధికంగా వాడటం, అన్వయ కాఠిన్యం వీరి కవిత్వాన్ని క్లిష్టం చేశాడు. వీరి కవితలలో, ఎన్నదగినవి – 'రక్తాశ్రువు' రణోన్మాది చిత్రపటం, స్టాలిన్ అస్తమయం, శ్రీశ్రీ అనేవి. రాజకీయోద్యమంలో రహస్య జీవితం గడుపుతున్న సుంకర సత్యనారాయణకు వీరు రాసిన 'ప్రజాకనికి బహిరంగ లేఖ' అనేది ఉత్తమ రచన.

అభ్యుదయ కవి అజంతా రాసిన ప్రతి గేయాన్ని ఆమోఘమైన సంచలనాన్ని కలిగించి కవుల, రసజ్ఞుల మన్ననకు పాత్రమైంది. 'చెట్లు కూలుతున్న దృశ్యం' అనే గేయంలో "ఆశలేదు అస్కారం లేదు. ఫలానా రోజు శాపం ఆఖరౌతుందనే హామీ లేదు, జీవితం ఎప్పుడూ ఇలా కన్నీళ్ళ ప్రవాహంగానే సాగుతుందనుకుంటాను. రోడ్డు పొడుగునా చెట్లు కూలుతున్న దృశ్యాలనీ చూపుతుందనుకుంటాను' అని అజంతా ఆధునిక మానవుడి నిస్సహాయతను, మానసిక ఏకాంతాన్ని వెల్లడించాడు. అజంతా రచించిన కొత్త సంవత్సరం, రోజూ చూస్తునే వున్నాను, పరిత్యాగి పరివేదన, న్యూస్ రీల్, నడి వేసవి, క్షుద్ర సంధ్య, జెండాలకు కన్నీళ్ళు లేవు, అగ్ని స్పర్శ' – అన్నీ ఉత్తరు కవితలే. మానవ హృదయాల అంతశ్చైతన్యాన్ని భావచిత్రంలో పట్టుకొనగలిగిన ప్రతిభాశాలి అజంతా. అతడు 'రోజూ చూస్తూనే వున్నా' గేయంలో నిరాశామయ లోకాన్ని చిత్రించాడు. మాటలలో విప్లవాన్ని రగిలించటం వీరికి సమ్మతం కాదు. అజంతా కవితా శిల్పంపై చూపుల కందేది కాదు. వపనగీతంలో అజంతా తీర్చిదిద్దిన శిల్పమమోఘమైంది. ఆరుద్ర, కేశవరావు మొదలైన వారిపై అజంతా ప్రభావం కన్పిస్తుంది.

ఆలూరి బైరాగి రాసిన 'చీకటి నీడలు, నూతిలో గొంతుకలు' రెండూ విశిష్టమైన రచనలు. "కత్తిరించిన ఒత్తులే వెలుగుతాయి దివ్యంగా, బాధా దగ్ధ కంఠాలే పలుకుతాయి శ్రావ్యంగా, అని ప్రపంచపు బాధ అంతా తన కంఠంలో పలికించిన

ఉత్తమ కవి బైరాగి. అతడు మానవతావాదాన్ని నమ్మి రాడికల్ హ్యూమనిజముతో ప్రభావితుడై కవిత్వాన్ని చెప్పాడు. “హృదయపు మెత్తని చోటులు గీరే జంతువు ఆకలి” అని ఆకలిని వర్ణించి బైరాగి ఆకలి జీవుల ప్రతినిధియై విప్లవానికి దారితీశాడు. “పేదజనుల స్వేదధార, మానధనుల అశ్రుధార, ఆకాశపు కళ్ళలోంచి కట్టలు తెగి పొరలుతోంది, అది తుఫానై ముంచెత్తుతుంది. ఆగబోదు ఈ తుఫాను, ఆగరాదు ఈ తుఫాను, మీ మేడలు ముసుగు వరకు, మీ కోటలు కూలు వరకు, మీ అంతఃపుర కాంతలు, భూమిపైన దొరలు వరకు, శోకంతో పొరలు వరకు, ఆగరాదు ఈ తుఫాను” అని శ్రామిక లోక మహాశక్తికి విజయం చేకూరాలని కోరాడు. సంఘ దురన్యాయాన్ని గురియై నికృష్ట జీవితం గడుపుతున్న 'వేశ్యపై కూడా బైరాగి జాలిచూపాడు తాజమహలు కష్టజీవులను వెక్కిరించే శిల్పమని, దానిని పడగొట్టమని బైరాగి 'తాజమహల్ పటగొట్టండోయ్' అనే గేయాన్ని చెప్పారు. శ్రీశ్రీ లాగా తాజమహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలను గురించి తపనపడ్డారు. 'నూతిలో గొంతుకలు' చీకటితో ప్రారంభమైన సంశయ కావ్యం 'ఆవేదనల అనంతంలో అందమైన జీవితాలను' గురించి ఇది చర్చిస్తుంది. ఇందలి నాయకులైన హేమ్లెట్, అర్జునుడు, రాస్కల్నికోవ్' ఈ ముగ్గురి బాధను ఒకే స్థాయిని అందుకొన్నది. ఇది మానవుడి సహజ వేదన అని బైరాగి తొలిపలుకులతో చెప్పారు.

'ప్రపంచంతో ఏకమైనవాడే కవి కంఠం సరిగ్గా పలుక కలుగుతుందని నా నమ్మకం. ప్రపంచానుభూతితో స్వీయానుభూతి పరమైనప్పుడే ఉత్తమ కవిత ఉద్భవిస్తుందని నా విశ్వాసం' అని బైరాగి పేర్కొన్నారు. తాను విశ్వసించినట్లే ఉత్తమ కవిత రచించి ఆధునిక కవితకు గౌరవాన్ని చేకూర్చాడు. 'విదూషకుని విషాదం, ఉన్మత్తుని ఆహ్లాదం, వేశ్యల విషాదం, ఓంకార ప్రణవనాదం ' అనే బైరాగి కవిత పఠితలను ఉక్కిరి బిక్కిరి చేసి అంతర్ముఖులను గావించింది. నాక్కొంచెం నమ్మక మివ్వు” అనటంతో ఈ సంశయ జగత్తులో మనిషికి కావలసింది నమ్మకమని బైరాగి చాటాడు. నూతిలో గొంతుకలు వంటి రచనను అర్థం చేసుకోవటానికి పఠితలకు సంస్కారం, పాండిత్యం, లోకానుభవం అవసరం. బైరాగి కవిత్వం చిక్కని భావ గాంభీర్యంతో ఆలోచనామృతంగా ఉంటుంది.

అభ్యుదయ కవులలో గోపాల చక్రవర్తికి ప్రత్యేక స్థానముంది. అతడు 'జీవితం కరిగిపోయె మంచు, ఉన్న దాంట్లో నలుగురికీ పంచు” అని జీవిత సత్యాలను రసవంతంగా పలికాడు. చేదు జీవితాన్ని, విషాద గాంభీర్యాన్ని అత్యద్భుతమైన హాస్య రీతిలో మేళవించాడు. అతడు “రేవు మనది' అనుకొనే ఆశావాది. సామాన్యులకు ఉత్సాహం కల్గించే అభ్యుదయవాది. గోపాల చక్రవర్తి రాసిన 'కలం కలలు, ఆనంద జీవనది' కావ్యాలు వాగ్వై చిత్రికి నిలయాలు. 'సంధి పత్రం, యువ కవి నిష్క్రమణ, యౌవనం' ఇత్యాది గేయాల గోపాల చక్రవర్తి రచించిన రసవద్రచనలలో కొన్ని.

ప్రణయము, ప్రకృతి, తత్వశాస్త్రం, అభ్యుదయం మొదలైన భావాలతో బోయి భీమన్న వచన కవిత్వంలో వైవిధ్యాన్ని ప్రవేశపెట్టాడు. 'అనాది కొసనుండి అనంతత్వంలోకి, త్రిపదలు రాగ వైశాఖి, గుడిసెలు కాలిపోతున్నై, శివాలికలు' బోయి భీమన్న వచన కవిత రూపంలో రాసిన కావ్యాలు. ప్రాచీన కాలం నుండి మానవ నాగరికతలో వచ్చిన మార్పులను వచన కవితారూపంలో వివరించిన కావ్యం 'అనాది కొస నుండి అనంతత్వంలోకి', 'త్రిపదలు' సమకాలిక సమాజంపై భీమన్న తలపులు. మూడేసి పంక్తులుగా కూర్చాయి. రాగ వైశాఖి, శివాలికలు ప్రణయ భావభరితమైనవి. 'గుడిసెలు కాలిపోతున్నై' భీమన్న అభ్యుదయ భావాలకు దర్పణం. మార్క్సిస్టు సిద్ధాంతంపై విశ్వాసం లేకున్నా నీకున్న దారిద్ర్యపు బాధలను స్వయంగా అనుభవించి పేదల జీవితం బాగుపడాలని కోరిన అభ్యుదయవాది. “ధర్మ సంస్థాపనార్థం, ఈ గుడిసెలు మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై, ఈ విషవలయం సాగడం, ఎంతవరకు? రహస్యం గుడిసెల వాళ్ళకు తెలిసేవరకు?' అని అట్టడుగున

ఉన్న వారిని కళ్ళు తెరవమని భీమన్న ఉద్బోధించాడు. భీమన్న రాసిన 'జన్మాంతర వైరమ్' లో అంటరానితనంలో మ్రగ్గుచున్న వారి బాధలను వర్ణించారు. 'ప్రార్థనలు, భజనలు అవీ, వట్టి శవజాగారాలు, మతమూ, భక్తి నశించకుండా ప్రగతి లేదు మనిషికి' అనే విశ్వాసాన్ని ప్రకటించారు.

ప్రణయం, ప్రగతి రెండు కలగలిసిన వీరి కవిత్వంలో అభ్యుదయ భావాలతో పాటు కాల్పనిక రీతి కూడా వ్యక్తమవుతుంది. బోయి భీమన్న రచించిన 'దీపసభ' అనే కావ్యంపై మానవతా ప్రభావం ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. 'మానవుడు పురోగమించడానికి ప్రాథమికంగా అతడికి కావలసింది స్వేచ్ఛ, సమృద్ధి, ఈ రెంటి కోసం 'దీప సభ' లో సర్వోదయ సమాజ నిర్మాణం ప్రతిపాదించబడింది. సమాజం దీపాధారంవలె స్నేహాపరమైనప్పుడు మానవుడు అఖండ జ్యోతి వలె జగజ్జీగీయమానుడు కాగలడని సూత్రీకరించబడింది' అని భీమన్న స్వయంగా 'దీపసభ' కావ్య ప్రయోజనాన్ని విశదీకరించారు. విశ్వేశ్వరి అయిన పరంజ్యోతి అధ్యక్షతను జరిగిన పరిషత్తులో వివిధాలైన దీపాలు తమ తమ అనుభవాలను వివరించుట ఇందలి కావ్యవస్తువు. ఆ అనుభవాలలో మానవ జీవిత రీతులనేకం వివరింపబడ్డాడు. 'హరికెనలైటు" అనే శీర్షికలో కర్షక జీవితం, తత్ప్రాశస్త్యం వివరింపబడింది. 'కొబ్బరి తుంట' అనే కవితా ఖండికలో కూలీల జీవితంలోని దుర్భరకష్టంను భీమన్న హృదయ విదారకంగా వర్ణించాడు. బండి దీపంలో దుర్భర దారిద్ర్య పీడితులైన నిరుపేదల బ్రతుకులు వివరింపబడ్డాయి.

శాస్త్ర విజ్ఞాన యోగంలో జీవిస్తున్న ఆధునిక మానవుడు సాధించిన విషయాలను కొనియాడి ఆ ఫలితాలను సామాన్యులకు కూడ అందుబాటులోకి రావలెనని అభిలషించిన అభ్యుదయ కవి కె.బాపురెడ్డి. వీరి 'రాకెట్టు రాయబారం' చక్కటి సందేశ కావ్యం, 'పాడేరు పాట, అరకులో అభ్యుదయం' మొదలైన రచనలలో బాపురెడ్డి గిరిజనుల జీవితాలను బాగుపరచటానికి ప్రభుత్వం తలపెట్టిన ప్రణాళికలను ప్రస్తుతించారు. 'కూలివాడు కుబేరుడు' లో పొదుపు ఉద్యమాన్ని ప్రచారం చేశాడు. బాపురెడ్డి గేయాలలో కవిత్వం కంటే ప్రచార ధోరణి ఎక్కువ.

**ఆధార గ్రంథాలు:**

1) ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు, ప్రయోగములు - ఆచార్య సి. నారాయణరెడ్డి.

2) తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - ఆచార్య వెలమల సిమ్మన్న

3) తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) - ఆచార్య జి. నాగయ్య.

**- డా. జి. గౌరి**

## పాఠం - 9

# తెలంగాణ పోరాట కవిత్వం

# విప్లవ కవిత్వం

**విషయ క్రమం:**

**9.1.** తెలంగాణా పోరాట కవిత్వం

**8.2.** విప్లవ కవిత్వం

### 9.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

తెలంగాణ పోరాట కవిత్వోద్యమం గురించి, విప్లవ కవిత్వోద్యమం గురించి, విప్లవ కవిత్వోద్యమం గురించి విద్యార్థులకు అవగాహన కలిగించటం.

### 9.1. తెలంగాణ పోరాట కవిత్వం:

తెలంగాణ పోరాటం తెలుగు సాహిత్యంలో నవ్యకవితకు వికాసదశను కలుగజేసింది. నైజాం నవాబు ఫ్యూడల్ నియంతృత్వానికి వ్యతిరేకంగా జాగీర్దార్ల భూస్వాముల వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా తెలంగాణ ఆంధ్ర మహాసభ సాగిస్తున్న వీరోచిత పోరాట ప్రభావంతో తెలుగు సాహిత్యం అగ్నిపూలు పూసింది. నిప్పుల ఉప్పెన వలె ఉప్పొంగింది. ఎందరో అజ్ఞాత కవులు. అందులో నిరక్షరాస్యులు కూడా ఉన్నారు. "నైజాము సరకరోడ, నాజీలమించినోడ, యమబాధలు పెడితివి కొడుకో, నైజాము సరకరోడ... చుట్టూ సూర్యపేట, నట్టానడుమ నల్లగొండ, అవతల గోలుకొండ, గోలకొండ ఖిల్ల కింద, నీగోరి కడతాం కొడకో, నైజాము సరకరోడ..." అని గొంతెత్తి పాడారు. ఈ పాటలోని 'నాజీలమించినోడ' అనేది అభ్యుదయ కవులు చేర్చినదై ఉంటుంది. జనచైతన్యం సాహిత్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో కూడా తెలంగాణ విముక్తి సమరం నిరూపించింది.

తెలంగాణ పోరాట సందర్భంలో ప్రజల తలలో నాలుకై ప్రజాకవిగా ప్రసిద్ధిగాంచిన కవి కాళోజీ నారాయణరావు. ఆయన అన్యాయాన్ని ప్రతిఘటించిన సాహసి. ఆర్ద్రమైన మనస్సుతో జాలువారు కన్నీటితో ఆర్తులను ఆదుకొన్న దయామూర్తి, తెలంగాణ ప్రజలను రాజకీయంగా చైతన్యవంతులను చేయుటకు ప్రయత్నించారు. 'నా గొడవ' అనే పేరుతో కాళోజీ రాసిన కావ్య సంపుటాలలో తెలంగాణ ప్రజల గొడవను బాధలను వ్యక్తం చేశాడు. 'కైతచేత మేల్కొల్పకున్న కాళోజీ కాయము చాలింక' అని ప్రతిజ్ఞ చేశారు. నవయుగంలో నాజీవృత్తుల, నగ్న నృత్యం ఇంకెన్నాళ్ళు, పోలీసు అండను దౌర్జన్యశక్తులు, పోషణ బొందె దెన్నాళ్ళు' అని విజృంభించిన రజాకార్లను గర్జించి కాళోజి ఎదిరించి ప్రజలను ఉత్తేజపరచారు. పేదరైతుని పీల్చి పిప్పి చేసే పాలనావ్యవస్థ అంతమొందాలని ఎలుగెత్తి చాటాడు. 'పండించు ప్రాణాలు వస్తుపడ్డాక, పాడు రాజ్యాన్ని కాపాడకుంటేమి, రక్షించు వారలే భక్షించినాక, విష్ణువని రేని సేవింపకుంటేనేమి అని నిజామును ఎదిరించి పల్కాడు. కాళోజికి కవిత్వమే ప్రచార సాధనం. అతడి రచనా ధోరణి ప్రజా హృదయానికి చేరువైంది. అందు కావ్యశిల్పం కొరకు గాలించి ప్రయోజనం లేదు.

ఆంధ్ర మహాసభ కార్యకర్తగా, ఫ్యూడల్ వ్యతిరేక సమరసైనికుడుగా దాశరథి "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని పలికారు. 'కళ్ళల్లో కోపం ఒళ్ళంతా కవిత్వం' తో తరతరాల బూజు నిజాంరాజును 'ఖబడ్దార్' అని హెచ్చరించి "ముసలి నక్కకు రాచరికంబు దక్కునే" అని అగ్ని వీణ మీటుతూ కవితలు రచించారు. దాశరథి మహేంద్రోదయ కవి. తెలంగాణ స్వాతంత్ర్య

వీరుడు. ఇరవై ఏండ్ల వయస్సులోనే దాశరథి నిజాము రాజు చెరసాలలో ఖైదీ అయ్యాడు. నిజామాబాదు జైలులో శిక్షను అనుభవిస్తూ ఒకరోజు జైలుగోడ మీద బొగ్గుతో దాశరథి రాసిన పద్యమిది.

**"ఓ నిజాము పిశాచమా కానరాదు**
**నిన్ను బోలిన రాజు మాకెన్నడేని**
**తీగెలను తెంపి అగ్నిలో దింపినావు**
**నా తెలంగాణ కోటి రత్నాల వీణ"**

"నిజాం రాష్ట్రంలో ప్రభుత్వ నిరంకుశత్వం, ప్రజల అగచాట్లు, భారత స్వాతంత్ర్యం, భారత సైన్యాల ప్రవేశం, నైజాం ప్రభుత్వ పతనం ఇవన్నీ నా రచనకు పునాదులు" అని దాశరథి స్వయంగా తెలిపారు. కేవలం కవిత్వానికే పరిమితమై పోక దాశరథి పోరాటంతో ప్రత్యక్షంగా పాల్గొని, లాఠీదెబ్బలు తిని జైలు జీవితపు బాధలనుభవించి, పోలీసుల తుపాకీల నుండి ప్రాణాలతో బయటపడిన సాహసమూర్తి. దాశరథి అగ్నిధార, రుద్రవీణలలో తెలంగాణ పోరాటం గురించి ఖండికలున్నాయి.

'విద్యుత్తులా ఊహించగల మనకు మద్యంలా పారే పాత ఛందస్సు పనికిరాదు' అని భావించి దాశరథి విద్యుత్ ఛందస్సు అయిన వచన కవిత్వాన్ని ఆదరించాడు. "అగ్నిధార, తిమిరంతో సమరం, ఆలోచనా లోచనాలు" మొదలైనవి దాశరథి వచన కవిత్వంలో రాసిన కావ్యాలలో ముఖ్యమైనవి. పద్యం నడక, గేయపు సొగసు చక్కగా తెలిసిన దాశరథి వచన కవిత్వాన్ని కొన్ని చోట్ల లయబద్ధంగా, మరికొన్ని చోట్ల నిక్కచ్చిగా ఉండునట్లు రచించాడు. 'నిరుపేదా, శ్రామికజాతి, అనంత సంగ్రామం, పదే పదే అనేస్తా' ఇత్యాది కావ్య ఖండికలు దాశరథి వచన కవిత్వంలో రాశాడు. 'రూపాయి విలువ లేని రోజు రేపు వస్తుందట, మస్తిష్కంలో లెబోరేటరీ, మేల్కొన్న మనిషిని చూడడానికి వెళుతున్నాను, రేపటి జలపాతాలు, కంటికి కనిపించిందంతా కైతగా రాసేస్తున్నాను, మొదలైన ఖండకావ్యాలలో దాశరథి వచన కవిత్వం అభ్యుదయ భావాలతో శక్తిమంతంగా సాగింది, ఉర్దూ, పర్షియన్ భాషలలో నిష్ణాతుడైన దాశరథి 'గజల్' వంటి ప్రక్రియలలోవలె క్లుప్తంగా 'కప్లెట్ల' వంటి వచన గీతాలను వెలయించి ఆధునిక కవితకు పుష్టిని చేకూర్చారు.

నిజాం ప్రభుత్వం విధించిన ఆంక్షల కారణంగా తెలంగాణా పోరాట వివరాలు బయటి ప్రపంచానికి తెలియలేదు. దొడ్డి కొమరయ్యను విసునూరి దేశముఖ్ పంపిన గూండాలు హత్యచేసిన వార్త, వరంగల్లులో మొగలయ్యని రజాకార్ దుండగులు పట్టపగలు హత్య చేసిన విషయం, రజాకార్లు మానభంగం చేసిన స్త్రీ వృత్తాంతం మొదలైనవి పత్రికలలో చదివి, ప్రజల నుండి విని తెలుసుకొని కవితావేశం పొంది రసవంతమైన కావ్యాలను రచించిన వారిలో పేర్కొనదగినవారు ఆరుద్ర, సోమసుందర్, కుందుర్తి, రమణారెడ్డి, గంగినేని, రెంటాల మొదలైనవారు.

హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ రచించిన "Tales of Telangana" ను ఆరుద్ర అనువదించారు. ఆరుద్ర రచించిన "త్వమేవాహమ్" (నీవే నేను) తెలంగాణలోని సామాన్యులు అనుభవించే బాధలను హృదయ విదారకంగా చిత్రించింది. సంవిధాన శిల్పంలో సరిక్రొత్త పోకడలతో వెలసిన కావ్యమిది. పాఠకులు ఊహించలేని ప్రతీకలతో, రూపచిత్రాలతో, అర్థంకాని ఆంగ్లపద ప్రయోగాలతో సంఘటనల 'రెఫరెన్సు' లతో ఆరుద్ర త్వమేవాహమ్‌లో చేసిన ప్రయోగాలు అభినవ నారికేళపాకంగా, పాషాణ పాకంగా తయారయ్యాయి. ఆరుద్ర ప్రతిభావంతుడైన అభ్యుదయకవి అయినా కొత్తకొత్త పోకడల చాపల్యం కారణంగా అతని కవిత నిగూఢమై అర్థకాని విధంగా తయారైంది. "కవిత కోసం నేను పుట్టాను, కాంతి కోసం కలం పట్టాను" అని ఆరుద్ర చాటిచెప్పి నూతన సమాజ నిర్మాణం కోసం కృషిచేశారు. ఆరుద్ర కవిత్వంపై టి.ఎస్. ఇలియట్, డిలాన్ థామస్, ఎమిలీ

డికిన్‌సన్, ఆగ్టన్‌నేఫ్ మొదలైన పాశ్చాత్యకవుల ప్రభావముంది. కవిత్వంలో ఆరుద్ర చేసిన ప్రయోగాలను హర్షించలేని విమర్శకులు వాటిని 'సర్కస్ ఫీట్లు' అన్నారు.

'త్వమేవాహమ్' తర్వాత ఆరుద్ర రాసిన సినీవాలి, పైలా పచ్చీసు, ఇంటింటి పజ్యాలు, గాయాలూ – గేయాలూ, ఏటికేడాది మొదలైనవి వచన కవిత్వానికి చెందిన రచనలు. కూనలమ్మ పదాలను మాత్రాచ్ఛందస్సులో ఎంచిన పజ్యాలను వృత్తాలలో రచించారు. వచన కవితలో ఛందోబద్ధమైన వృత్తాలను ఇమడ్చటం ఆరుద్ర వారిలోని ప్రత్యేకత, ఆరుద్ర వచన కవిత్వంలో అంత్య ప్రాస నియమాన్ని పాటించారు. 'సినీవాలి' లో నాటకీయత వ్యక్తం అవుతుంది. 'ఇంటింటి పజ్యాల' లో మనసుని ఝల్లు మనిపించే ఝటితి స్ఫూర్తి కనిపిస్తుంది. 'ఏటికేడాది' లో సమకాలిక సమాజంలో మార్పుకావాలనే ఆకాంక్ష కనిపిస్తుంది. ఇంటింటి పజ్యాలలో ఆరుద్ర వచన కవిత్వానికి లాలిత్యం
కూర్చారు. 'పైలపచ్చీసు' లో వైచిత్రీ ప్రియత్వం కనిపిస్తుంది. ఈ రచనలన్నీ ఆరుద్ర కవితా వైభవాన్ని తెలియజేస్తాయి.

ఆమంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం' తెలంగాణ విప్లవ పోరాటాన్ని వర్ణించిన చక్కటి అభ్యుదయ రచన. దీనిలో తెలంగాణ పోరాట తీవ్రత కనిపిస్తుంది. కుందుర్తి ఆంజనేయులు విప్లవ అవగాహనతో భూస్వామ్య వ్యవస్థపై శ్రామికుల తిరుగుబాటుగా తెలంగాణా పోరాటాన్ని కావ్య వస్తువుగా స్వీకరించి 1949వ సంవత్సరంలో "తెలంగాణా" కావ్యాన్ని 16 పర్వాలుగా 16 రోజులలో పూర్తి చేశారు. అప్పటికి పోలీసు చర్య జరగలేదు. 1956వ సంవత్సరంలో మరో రెండు పర్వాలు పెంచి 18 పర్వాలుగా ఈ కావ్యాన్ని ప్రచురించారు. "బహుశా యిదే మొదలనుకుంటాను, గేయాలు తెచ్చిన కొత్త వెలుగు ఆధునికయుగంలో ఒక పూర్ణ కావ్యంగా బ్రతుకును వర్ణించటం" అని కుందుర్తి చెప్పినట్లుగా పూర్తిగా వచ్చిన కవిత్వంలో వచ్చిన మొదటి కావ్యమిది. మార్క్సిస్టు సిద్ధాంత అవగాహనతో సామాజిక చైతన్యాన్ని ప్రబోధిస్తూ సంఘాన్ని పురోగమింప జేయుట కుందుర్తి కవితా లక్ష్యం. సామాన్య మానవుడితో చైతన్యం కల్గించటం కుందుర్తి కవిత్వ పరమార్థం. సంస్కృత సమాస భూయిష్టమైన శైలికి, ఆంగ్లపదాలను విరివిగా ఉపయోగించటానికి కుందుర్తి పూర్తి వ్యతిరేకి. అందుకే వీరి కవిత్వం తేటతెలుగు మాటలతో నిరక్షరాస్యులను కూడా అలరిస్తుంది. "తెలంగాణ" కావ్యం తెలంగాణ ప్రజల జీవిత వృత్తాంతం. తెలంగాణ జన జీవిత మహాభారతంగా దీనిని కుందుర్తి 18 పర్వాలలో రూపొందించారు. పాలక వ్యవస్థ మీద తెలంగాణ ప్రజల తిరుగుబాటును, ప్రజలలో కలిగిన ఉద్యమ చైతన్యాన్ని కుందుర్తి కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు. "తెలంగాణను వర్ణించటానికి తెలుగులో మాటలు చాలవు. దానిని హెలంగాణా అంటున్నాను" అని కుందుర్తి నాటి పరిస్థితులను చక్కగా తెలిపారు. "నిజం జయిస్తుంది ధర్మం జయిస్తుంది వెలుగు జయిస్తుంది" అని అభ్యుదయ భావాన్ని, సమాజ పురోగతిని కాంక్షిస్తూ కుందుర్తి 'తెలంగాణ' కావ్యాన్ని ముగించారు. 'తెలంగాణ' మొదటి వచన కావ్యంగానే కాక 'తొలి తెలుగు వచన విప్లవ కావ్యం' గా కూడ ఆదరించదగింది.

కుందుర్తి 1940వ సంవత్సరానికి ముందు బావకవిత్వ ప్రభావానికి లోనై తేటగీతి పద్యాలలో 'రసధుని' కావ్యాన్ని, వృత్తపద్యాలలో 'అమావాస్య' అనే విరహ కావ్యాన్ని, 'నా ప్రేయసి' అనే ఖండకావ్యాన్ని రచించారు. తరువాత శ్రీశ్రీ రచనల వల్ల ప్రభావితుడై మార్క్సు సిద్ధాంతం పట్ల అభిమానాన్ని పెంచుకొన్నారు. 1941వ సంవత్సరంలో కుందుర్తి రాసిన 'జయిస్తుంది' గేయ రచన శ్రీశ్రీ మహాప్రస్థాన గేయాన్ని స్ఫురణకు తెస్తుంది. 1942వ సంవత్సరంలో రాసిన 'తరువాత' అనే గేయంలో ఆవేశపు తీవ్రత తగ్గింది. 1943వ సంవత్సరంలో 'మన్యంలో' అనే గేయంలో అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య ఇచ్ఛను కీర్తించారు. 1944వ సంవత్సరంలో ప్రచురింపబడిన 'నయాగరా' కావ్యంలో కుందుర్తి రచించిన మూడు గేయాలున్నాయి.

'నయాగరా' కావ్యంలో వర్గ సంఘర్షణ, విప్లవం, సమ సమాజ స్థాపన ప్రధాన విషయాలు. 'యుగేయుగే', 'నగరంలో వాన', 'భగవంతునికి బహిరంగ లేఖ' రచనలలో కుందుర్తి ఆర్థిక అసమానతను, కరువు కాటకాలను, గుమాస్తా జీవితాన్ని, వీది మానిసి బ్రతుకుని, చాలీచాలని జీతాలతో బాధపడిన నగరంలోని ఉద్యోగుల అవస్థలను, అవినీతిని, మనుషులలోని స్వార్థాన్ని, రాజకీయ నాయకుల ఎత్తుగడలను, మార్పు చెందని సమాజ వ్యవస్థ పట్ల ఆవేదనని వెల్లడించారు. ఈ కావ్యాల ద్వారా సామాన్యుడిని చైతన్యపరిచారు. సామాన్య మానవుడి శ్రేయస్సుని కాంక్షించారు.

కుందుర్తి తన కవిత్వం చదువు సంధ్యలు రాని రోడ్డు మీద పామరుని ఉద్దేశించి రాసిందని చెప్పారు. "ప్రయోజనం తండ్రిగా, పరమ సౌందర్యం తల్లిగా పలికే ప్రతిపలుకు రసానంద కల్పవల్లిగా' 'నాదారి నాది' అని కుందుర్తి తమ "నాలోని నాదాలు" లో తన కవితా ప్రయోజనాన్ని, కవితా తత్వాన్ని వెల్లడించారు. కుందుర్తి కవిత్వంలో సామాజిక స్పృహ, భవిష్యత్తుపై ప్రగాఢ విశ్వాసం కనిపిస్తాయి. 'సంప్రదాయాన్ని మన్నించటమంటే, సమస్తం అనుకరించటం కాదు. అయినా పాత మాపు నాది, నన్నయ నుండి నా దాకా తెలుగు కవిత అంతానాది' అని తన "దండయాత్ర" లో ప్రకటించాడు. కుందుర్తి నన్నయ తిక్కన, శ్రీనాథుల వంటి ప్రాచీన కవులను, విశ్వనాథ, జాషువా వంటి సంప్రదాయజ్ఞులను అభిమానించారు. సంప్రదాయాన్ని హేతువాదంతో పరిశీలించి శాస్త్ర ప్రమాణంకు నిలబడని వాటిని కాదని మంచిని గ్రహించాలనే మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అవగాహన చేసుకున్న కవి కుందుర్తి. కుందుర్తి మొదట మార్క్సువాది, నాస్తికులు. తరువాత మానవతావాదులు, ఆస్తికులుగా మారారు. తెలంగాణా కావ్య రచన తర్వాతే ఈ మార్పు అతడిలో వచ్చింది. కుందుర్తి మత మానవతావాదం "నగరంలో వాన" అనే కవితా సంపుటిలో కనిపిస్తుంది.

**"ఒకనాడు పరమ నాస్తికుడు**
**సంఘాన్ని మార్చదలచిన మహావీరుడు**
**విప్లవభావాల పల్లకీ మీద**
**ఊరేగిన ఉత్సాహవంతుడు**
**ఈనాడు దేవుడికి నమ్మినబంటు"**

కుందుర్తి కవితకు తగిన కీర్తి, గుర్తింపు లభించాయి. 1969వ సంవత్సరంలో 'నగరంలో వాన', 'నాలోన నాదాలు' కు సోవియట్ భూమి నెహ్రూ అవార్డు, 1970వ సంవత్సరంలో 'నగరంలో వాన' కు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి, 1977వ సంవత్సరంలో కుందుర్తి రచనలకు కేంద్ర సాహిత్య అకాడమి బహుమతి లభించాయి. కుందుర్తి విప్లవం అభ్యుదయ పథానికి అంకితమైంది.

కె.వి. రమణా రెడ్డి "అడవి", "భువన ఘోష" అనే కావ్యాలలో తెలంగాణ పోరాటంలో పాల్గొన్న వీర యోధుల స్మృతి చిహ్నంగా, ప్రజల దుర్మార్గాన్ని ఎదుర్కోవాలని ప్రబోధించారు. "తెలంగాణ కనుబొమ్మలు సంధ్యలు, తెలంగాణ కనుపాపలు పడగలు, తెలంగాణ – జన కార్యము వీర్యము, తెలంగాణ జవనాశ్వము సింహము" అని రమణారెడ్డి వర్ణించారు. గంగినేని "ఉదయిని" కూడా తెలంగాణ పోరాటాన్ని చిత్రించిన కావ్యము. రెంటాల "సంఘర్షణ", "సర్పయాగం" కావ్యాలు తెలంగాణలో పీడనకు, చిత్రవధలకు గురైన ప్రజల సమస్యలను చిత్రించాయి. ఈ విధంగా జన చైతన్యాన్ని సాహిత్యం ఎలా ప్రభావితం చేస్తుందో తెలంగాణ విముక్తి పోరాటం నిరూపించింది. నైజాం పతనం తర్వాత సాహిత్యంపై ప్రభావం చూపలేకపోయింది.

## 9.2. విప్లవ కవిత్వం:

ఆంగ్లంలో 'రివొల్యూషన్' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో 'విప్లవం' అనేపదం ఉపయోగిస్తారు. ఒక సాంఘిక వ్యవస్థలోని అన్ని విషయాలు నూటికి నూరుశాతం పూర్తి స్థాయిలో మార్పు జరిగితే అది 'విప్లవం'. ఇంకా చెప్పాలంటే అభివృద్ధి నిరోధకమైన ఒకానొక వ్యవస్థని నాశనం చేసి, సమూలంగా కూలదోసి మరో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయటమే విప్లవం. విప్లవం రావాలంటే బలప్రయోగం లేదా హింస తప్పనిసరిగా చేయాలి. విప్లవం ఊరికే రాదు. ఏ దేశంలో అలారాలేదు కూడా. దానికి శ్రమ, పట్టుదల ఉండాలి. కొన్ని త్యాగాలు తప్పనిసరి. ముఖ్యంగా నమ్మిన సిద్ధాంతం పట్ల నిబద్ధత ఉండాలి. అప్పుడే విప్లవం వస్తుంది. తెలుగు సాహిత్యంలో 1970-1990 మధ్య కాలాన్ని విప్లవోద్యమ కాలంగా విమర్శకులు భావించారు. ఆ కాలంలో విప్లవ కవిత్వం, కథలు, వ్యాసాలు వేల సంఖ్యలో వచ్చాయి. ఆ కాలానికి అటు ఇటు ఇంకా విప్లవ సాహిత్యం వచ్చినప్పటికీ విమర్శకులు మాత్రం దాని విస్తృతిని బట్టి స్థూలంగా కాలనిర్ణయం చేశారు.

### 9.2.1. విప్లవ సాహిత్యం - చారిత్రక నేపథ్యం:

1947 ఆగష్టు 15న మనకు స్వాతంత్ర్యం వచ్చింది. దానితో సామాన్యుడికి మేలు జరుగుతుందని అందరూ ఆశించారు. అయితే సమస్యలు తీరలేదు. ఇంకా ఎక్కువయ్యాయి. అధికార మార్పిడి మాత్రమే జరిగింది. నెహ్రూ నాయకత్వంలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని ఆశపడ్డారు. పంచవర్ష ప్రణాళికలు సామాన్యుడి దగ్గరకు వెళ్ళలేకపోయాయి. దేశంలో అవినీతి, కుల కక్షలు, నిరుద్యోగం, బంధు ప్రీతి ఎక్కువైపోయాయి. చివరకు డబ్బు గలవారు మరికొంచెం ఎక్కువగా డబ్బు సంపాదించుకున్నారు. పేదవాడు మరికొంచెం పేదవాడిగా మారాడు. భూస్వాములు, పెట్టుబడిదారులు అధికారం చెలాయించారు. జాగృతి గల ప్రజలు తిరగబడటం నేర్చుకున్నారు. కార్మికులు, వ్యవసాయ కూలీలు, గిరిజనుల నుంచి ప్రతిఘటన ప్రారంభమైంది. అగ్ర రాజ్యమైన రష్యా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్ధతు పలికింది. 1956వ సంవత్సరంలో రష్యా కమ్యూనిస్టు పార్టీ సోషలిస్టు వ్యవస్థ స్థాపన తన ధ్యేయమని చెప్పింది. భారతదేశంలోని "భారత కమ్యూనిస్టు పార్టీ" కాంగ్రెస్ పార్టీతో మంచి సంబంధాలు పెట్టుకుంది. అయితే ఈ సంబంధాలు ఎంతో కాలం నిలువలేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా కమ్యూనిస్టులు వ్యతిరేకించారు. భారతదేశంలోని పార్లమెంటరీ వ్యవస్థను నూతన ప్రజాస్వామ్య వ్యవస్థగా రూపొందించడానికి భారత కమ్యూనిస్టు పార్టీలో కొందరు ఆలోచించారు. వారినే "రాడికల్స్" అన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట విరమణ సందర్భంగా 1951వ సంవత్సరంలో భారత కమ్యూనిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలు చోటుచేసుకున్నాయి. భారత చైనా యుద్ధం నాటికి విభేదాలు ఎక్కువయ్యాయి. 1962వ సంవత్సరంలో భారత - చైనా యుద్ధం జరిగింది. భారతదేశానికి భారత కమ్యూనిస్టు పార్టీ సపోర్టు చేసింది. భారత కమ్యునిస్టు పార్టీ లోని ఒక వర్గం, అంటే తీవ్రవాద వర్గం రాడికల్ వర్గం చైనాకు మద్దతునిచ్చింది. తర్వాత కాలంలో రాడికల్ వర్గాన్ని ప్రభుత్వం అణచడానికి అన్ని ప్రయత్నాలు చేసింది. ప్రయోజనం లేకపోయింది. రాడికల్ వర్గం తిరగబడింది. దాని కారణంగా 1964వ సంవత్సరంలో రాడికల్ వర్గం భారత కమ్యూనిస్టు - మార్క్సిస్టు పార్టీగా (CPI-M) గా అవతరించింది. ఈ పార్టీ నిజమైన స్వాతంత్ర్యం విప్లవం ద్వారా వస్తుందని ఆశించింది. ఈ పార్టీ రానురాను భారతదేశంలో తన బలాన్ని నిలబెట్టుకుంది. యువకుల్లో ఉత్తేజాన్ని ఈ పార్టీ కలిగించింది. ఒక గొప్ప సామాజిక విప్లవం ద్వారా మాత్రమే భారతదేశంలో ప్రజల సమస్యలు తీరుతాయని వక్కాణించింది.

పశ్చిమ బెంగాల్‌లో డార్జిలింగ్ జిల్లా నక్సల్బరీ గ్రామంలో గిరిజనులు భూస్వాములపై 1967వ సంవత్సరంలో తిరుగుబాటు చేశారు. చాలా అల్లరులు, ఆందోళనలు జరిగాయి. చివరకు గిరిజనులు తమ భూముల్ని తిరిగి స్వాధీనం

చేసుకున్నారు. ఈ గిరిజనుల రైతాంగ పోరాటానికి చారు మజుందార్, కానూ సన్యాల్ లాంటివారు సారథ్యం వహించారు. మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ 1969వ సంవత్సరంలో ఏర్పడింది. అప్పటి ప్రభుత్వం ఈ తిరుగుబాటును అణచివేసింది. ఆ కారణంగా చారు మజుందార్ 1972వ సంవత్సరంలో అరెస్ట్ అయ్యారు. చివరకు పోలీసు కస్టడీలోనే మరణించారు. నక్సల్బరీ పనులు ఆగలేదు సరికదా ఇంకా ఎక్కువయ్యాయి. నక్సల్బరీ గానాన్ని కవులు పాటకట్టారు. తమ కవిత్వంలో పార్టీ అభిప్రాయాల్ని పొందుపరిచారు. బలంగా ప్రచారం చేశారు.

శ్రీకాకాళంలో గిరిజన పోరాటం 1967వ సంవత్సరంలో మొదలైంది. భూస్వాములపై గిరిజనులు తిరుగబడ్డారు. గిరిజనులకు మద్దతుగా ఎందరో మహామహా మేధావులు ముందుకు వచ్చారు. తరిమెల నాగిరెడ్డి, నాగభూషణ పట్నాయక్ మొదలైనవారు నాయకత్వం వహించారు. ప్రజల్ని చైతన్యవంతులుగా మార్చారు. శ్రీకాకుళంలో జరిగిన పోరాటంలో అనేక మంది అమరులయ్యారు. విప్లవకారులపై 1970వ సంవత్సరంలో పార్వతిపురం కుట్ర కేసు పెట్టింది. ఉద్యమం అపజయం పాలైన ఆ స్ఫూర్తి నుంచే తెలుగు సాహిత్యంలో విప్లవోద్యమం మొదలైంది. తన పాటతో విప్లవానికి నాంది పలికిన మొనగాడు సుబ్బారావు పాణిగ్రాహి.

శ్రీశ్రీకి విశాఖపట్నంలో 1970 ఫిబ్రవరిలో 1, 2 తేదీల్లో షష్టిపూర్తి ఘనంగా జరిగింది. ఆంధ్రదేశం మొత్తం నుంచి ప్రముఖ కవులు, కథకులు, రచయితలు వచ్చారు. శ్రీశ్రీ సాహిత్యాన్ని ప్రశంసిస్తూ, సాహితీ ఉపన్యాసాలు, కవితా గానాలు సాగుతుండగా 'బాంబు' లా సాహిత్యకారుల మధ్యలో ఒక కరపత్రం పంచబడింది. "రచయితలకు విశాఖ విద్యార్థుల సవాల్" అంటూ వెలువడిన ఆ కరపత్రం రచయితలకు మీరు ప్రజల పక్షమా? పాలకుల పక్షమా? అని ప్రశ్న వేసింది. 'అభ్యుదయం పేరుతో గొంతు చించుకొని అరిచిన వాళ్ళంతా ఆ పేరుతో కవిత్వాన్ని సొమ్ము చేసుకుంటున్నారు' అని రచియితలను తప్పుపట్టారు. మిమ్మల్ని మీరు తిరిగి చూసుకోండి అన్నారు. తాను రాసిన ప్రతి పద్యం గిరిజనులు నోటి ఊతపదంగా చేసి శ్రీకాకుళ విప్లవ పోరాటంలో వీర మరణం చెందిన సుబ్బారావు పాణిగ్రాహిలా సాహిత్యం జీవితాన్ని మార్చే శక్తిగా మీరెందుకు చెయ్యలేదు అని నీలదీశారు. ఈ కరపత్రం మేధావుల్ని, సాహితీకారులను, రచయితలను ఆలోచింపజేసింది. కవులు, రచయితలు అందరూ కలిశారు. వీరందరి కలయికతో 1970 జులై 3 వ తేదీన "విప్లవ రచయితల సంఘం" ఏర్పడింది. ఈ సంఘానికి మొదటి అధ్యక్షుడు శ్రీశ్రీ. ఈ సంఘం ఏర్పడి వారం గడువక ముందే శ్రీకాకుళం గిరిజనోద్యమ నాయకుడు వెంపటాపు సత్యంను 1970 జులై 10వ తేదీన పోలీసులు కాల్చి చంపారు. అప్పుడు శ్రీశ్రీ 'విరసం' అధ్యక్షుడిగా

**"సాయుధ విప్లవ బీభత్సుని సారథినై**

**భారత కురుక్షేత్రంలో**

**నవయుగ భగవద్గీతా ఝుంఝుని ప్రసరిస్తాను**

**మంటల చేత మాట్లాడించి**

**రక్తం చేత రాగాలాపన చేయిస్తాను"** అని ప్రతిజ్ఞ చేశారు.

"విరసం" ప్రథమ మహాసభలు 1970 అక్టోబర్‌లో ఖమ్మంలో జరిగాయి. శ్రీశ్రీ, కె.వి. రమణారెడ్డి, వరవరరావు, జ్వాలాముఖి, రావిశాస్త్రి, నిఖిలేశ్వర్, నగ్నముని, కొడవటిగంటి, కాళీపట్నం రామారావు మొదలైనవారు ఈ మహాసభల్లో పాల్గొన్నారు. ఏడు అంశాలతో విరసం ప్రణాళికను వెలువరించారు.

1) మార్క్సియన్ సోషలిజమే మనందరి ధ్యేయం.
2) ప్రజల దీర్ఘకాలిక పోరాటాన్ని గుర్తించి బలపరిచే రచయితలే ఇందులో సభ్యులు.
3) ఏ రూపంలో జరుగుతున్నా, ప్రజల వర్గపోరాటాలన్నిటినీ మనం సమర్థిస్తాం.
4) సర్వసమగ్రమైన దేశ స్వాతంత్ర్యం మన లక్ష్యం
5) వలస, భూస్వామ్య, ధనస్వామ్య అవశేషాలన్నిటినీ తొలగించి, నూతన ప్రజాస్వామ్య స్థాపనకు తోడ్పడటమే మా ఉద్దేశ్యం
6) శ్రామిక అంతర్జాతీయత మా వైఖరి
7) దేశదేశాల ప్రజల విమోచన పోరాటాన్ని మేము హృదయపూర్వకంగా బలపరుస్తాం.

"విప్లవ రచయితల సంఘం" ఈ ప్రణాళికను విప్లవ సాహిత్యోద్యమానికి ఆయుధంగా అందించింది. జీవితాల్లో స్తబ్ధత, రాజీ ధోరణిని తొలగించి సమాజంలో మార్పు తీసుకురావాలి. మార్పును వ్యతిరేకించే వారిలో సంఘర్షణ తప్పనిసరి. పోరాడే శక్తులకు మద్దతివ్వడమే కాకుండా పోరాడే అవసరాన్ని గుర్తింపజేయడం రచయితల బాధ్యతగా "విప్లవ రచయితల సంఘం" ప్రకటించింది. 1969వ సంవత్సరంలో "తిరుగబడు" కవుల కవితా సంకలనం వెలువడింది. ఇందులో వరవరరావు, అశోక్, లోచన్, కిషన్, ఎక్స్-రే, ఐ, సంజీవరావు, సుధాకర్, సుదర్శన్, యాదగిరిరావు మొదలైన పదిమంది రచయితలున్నారు. ఈ పదిమంది తిరుగబడు కవులుగా తెలుగు సాహిత్యంలో వ్యవహరింపబడుతున్నారు. విప్లవ సాహిత్యం వైపు కవులు, కథారచయితలు మొగ్గుచూపారు. అనేక విప్లవ కవితా సంకలనాలు వచ్చాయి.

**9.2.2. విప్లవ కవిత్వం - నిర్వచనం:**

"విప్లవాన్ని సమర్థిస్తూ, విప్లవోద్యమ చరిత్రను ప్రతిఫలిస్తూ విప్లవ భావాలను ప్రచారం చేస్తూ రాసే సాహిత్యం విప్లవ సాహిత్యం. రాసే కవిత్వం విప్లవ కవిత్వం ఒక్క మాటలో చెప్పాలంటే విప్లవం వస్తువుగా వచ్చే కవిత్వం విప్లవ కవిత్వం అనవచ్చు". - ఆచార్య కాత్యాయనీ విద్మహే

"విప్లవం అంటే ఏమిటి? అస్తిత్వంలో వున్న సామాజిక ధర్మాన్ని తోసి రాజని కొత్త ధర్మాన్ని స్థాపించటానికి జరిగే క్రియాకలాపం విప్లవం. అసమాన వ్యవస్థను నశింపజేసి సమానతా ధర్మస్థాపన చేయటం విప్లవం. ప్రస్తుత సందర్భంలో ఇది వర్గ అసమానతల నిర్మూలననే సంబోధిస్తుంది. మరీ ముఖ్యంగా భూసంబంధాలలోని అసమానతలనే లక్ష్యంగా చేసుకున్నది. అందుకనే భూస్వామ్య వ్యతిరేక రైతాంగ విప్లవం. అస్తిత్వంలో వున్న రాజ్యాధికార వ్యవస్థపై ధిక్కారం భూసంబంధాలను భూమి లేని అశేష పేద జన ప్రయోజనాలకు అనుకూలంగా మంచిని మార్చలేని రాజ్యాధికార స్వభావాన్ని గుర్తెరిగిన తిరుగుబాటు. భూస్వామ్య ఆర్థిక పునాది మీద ఏర్పడిన రాజకీయ వ్యవస్థను బలప్రయోగంతో సమూలంగా పెకలించే కార్యక్రమం. ఈ కార్యక్రమ రూపాలను, సారాన్ని గుణాత్మకంగా విమర్శనాత్మకంగా అనుసృజించేది విప్లవ కవిత్వం. విప్లవ నిర్మాణానికి, నిర్వహణకు సంబంధించిన రాజకీయ సిద్ధాంత తాత్వికతకు అనుకూలమైనదంతా విప్లవ కవిత్వమే. విప్లవ భావ తీవ్రతను విప్లవ కార్యాచరణను వస్తువుగా చేసుకున్నది విప్లవ కవిత్వం". - ఆచార్య కేతవరపు రామకోటి శాస్త్రి.

**9.2.3. విప్లవ కవిత్వోద్యమ లక్షణాలు:**

1) విప్లవ కవిత్వోద్యమం విప్లవోద్యమ చరిత్రతో ముడిపడి వుంది. నిర్దిష్ట జాతీయ అంతర్జాతీయ సంఘటనలకు, సందర్భాలకు ప్రతిస్పందనగా వ్యాఖ్యానంగా వుంటుంది విప్లవ కవిత్వోద్యమం.

2) విప్లవ సిద్ధాంత అవగాహన కలిగించటం విప్లవోద్యమ కవితా లక్షణం.
3) విప్లవ నిర్మాణంలోకి వివిధ వర్గాల ప్రజలను సమీకరించటం దాని లక్ష్యం. కాబట్టి ఆయా ప్రజల జీవన సమస్యలు వాళ్ళ చైతన్యాన్ని అభివృద్ధి పరచే విధంగా కవిత్వీకరింపబడతాయి విప్లవోద్యమ కవిత్వంలో.
4) విప్లవ నిర్మాణంలో వచ్చే ఆటుపోట్లను గురించిన అవగాహన కలిగిస్తూనే సాహసాన్ని జీవనశక్తిగా మలచటం విప్లవోద్యమ కవిత్వ లక్షణం.
5) విప్లవోద్యమంలో క్రియాశీలక పాత్ర నిర్వహిస్తూ విధినిర్వహణలో మరణించిన విప్లవకారులను గుర్తుచేసుకుంటూ, కీర్తిస్తూ వారిని స్ఫూర్తి దాతలుగా స్థాపిస్తూ కవిత్వం రాయటం కూడా విప్లవోద్యమం కవిత్వంలో ప్రధాన లక్షణం.
6) సకల మానవ సంబంధాలను విప్లవీకరించటం విప్లవ కవిత్వ లక్షణం.
7) స్థానిక ప్రజల పట్ల ప్రేమ, దేశం పట్ల భక్తి, గౌరవాలు విప్లవ కవిత్వోద్యమం లక్షణాలు.

**9.2.4. విప్లవ కవిత్వం:**

"ఝుం ఝుం" కవితా సంకలనం 1970వ సంవత్సరంలో విప్లవ కవిత్వోద్యమ ప్రారంభంలో వచ్చింది. ఈ సంకలనం శ్రీకాకుళం గిరిజన పోరాటంలో ప్రధాన పాత్ర వహించి, ప్రాణాలర్పించిన సుబ్బారావు పాణిగ్రాహికి అంకితం ఇవ్వబడింది. ఈ కవితా సంకలనాన్ని ప్రభుత్వం నిషేధించింది. జానపద బాణీలో తనదైన శైలిలో పాటలు పాడి ప్రజల్ని ఉగ్రూతలూగించి అనేక విప్లవ కవితలు సుబ్బారావు పాణిగ్రాహి రాశారు. సాయుధ పోరాటంలో చనిపోయిన నక్సలైట్ నాయకులపై అనేక స్మృతిగేయాలు ఇందులో చోటు చేసుకున్నాయి. ప్రజాదరణ పొందిన విప్లవ కవితా సంకలనం ఇది. "మార్చ్" విప్లవ కవితా సంకలనకర్త పి. కిషన్‌రావు. ఇందులో కవుల పేర్లు లేవు. ఈ కవితా సంకలనం "బాలెట్లతో కాదు బుల్లెట్లతో ఈ రాజ్యాధిపత్యం చేపట్టండి" అని ప్రబోధించింది. ఈ సంకలనాన్ని కూడా ప్రభుత్వం నిషేధించింది. "లే" విప్లవ కవితా సంకలనం తిరుపతి నుంచి వచ్చింది. ఇందులో చెరబండరాజు, గద్దర్, వంగపండు ప్రసాదరావు పాటలున్నాయి. దీన్ని కూడా ప్రభుత్వం నిషేధించింది.

శ్రీశ్రీ 'మహాప్రస్థానం', 'ఖడ్గ సృష్టి' కవితా సంపుటాల్లో విప్లవ సాహిత్యాన్ని సృష్టించారు.

విప్లవకవుల్లో ప్రధానంగా ముందుగా చెప్పవలసిన కవి శ్రీశ్రీ. విప్లవ పోరాటంలో పాల్గొని ఉరిశిక్షకు గురైన భూమయ్య, క్రిష్టాగౌడ్‌ల స్మృతిలో శ్రీశ్రీ రాసిన "భూమ్యాకాశాలు" కవిత విప్లవ కవిత్వంలో ఒక ప్రత్యేకతను, విశిష్టతను సంతరించుకుంది. అదేవిధంగా "తుది పయనం – తొలి విజయం" అనే కవిత విప్లవకారుల్ని ఒక ఊపు ఊపింది.

**"ఊగరా, ఊగరా, ఊగరా!**
**ఉరికొయ్య అందుకొని ఊగరా!**
**ఉరికొయ్య అంటుకొని ఊగరా!**
**..............................**
**స్వాతంత్ర్యపు మారుపేరు సామ్యవాదమే సత్యం**
**చావులేని ఆసత్యం జ్వలిస్తుంది అనునిత్యం".**

విప్లవకవుల్లో చెప్పుకోదగ్గవాడు శివసాగర్. అసలు పేరు కె.జి. సత్యమూర్తి. "నరుడో భాస్కరుడా!" అనే గేయంతో విప్లవ కవిత్వంలో ప్రముఖుడయ్యాడు. శ్రీకాకుళం రైతాంగ పోరాటంలో పాల్గొని చనిపోయిన బాగంటి భాస్కర్ మీద స్మృతి

గీతం ఇది.

**"నరుడో! భాస్కరుడా!**
**నర్రెంగ సెట్టు కింద నరుడో! భాస్కరుడా!**
**కన్నెర్రవేస్తివయ్యా నరుడో! భాస్కరుడా!**
**కన్నెర్రసేసి నీవు నరుడో! భాస్కరుడా!**
**కదనాన దూకితివా నరుడో! బాస్కరుడా!**
**....................................**
**బర్రెంక సెట్టు కింద నరుడో! భాస్కరుడా!**
**బందూకు పట్టాము నరుడో! భాస్కరుడా!**
**బందూకు సేత పట్టి నరుడో! భాస్కరుడా!**
**బంధాలు తెంచాము నరుడో! భాస్కరుడా!"**

శివసాగర్ రాసిన "తోటరాముడి పాట" పోరాటంలో గాయపడిన వీరుణ్ణి వర్ణించేది. "నా చెల్లీ చెంద్రమ్మా" కరుణ రసాత్మక కథాగేయం. "ఏటికెదురీదేవాళ్లమురా" అనేది సత్యమూర్తి (శివసాగర్) రాసిన ప్రసిద్ధ విప్లవ గీతం. సత్యమూర్తిగారు అనేక విప్లవ గేయాన్ని రాశారు. తర్వాత విరసం నుండి విడిపోయి బహుజన సమాజ్ పార్టీలో చేరారు. సత్యమూర్తి రానురాను విరసం విధానాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుతం శివసాగర్ విశాఖపట్నంలో స్థిరపడ్డారు.

చెరబండరాజు విప్లవకవుల్లో మంచి ప్రతిభావంతుడు. ఆయన "దిక్సూచి", "ముట్టడి", "గమ్యం", "కాంతి యుద్ధం", "గౌరమ్మ కలలు, "జన్మ హక్కు", "పల్లవి" అనే విప్లవ కవితలు రాశారు.

**"ఈ మట్టి నాకు పట్టెడన్నం పెట్టి పాలు తాపింది**
**రాక్షస భూస్వామ్యం రంపపు కోతల్నుంచి**
**తనను కాపాడి రుణం తీర్చుకుంటాను**
**ఆగష్టు పదిహేను ద్రోహం గురించి చెప్పకపోతే**
**అన్నం సయించదు నాకు**
**ఏ రోజైనా ప్రజాపోరాటాల విజయాలను వర్ణించకపోతే**
**ఆ రోజు జీవించినట్టుండదు"**
**"శిశుహంతక రాజ్యం ఇది**
**పశు సంతతి పాలన ఇది**
**స్వేచ్ఛా జీవుల రక్తం మాంసం**
**యధేచ్ఛగా తినమరిగిన రక్కసి**
**శిరశ్ఛేదమే మన కర్తవ్యం**
**దానికి మించిన ధర్మం శూన్యం"**

అని "గడ్డిపోచలు గర్జించాలి" అనే కవితలో చెరబండరాజు తిరుగుబాటు వేదాంతం ప్రబోధించాడు.

నగ్నముని "తూర్పుగాలి","కొయ్యగుఱ్ఱం" ఈ దృక్పథంతో నడిచినవే. ప్రారంభంలో "కేశవరావ్" లనే అసలు పేరుతో "ఉదయించని ఉదయాలు" అనే కవితా సంపుటి ప్రచురించాడు నగ్నముని. ఈయన దిగంబర కవుల్లో ప్రధానపాత్ర వహించాడు. ఆ తర్వాత విప్లవకవిగా రాణించాడు.

కోస్తా ఆంధ్రాలో 1977వ సంవత్సరంలో పెను తుఫాను వచ్చింది. ఆ తుఫాన్‌లో వేల మంది ప్రాణాలు పోయాయి. ప్రభుత్వ యంత్రాంగం నిర్లిప్తత కూడా కొంత కారణమైంది. ఆ సంఘటన నేపథ్యంలో ప్రభుత్వ వ్యవస్థ "కొయ్య గుఱ్ఱం" లా వుందని విమర్శిస్తూ "కొయ్య గుఱ్ఱం" అనే దీర్ఘ కవితను రాశారు నగ్నముని.

**"సిద్ధార్థుణ్ణి రాజ్యం పొలిమేర వరకూ**
**చేరవేసి తిరిగొచ్చిన**
**అశ్వం**
**అశ్రునయనాల్తో నాగార్జునకొండలో ఇంకా**
**నిలబడే వుంది**
**మనిషి మనసులో మాత్రం**
**మహాబోధి ఎప్పుడో కూలిపోయింది"**

అని సమాజంలో మానవతా సాహిత్యాన్ని తాత్వికంగా వివరించాడు నగ్నముని. వరవరరావు "జీవ నాడి", "చలి నెగళ్లు","స్వేచ్ఛ", "భవిష్యత్ చిత్రపటం", "సముద్రం", "ముక్త కంఠం" మొదలైన విప్లవ కవితా సంపుటాలు వెలువరించారు. "మువ్వన్నెల జెండా" లో వరవరరావుగారు

**"ధన గణ మన అధినాయక్ జయహే**
**భారత భాగ్య విధాత .**
**భయహే! భయహే!**
**భయ భయ భయ జయహే!"**

అని దేశ దౌర్భాగ్యాన్ని, విప్లవ అవసరాన్ని తెలియజేశారు. స్వతంత్ర దేశంలో సర్వత్రా భయమే రాజ్యం చేస్తుందని వ్యంగ్యంగా విమర్శించారు.

**"రక్షించండి రక్షించండి**
**దరిద్రాన్ని, అజ్ఞానాన్ని**
**రోగాలను భోగాలను**
**విప్లవం నుంచి**
**పడిపోతున్న ప్రభుత్వాలను**
**పగిలిపోతున్న పార్లమెంటు భవనం**

**పునాదుల మీద నిలిచిన మన ప్రజాస్వామ్యాన్ని**

**కాపాడండి విప్లవం నుంచి**

**పాడండి నాలుక చివరి సామ్యవాద గీతాలుచించి**

**ఆకుపచ్చ విప్లవం గురించి**

**వీయల్ 480 గిటార్ సవరించి"**

అంటూ వరవరరావుగారు దేశ పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్లు వివరించారు.

విప్లవ సాహిత్యంలో గద్దర్ ఒక మహాశక్తి. గోచి, గొంగడి తప్ప మరే ఆహార్యం లేకుండా ఆంధ్రప్రదేశ్ అంతా తిరిగి ప్రజల్ని జాగృతి చేసిన ప్రముఖ విప్లవకారులు గద్దర్ ఆధునిక సాహిత్యంలో ప్రజాకవి.

గద్దర్ వివిధ పోరాటాల్లో అమరులైన వీరుల్ని గూర్చి అద్భుతంగా గానం చేశాడు. చనిపోయిన వాళ్ళందరికీ "లాల్‌సలాములు" చెప్పాడు. భారతదేశ ప్రభుత్వం 1975వ సంవత్సరంలో అత్యవసర పరిస్థితి ప్రకటించింది. ఆ సమయంలో చాలామంది విద్యార్థులు చనిపోయారు. గద్దర్ తన పాటలో ఇలా తలుచుకుంటాడు.

**"ఏడబట్టి ఏడబెరిగె**

**ఎడకొచ్చి ఏడసచ్చె**

**ఎవరికొరకు వచ్చినారు**

**ఎవరి కొరకు సచ్చినారు**

**ఏ తల్లికడుపు పంటలోలీ –శెమ్మకేలీల వోలీ**

**కూలి తల్లి కంటిపాపలోలీ – శెమ్మకేలీల వోలీ"**

రమణా రెడ్డి గారి "ఎర్రపిడికిలి", "జైలు కోకిల, జ్వాలాముఖి గారి "ఓటమి", "తిరుగుబాటు", నిఖిలేశ్వర్ గారి "మండుతున్నతరం" శివారెడ్డి గారి "నేత్ర ధనుస్సు", "రక్తం సూర్యుడు", "ఆసుపత్రి గీతం" మొదలైనవి ఈ కోవకు చెందినవే.

1990వ సంవత్సరంలో మరో "ఝుం ఝుం" విప్లవ కవితా సంకలనం కె.వి. రమణారెడ్డి సంపాదకత్వంలో వచ్చింది. "ఈ తరం యుద్ధకవిత" 1982వ సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీ రైటర్స్ సర్కిల్ ప్రచురణగా వచ్చింది. ఇందులో శ్రీశ్రీ, శివసాగర్, చెరబండరాజు, వరవరరావు, దేవిప్రియ, నగ్నముని, శివారెడ్డి, కె. రామమోహనరాజు, హెచ్చార్కె, అజ్ఞాత సూరీడు, నందిని సిద్ధారెడ్డి, జయధీర్ తిరుమలరావు, అజంతా మొదలైనవారు రాసిన గేయాలు చోటుచేసుకున్నాయి. "దేశంలో వున్న రాజకీయ పోరాటాన్ని సమర్థిస్తూ ప్రజల్ని సమరశీలురుగా చేయడమే ఈ విప్లవ కవితా లక్ష్యం" అని ఆచార్య చేకూరి రామారావు ఈ సంకలనానికి ముందుమాట రాస్తూ అన్నారు.

1980 –94 మధ్య కాలంలో వచ్చిన విప్లవ కవిత్వం ఒక సంకలనంగా "కవిత్వంపై ఎర్రజెండా" పేరుతో 1995వ సంవత్సరంలో ప్రచురించబడింది. ఈ కవితా సంకలనం విప్లవ కవిత్వంలో వస్తు విస్తృతికీ, శిల్ప నైపుణ్యానికి గుర్తుగా మనం పేర్కోవచ్చు. "గద్దర్ పాటలు", "జనసేన పాటలు", "జననాట్య మండలి పాటలు", "గమ్యం", "ఎరుపు, కల్లోల కలల మేఘం", "అడవి ఉప్పొంగిన రాత్రి", "మహోదయం", "జముకుల కథ",'లావా", "గోదావరి లోయ" మొదలైన వాటిలో విప్లవ భావాలు చోటుచేసుకున్నాయి.

పత్రికలు కూడా విప్లవ సాహిత్యానికి ఎంతో మేలు చేశాయి. "అరుణ తార" "సృజన", "విమోచన", "ఎర్రగడ్డ", "పిలుపు", "ప్రభంజనం" మొదలైన పత్రికలు విప్లవ సాహిత్యాన్ని ప్రోత్సహించాయి. "విరసం" లో చేరకుండా, సభ్యులుగా కాకుండా ఎంతో మంది విప్లవ సాహిత్యాన్ని సృష్టించారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగాల్లో విప్లవ సాహిత్యం ప్రధాన భూమిక పోషించింది.

ఏమైనా ప్రజల ఉమ్మడి పోరాటాలను పట్టించుకోకుండా వారి చైతన్యానికి పరిమితులను గుర్తించక సంకుచితమైన ఆత్మాశ్రయ ధోరణికి గురవటం వలనే మాజీ దిగంబర కవులు, విరసం కవులు ప్రధాన జీవన స్రవంతికి దూరంగానే ఉండిపోయారని చెప్పవచ్చు. స్వాతంత్ర్యానంతరం వెలసిన తెలుగు కవిత్వపు తీరుతెన్నులను పరిశీలిస్తే అందులో విప్లవ కవుల రచనలే శ్రేష్ఠమైనవని చెప్పక తప్పదు. అభ్యుదయ కవుల కంటే కూడ విప్లవ కవులు జన జీవితాన్ని అర్థం చేసుకొని కవిత్వాన్ని జనసామాన్యానికి సన్నిహితంగా తీసుకొని వచ్చారని విప్లవాన్ని ఆహ్వానించిన వారి రచనలు నిస్సందేహంగా మేలైనవని చెప్పవచ్చు.

సాహిత్య సాంస్కృతిక రంగానికే పరిమితం కావలసిన 'విరసం' దేశంలో చెలరేగిన అతివాద రాజకీయ పక్షాల అభిప్రాయాలకు తావిచ్చింది. అతివాద రాజకీయ పక్షాలలో వచ్చిన చీలికలు 'విరసం' లో కూడా తలెత్తాయి. జ్వాలాముఖి, నిఖిలేశ్వర్ విడిపోయి 'జన సాహితి' స్థాపించారు. 'ప్రత్యేక తెలంగాణ' కోసం జరిగిన ఆందోళనలో 'విరసం' వైఖరిని ప్రజలు హర్షించలేదు. అయినప్పటికీ విప్లవ సాహిత్యం చదివి ప్రభావితులై రచనలు చేసిన వారిలో కార్మికులు, శ్రామికులు ఉండటం కూడా ఈ విప్లవ సాహిత్యం ప్రత్యేకతే. ఏదేమైనప్పటికీ తెలుగు సాహిత్యాన్ని ప్రజల దగ్గరకు తీసుకెళ్ళిన గొప్పతనం మాత్రం విప్లవ కవిత్వానిదే.

**ఆధార గ్రంథాలు:**


1) ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు, ప్రయోగములు - ఆచార్య సి. నారాయణరెడ్డి.

2) తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) - ఆచార్య జి. నాగయ్య.

3) తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - ఆచార్య వెలమల సిమ్మన్న.


**- డా. జి. గౌరి**

## పాఠం - 10

# వచన కవిత్వం - ఆవిర్భావ వికాసాలు

**విషయ క్రమం:**

- **10.1.** వచన కవిత్వం - నిర్వచనాలు
- **10.2.** వచన కవిత్వ ఆవిర్భావ వికాసాలు
- **10.3.** వచన కవితా పితామహులు కుందుర్తి

### 10.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

ఈ పాఠ్యభాగంలో వచన కవిత్వం గురించి, దాని ఆవిర్భావ వికాసాల గురించి విద్యార్థులకు తెలియజేయటం.

### 10.1. వచన కవిత్వం - నిర్వచనాలు:

వచన కవిత్వం గురించి దాని స్వరూప స్వభావాలను, నిర్వచనాలను శ్రీశ్రీ, కుందుర్తి ఆంజనేయులు మొదలు చేకూరి రామారావు గారి వరకూ వివిధ కోణాల నుంచి పరిశీలించి తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. "వచనంలాగా భాసించే మాటల్లో కవితా స్వభావమైన భావానుభూతిని కలిగించే ప్రయత్నం వచన కవిత్వం. ఛందో రహితమైన కేవల వచనంలో భావలయ ప్రధానంగా పలికే కవిత్వానికి వచన కవిత్వమని స్థూలంగా నిర్వచనం చెప్పవచ్చు". - అరిపిరాల విశ్వం.

"తెలుగు కవిత్వంలో ఛందస్సులిచ్చిన ఇనుప తొడుగుల్ని నిరసించి కావ్యభాషలో గేయాల అవతరణ తర్వాత కూడా మిగిలి ఉన్న కృత్రిమత్వాన్ని నిరాకరించి, కావ్యగమనాన్ని నిరాఘాటం చేసేందుకు ఆధునిక కవులు చేపట్టిన రచనా పద్ధతే వచన గేయం" - కె.వి. రమణారెడ్డి.

"వచన గేయమునకు లయ ముఖ్యము. ఒకానొక ఊపులో, విసురులో పదములను గుప్పించుట వలన ఈ లయ ఏర్పడును. ఏ నియమము లేకుండ శుద్ధ వచనమును లయాత్మకముగ మార్చినచో అది వచన గేయమగును".

- సి. నారాయణ రెడ్డి.

"వచన పద్యాలంటే ఏదో ఒక ఛందస్సును పట్టుకొని వ్రేలాడడం కాదన్నమాట. అట్లా అంటే కేవలం ఛందస్సును విస్మరించడం గానీ జారవిడవడం గాని కాదు. భావవ్యంజకమైన యమకాలు, గమకాలు, విరుపులు, నాట్యవిన్యాసాలు, ప్రాసలు తప్పనిసరిగా పొడచూపుతవి. కవి స్వేచ్ఛాయుతమైన శయ్యను పుణికి పుచ్చుకొంటాడు. ఈ శయ్య వ్యర్థ పదాలకు తావీయదు. అందుచేత ఛందోబద్ధమైన కవిత్వం కంటే కష్టసాధ్యమేగాని సులభ సాధ్యం కాదు" - రోణంకి అప్పలస్వామి

"కవి ఒక వచన గేయాన్ని రాసేటప్పుడు అతడు ప్రదర్శించే శైలీవిన్యాసం, భావనా గుణమైన శబ్ద వైచిత్రి, ఉద్రేకానుగుణమైన పాదాల విరుపు, ఇవన్నీ ఆ వచన గేయం యొక్క రూపావిష్కరణకి తోడ్పడతాయి. అంచేత ప్రతిభను బట్టి మారుతూ వుంటుంది". - టి.ఎల్. కాంతారావు.

"వచన గేయం యొక్క ప్రధాన లక్షణాలు నిరాడంబరత, నిరలంకారత కాదుగాని, అనవసర అలంకారాల భార రాహిత్యం అలాగే కవితలో వర్ణనాధిక్యతకు స్వస్తి, కథాభంజకం కానంత వరకే అలంకారాల వర్ణనల స్వీకరణ, కవిత్వంలో సారళ్యం, సూటిగా హృదయానికి తాకే విధంగా శబ్దాల కూర్పు, తెనుగు నుడికారపు సొంపులను, రసపోషణలను తగినంతగా వినియోగించుకోవడం, అన్నిటికంటే కవిత తెలుగు ప్రజల సంభాషణ స్థాయికి దగ్గరగా రావటం".

- కుందుర్తి ఆంజనేయులు.

ఈ నిర్వచనాలను గమనిస్తే వచన కవిత్వం ఏ నిర్వచనానికి కట్టుబడదనీ, వచన కవిత్వ లక్షణాలు విస్తృతమైనవనీ తెలుస్తుంది. వచన కవితా నిర్వచనం కవిని బట్టి, కవితను బట్టి మారుతుంది అనేది అక్షర సత్యం. అంత విశాలమైన పరిధి కలది వచన కవిత్వం.

## 10.2. వచన కవిత్వం – ఆవిర్భావ వికాసాలు:

"వచన గేయమును ఫ్రెంచి భాషలో Verse libre అని, ఇంగ్లీషులో Free verse అని యందురు. ఈ ప్రక్రియకు మొదట ఫ్రెంచి భాషలో జూలిస్ లాఫోర్జ్ మున్నగువారు పాదులు వేసిరి. ఈ తెగకు చెందిన గేయము ఛందోబద్ధమైన కవిత్వమునకే మాత్రము తీసిపోదని గుర్తించిరి. ఫ్రెంచి కవుల ప్రభావానికి లోనైన ఇంగ్లీషు కవులీ ప్రక్రియను చేపట్టిరి. ఈ ప్రక్రియ ఇంగ్లీషులో ఆర్నాల్డ్, వాల్ట్‌విట్‌మన్ వంటి వారి రచనలలోకి తీగలు సాగినది" అని సి. నారాయణరెడ్డిగారు వచనకవిత్వ నేపథ్యాన్ని వివరించారు. 'ఫ్రీవర్స్' కి తెలుగులో చాలామంది అనేక పేర్లు ఉపయోగించారు. వచన గేయం, వచన పద్యం, ముక్తచ్ఛందం, స్వచ్ఛంద కవిత్వం, స్వేచ్ఛా కవిత్వం, అనిబద్ధ కవిత్వం, స్వేచ్ఛాగీతి మొదలైనవి. కానీ 'వచన కవిత్వం' అనే పేరు స్థిరపడింది. ఎస్వీడి చంద్రశేఖర్ గారు తమ "వచన కవిత్వం – కుందుర్తి పాత్ర" అనే రచనలో "వచన కవిత్వం ప్రాథమిక దశ వచన పద్యం. అటు తరువాతి దశ వచన గేయం. అటుపైన అది వచన కవిత్వంగా ప్రచారం పొందింది. వచన పద్యానికి, వచన గేయానికి, వచన కవిత్వానికి చాలా తేడాలున్నాయి. తొలి వచన కవితా నిర్మాతలు పద్య స్థితి నుంచి విడువలేక చేసిన వచన కవితా రచనలను వచన పద్యాలనవచ్చు. పాదబద్ధత, యతి ప్రాసల గణాల ప్రభావం అధికంగా వుండి ఈ రచనలు పద్యానికి దగ్గరగా వుంటూ వుండేవి. అటు తరువాతి దశలో ఈ వచన పద్యమే వచన గేయం అయ్యింది. వచన పద్యంలోని పద్య లక్షణాలన్నీ వదులుకుంటూ గేయగుణాన్ని సంతరించుకొన్న మాత్రా ఛందో ప్రభావం గల కవితలు వచన గేయాలయ్యాయి. భావకవుల్లో వచన గేయరచనలు చేసినవారు అధికంగా వున్నారు. ఈ వచన గేయమే పూర్తిగా వచనత్వాన్ని వ్యవహారిక శైలిని సంతరించుకొని వచన కవిత్వం అయ్యింది" అని విశ్లేషించారు.

ఈనాడు మాత్రం కవిత్వం అంటే వచన కవిత్వం అనేలాగా స్థిరపడిపోయింది. అభ్యుదయ, దిగంబర, విప్లవ, స్త్రీ వాద, దళితవాద ఉద్యమాలకు ఈ వచన కవిత్వమే ప్రధాన వాహికగా సహకరించింది. అందుకే అనేకమంది వచన కవిత్వాన్ని 'ప్రజాస్వామ్యయుగ కవితా వాహిక' అంటారు. ఈ వచన కవిత్వ ప్రక్రియని అభ్యుదయ వాదులు తీసుకొచ్చారు. ఇది పద్య కవిత్వానికి వ్యతిరేకంగా ప్రారంభమైన ప్రక్రియ. ఆధునిక భావాలకు పద్యం పనికి రాదనీ, ప్రజలకి పద్య కవిత్వం చేరువ కాలేదని అభ్యుదయ వాదులు భావించారు.

1975వ సంవత్సరంలో కుందుర్తి సన్మాన సంచికలో "నిన్నటి వరకూ కవితా సంధానం ఛందోబద్ధ పద్యనిర్మాణంగానే పరిగణించబడింది. ఛందస్సు కవితకొక మంచి PACKING గా ఆనాడు గౌరవించబడిన మాట నిజమే! కాని వర్తమాన యుగంలో దబాయింపుతో ఆ మార్గం బ్రతకచూస్తోంది. అలవాటయిన చతుష్పాద ఛందోమార్గం అమాయకులను భ్రమపెడుతోంది. ధార, శయ్య కుదిరితే చాలు, భావాభావం ఎంత ఉన్నా పద్య కవిత్వం కాబోలన్న భ్రమ చాలమందికి మా దేశంలో యీ దేశంలో అలవాటయి ఉంది. అట్టివారికి వర్తమాన ఆలోచనా ధారను ఆవాహనం మోయలేదన్న సంగతి తెలియదు. ఆధునిక భావధార మత్తగజం వంటిది. దానిని లాక్షణిక ఛందస్సుల డెమ్మీ ఆక్టోవ్ పేకెట్‌లో బంధించడం ఎవరికీ సాధ్యం కాదు. ఒక్క పుటలో ముద్రితమైన Verse లో Universe ప్రతిబింబించడం ఆధునిక కవితకు ప్రాణ లక్షణం!" అని సోమసుందర్ విశ్లేషించారు.

ఈ వచన కవిత్వాన్ని ఉద్యమంగా నడిపి 'వచన కవితా పితామహుడు' గా కీర్తించబడినవారు కుందుర్తి ఆంజనేయులు గారు. యువకవులకు వచన కవిత్వ రచనా పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చేవారు. దీనికోసం ప్రత్యేకంగా ఫ్రీవర్స్ ఫ్రంట్ స్థాపించి, ఉత్తమ కవితా సంపుటాలకు బహుమతులిచ్చి, యువ కవుల సంపుటాలకు పీఠికలు రాసి, కవి సమ్మేళనాలు నిర్వహించి వచన కవిత్వం స్థిరపడడానికి విశేష కృషి చేశారు. ఆకాశవాణి కేంద్రంలో అప్పటి వరకు పద్యకవులకే కవి సమ్మేళనాల్లో పాల్గొనే అవకాశం ఉండేది. మొదటగా వచన కవిత్వం చదివే అవకాశం కుందుర్తిగారికే లభించిందట. కుందుర్తిగారు తాను చేపట్టిన వచన కవితా ఉద్యమం గురించి

**"నా ఉద్యమం ఒక మహాయుద్ధానికి నాంది**

**కర్త, కటారీ, వేషమూ, ద్వేషమూ లేంది**

**నా ఉద్యమం యిప్పుడే మొగ్గ**

**అది విచ్చుకొని నలుదిక్కులా పరిమళం వెదజల్లుతుంది"**

చెప్పినట్లుగానే నేడు వచనకవిత్వం ఒక ఉద్యమంలా విస్తరించింది. దువ్వూరి రామిరెడ్డి, నోరి నరసింహశాస్త్రి వంటివారు వచన కవిత్వాన్ని వ్యతిరేకించి హేళన చేశారు. అయినా వాటన్నిటినీ ఎదురుకొని దాదాపుగా క్రీ.శ. 1930 నుంచి ఈనాటికీ వచన కవిత్వం తెలుగు సాహితీ జగత్తునేలుతుంది. 1933వ సంవత్సరంలో కవికొండల వెంకటరావు గారు రచించిన 'నక్కాసామిగాడు'. కృష్ణా పత్రికలో ముద్రించబడిన వచన కవిత. దాదాపుగా అప్పటి నుంచే వచన కవితా రచన ప్రారంభమై ఉండవచ్చు. ఇదమిత్థంగా ఈరోజునే వచన కవిత్వం ప్రారంభమైందని చెప్పలేం. 1939వ సంవత్సరంలో 'ఫిడెల్ రాగాల డజన్' అనే పఠాభి రచనే మొదటి కవితా గ్రంథమని కొందరు, 1938వ సంవత్సరంలో వెలువడిన శిష్ట్లా ఉమామహేశ్వరరావు గారి 'నవమి చిలుక – విష్ణు ధనువు' మొదటిదని కొందరు అభిప్రాయపడ్డారు.

**"నా యీ వచన పద్యాలనే దుడ్డు కర్రల్తో**

**పద్యాల నడుముల్ విరగదంతాను**

**చిన్నయసూరి బాలవ్యాకరణాన్ని చాల దండిస్తాను"** అని పఠాభి అంటారు.

తొలితరం వచన కవులలో ముద్దుకృష్ణ, నారాయణబాబు, శ్రీశ్రీ, పురిపండా, పఠాభి, పాలగుమ్మి పద్మరాజు ప్రసిద్ధులు. జరుక్ శాస్త్రి, తిలక్, సంపత్, సింగరాచార్య మొదలైనవారు వచన కవితను మరింత విస్తరించారు. అభ్యుదయ కవిత్వం ఒక ఉద్యమ రూపం దాల్చిన తర్వాత వచన కవితకు శక్తిని ప్రసాదించిన వారు 'నయాగరా' కవులు, అజంతా, బైరాగి, కాళోజీ దాశరథి, ఆరుద్ర మొదలైనవారు. ఆ తర్వాత దిగంబరకవులు, పైగంబర కవులు, చేతనావర్త కవులు, విప్లవ కవులు, అనుభూతివాద కవులు, స్త్రీవాద, దళితవాద కవులు వచన కవిత్వానికి శక్తినిచ్చారు. సి. నారాయణరెడ్డి, శేషేంద్రలు కొత్త రక్తం ఎక్కించారు. నారాయణరెడ్డి గారు రచించిన "విశ్వంభర" జ్ఞానపీఠ్ బహుమతిని పొంది వచన కవిత్వాన్ని జాతీయం చేసింది. వస్తువులో, అభివ్యక్తిలో శిల్పంలో నూతన పోకడలు పోతూ, మినీ కవితలుగా, దీర్ఘకవితలుగా, హైకూలుగా ఇంకా ఇతర ప్రక్రియలలో వచనకవిత్వం విశ్వరూపాన్ని ప్రదర్శిస్తోంది.

## 10.3. వచన కవితా పితామహులు కుందుర్తి:

**"వచన కవిత విచారణలో ఉరిశిక్షపడ్డ**

**మొదటి ముద్దాయిని నేను**
**అలనాటి కవితా లతాంగిని హత్య చేశాను**
**అలంకార ఆభరణాలు అపహరించాను**
**అన్నీ ఒప్పేసుకున్నాను ఆనాడు బోనులో ఎక్కి**
**క్రింది కోర్టు వేసిన శిక్షను**
**మానవ కారుణ్య దృక్పథంతో సడలించి**
**జన్మ ఖైదు వేశారు హైకోర్టు న్యాయమూర్తులు**
**ఒక తరంపాటు బ్రతకాలన్నారు బందీగా**
**పాఠకుల గుండెల చెరసాలలో"**

అని చెప్పుకున్నారు కుందుర్తి. వచన కవిత అనగానే ముందుగా గుర్తుకొచ్చే పేరు కుందుర్తి. కుందుర్తి ఆంజనేయులు గారి ప్రాణం ఫ్రీవర్స్ ఫ్రంట్. వచన కవితా ప్రక్రియను ఒక ఉద్యమంగా, జీవిత ధ్యేయంగా స్వీకరించి వచన కవితాచార్య, వచన కవితా పితామహులుగా పిలువబడింది కుందుర్తి ఒక్కరే. ఊరూరా తిరిగి, కవిత్వం రాసి, పీఠికలు రాసి, ఫ్రీవర్ ఫ్రంట్ నడిపి, సిద్ధాంతాలు చేసి మార్గదర్శకులయ్యారు.

1922 డిశంబర్ 16న గుంటూరుజిల్లా కోటవారి పాలెంలో కుందుర్తి ఆంజనేయులు నిరుపేద కుటుంబంలో జన్మించారు. వినుకొండలో విద్యాభ్యాసం చేసినప్పుడు జాషువా తెలుగు పండితులుగా ఉన్నారు. జాషువా "పిరదౌసి" రాస్తున్నప్పుడు కుందుర్తి తన 13 వ ఏటనే ప్రథను శ్రోతలలో ఒకరయ్యారు. 1936 – 41 విజయవాడ మున్సిపల్ హైస్కూల్లో విద్యాభ్యాసం చేసి 1937వ సంవత్సరంలో పద్యరచనకి శ్రీకారం చుట్టారు. విజయవాడ ఎస్.ఆర్.ఆర్. కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుండగా విశ్వనాథ వారికి శిష్యుడు. విశ్వనాథ వారి ప్రభావంతో ప్రాచీన కవిత్వ పఠనం అలవడింది. పద్యకావ్యాలు, ప్రేమ కావ్యాలు రచించారు. 1941–43 లో గుంటూరు ఏ.సి. కళాశాలలో బి.ఏ. చదివారు. నరసరావుపేటలో నవ్యకళా పరిషత్తు స్థాపించారు. ఆ కాలంలోనే కమ్యూనిస్టు భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. తెనాలి దగ్గర రేవేంద్రపాడులో రెసిడెన్షియల్ పాఠశాలలో ఆంగ్లోపాధ్యాయుడిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆ తర్వాత గుంటూరు టుబాకో మార్కెట్‌లో ఉద్యోగం చేశారు. 1956వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ సమాచార శాఖలో అనువాదకుడిగా కర్నూలులో పనిచేశారు. ఆ తర్వాత హైదరాబాదుకు బదిలీ అయ్యారు. 1967వ సంవత్సరంలో ఫ్రీవర్స్ ఫ్రంట్ స్థాపించారు. 1977వ సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేశారు. సోవియట్ లాండ్ నెహ్రూ బహుమతి, ఆంధ్రప్రదేశ్ కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు లభించాయి. 1982 అక్టోబర్ 25న మరణించారు.

**కుందుర్తి రచనలు:** సౌప్తికం (పద్యకావ్యం), రసధుని, అమావాస్య, నా ప్రేయసి (ప్రేమ కావ్యాలు). నయాగరా (కవితా సంకలనం), తెలంగాణా, ఆశ (వచన కవితా నాటకం), నగరంలో వాన, నాలోని వాదాలు, హంస ఎగిరిపోయింది, తీరా నేను కాస్తా ఎగిరిపోయాక, మేఘమాల, ఇది నా జెండా, కుందుర్తి పీఠికలు, కుందుర్తి వ్యాసాలు, బతుకు మాట (ఆత్మ కథ). హిందీలోకి వీరి కవితలు "మేరే బినా" గా అనువదింపబడ్డాయి.

కుందుర్తి, వచన కవితా ప్రచారంలో ఉద్యమం నడుపుతున్న రోజులలో కవిత్వమంటే పద్యమే అని అనుకునేవారు.

సంప్రదాయ సాహిత్యానికి, పద్య కవిత్వానికి ఉన్న ఆదరణ వచన కవిత్వానికి లేదు. రాయప్రోలు, విశ్వనాథ, తుమ్మల, వేదుల, నాయని, పుట్టపర్తి. మధునాపంతుల, కరుణశ్రీ మొదలైనవారు పద్య కవిత్వంలో ఆరితేరిన వారున్నారు. ప్రసార సాధనాలలో, పత్రికలలో, సభలలో పద్యాలే. అటువంటి పరిస్థితుల్లో పద్య కవిత్వానికి ఎదురొడ్డి నిలవడమేకాదు, హేళనలను ఎదుర్కొంటూ వాటిని

**"పాత కాలం పద్యమైతే**

**వర్తమానం వచన గేయం"** అంటూ త్రిప్పికొట్టారు.

సాహిత్యంలో మారుతున్న విలువలకి అనుగుణంగా రూపంలో మార్పు తప్పదని హితవు చెప్పారు. అలా అని కుందుర్తి పద్య ద్వేషి కాదు. కుందుర్తి "నియమబద్ధమై నన్నయాదుల చేత తీర్చిదిద్దబడిన పద్యం మాకు తల్లి. దానిని కించపరచాలనే వుద్దేశం లేదు. కాని, తెనుగు కవిత్వానికి ఈ పద్యమే, ఈ వృత్తమే తుది స్వరూపమని మాత్రం అంగీకరించం. కొత్త ప్రయోగం నిరంతరం జరుగవలసిందే" అని చెప్పిన మాటలు గుర్తుంచుకోవలసినవే. కుందుర్తి తన వ్యాసాలు, పీఠికల ద్వారా వచన కవిత్వోద్యమానికి ఈ క్రింది ప్రతిపాదనలు చేశారు.

1) కవితా శైలి సామాన్య ప్రజల సంభాషణ స్థాయికి రావాలి.
2) బృహత్ కావ్యాలూ, కథ కావ్యాలూ, కవితా నాటకాలు, నాటికలూ రావాలి.
3) ఆత్మాశ్రయ తత్త్వం వదులుకొని, మార్క్సిజం చదవాలి.
4) వచన కవిత్వానికి వ్యాకరణం ప్రజలు, నిఘంటువులు ప్రజలు, అలంకారులు ప్రజలు
5) సంస్కృత పద బాహుళ్యాన్ని, ఆంగ్ల పదాడంబరాన్ని వదులుకోవాలి.
6) కవిత్వాన్ని జాతీయం చేశాం – ఇక ఇది అందరి సొత్తు.
7) అధివాస్తవికత, అయోమయం, అస్పష్టత పనికి రాదు.
8) నిజాయితీ, చిత్తశుద్ధి అనేవి ప్రజాదృష్టితో రాసే కవికి చాలా ముఖ్యం
9) పీడిత వర్గాలను గురించి రాసే కవి ఆ వర్గానికి చెందినవాడే కానక్కరలేదు. సానుభూతి ముఖ్యం. ఆ వర్గ సమస్యల పట్ల సమగ్రమైన అవగాహన ఉండాలి. అందుకు తగ్గ బలమైన అభివ్యక్తి అవసరం.
10) ఆధునిక కవిత్వం రాయడం అంటే కవి తాను సమాజంలో ఒకడుగా భావించుకొని, వర్తమాన సమాజ స్వరూపాన్ని మార్చే కృషికి దోహదకరంగా కవితలు రాయడం, తాను ఇతరులకంటే అధికుడననే అహంకారం ఆధునిక కవికి పనికి రాదు. కావ్య వస్తువునూ, దానికి సంబంధించిన expression ను కూడా ప్రజల నుండి గ్రహించడానికి ఏది సిద్ధంగా వుందో అది ఆధునిక కవిత్వం.

ఫ్రీవర్స్ ఫ్రంట్ ద్వారా మంచి కవితా సంపుటికి బహుమతి ఇచ్చేవారు. కవిత్వానికే బహుమతిగానీ వ్యక్తులకీ, సిద్ధాంతాలకి కాదని నిరూపించారు.

**"యతి ప్రాసల యిరకాటంలో పొల్లు మాటలు వాడినట్లు**

**భార్యామణి మెప్పుకోసం పక్కింటివాణ్ణి తిట్టినప్పుడు**

**కథాగమనం భుజకంగా చంద్రవర్ణన చేసినట్లు"**

అని కవితా లక్షణాలను ఉపమానాలుగా తీసుకొని చెప్పటం కుందుర్తి ప్రత్యేకత.

**"వెన్నెల బ్రతుకు కన్నెల మీద**
**విరహ సర్పపు పడగ విప్పింది"**
**"వానల మేనాల మీద**
**దిగులు కన్య మనస్సులోకి దిగుతున్నది"**
**"మాంత్రికుడి మెడలో ధరించిన**
**పుర్రెల దండలా వుంది నాదేశం"**

ఇలాంటి అలంకారులు, ఉపమానాలు వాడటం వీరు చేసిన ప్రయోగమే అనుకోవాలి. కుందుర్తి వచన కవిత్వంలో ఒక లయ, తూగు సాధించాలని ప్రయత్నించారు. అందుకు అంత్య, ఆది ప్రాసలను ప్రయోగించారు.

**"స్వార్థం గట్టిన గులకరాళ్ళ వంతెన ఆలంబంగా**
**సామాన్యుల బ్రతుకు బాటకొక లంబంగా"**
**"అంతులేని ఆనాటి దురాగతాలకు**
**అంతా బెదిరి చూస్తున్నారు**
**అంత మొందించే శక్తి కోసం**
**అంతా ఎదురుచూస్తున్నారు"**

కుందుర్తి గురించి అద్దేపల్లి రామమోహనరావు "సాంప్రదాయికమైన image ని శిల్పపరంగా వినియోగించుకున్న అభ్యుదయ కవులలో కుందుర్తి విశిష్టుడు. సమకాలీన మానవునిలో ఉన్న కుళ్ళునీ, కపటాన్నీ బహిర్గతం చెయ్యడానికి విశిష్ట విధానం అవలంబించాడు" అన్న మాటలు అక్షర సత్యాలని ఈ క్రింది కవిత నిరూపిస్తుంది.

**"రా తమ్ముడూ పోదాం, మనకు చోటు లేదిక్కడ**
**ఆప్తుల్లేని అరణ్యంలో హాయిగా కాలం గడుపుదాం**
**కడుపు కొరకు క్రూరజంతువునని గర్జించి చెప్పే సింహం**
**మనిషి కంటె నయం కదూ! అమ్మో భయమేస్తుందిక్కడ**
**రా తమ్ముడూ పోదాం! ప్రమాదాల పల్లకీనెక్కి**
**ఎదురొచ్చే ఎడారి దాటి, ఏరుదాటి వెళ్ళిపోదాం**
**ఇసుక తుఫాను లేస్తుందని హెచ్చరించే ఒంటరి ఒంటె**
**మనిషి కంటే నయంకదూ, అమ్మో భయమేస్తుందిక్కడ"**

"నగరంలో వాన" లో ప్రకృతిని తన అభ్యుదయ పంథాకి, సామాజిక స్పృహకి బలంగా వాడుకొన్నారు.

**"భూమ్మీద పస్తులున్న మనుషుల్ని చూసి**

**ఆకాశం కంటతడి పెట్టినట్లు**

**వాన ముమ్మరంగా కురుస్తుంటే"**

**"అవసరం లేనప్పుడడిగితే అప్పులు సులువుగా లభించినట్లు**

**అక్కరలేని నగరంలో కూడా పుష్కలంగా కురుస్తుంది"**

ఉప్పు సత్యాగ్రహాన్ని "దండి" కావ్యంగా, నిజాం నవాబు నిరంకుశ పాలనకి వ్యతిరేకంగా "తెలంగాణ" కావ్యం రచించారు. "తెలంగాణా" కావ్యం గురించి అద్దేపల్లి "తెలంగాణా కావ్యాన్ని కుందుర్తి కొన్ని భావాల పునాదుల మీద రాశారు. కాలం, మార్పు, ఉద్యమం, జనశక్తి, సంఘర్షణ – యిత్యాది భావాలు కావ్యంలో అంతః ప్రవాహాలుగా ఉంటై ప్రజల్లో చైతన్యం రావడం, సమాజ ప్రయోజనానికి కృషి చెయ్యడం ప్రధానాంశం" అంటారు.

**"నేను గేయాన్ని**

**ప్రజల గుండెల్లో యింకా మాయని గాయన్ని**

**మృత వీరుల ధ్యేయాన్ని**

**స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఉపమేయాన్ని**

**ఛందస్సు పరిశ్రమకు ఆపేసిన ప్రభుత్వ సహాయాన్ని**

**సమతా సమాజ సాధనకు ప్రజాబలం చెప్పిన ఉపాయాన్ని**

**జాతికీ అనీనీతికీ జరిగే సంఘర్షణ సముదాయాన్ని"** అని అంటారు,

భార్య సుందరమ్మ స్వర్గస్తురాలైనప్పుడు "హంస ఎగిరిపోయింది" అనే స్మృతి కావ్యాన్ని రచించారు. ఇందులో తాత్విక ధోరణి కనిపిస్తుంది. ఇది కుందుర్తి వ్యక్తిగత అనుభూతికి చెందింది. ఇక్కడ మరో కుందుర్తి కనిపించినప్పటికీ శైలి మాత్రం అదే.

**"సుందరమ్మధురం మంజులమ్మనోహరమైన**

**చుక్కొకటి రాలిపోయింది**

**పక్షవాతం రాకుండానే నారెక్కొక్కటి వాలిపోయింది"**

**"ఈ అడవిలో కొలనుందేమో**

**హంసలేంది కొలనెందుకుంటుంది?**

**ఇక నీళ్ళు కూడా కరువు**

**బ్రతుకింక గాడిద మీద మైల గుడ్డల బరువు"**

అని ఆవేదన చెందుతారు. జీవిత సహధర్మచారిణి విలువను తెలియజేశారు.

**"గతం చూసి గర్వించడం మంచిదే**

**కాని ప్రస్తుతం పఠించడం మరీ మంచిది**

**గతం విస్మరించడం తప్పే**

**కాని పట్టుకు వేలాడ్డం మరీ తప్పు**

**వాల్మీకి రామాయణం వ్యాసుడు భారతం రాసినట్లు**

**వర్తమాన కథావస్తువును వర్ణించడం నా మతం"** అని

తన దృక్పథాన్ని తెలియజేశారు.

**ఆధార గ్రంథాలు:**

1) తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య ద్వా.నా. శాస్త్రి.

2) తెలుగు సాహిత్య విమర్శ, సిద్ధాంతాలు - ఆచార్య వెలమల సిమ్మన్న.

**- డా॥ సిహెచ్. అనిత**

## పాఠం - 11

# నవ్య సంప్రదాయ కవిత్వం - స్వరూప స్వభావాలు, చరిత్ర

**విషయ క్రమం:**

**10.1.** నవ్య సంప్రదాయ కవిత్వం – స్వరూప స్వభావాలు, చరిత్ర

**10.2.** నవ్య సంప్రదాయ కవులు

### 11.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

ఈ పాఠ్యభాగం ద్వారా విద్యార్థులు నవ్య సంప్రదాయ కవిత్వం గురించి అవగాహన చేసుకుంటారు.

### 11.1. నవ్య సంప్రదాయ కవిత్వం – స్వరూప స్వభావాలు:

ఆంగ్లంలో ఉన్న Neo-Classicismకి అనువాదంగా 'నవ్య సంప్రదాయం' అని భావించవచ్చు. అయితే నవ్య సంప్రదాయవాదులు ఈరెండింటి లక్షణాలు వేరని చెప్తున్నారు. నవ్య సంప్రదాయాన్ని గురించి జి.వి. సుబ్రహ్మణ్యంగారు– "ఆధునిక సాహిత్యంలో క్లాసిక్ భావం అంతరించిపోయే ప్రమాదం నుండి సాహిత్యాన్ని రక్షించాలనీ, అనువాదాలూ అనుకరణలూ మాత్రమే సంప్రదాయమని భావించే ఛాందస ప్రయోగాలలో బలవన్మరణం పొందుతున్న క్లాసిజంను నిజమైన రీతిలో పునరుజ్జీవింప జేయాలనీ, యుగోచితమైన ఒక క్రొత్త శైలిని క్లాసిక్ కల్పించాలనీ, అది అంతర్జాతీయ స్పృహను వీడని జాతీయ భావానికి, దేశీయతకూ భారతీయ సాహిత్య దృక్పథానికి పోషకంగా ఉండాలనీ, పాశ్చాత్య సాహిత్యంలోని మేలిమిని గ్రహించినా దానికి దాసోహం అనకుండా ప్రాచ్య సాహిత్య వ్యక్తిత్వాన్ని ఆధునికంగా పునః ప్రతిష్ఠించాలనీ సాగించిన సప్రయత్న సాహిత్యోద్యమం నవ్య సంప్రదాయవర్గం" అని "సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు" లో చెప్పారు.

ఆంగ్ల సాహిత్యంలో వచ్చిన నవ్య సంప్రదాయ యుగానికో, తెలుగులో వచ్చిన దానికీ స్వరూప స్వభావాల్లో సామ్యంతో పాటు భేదం కూడా ఎక్కువగా కనిపిస్తుంది. ఆంగ్లంలో నవ్య సంప్రదాయయుగల రెస్టోరేషన్ యుగం తర్వాత 17వ శతాబ్ది చివరి నుండి 18 వ శతాబ్ది చివరి వరకు ఉంది. దాని తరువాత కాల్పనిక కవిత్వోద్యమం వచ్చి, 19వ శతాబ్ది పూర్వపాదంలో తన ప్రత్యేకతను చూపింది. కాల్పనిక కవిత్వోద్యమానికి ప్రతిగా విక్టోరియన్ సాహిత్య యుగ చైతన్యం 19వ శతాబ్ది పూర్వార్థంలోనే మొదలై ఆ శతాబ్ది చివరి పాదం వరకు కొనసాగింది. అయితే తెలుగులో నవ్య సంప్రదాయ కవిత్వోద్యమం భావకవిత్వ యుగం తర్వాత సాగింది. ఈ చారిత్రక సత్యం నవ్య సంప్రదాయ కవిత్వోద్యమంలోని కొన్ని విలువలను వివేచించటానికి తోడ్పడుతుంది.

కొంతమంది విమర్శకులు సంప్రదాయం వేరు, నవ్యసంప్రదాయం వేరు అనే సిద్ధాంతాలు చేసి కవిత్వం, నవల, విమర్శ మొదలైన ప్రక్రియల్లో నవ్య సంప్రదాయం ఏవిధంగా ఉందో వివరించే ప్రయత్నం చేశారు. అటువంటివారిలో వడలి మందేశ్వరరావు, కోవెల సంపత్కుమార, ముదిగొండ వీరభద్రయ్య వంటి వారున్నా నవ్యసంప్రదాయ విమర్శకి ప్రయోక్తగా జి.వి. సుబ్రహ్మణ్యాన్ని పేర్కొనాలి. అయితే చేకూరి రామారావులాంటి వారు నవ్య సంప్రదాయాన్ని అంగీకరించటం లేదు. "అది కొత్త ధోరణి కాదు. జాతీయవాద కవితలో ప్రధానమైనది. హిందూ జాతీయత, కమ్యూనిస్టు వ్యతిరేకత ఈ ధోరణి బలమైన ధోరణిగా నిలద్రొక్కుకున్నట్లు లేదు" అంటారు చేకూరి రామారావుగారు. దీనిని జి.వి. సుబ్రహ్మణ్యంగారు ఖండించారు.

రామాయణ భారతాదులు సంప్రదాయ రచనలైతే విశ్వనాథ సత్యనారాయణ, గడియారం వంటి వారి రచనలు నవ్య సంప్రదాయమని వివరించవచ్చు. ఈ సందర్భంలో సుప్రసన్నాచార్య అభిప్రాయం గమనిస్తే “నవ్య సంప్రదాయమంటే గతానుగతికంగా వచ్చే సంప్రదాయ సాహిత్యంగా భ్రమించే వీలులేదు. దీనివల్ల సమగ్రావగాహన కలుగదు. పరంపరగా వచ్చే విశ్వసనీయములైన పురాణాతిహాసముల అనువాదాలేవీ నవ్య సంప్రదాయంలో చేరవు. ఎందుకంటే వీటిల్లో సమకాలీన స్పందన చేరలేదు” అంటారు. నవ్య సంప్రదాయానికి ముఖ్యమైనది జాతీయ దృక్పథం. అంటే దేశభక్తితో కూడిన రచన. ఏ రూపమైన ఏ ప్రక్రియ అయినా నవ్య సంప్రదాయోద్యమ స్వభావం. నవ్య సంప్రదాయ వాదులు పూర్తిగా సంప్రదాయాన్ని గానీ, పూర్తిగా మార్క్సిజాన్ని గానీ ఆమోదించరు, తిరస్కరించరు. కానీ దేశీయత, రసానురక్తి, రాజకీయాలు లేని సామాజిక సాహిత్య స్పృహ నవ్యసంప్రదాయ లక్షణాలుగా చెప్పారు. నవ్య సంప్రదాయ వాదులు మానవ వికాసవాదులని చెప్పుకున్నారు.

విశ్వనాథ సత్యనారాయణగారు నవ్య సంప్రదాయ సాహిత్యానికి ప్రయోక్త. విశ్వనాథ వారి నుంచి ఈ ధోరణి వ్యాపించిందంటారు. దుర్భాక రాజశేఖర శతావధాని ‘రాణా ప్రతాపసింహ చరిత్ర’, గడియారం ‘శివభారతం’, విశ్వనాథ ‘ఆంధ్ర ప్రశస్తి’, ‘ఝాన్సీ లక్ష్మీబాయి’ వంటి కావ్యాలు, పుట్టపర్తి ‘సిపాయి పితూరి’, మధునా పంతుల ‘ఆంధ్రపురాణం’, ముదిగొండ వీరభద్రమూర్తి ‘వందేమాతరం’ వంటి చారిత్రక కావ్యాలు నవ్య సంప్రదాయ మార్గంలోనివి. విశ్వనాథ వారి చారిత్రక నవలలు, బాపిరాజు నవలలు, నోరి నరసింహ శాస్త్రి నవలలు నవ్య సంప్రదాయానికి చెందినవే. పాశ్చాత్య విమర్శ పద్ధతుల్ని అనుసరిస్తూనే వాటిని దేశీయమైన వాటితో సమన్వయిస్తూ సంవాద విధానాన్ని వ్యక్తం చేసే రీతిని నవ్య సంప్రదాయ విమర్శ అన్నారు. ఇది ఒక రకంగా సమన్వయ విమర్శ. పింగళి, జి.వి. కృష్ణారావు. పాటిబండ మాధవశర్మ, శేషేంద్ర, రాళ్ళపల్లి, యస్వీ జోగారావు మొదలైనవారు ఈ కోవకు చెందినవారు. ఆధునిక నవ్య సంప్రదాయ విమర్శకులలో జీవియస్, సంపత్కుమార, సుప్రసన్న, ఆర్.ఎస్. సుందర్శనం, వడలి మందేశ్వరరావు, అక్కిరాజు రమాపతిరావు, ముదిగొండ వీరభద్రయ్య మొదలైనవారు ముఖ్యులు.

కాల్పనిక కవితా యుగకవికీ, నవ్య సంప్రదాయ కవితా యుగకవికీ ఉన్న భేదాన్ని వడలి మందేశ్వరరావుగారు “రొమాంటిస్టు ఎలాగైనా స్వేచ్ఛా ప్రియుడు. వెనుకటి బంధనాలను ఊడ్చుకుంటాడు. శృంఖలాలను తెంచుకోవటం అతని కవసరం. అతని నూతన ఆలోచనలు వెనుకటి మూసలలో ఇమడవు. అందుచేత గతంతో అతను తెగత్రెంపులు చేసుకోవాలనుకుంటాడు. క్లాసిసిస్టు అలా అనడు పైకి సంప్రదాయవాదిలా కనబడతాడు. కాని ఆ మార్గాన్ని విస్తృత పరుస్తాడు వెనుకటి ఛందస్సుల్ని అంగీకరించినట్లు కనబడతాడు. అందులో కొత్త లయను ప్రవేశపెడతాడు. వెనుకటి అలంకారాలనే వాడినట్లు కనబడతాడు. కాని, ఇతని శబ్దచిత్రాలు కొత్తగా ఉంటాయి. కాని, ఇవన్నీ బాహ్య స్వరూపానికి సంబంధించినవి, క్లాసిసిస్టును నిక్కచ్చిగా పట్టి ఇచ్చేది అతని ఆలోచనా విధానం, శిల్పదృష్టి, లోచూపు, సంప్రదాయం మీద తిరగబడినా అనుసరించినా అతని ఆలోచనా విధానం విశ్లేషణను ఆకర్షిస్తుంది. శిల్పదృష్టి అకుంఠితంగా ఉంటుంది; లోచూపు ఉపకరించేది అవుతుంది” అని విశ్లేషించారు.

నవ్య సంప్రదాయ యుగకర్త అయిన విశ్వనాథ సత్యనారాయణగారు ఇంగ్లీషు సాహిత్యంలోని నవ్య సంప్రదాయ యుగ కవులకంటే, విమర్శకుల కంటే, విక్టోరియన్ యుగ కవులు సాహితీ ధోరణికే సన్నిహితులుగా కనపడతారు. జీవితాన్ని ఉదాత్త నైతిక తాత్విక కళా దృకథంతో దర్శించి భావించటమే కవుల ధర్మమనీ, కవిత్వం ద్వారా సమాజంలో శాశ్వత నైతిక ప్రమాణాల విలువలు పునరుద్ధరింపబడాలనీ, ఉత్తమ కావ్యేతివృత్తాలు, ఉదాత్త శైలి కవితకు అత్యవసరమని తలంచిన

విక్టోరియన్ యుగకవుల దృక్పథాలు విశ్వనాథలో కనబడతాయి. విశ్వనాథ గురించి ఆర్.ఎస్. సుదర్శనం గారు "కాల్పనికోద్యమ ప్రభావంతో ప్రారంభమైన విశ్వనాథ సత్యనారాయణ సాహితీ కృషి అనతి కాలంలోనే ఆ ప్రభావాన్ని అధిగమించి, ఆయన యేర్పరచుకొన్న విశిష్ట దృక్పథాన్ని ప్రతిబింబిస్తూ పరిణతి చెందింది. ఆయన ప్రతిభ భావనాత్మకమే కాదు, ఆలోచనాత్మకం కూడా. ఆ పైన అది భౌతిక దర్శన శక్తి ఒకటి. ఆయన భావనకు సామాన్యంగా కాల్పనిక యుగ రచయితలకు లేని తత్త్వ పరిపూర్ణతను ఇచ్చింది" అంటారు.

"నేను ఏమి వ్రాస్తానో నేను తెలుసుకొని వ్రాస్తాను. అనాది నుంచీ ఈ దేశంలో ఒకటి జ్ఞానం అనిపించుకొంటూ వస్తున్నది. ఆ జ్ఞానం నా పాఠకులకు కల్పించి నేను సఫలుణ్ణయి వాళ్ళని జ్ఞానవంతులను చేస్తున్నాను అనే భావం నాకు ఉన్నది. ఈ భావం ఉన్న వాళ్ళు చాలా మంది ఉన్నారని నాకు తెలుసు... పూర్వ సాహిత్యం ఒకటి ఉన్నది..... నేను పోతే నాతో పోయేవాళ్లు నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, నాచన సోమనాథుడు, శ్రీనాథుడు, పోతన్న,పెద్దన్న, పోతన్న, పెద్దన్న, తెనాలి రామకృష్ణుడు మొదలయివారు" అని విశ్వనాథ వారే చెప్పుకున్నారు.

విశ్వనాథకి పూర్వమే నవ్య పద్యరచన చేసినవారు తిరుపతి వేంకటకవులు, పద్య కవిత్వాన్ని ఉద్యమంలా నడిపి, పద్యాలను వ్యావహారిక శైలిలో రచించి, నిరక్షరాస్యుడు కూడా తెలుగుపద్యాన్ని హాయిగా పాడుకొనే స్థాయికి కవిత్వాన్ని తీసుకెళ్ళిన ఘనులు వీరు. వీరు పద్యాన్ని కృతక భాష నుంచి సాధ్యమైనంత వరకు తప్పించడానికి ప్రయత్నించారు. "తిరుపతి వెంకటేశ్వరులు పూర్వాంధ్ర కవిశిఖామణులలో చివరివారనీ, నవ్యాంధ్ర కవులలో మొదటివారనీ నా ఉద్దేశం" అంటారు నోరి నరసింహశాస్త్రి గారు. కుందుర్తి వచన కవిత్వ ప్రచారానికి నడుంకట్టినట్లుగా ఈ జంటకవులు కొత్త పద్య కవిత్వ ప్రచారానికి ఊరూర తిరిగారు. వీరి శిష్యులైన విశ్వనాథ సత్యనారాయణగారు నవ్య సంప్రదాయ కవిత్వానికి మార్గదర్శకులు కావటం వింతేమీ కాదు కదా!

నవ్య సంప్రదాయక కవిత్వాన్ని రచించిన వారిలో తుమ్మల, పింగళి, కాటూరి, నాయని, ఇంద్రగంటి, పుట్టపర్తి, జాషువా, రాయప్రోలు, కరుణశ్రీ , బోయి భీమన్న, ఉత్పల, జ్ఞానానందకవి, విశ్వనాథ వెంకటేశ్వరు, కొండవీటి వెంకటకవి, యస్వీ జోగారావు, పువ్వాడ శేషగిరిరావు, బీర్నిడి ప్రసన్న, వి.వి.యల్, స్ఫూర్తి శ్రీ, బాడాల రామయ్య, కరుటూరి సత్యనారాయణ, వఝల కాళిదాసు మొదలైనవారున్నారు. అభ్యుదయ మార్గంలో నడిచినా కొంతవరకు నవ్య సంప్రదాయధారకు తోడ్పడే రచనలు చేసిన కవులుగా దాశరథి, నారాయణ రెడ్డి, గుంటూరు శేషేంద్ర శర్మ, జె. బాపు రెడ్డి వంటి కవులను పేర్కోవచ్చు.

శిష్ట్లా వెంకట్రావు, కొండెపూడి సుబ్బారావు, బేతవోలు రామబ్రహ్మం, కేశాప్రగడ సత్యనారాయణ మొదలైనవారు పద్య కవిత్వ ప్రచారోద్యమం చేపట్టడానికి "పద్య కవితా సదస్సు" అనే సంస్థను నడుపుతున్నారు. ఇది గమనిస్తే పద్యం నడుము విరగ్గొడతానని పఠాభి, నారాయణబాబు లాంటి వారు పోలీసు జులుం చేసినా, లాఠీ చార్జీతో దెబ్బలు తిన్న స్వాతంత్ర్య యోధుడు లాగా పద్యం నేటికీ నిలిచేవుంది అని తెలుస్తుంది. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు "ఒక్క మాటలో చెప్పాలంటే, నవ్య సంప్రదాయ కవిత్వోద్యమం గాంధీ మహాత్ముని సత్యాగ్రహోద్యమం వంటిది,.అభ్యుదయ కవిత్వోద్యమం సుభాస్ చంద్రబోస్ సాగించిన స్వాతంత్ర్యపు పోరాటం వంటిది. విప్లవ కవిత్వోద్యమం సిపాయిల తిరుగుబాటు వంటిది" అన్న మాటలు నిజమే అనిపిస్తాయి.

## 11.2. నవ్య సంప్రదాయ కవులు:

విశ్వనాథ, జాషువా, కరుణశ్రీ, గడియారం, దుర్భాక, పుట్టపర్తి, నండూరి, జ్ఞానానంద కవి, వానమామలై మొదలైన మొదటి తరం వారి పద్య సంప్రదాయాన్ని తర్వాతి తరం వారు కొనసాగిస్తూనే ఉన్నారు. జి.వి. సుబ్రహ్మణ్యం గారు "పద్యం పాటలాగానే తెలుగువారి నాల్క పంట. పద్యం చావలేదు కాని, దానికి పునరుజ్జీవనం కావాలి, అది పునః చైతన్యవంతం కావాలి. నేటి పద్యానికి కావలసింది ఆకృతి మాత్రమే కాదు, అంతశ్శక్తి. గతి వైవిధ్యమే కాదు ప్రయోగ దీప్తి, పద్యం హృద్యంగా, ఖాద్యంగా, అనవద్యంగా ఉంటుందని ఊరించే రోజులు కావివి. ఉద్యమంగా పద్యానికి ఊపిరిపోసే శక్తిని నింపాలి" అని చెప్పిన మాటలను ఆధునిక పద్యకవులు గుర్తుంచుకోవాలి.

నవ్య సంప్రదాయ కవుల్లో ఉత్పల సత్యనారాయణాచార్యులుగారి స్థానం విశిష్టమైంది. వీరు నాలుగైదు పద్య రచనలు చేసినా వీరికి పేరుతెచ్చిన కావ్యం "ఈ జంట నగరాలు – హేమంత శిశిరాలు" ఆధునిక స్పృహ కలిగిన కావ్యమిది.

**"పదవులుద్యోగాలు పైరవీ వల్లనే ప్రాప్తించుగాని అర్హతనుగాదు**
**బహుమతులో బిరుదులు పైరవీ వల్లనే లభియించు గాని పాత్రతను గాదు**
**బదిలీ ప్రమోషన్లు పైరవీ వల్లనే సమకూరు గాని అన్యమున గావు**
**పర్మిట్లు మార్కులు పైరవీ వల్లనే జతపడదం గాని యోగ్యతను గాదు"**
**"పైరవీ వల్ల నాఫీసు ఫైళ్ళు కదలు**
**కార్లు రైళ్ళు విమానలోకమ్ము కదలు**
**పైరవీ చేయకున్ననే పనియు గాదు**
**పైరవీ చేయకెవ్వండు పైకి రాడు"** అంటారు.

నవ్య సంప్రదాయ కవుల్లో పద్యానికి జీవం పోస్తూ, పద్యాన్ని సామాజిక అభ్యుదయానికి వాహికగా ఉపయోగిస్తూ దాదాపు ఏభై సంవత్సరాలుగా పద్యాన్ని నమ్ముకొని అనేక పద్యకావ్యాలు రచించిన సహజ కవి కళా ప్రపూర్ణ ఎస్.టి. జ్ఞానానంద కవి. "ఆమ్రపాలి, పాంచజన్యం, క్రీస్తుశతకం, గాంధీ" వంటి రచనల ద్వారా మానవతావాదిగా, భారతీయతను గాఢంగా ప్రేమిస్తూనే సామాజిక అభ్యుదయాన్ని ఆశించే కవిగా తన స్థానం నిలబెట్టుకున్నారు జ్ఞానానంద కవి.

**"ఖద్దరు బట్టగట్టి ముని గాంధికి శిష్యునిగా దలచి యా**
**దద్దమ దేశభక్తుని గతాను జరించుచు నుండ స్వార్థపున్**
**ముద్దగు వీడు చేసినదీ మోసమే తప్ప మరేది లేదు నే**
**దద్దిర! దేశభక్తియన నయ్యయొ! మోసమో! వేసమో! ప్రభూ!"**

వీరు విశ్వనాథ శిష్యులు. సంప్రదాయం పునాదిపై సామాజిక విప్లవాన్ని ఆశిస్తారు.

ఎం.పి. జాను కవి కూడా జ్ఞానానంద కవిలా సరళంగా పద్య రచన చేస్తూ సామాజిక స్పృహతో కవిత్వం రాస్తారు. ఆర్.ఎ.ఎస్. సుదర్శనం "నిశాంతం" అనే తాత్త్విక కావ్యం రచించారు. కోవెల సంపత్కుమారాచార్య "అంతర్మథనము" అనే శతకం రాశారు. ఆధునిక పద్యానికి వన్నెతెస్తూ, శైలికి తగిన భావనతో, సహజంగా సాగిన రచన ఇది.

**"బస్సులో గాల్చుట రైళ్ళు గూల్చుట జన ప్రాణమ్ములన్ దీయుటల్**

**కస్సంబుస్సుల విప్లవమ్ములివి సంఘమ్మున్ సమానించునా**

**హిస్సో కోసము చంపులాడుకొను తామీ నాయకులే మాకు శ్రే**

**యస్సుందెత్తురె! నమ్ము టెట్టుట! యతీంద్రా, వ్యాజ రామానుజా!"**

బేతవోలు రామబ్రహ్మంగారు "క్రొత్త గోదావరి" అనే పద్య కవితా సంపుటిని రచించారు. ప్రకృతి చిత్రణం, ప్రాచీన గాథా సంబంధనిరూపణం, తాత్త్విక చింతనల వంటివే కాక ఆధునిక భావచింతన కూడా ఈ పద్య సంపుటిలో విశేషంగా కనిపిస్తుందంటారు చేరా. బేతవోలు రామబ్రహ్మంగారి పద్యకవితాశక్తి 'యశోధర' ఖండకావ్యంలో దర్శనమిస్తుంది.

**"ఒక నాడెప్పుడొ చిట్టిహంసనెవడే నొక్కండు హింసింప దా**

**నికి రాద్ధాంతము చేసివేసిన దయానీరంధ్రు డిల్లాలి గుం**

**డెకు పాషాణ శిలీముఖంబు గురివెట్టెన్ చూడు డీయంచుదా**

**వక గాథామృత మూర్తికిన్ పులుమ నా బాధామషీ పంచకముల్!"**

ఆధునిక సమాజంలోని విభిన్న ప్రవృత్తుల్ని, అరాచకాన్ని అధిక్షేపిస్తూ వేమనకి పేరడీగా "విశ్వదాభిరామ వినురవేమ" రచించారు. బండ్లమూడి సత్యనారాయణగారు పద్య రచనలు, ఖండ కావ్యాలు రచించినా "బండ్లమూడి మాట" అనే రెండు భాగాల పుస్తకం వెలువరించారు. సుమతీ, వేమన శతకాలకిది పేరడీలు.

**"ఇన్ని 'హోల్సు' విడచియిల కళాశాలకు**

**పరుగుతీయువాడు పరమశుంఠ**

**దివ్యవనము విడచి దిబ్బకేగిన యట్లు**

**బండ్లమూడి మాట పసిడి మూట"**

పద్యసాహిత్యానికి కొత్త అందాలు దిద్దిన కవి రసరాజు. "రస భారతి" పద్య కవితా సంపుటి ప్రచురించారు.

**"నేటి తారాజువ్వ నింగికెగయునట్టి ధరలకు నూతనార్థముగ తోచె!**

**నేటి టపాకాయ కాటకమ్మున ప్రేలు బడుగు గుండెకు ప్రతిధ్వనిగ దోచె!**

**నేటి భూ చక్రమ్ము నెత్తిచుట్టు తిరుగు బలు సమస్యలకు వ్యాఖ్యలుగ దోచె!**

**నేటి సిసింద్రీ అనేక వక్రములున్న బ్రతుకు బాటకు నుదాహృతిగ దోచె!"**

అని సమకాలీన సమాజానికి పండుగకు అన్వయించి చెప్పారు.

అనుమాండ్ల భూమయ్య "వేయి నదుల వెలుగు, వెలుగు నగల హంస, అగ్ని వృక్షము' అనే పద్య కావ్యాలు రచించారు. వీరిది సహజశైలి

**"నమ్మ బల్కుదున్ కాని నమ్మనెవని**

**నంచు కడు నమ్మకమున గర్వించి యొంటి**

**నన్ను నమ్మించుటే కాని నన్నెవండు**

**నమ్మటమె లేదనెడి విషయమ్మెరుంగ"**

నాగభైరవ కోటేశ్వరరావుగారు వచన కవిత్వంలోనే కాక పద్య కవిత్వంలో కూడా దిట్ట. "గుళ్ళకమ్మ చెప్పిన కథ, నది చెప్పని కథ" కావ్యాలు వీరి రచనలు. వీరు పద్యానికి సరళత్వాన్ని, ఆహ్లాదాన్ని కలిగించారు.

**"అది యొక పల్లెపట్టు మరియాదకు మట్టుకు నాటపట్టు సం**
**పదలకు తేనెపట్టు, సమభావ సుగంధపు పూలచెట్టు, ఆ**
**పద దరి గొన్న వారికి శుభమ్ములు గూర్చెదు చెల్మిగట్టు,నె**
**మ్మది శివభక్తి తత్వములు మాధురులూ రెడిమెట్ట భూస్థలిన్"**

ఆచార్య తిరుమల, ఆయాచితం నటేశ్వర శర్మ, కసిరెడ్డి వెంకటరెడ్డి, డి.ఎ.ఎల్.ఎన్. మూర్తి, ప్రసాదరాయ కులపతి, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, కొత్తపల్లి ఘన శ్యామల ప్రసాదరావు, పైడిపాటి సుబ్బరామ శాస్త్రి, గాడేపల్లి కుక్కుటేశ్వరరావు, వంటివారు పద్య సాహిత్యాన్ని వెలయిస్తున్నారు. ఇంకా అనేక మంది కవులు పద్య రచన పట్ల శ్రద్ధ చూపిస్తున్నారు. ఈ సందర్భంలో గరికపాటి నరసింహారావు గారు చెప్పిన పద్య వైభవం "స్మరించటం" సందర్భోచితం.

**"ఉయ్యాల లూగించు ఒయ్యారి సీసాలు**
**తెలుగు టూయెల కవ్వి తెగని త్రాళ్లు**
**ఆచారములు తెల్పు ఆటవెలది జాలు**
**తెలుగు టావులొసంగు తేటపాలు**
**తేనె సోనల చిన్కు తేటగీతి పదాలు**
**తెలుగు మబ్బులు చిన్కు తీపి జడులు**
**అందాలు చిందించు కందార్థముల విందు**
**తెలుగు పాపల పల్కు తేనెలందు**
**పద్యమన్నది వేయేండ్ల పసిడిపంట**
**పద్యమన్నది తెలుగింటి పాడిపంట**
**తెలుగు పద్యమ్మె పాడుము తెలుగు బాల**
**తెలుగు తేజమ్ము వెలయంగ దిశల మ్రోల"**

యార్లగడ్డ వెంకట సుబ్బరావు "కాకతీయ తరంగిణి' పోచిరాజు శేషగిరి రావు "కవితా విపంచి", కె.వి, సుబ్బారావు "మృత్యులగ్నము' రాళ్ళబండి కవితా ప్రసాద్ "కాదంబిని" అనే పద్య రచనలు చేశారు.

**ఆధార గ్రంథాలు:**

1) తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య ద్వా.నా. శాస్త్రి.

**- డా॥ సిహెచ్. అనిత**

## పాఠం - 12

# నయాగరా, చేతనావర్త, అనుభూతి కవులు - కృతులు - సమీక్ష

**విషయ క్రమం:**

**12.1. నయాగరా కవులు**

**12.2. చేతనావర్త కవులు**

**12.3. అనుభూతి కవులు**

### 12.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

ఈ పాఠ్యభాగం ద్వారా తెలుగు సాహిత్యంలో వచ్చిన నయాగరా, చేతనావర్త, అనుభూతి కవిత్వం గురించి, వచ్చిన రచనల గురించి, కవుల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించటం.

### 12.1. నయాగర కవులు:

బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, కుందుర్తి ఆంజనేయులు – వీరు ముగ్గురిని నయాగరా కవులు అంటారు. ఈ ముగ్గురు కలిసి 1944వ సంవత్సరంలో ప్రచురించిన కవితా సంపుటి "నయాగరా". ఈ "నయాగరా" కవితా సంపుటిలో వీరి ముగ్గురువి మూడేసి చొప్పున తొమ్మిది ఖండకావ్యాలు ఉన్నాయి. జి.వి. సుబ్రహ్మణ్యం గారు ఈ సంపుటి గురించి "ఈ సంపుటి అభ్యుదయ కవితా ప్రస్థానంలో ఒక మజిల్. అభ్యుదయ కవితాయుగంలో అచ్చయిన తొలి కావ్యం" అన్నారు. ఈ కవితా సంపుటిలో సీతా రామరాజు, ఠాకూర్ చంద్రసింగ్‌ల గురించి రాశారు. అలాగే గెరిల్లాల ప్రస్తావన చేశారు.

రామదాసు "ఇంతకాలమును సమాజ మొక చెరసాల వంటిదనియు, దానిని పూజారులు, సమ్రాట్టులు, అమాత్యులు, మఠాధిపతులు కలిసి నిర్మించారనియు" అంటూ పూర్వ సమాజ వ్యవస్థను తీవ్రముగా ఖండిస్తూ తన దృక్పథాన్ని తెలిపారు. కుందుర్తి కూడా ఆ రోజుల్లో కుండపోతగా ఆవేశం కుమ్మరించటమే కవిత్వమనే వాదం మాది. దీనికి తోడు ఎర్రజెండా నాయకత్వాన యీ సమాజ వ్యవస్థ మారాలని మా కవితలో వుండే సందేశం" అని చెప్పారు.

**"అన్యాయం అక్రమమూ**<br>
**సంఘంలో చదరంగం**<br>
**పరస్పరం దొమ్మి దోపిడీ**<br>
**ఆరంభించని**<br>
**ఆదియుగంలా**<br>
**మంచి మీద బ్రతకమంది**<br>
**అందరికీ**<br>
**అవకాశాలూ**<br>
**సరిపోయే వస్తూత్పత్తి**<br>
**పంపిణీలో సమాన భాగం**<br>
**కోరుకొను హక్కుందట"** అంటారు కుందుర్తి.

నయాగరా కవులకి పారిస్ వీధులు, చైనా లోయలు, బర్మా అడవులు, మాస్కో గేట్లు, సోల్జర్లు, టాంక్ డ్రైవర్లు, కొడవలి పదును, సమ్మెట పెట్టు కూడా కవితా వస్తువులయ్యాయి. శ్రామికుల స్థితి రైలు క్రింద పట్టాల్లాగా, చెప్పు క్రింద చీమల్లాగా ఉందని చెప్పారు. ఏల్చూరి సుబ్రహ్మణ్యం "పాలు కోసం వేచివున్నారు ప్రజలు" అనే ఖండికలో

**"కొత్తదనం కొత్త పాట కోసం**
**మానవాళి తపించిపోతున్నది**
**గాయకులారా రండి!**
**.........................**
**ఇంక బానిసలుండరు శృంఖలాలను పాతిపెట్టండి**
**హతలూ హంతకులూ యుద్ధాలు ఆయుధాలు**
**కలవాళ్ళు లేనివాళ్ళు వర్గాలుండని**
**అంతరాలు రాని**
**స్వర్గాలకు అపురూపమైన దివ్యధామంలా జగతి**
**...............................**
**మూసలన్నీ బీటలు వారి**
**ఒక్క గాలి ఊపుకు కొట్టుకొస్తున్నది కొత్త నీరు.....**
**అన్నీ అందరమూ ఒక కంచంలో పెట్టుకొని**
**ఆప్యాయంగా తింటూ సోదరీ సోదరులలా**
**జనక జన్య రాగాలలా మసలుతుంటాము...."**

అని అంతరాలు లేని సమ సమాజాన్నే కాంక్షించారు.

బెల్లంకొండ రామదాసు అలంకారాలు, రసం మొదలైన వాటిని కవిత్వానికి శత్రువులుగా భావించారు. నయాగరాలోని కవితలు కాకుండా "శ్మశానం" అనే పుస్తకాన్ని ప్రచురించారు. "కల్పన" కవితా సంపుటికి సంపాదకులలో ఒకరైన రామదాసు రచించిన కవితలలోని కొన్ని పంక్తులు గమనిస్తే "యుగాల నుంచీ నడిచే నియమపు రైళ్ళకు పట్టాలు పీకేశారు" అనిపిస్తుంది.

**ఉదాహరణ:**

**"బ్రతుకే ఒక క్రాస్, మనిషే ఒక క్రైస్ట్"**
**"ప్రపంచమొక లంకా నగరం బ్రతుకొక అశోక వృక్షం**
**నేనొక సీతను, లంకా దహనం ఎదురు చూస్తూ"**

## 12.2. చేతనావర్త కవిత్వం:

సామాజిక చైతన్యమే నిజమైన చైతన్యంగా భావిస్తూ ఏర్పడిన కవిత్వం చేతనావర్త కవిత్వం. ఇక్కడ సామాజిక చైతన్యమంటే మానవ చైతన్యమే. మానవ చైతన్యాన్ని కాంక్షిస్తూ రచనలు చేసిన వారు చేతనావర్తకవులు. మార్క్సిస్టు ధోరణిని

తీవ్రంగా వ్యతిరేకిస్తూ, దిగంబర కవిత్వాన్ని తిరస్కరిస్తూ, మానవ వికాసశీలమైన చేతనావర్తాన్ని ఆహ్వానిస్తూ, సర్వజన ప్రయోజనం కోసం అందరికి అర్థమయ్యే విధంగా చేతనావర్తకవులు వచనంలో కవిత్వాన్ని రచించారు. దిగంబర కవిత్వంపై విమర్శలు కురుస్తున్న సమయంలో చేతనావర్త కవిత్వం ఆవిర్భవించింది. యువకుల్లో భయాన్ని పోగొట్టి, సాహిత్యతత్వాన్ని గురించి, సామాజిక వాస్తవికతను గురించి, సదవగాహన కలిగించే ప్రయత్నం చేతనావర్త కవులు చేశారు. కవిత్వానికి సుస్థిరత కల్పించి సాహిత్యంపై జరుగుతున్న సాహిత్యేతర దాడులను తిప్పికొట్టారు. చేతనావర్త కవులు కవిత్వం రాయడం సంఘం తమకప్పగించిన బాధ్యతగా భావించారు. వీరు భారతీయ సంస్కృతి గురించి, జాతి గురించి ఆవేదన చెందారు. దానిని బాగుచేయడమే లక్ష్యంగా భావించారు. ఆధునిక తెలుగు కవితా ప్రస్థానం మేలుకొలుపుగా చెప్పుకోదగింది. "చేతనావర్త కవిత్వం" 1967వ సంవత్సరంలో చేతనావర్తం మొదటి సంకలనం వెలువడింది. 1970వ సంవత్సరంలో రెండవ సంకలనం ప్రచురించబడింది.

సాహితీ బంధు బృందంగా వరంగల్‌లో స్థిరపడిన ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులు, ఆచార్య పేర్వారం జగన్నాథం, ఆచార్య కోవెల సంపత్కుమారాచార్యులు, శ్రీ వేణుముద్దల నరసింహారెడ్డి అనే కవులు నలుగురు తమను తాము చేతనా వర్తకవులుగా పరిచయం చేసుకున్నారు. వీరు తెలుగు సాహిత్యంలోని పెడధోరణుల్ని, పిడివాద ధోరణిని తీవ్రంగా నిరసించారు. మానవవికాస శీలమైన చేతనావర్తాన్ని ఆహ్వానిస్తూ రచనలు చేశారు. ఇజాల పేరుతో నిజానిజాన్ని మరచిన జాతికి స్వచ్ఛమైన రసానుభవం లోపించిందంటారు. సుప్రసన్నాచార్యులు చేతనావర్తకవులు గురించి "జీవితం నుండి పలాయనం చేయడం, వర్తమానాన్ని తిరస్కరించడం మాత్రం వీళ్ళు చేయరు. మానవ జీవితంలోని పురోగతి సుదూర ఆకాశాల స్ఫురించే దివ్య జీవన శిఖరం అధిరోహించడంగా వీళ్ళు భావిస్తున్నారు. కాలం వీళ్ళకు అనంతమైన అఖండమైన ప్రవాహం. భావియుగంలోని ప్రేమమంజులమైన దివ్యభావ చైతన్యావతరణ ప్రభాతవేళలోని స్వర్ణకిరణాలను వీళ్ళు దర్శిస్తున్నారు" అంటారు. చేతనావర్తన కవిత్వం ఒక దృక్పథం. చేతనావర్త కవులు సామాజిక చైతన్యాన్ని కాంక్షించారు అనేదానికి నిదర్శనం ఆ నలుగురు ప్రచురించిన "చేతనావర్తం" మొదటి సంకలనంలో నాలుగవ పుటలోని కవితలే.

**"ఎదిగిపో" కవితలో కోవెల సుప్రసన్నాచార్యులు**

**"శ్మశానంలోంచే రానక్కరలేదు మార్పు**

**సౌందర్య నిరంతరాన్వేషణలోంచి రావచ్చు**

**సంపూర్ణత కోసం సమగ్రత కోసం మనం చేసే**

**తపస్సు లోంచి రావచ్చు, రమణీయ ఫలనిశ్చాయకంగా"** అంటారు.

"కాలజ్ఞానతత్త్వం" అనే కవితలో పేర్వారం జగన్నాథం గారు

**"కాలాన్ని వాహనంగా వాడుకునేవాడు**

**కదలకుండా కూర్చోడం నేర్చుకోవాలి.**

**కళ్ళెం బిగి పట్టడం రావాలి**

**లేదా కందకంలో కూలడం తప్పదు"** అంటారు.

"మనశ్చిత్రం" కవితలో కోవెల సంపత్కుమారాచార్యులు

**"నేను నిర్మించిన భవనం నా మీదే కూలింది**

**నేను పెంచిన కుక్క పిచ్చిదై నన్నే కరిచింది**

**లోకానికి ఆలోకానికి పెరిగిన జీవితం**

**చూస్తుండగానే విరిగిపడింది"** అంటారు.

"నిద్రనెరుగని మనసుతో" అనే కవితలో వేణుముద్దల నరసింహారెడ్డి

**"నిద్రనెరుగని మనస్సులతో నడుస్తున్నాను**

**గుండెలో కొండంత కుంపటి దాచుకున్నాను**

**నలుగురిలో ఏడ్వటం నాగరికత కాదని**

**యోగిలా నవ్వటం నేర్చుకున్నాను"** అంటారు.

**1) ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులు:**

చేతనావర్త కవుల్లో వీరు మొదటి వారు. భారతీయ తాత్విక సిద్ధాంతాల్ని, ఆధ్యాత్మిక భావ భూమికను పూర్తిగా అర్థం చేసుకున్న వారు సుప్రసన్నాచార్యులు. వీరు "చేతనావర్త" మొదటి సంకలనంలో "అనంత మోహిని", "ఆశావాది", "పరంపర", "నిగమ విశ్రాంతి నుండి", "ఛాయాగ్రహం", "అవర్త విభ్రమణ", "శుష్కక్షాళనానికి పంపండి", "తేజోరేఖ", "అనవధి", "వ్యాఖ్యానం", "ఇంద్రియాలు నిద్రపోయిన వేళ", "అవతారం", "శివధనస్సు", "అమృత పుత్రులు", "అన్నా", "ఎదిగిపో", "కళ్యాణవర్ష" అనే 17 కవితల్ని రచించారు. "చేతనావర్తం" రెండవ సంకలనంలో "మాతృ దర్శన", "కన్నీళ్ళు", "ఓనాదేశమా', "యుగపద", "రెండు పక్షులు", "క్షాత్ర ప్రతీక", "ఎఱ్ఱని పీడకల", "నీవు", "మధనం", "రెక్కలు కట్టుకువచ్చింది" "రేపు పగిలిన అద్దం" అనే కవితలున్నాయి.

"ఆశావీధి" అనే కవితలో సుప్రసన్నాచార్యులు గారు

**"వస్తువును శక్తిగా మార్చ**

**వచ్చునన్న సిద్ధాంతం నించి**

**శక్తినానందంగా మార్చి**

**సాగునాతనాశా వీది**

**ఆశలు చిగిర్చినై – అన్ని దిశల**

**కోసల హస్తాలు చాచుకో**

**ఉన్న మన్మస్తకుడవై – భూమి**

**ఉన్నంతకాలం అలాగే ఉండిపో"** అంటారు.

సుప్రసన్నాచార్యులు మనోమయకోశంలోని మానవుడు దివ్యత్వాన్ని అధిరోహించడాన్ని ప్రతీకాత్మకంగా చెప్తారు. వీరి కవితల్లో వేదాంత, తాంత్రిక, మనశ్శాస్త్ర విషయాలు ఉంటాయి. "తేజశ్చక్రము, దుఃఖ యోగిని, అధునా" అనే కావ్యాలు రచించారు.

**"రాత్రి నల్లంచు చీర చివర**

**కట్టుకున్న జరీపోగు ఉషస్సు**
**సాగిపోయే గజదొంగ మెడకు**
**కట్టిన ఇనుపగుండు సూర్యుడు"**

అని మిగిలిన వారికి భిన్నంగా వర్ణించారు.

"అమృత పుత్రులు" అనే ఖండికలో సుప్రసన్నాచార్యుల వారు

**"పులుముకున్నారు వెన్నెలలు మొగాలపైన**
**వేసుకున్నారు పందిళ్ళు మల్లె తీవలకు మనసుల్లో**
**కన్నుల్లో కాశ్మీర సౌందర్య దీపం వెలిగించుకున్నారు**
**ఆలోచనల్లో సిత హిమాచలం పెంచుకొన్నవాళ్ళు**
**ఎవళ్ళు వీళ్ళు?**
**........................**
**తరణి కిరణాలవలె స్వచ్ఛమైన వాళ్లు**
**తరుణ భావం వలె ఎప్పుడూ ఉప్పొంగేవాళ్ళు**
**కర్పూరం వలె పరిమళంలో వెలిగిపోయేవాళ్ళు**
**చైతన్య సాగర సింహాలు, సౌందర్యాకాశ మరాళాలు**
**సంసార మహావృక్షం పండిన తొలి మధుర ఫలాలు**
**ఎవళ్ళు వీళ్ళు?**
**అమృత పుత్రులు, ఆనంద గాత్రులు, అంభోదనేత్రులు"**

అని భారతీయుల గురించి ఎంతో గొప్పగా చెప్పారు. మానవుడి స్థితిని ప్రకృతితో, సమాజంతో, వైజ్ఞానిక యంత్రాలతో ముడిపెట్టి పరిశీలించి, సమగ్ర మానవ వికాసానికి కవిత ఉపయోగపడాలని సుప్రసన్నగారు భావించారు.

**2) ఆచార్య పేర్వారం జగన్నాథం:**

చేతనావర్త కవుల్లో రెండవవారు జగన్నాథంగారు. "చేతనావర్తం" మొదటి సంకలనంలో "శ్రీముఖం, స్వయంవరం, రోడ్డు రోలర్, దైవాసుర సంపద్విభాగయోగ, దయ్యాల కొండ, యదాయదాహి, గ్లానిర్భవతి భారత, గాండీవం స్రంసతే హస్తాత్, ది గ్రేట్ ఇండియన్ సర్కస్, మహమ్మారి, తమసోమా జ్యోతిర్గమయ, పట్టాలు తప్పిన బండి, కాలాంతకుడు, కాలజ్ఞాన తత్త్వం, తెరదించాలి, మరణ శాసనం, ఏకం సద్విప్రాబహుధా వదన్తి" అనే శీర్షికలు కల మొత్తం 16 కవితలున్నాయి. "చేతనావర్తం" రెండవ సంపుటిలో "వృషభ పురాణం, కీలెరిగివాత, కనకపు సింహాసనము, గుడినే మింగిన వానికి, ఇది రహదారి కాదు, బొంబై తమాషా, ఔటాఫ్ సిలబస్, ఇక్కడే మనమంతా, నిప్పుకణిక, భవిష్యద్గీత, ఉగాది పాట" అనే 11 కవితలున్నాయి. వీరి కవితా శీర్షికలే భిన్నంగా ఉంటాయి. సమాజంలో రోజురోజుకి పెరుగుతున్న అవినీతిపై దండయాత్ర చేశారు జగన్నాథంగారు.

**"...... అల్లాఉద్దీన్ దీపంతో**

**ఆదుకుంటున్నారు ప్రభువులు**

**అధికారుల హస్తముద్రలు**

**అమ్ముడుపోతున్నాయి అంగట్లో**

**కూలుతున్న వంతెనపై**

**మేడలు నిర్మితమవుతున్నవి"**

అని వ్యంగ్యధోరణలో అధికారుల అధికార దుర్వినియోగాన్ని గురించి చెప్పారు. పేర్వారం జగన్నాథంగారు తన కవితా ధ్యేయాన్ని గురించి గతంలోంచి అనుభవాల్ని పిండి, వర్తమాన విషవలయాన్ని ఛేదించి, భవిష్యదాశాంచలాల వైపు చేతులు చాచి, మనిషిలో నిగూఢంగా ఉన్న మానవతను జాగృతం చేసే ప్రయత్నమే ఈ కవిత. అవినీతి, అన్యాయం, అరాచకం వంటి అంటురోగాలతో బాధపడుతున్న జనసందోహానికి విద్యుత్తులా నరనరంలోకి ప్రాకి హృదయ ప్రక్షాళనం చేసి మనిషిలోని మంచితనానికి నీరాజనం పట్టి మనిషిపై మనిషికి భరోసా కలిగించడం దీని లక్ష్యం. రంగురంగుల బురఖాలతో నంగనాచి కుతర్కాలతో పైశాచిక వికటాట్టహాసాలతో మనిషిని మరింత పాశవిక దుస్థితికి దిగజార్చే కుహనా సంస్కారాలతో నిండిన జీవిత కశ్మలాన్ని విచ్ఛిన్నం చేసి గుండె గుండెకు వంతెన కట్టి మనిషి మనిషి జ్యోతిర్గోళంలా వెలిగించడం దీని ధ్యేయం" అని కవిత్వం యొక్క అసలైన లక్ష్యాన్ని తెలిపారు.

సమాజానికి కేంద్రబిందువు వ్యక్తి. ఆ వ్యక్తిలో చైతన్యం కలిగించడం కోసం జగన్నాథం గారు "ఉగాది పాట" అనే కవితలో

**"మంచికైనా చెడుకైనా**

**మానవుడే కేంద్ర బిందువు**

**ఒకే కేంద్రం నుండి పుట్టిన తరంగం**

**కొలనంతా వ్యాపించినట్లు**

**మనిషిలోని మంచితనం పుట్టి**

**సమాజాన్ని ఆవరించాలి"** అంటారు.

వీరు వ్యంగ్య ధోరణిలో రాసిన కవిత "కనకపు సింహాసనము".

**"ఈ కుక్క నిన్నటి దాకా**

**ఎక్కడెక్కడో తిరిగి ఏమేమో తిన్నది**

**ఎదురైన వాడినల్లా కరిచింది**

**ఎగబడి ఒళ్ళంతా గీకింది**

**......................**

**ఛీ! ఛీ! పెంచినవాళ్ళను కరిచే కుక్క**

**దొంగలు పడితే మొరగని కుక్క**

**అదేం కుక్క"** అని ప్రశ్నిస్తారు వీరు.

జగన్నాథం గారి కవిత్వంలో విలక్షణత కనిపిస్తుంది. సామాజిక చైతన్యం కలిగించటం కోసం కవిత్వం రచించారు. వీరు ఏది చెప్పినా హాస్య వ్యంగ వైభవాల కలయికతో అన్యాయాన్ని, అక్రమాన్ని ఎలుగెత్తి చెప్పారు. రాజకీయాల్లోని కుళ్ళుని నిశితంగా విమర్శించారు. అందుకే వడలి మందేశ్వరరావు గారు వీరి కవిత్వం గురించి "జగన్నాథం కవిత చదువుతుంటే ఇలా ఆషామాషీగా, తమాషాగా చెబుతున్నాడేమిటి అనిపిస్తుంది, నవ్వు వస్తుంది, ఆలోచిస్తే ఒకసారి కోపం, ఒకసారి నిర్వేదం, భయం, ఒకసారి దేన్నో పాతెయ్యాలన్న ఉద్వేగం కలుగుతుంటాయి. వసుచరిత్రకారుని నోట ప్రతిమాటకూ రెండర్థాల శ్లేష ఎలా నైజమైపోయిందో అలాగే జగన్నాథంగారి వాక్కుకు అన్యాపదేశం అంతనైజమైంది. దీనిలో నుంచే ఆయన అవహేళన, అధిక్షేపం పుట్టుకొని వస్తాయి" అని అన్నారు. ఇది అక్షర సత్యం.

**3) ఆచార్య కోవెల సంపత్కుమారాచార్యులు:**

సంపత్కుమారాచార్యులు "చేతనావర్తం" రెండవ సంకలనంలో తన కవితకు అనంత జగత్ చైతన్యం ప్రేరణ నిచ్చిందన్నారు.

**"దేశకాల సమాజాల త్రిపుటి**
**అన్నిటికీ కేంద్రమైన వ్యక్తి**
**అనంత వైవిద్యం గల మనః ప్రవృత్తి**
**అన్ని దశల్లోనూ మానవ సమగ్ర వికాసం**
**ఆధునిక భావ చైతన్య విన్యాసం**
**నినాదాడంబరాలు లేని విధానం**
**ఇజాల విషవలయం చీల్చి వచ్చే నిజం**
**ఉభయంలోనూ ఏర్పడే సామీచీన్యం–**
**ఆవేశాన్ని అనౌచిత్యం పాలుకానీయని ఆలోచన**
**అవ్యావహారికతను నిరాకరించిన వివేచన**
**అంతర్బహిరంగ సమన్వయాల సమాలోచన**
**భావం**
**దాని అభివ్యక్తిలోని వైవిధ్యం**
**సాధనాల సమ్యక్సమ్మేళనం**
**ఔచిత్య భావనా సంధానం**
**ఆనంద భావన అనుమతి ప్రసారణ**
**అనంత జగచ్చైతన్యావగాహన,**
**నా కవితకు ప్రేరణాలు**
**స్పందనలో దోహదాలు"**

ఈ కవితలో సంపత్కుమారాచార్యులు కవిత్వం ఎంతో వైవిధ్యాన్ని ప్రదర్శించింది. "చేతనావర్తం" మొదటి సంకలనంలో

"మబ్బు, గృహ ప్రవేశం, జనాంతికం, అలం-కృతి, రోజువారీ, ఆసివీక్షణ, అంతర్లీయం, మనశ్శీత్రం, ద్వైవిధ్యం, నాటకాంతం, ఈ రాత్రి గడువలేదు" అనే కవితలు, రెండో సంకలనంలో "వర్తమాన వృత్తం, అంతర్వలయం, స్వాభినందన, కత్తి విడిచి సాం, ఆవేశానికి అభ్యర్థన, ఆత్మాశ్రయం, వసుధైక కుటుంబీకుడు, ఆవర్త ప్రవృత్తి, ఒకమాట, సమాజం ఎక్కడా కన్పించలేదు, ఆశల బతుకు" అనే వీరి కవితలు ఉన్నాయి.

వీరి కవితల్లో వేదాంతం, భారత జాతీయత కన్పిస్తాయి.

"అంతర్లయ కవితలో వీరు

**"............. నేను మళ్ళీ నిద్రలేవదలచుకోలేదు**
**వ్యర్థ జీవన భాండం నెత్తికెత్తడం కుదరదు**
**నన్ను నే బాగా పరీక్షించుకొని**
**నేను కాని దాన్ని దులుపుకొని**
**నన్ను నాలో లయం కానీయండి"** అని తమ నిరాశను వ్యక్తీకరించారు.

వసుధైక కుటుంబం అనేది భారతీయ సంస్కృతికి నిదర్శనం. అందరినీ ఒకే కుటుంబంగా భావించేటంత విశాల హృదయం భారతీయుల స్వంతం. సంపత్కుమారాచార్యులు "వసుధైక కుటుంబకుడు" అనే కవితను రచించారు.

అందులో

**"వ్యక్తికీ వ్యక్తికీ మధ్య గల సంబంధాన్ని**
**నిర్దాక్షిణ్యంగా విచ్ఛిన్నం చేస్తూ**
**వసుధైక కుటుంబ సంయోజనకు**
**సగర్వంగా పాటుపడుతున్నా**
**పాటులో ఆటూ పోటూ అట్లా ఉంచి**
**అనుక్షణం ఆగకుండా అరుస్తున్నా,**
**ప్రచారం చేస్తున్నా**
**నాకు తెలుసు, ఇది ఆదర్శం మాత్రమేనని**
**నాకు తెలుసు, ఇది ఆచరణలో అసంభవమని**
**..................................**
**వసుధైక కుటుంబ సంయోజనకు**
**సగర్వంగా పాటుపడుతున్నా**
**సిద్ధాంత ప్రమేయాల కూడా దీసి**
**అనుక్షణం ఆగకుండా అరుస్తున్నా,**
**ప్రబోధిస్తున్నా"**

అని ఆదర్శాల కోసం వసుధైక కుటుంబం కోసం తానెంతగా శ్రమిస్తుందీ వివరించారు కవి.

**4) శ్రీ వేణుముద్దల నరసింహారెడ్డి:**

చేతనావర్త కవుల్లో నాలుగవవారు నరసింహారెడ్డిగారు. "చేతనావర్తం" మొదటి సంకలనంలో "జన్మాష్టమి, ఈ తమస్సు చీల్చబడుతుంది, యుద్ధం పూర్తికాలేదు, చీకటి ఆవులించింది, సూర్యున్ని విడిపించాలి, రఫ్‌స్కెచ్, నిషాద విషాద యోగం, నిద్రనెరుగని మనస్సుతో, కవీ! కవీ! మానవుడా" అనే కవితలు, రెండవ సంకలనంలో "కాలాన్ని కత్తిరించి చూడకు, ఆకలి ఒక్కటే సత్యం, పిచ్చి గుండె పిరికిగా చావకు, నడచి వచ్చిన సముద్రం, కవిత్వం నా ఊపిరి, "? -!", నీకాళ్ళ మీద నువ్వు, యుద్ధం పూర్తి కాలేదు, ఎత్తిపట్టిన పిడికిలిలోని రహస్యం, చేదు మాత్రలు, మావో నవ్వ్వుండట" మొదలైన కవితలున్నాయి.

"చేతనావర్తం" రెండవ సంకలనంలో నరసింహారెడ్డి గారు సమాజాన్ని సంఘటితం చేయాలనే తపనతోనే తాను కలం పట్టినట్లు చెప్పుకున్నారు. కవిత్వం ఇలానే ఉండాలి అనే అధికారం ఎవరికీలేదని, వేర్వేరు జాతులిక్కడ లేవని ఉన్నది ఒక్క భారతజాతేనని చెప్పారు, అవ్యవస్థ, అరాచక, కుళ్ళు రాజకీయాలు, కుల గోత్రాలు, మూఢ విశ్వాసాలు, ఆకలి అవమానం ఈ జాతి నుంచి తొలగించాలని ఆకాంక్షించారు. రచనలలోనూ సంయమనం పాటిస్తున్నానన్నారు.

"కవీ! కవీ! మానవుడా!" కవితలో

**"............ విశ్వ శ్రేయము నీధ్యేయంగా**
**శశ్వదుదారత పాథేయంగా**
**కవితా వీధులలో విహరించిన వానిని**
**శివతా పరిమళాలు నించిన వానిని**
**........................**
**ఇరుకు గోడల నడుమ న**
**ఏవేవో సంకుచితపు**
**ఊహల ఊయలలో ఊగకు**
**పిడికెడు స్వాతంత్ర్యంతో...**
**గుక్కెడు సానుభూతి కోసం వేడకు**
**పరాయి కిరాయి స్వరాలతో పాడకు**
**................................**
**కుహనా సంస్కారాల కుటిలత నుండి, కృత్రిమత నుండి**
**మదుల నుండి, జడుల నుండి**
**వలల నుండి, జలగల నుండి**
**విడివడే స్వేచ్ఛ, స్వేచ్ఛ, స్వేచ్ఛ,**
**స్వేచ్ఛ కావాలి నాకు**

**పాడవోయి సోదరుడా**

**కవీ! కవీ! మానవుడా!"**

అని తన సంస్కార హృదయం చాటుకున్నారు. వీరి కవిత్వం వాడిగా వేడిగా సూటిగా ఉంటుంది. వీరి కవిత్వం వీరి వ్యక్తిత్వానికి ప్రతీకగా ఉంటుంది. సమానత్వం, సుహృద్భావం, శాంతి సౌభాగ్యం, స్వాభిమానం వీరి కవితా గుణాలు.

ఈ విధంగా చేతనావర్త కవులు దిగంబర కవిత్వాన్ని తిరస్కరించారు. అసభ్య పదజాలంతో వచ్చేది కవిత్వం కాదని అటువంటి కవిత్వాన్ని నిరాకరించారు. సామాజికంగా చైతన్యం సాధించడానికి, ప్రగతిని సాధించటానికి, సమగ్రతైన మానవీయత వికాసం చెందటానికి చైతన్యవంతమైన కవిత్వం రావాలని భావించి వీరు తమ కలాన్ని బలంగా వాడారు. వీరి చైతన్యం వీరి కవిత్వంలో సాక్షాత్కరిస్తుంది. ఈలోపు తెలుగు సాహిత్యంలో విప్లవ సాహిత్యం ప్రారంభమైంది.

## 12.3. అనుభూతి కవులు:

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, ఇస్మాయిల్, మాదిరాజు రంగారావులు అనుభూతి కవుల్లో ముఖ్యులు. వేగుంట మోహన ప్రసాద్ (మో) ని కూడా ఒక విధంగా అనుభూతికవే అనుకోవాలి. కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ, వాడ్రేవు చిన వీరభద్రుడు, వజీర్ రెహమాన్, రేవతీ దేవి, వై. శ్రీరాములు మొదలైనవారు అనుభూతి కవుల కోవకే చెందుతారు. సీతారాం, సిద్దార్థ, నామాడి శ్రీధర్ ల కవితలలో అనుభూతివాద ఛాయలు కనిపిస్తాయి.

"అనుభూతి కవిత్వమంటే అనుభూతికి సంబంధించిన కవిత్వమని కానీ, అనుభూతిని ఆవిష్కరించే కవిత్వమని కానీ, అనుభూతికి ప్రాధాన్యమిచ్చే కవిత్వమని కానీ చెప్పడానికి వీలుంది. అనుభూతి కోసం అన్వేషిస్తూ దాన్ని సాహితీ జగత్తులో సాక్షాత్కరింపజేయాలన్న తపన, ప్రయత్నం ఉన్న కళాకారులు, రచయితలు ఈ శబ్దాన్ని ప్రయోగించగలుగుతారు. అందుకు కారణం తమకు పూర్వం కానీ, తమ సమకాలీన సాహిత్య చైతన్యంలో కానీ అనుభూతి స్పర్శ సాహిత్యంలో లుప్తమైపోతున్న వేదన కూడా వారు బలంగా పొంది ఉంటారు" అని జి.వి. సుబ్రహ్మణ్యం గారు అనుభూతివాదం గురించి వివరించారు. గుంటూరు శేషేంద్ర శర్మ అనుభూతివాదం దేశీయమని, విప్లవ కవిత్వానంతరం కూడా కొనసాగుతుందని తెలిపారు. జి.వి. సుబ్రహ్మణ్యంగారు "సాధారణీకరణం, సామాజికీకరణం, స్వాత్మీయ కరణం" అని మూడు రకాలుగా అనుభూతి వాదం ఉంటుందని వర్గీకరించారు.

కొందరు అనుభూతివాదాన్ని మరో కోణంలోనూ వ్యాఖ్యానించారు. "ధన స్వామ్య వ్యవస్థలో మధ్య తరగతి మనస్తత్వం ఊగిసలాడుతూ వుంటుందని, అందుకని భ్రాంతిమయ వాతావరణంలో జీవిస్తూ ఏకాంతంగా అనుభూతి పొంది కవిత్వం రాస్తారని" త్రిపురనేని మధుసూదనరావు గారంటే, నందిని సిధారెడ్డి గారు "కొందరు మధ్య తరగతి కవులకి కవిత్వంలోనికి రాజకీయాలు రావటం నచ్చలేదు. లోకానుభూతులకి తట్టుకోలేక ఆత్మానుభూతుల్ని ఏర్పరచుకున్నారు. శుద్ధంగా, శుభ్రంగా జీవించాలనుకున్నారు. ఈ ధోరణి మనస్తత్వంలో 'అనుభూతి వాదం' అనే శాఖ చిగురుతొడిగింది. సమాజానికి భయపడేవారు, వ్యక్తివాదంతో, శుద్ధ కళావాదంతో, ఆత్మన్యూనతా భ్రాంతివల్ల అంతర్ముఖుడై అనుభూతివాద కవిత్వం సృష్టిస్తారు" అని వ్యాఖ్యానించారు.

అనుభూతి కవిత్వంలో ఆత్మానుభూతులు, లోకానుభూతులు వుంటాయి, ఈ అనుభూతులలో స్పష్టత లోపిస్తే అయోమయం తప్పదు. అనుభూతి కవులు రాజకీయాలకు అతీతంగా ఉంటారు. సౌందర్యీకరణ, ఆదర్శీకరణ వీరికిష్టం. భావ

కవిత్వానికి తోబుట్టువులాంటిదే అనుభూతి కవిత అనిపిస్తుంది. అనుభూతి కవులలో ముందుగా పేర్కొనవలసింది బాలగంగాధర తిలక్ గారినే.

"అనుభూతి కవితగా గుర్తుపట్టడానికి ప్రధానమైన లక్షణం కవిత చదివిన తరువాత ఒక సందేశం, ఒక భావనం, ఒక దృక్పథం కాకుండా కేవలం అనిర్ధిష్టమయిన అనుభూతి కావాలి. అది పోలికల ద్వారా, ఉహా అల్లికల ద్వారా, ఇంద్రియ సంవేదన రేకెత్తించే వర్ణన ద్వారా కావచ్చు. కాని, అందులోని నవ్యత హృదయానికి హత్తుకొనే అనిర్వచనీయమైన, అనిర్దిష్టమైన అనుభూతిగా మిగలాలి" అని ఆర్. ఎస్. సుదర్శనం అంటారు.

జీవచైతన్యాన్ని కాల్పనిక, మార్మిక చైతన్యాలతో పరిపోషించిన కవులు మాదిరాజు రంగారావు, మో మొదలైన వారు. కాల్పనిక ప్రవృత్తితో జీవ చైతన్యాన్ని పోషించే అనుభూతిని కవితలో పోషించిన కవులలో శ్రీకాంతశర్మ, వై. శ్రీరాములును పేర్కొనాలి. వైజ్ఞానిక తాత్విక ప్రవృత్తులతో జీవ చైతన్య ప్రవృత్తులను పోషించిన కవులలో పేర్కొనదగినవారు అజంతా, కొత్తపల్లి, రేవతీ దేవి, శేషేంద్ర శర్మ, చలం కవితల్లోనూ కూడా అనుభూతి కవిత్వం ఉంది. కొందరు కవుల కవిత్వంలో అనుభూతి ఉంటుంది. వారు కేవలం అనుభూతి కవిత్వం మాత్రమే రాయరు, అనుభూతికి ప్రాధాన్యతనిస్తారు.

**ఇంద్రగంటి శ్రీకాంత శర్మ:**

"లోకంలో తాను దర్శించిన వస్తువు మనస్సును కదిలిస్తే ఆ అనుభూతిని కావ్యంగా మలచుకుంటారే గాని యీయన ఏ రాజకీయ సిద్ధాంత ప్రచారానికి కవిత్వాన్ని సాధనంగా ఉపయోగించరు. ఏ ఇజాలతో నిమిత్తం లేకుండ, అన్ని ఋతుపవనాలను ఆహ్వానిస్తారు. జీవితం నుండి వెలుగును స్వీకరించి వెలుతురును ప్రసరింపజేసే కవి శ్రీకాంతశర్మ గారు" అంటారు రామమోహన రాయ్‌గారు. శ్రీకాంతశర్మ గారి కవిత్వంలో అనుభూతి ఉంటుంది.

**"దృశ్యాలు గతించాక**
**మిగిలేవి అనుభవాలే కద!**
**అవి బాధిస్తాయి సాధిస్తాయి**
**అస్తిమితంగా పరుగెత్తిస్తాయి**
**పరుగెత్తిన వాళ్ళ పాదాల గుర్తులు**
**రేపటికి బాటలు పరుస్తాయి"**

అనడంలో అనుభూతి ప్రాధాన్యాన్ని గుర్తించవచ్చు.

**"స్వప్నం నా ఊతకర్ర**
**దేపం నాగానం**
**భవిష్యత్తు నుదుటికన్ను**
**నిశ్శబ్దం గమ్యం"**

అంటారు కవి.

**శ్రీకాంతశర్మ "అనుభూతి గీతాలు" సంపుటి లోని కొన్ని కవితలు:**

**"స్వప్నం రంగుల వలయం**
**ఏ అంచు నుంచి నువ్వు జన్మిస్తావో తెలియదు**
**ఆత్మ ప్రాకారాల్లోకి చొరబడతావు**
**క్రమంగా మెత్తని చల్లని పొగమంచువై**
**మెల్లమెల్లగా అంతరిస్తావు"**
**"నిన్ను విడిచి వచ్చాకగాని**
**నీ స్వప్న చ్ఛాయలింత బలమైనవని నాకు తెలియదు...**
**.......... విషమ సందర్భాలలో**
**వడగాలిలో చెట్టు లాగ జుట్టు విరబోసుకుని**
**మండు టెండల్ని పిడికిట బట్టి**
**అగ్ని స్నానం చెయ్యడం నాకలవాటు**
**నా ఆగ్రహావేశాలే తప్ప**
**నిన్ను గురించి ఆలోచించినదెప్పుడు?"** మొదలైనవి.
**"ఒక యత దుండును**
**ఆతని కామెయుండును**
**ఉండునా....."**

అనే కవిత విశ్వనాథ వారిని అనుకరిస్తూ ఫెమినిస్టుల్ని ఉద్దేశించి రాశారు. సమాజాన్ని గురించి, కుహనా నాయకుల గురించి

**"మహాకాలుష్య కటాహంలో**
**మురిగి పోయివున్నాం**
**అడిగావు గనక చెపుతున్నా**
**అంతరంగం జబ్బుగా వుంది**
**జ్ఞానస్నానం ఒక్కటే శరణ్యం"** అని అంటారు,

**ఇస్మాయిల్:**

"వాటిల్లో (అభ్యుదయ, విప్లవ కవిత్వాలు) కవిత్వం అనిపించుకునేవి చాలా తక్కువగా వున్నాయి. రాజకీయ అభిప్రాయాల పొలిమేరలు దాటి కవి వైయక్తిక అనుభవాన్ని స్పర్శించిన చోట్ల కవిత్వం ఉద్భవించింది" అంటారు ఇస్మాయిల్. కవిత్వం ఎప్పుడూ అన్వేషణే అని నిబద్ధత, మార్క్సిజం దానికి అవసరం లేదని చెబుతారు ఇస్మాయిల్. "చెట్టు నా ఆదర్శం", "మృత్యువృక్షం", "చిలుకలు వాలిన చెట్టు", "రాత్రి వచ్చిన రహస్యపు వాన" మొదలైన కవితా సంపుటాలలో హైకూ కవిత్వం రాశారు. అభ్యుదయ భావాల పట్ల, సామాజిక స్పృహ పట్ల, నిబద్ధత పట్ల ఆసక్తి లేని కారణంగా కొందరు ఇస్మాయిల్‌ని అంతర్ముఖ కవిగా, కాల్పనిక కవిగా పేర్కొంటారు. వీరి కవితలు కొన్నిటిని గమనిస్తే

"దివిలో ఊగే విహంగాన్ని
భువిలో పాకే పురుగు బంధిస్తుంది
గడియేని ఆగని సూర్యుణ్ణి
గడియారపు బాహువులు బంధిస్తాయి
పీత డెక్కల చంద్రుణ్ణి
చేతులెత్తే సముద్రం బంధిస్తుంది
తెగవాగే జలపాతపు నాలికని
సెగలెగిసే గ్రీష్మం బంధిస్తుంది"

అంటారు. ఇందులోని భావుకత వెంటనే అర్థంకాదు. 'మనీష' మనిషిని మనిషిని కలుపుతుందంటారు ఇస్మాయిల్ గారు.

"దినపు రేకలపైన వాలెను
ఇనుని సీతాకోక చిలుక
పిట్టల పాటలు నీడ ఊటలు
చెట్టులను చేరు కృశించి
నీడ మహా ప్రేమి, వీడ
లేదు గౌరాంగి గోడను"

"అగాధమైన రైలుహోరులోంచి
ఎగతోడుతున్న నిదరబాల్చీలనించి
ఒకటి రెండు మాటలొలికి
ఒడిలిపోయిన స్మృతుల
ముసిలి వేళ్లని తడిపి
ముడుచుకుపడుకున్న నన్ను
వికసించిన చివురాకులా
విప్పి కూచోబెట్టాయి
ఆమె చిన్నప్పటి ఊరు"

"పద్యాన్ని లోతుగా తవ్వుతున్నాడు కవి
టన్నుల కొద్దీ మన్ను కింద
కప్పబడి వుంది పద్యం
ఇంత లోతుగా దీన్ని
ఎవరు పాతేశారో తెలీదు"

ఇస్మాయిల్ "మా మనవడు" అనే కవిత రాశారు. అది చదివితే అనుభూతికి లోనవుతారు.

**"నీ మార్మిజం మహాసముద్రం**
**నిన్ను విడిచి ఎన్నడో ఇంకిపోయింది**
**నీ చెవిలోని హోరు**
**ఇంకా అదే ననుకుంటున్నావు"** అని నిర్భయంగా ప్రకటించారు.

"అనంతపురంలో గాడిదలు" అనే కవితను రాజకీయవేత్తలపై వ్యంగ్యాస్త్రంగా సంధించారు.

**మాదిరాజు రంగారావు:**

"వచన కవితకు తాత్విక చింతనా దృష్టిని కల్గించి, జీవితమంత గంభీరమైనది కవిత్వం అనే భావంతో రచిస్తున్నవారు శ్రీ మాదిరాజు రంగారావు" అన్నారు కడియాల రామమోహనరాయ్. వీరి కావ్యాలన్నీ "స్వేచ్ఛా కవిత్వం" పేరుతో మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. "ఈ సంపుటంలో ఆదర్శ, తాత్త్విక, ప్రతీక, భావాత్మక, మనోవైజ్ఞానిక, సామాజిక కవిత్వ విశ్లేషణలో రూపొందింపబడింది" అని రంగారావు గారు అంటారు. వీరి కవిత్వంలో తాత్వికత, మార్మికత్వం, ప్రతీకలు ఒక్కోసారి జటిలంగా, ఇంకోసారి గూఢంగా, ఇంకోసారి పేలవంగానూ ఉంటాయి.

**ఉదాహరణకు వీరి కవితలు కొన్ని:**

"మొదలూ తుదీ నాశనం ఎరగని మహాకాంతి పుంజం నుండి
అవతరించిన భాగం వలె ప్రపంచం
అందులో అగ్నిశిఖల వలె సంచరించేరు మానవులు"
"నా శిరస్సు ఆకాశం వలె అందని ఎత్తులో ఉంది
నా పాదాలు నదీ తరంగాల వలె ఒక చోట నిల్వలేకున్నాయి
నా మనస్సు గాలి వలె వెలుగువలె అంతటా ఆడుతూంది"
"టాక్సీలు తిరుగుతున్నాయి ఎన్నికల్లో నాయకులవలె
బిచ్చగాండ్లు హోటల్ ముందు దారి కడ్డంగా నిల్చున్నారు
ఎన్నికల్లో నిల్చిన ప్రజా ప్రతినిధులకు మల్లే
అపుడపుడు మన శాసనసభలూ ఈ బజారుకేమీ తీసిపోవు"

**వేగుంట మోహన ప్రసాద్:**

మోహన ప్రసాద్ గారు "చితి–చింత" నుంచి "బతికిన క్షణాలు", "రహస్తంత్రి" వరకు వేగుంట మోహన ప్రసాద్ – 'మో' గా ఎన్నో కవితలు రాశాడు. ఇతని కవితలు "అర్ధమ్ముకాని భావగీతాల" వంటివి. అస్పష్ట కవిగా పేరు తెచ్చుకున్నాడు. విషాదకవి అంటారు. నిరాశావాది అంటారు. అయితే కవితాహృదయం గలవాడని అంతా ఒప్పుకుంటారు. ఈ విషయాన్నే కడియాల రామమోహనరాయ్ గారు "వచన కవిత్వంలో నూతన ప్రయోగాలు చేసి, అల్లకల్లోలమైన మానసికావస్థను మాటల్లో పెట్టడానికి ప్రయత్నిస్తారు. అధివాస్తవికుల ఆలోచనల్లాగే వీరి గీతాల్లో భావాలు కూడా ఒక క్రమంగా లేకుండా చెదిరిపోతూ వుంటాయి.

నేటి సమాజాన్ని చూచి కవి పొందిన నైరాశ్యం, ప్రాచీన స్మృతులు, కవి మనస్సులో అల్లిబిల్లిగా గజిబిజిగా అలుముకున్న చిన్న నాటి జ్ఞాపకాలు శ్రీ మోహన ప్రసాద్ కావ్య వస్తువులు" అని విశ్లేషించారు.

**"మన మనః క్లేశాల్ని కోసి, నిమ్మ, నారింజ, బత్తాయి**
**పళ్ళుగరసం తీస్తే పులుపు రొద్దు**
**చెడుగుడాడే వాడికి పారిపోయేవాడికీ, పండు ముదుసలికీ**
**ఇస్తే కూతపట్టి రక్తం వచ్చి యౌవనం తొంగి చూస్తుంది.........**
**........... మాటలు ఒక్కొక్క బొట్టు పడుతూ తడబడుతూ**
**పులుపురొద్దు వాక్యాలవుతాయ్, కావ్యాలవుతాయ్...."** అంటూ

అసంబద్ధంగా సాగుతుంది వీరి కవిత. చేకూరి రామారావుగారు వీరి కవిత్వం గురించి "ఆషామాషీగా చదివితే అర్థమయ్యే కవికాడు ఇతను. మనం అలవాటయిన ధోరణిని భగ్నం చేస్తాడు. అప్పుడప్పుడు అక్కడక్కడ కొంచెం తిక్క చూపిస్తాడు" అంటారు.

**"నులక మంచం**
**మీంచి ఇంకా లేవలేని ముసలమ్మ**
**బొంత పరుపు కంటుకున్న బొమికలు**
**నీరస నైరాగ్యాధ్యాత్మిక రామాయణ కీర్తనలు**
**ఎంత మాత్రము సీతమ్మా తల్లీ చింతింపా వలదు...."**

**ఆధార గ్రంథాలు:**


1) తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య ద్వా.నా. శాస్త్రి
2) తెలుగు సాహిత్య విమర్శ, సిద్ధాంతాలు - ఆచార్య వెలమల సిమ్మన్న.


**- డా॥ సిహెచ్. అనిత**

**పాఠం - 13**

# స్త్రీ వాద కవిత్వం

**విషయ క్రమం:**

**13.1.** **స్త్రీ వాద కవిత్వం - నేపథ్యం**

**13.2.** **స్త్రీ వాదం - నిర్వచనం**

**13.3.** **స్త్రీ వాద కవిత్వం - ప్రధానాంశాలు**

**13.4.** **స్త్రీ వాదం - విభిన్న ధోరణులు**

**13.5.** **స్త్రీ వాద కవిత్వం - వస్తు వైవిధ్యం**

## 13.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

ఈ పాఠ్యభాగం ద్వారా స్త్రీ వాద కవిత్వోద్యం గురించి విద్యార్థులకు అవగాహన కలిగించటం.

## 13.1. స్త్రీ వాదం - చారిత్రక నేపథ్యం:

1789వ సంవత్సరం ఫ్రెంచి విప్లవం తర్వాత స్వేచ్ఛా సమానత్వ భావాలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ సమాజంలో అందరూ స్వేచ్ఛగా, హక్కుల్ని అనుభవించాలి. అయితే ఇక్కడ పురుష, స్త్రీల విషయంలో చాలా తేడా కనిపిస్తుంది. పురుషులకు ఒక న్యాయం, స్త్రీలకు ఒక న్యాయం, పురుషులకు వున్న హక్కులు స్త్రీలకు ఎందుకు ఉండకూడదు అనే ప్రశ్నలు ఆరంభ మయ్యాయి. ఎప్పుడైతే స్త్రీలు ప్రశ్నలు వేశారో అప్పుడే వాళ్ళలో చైతన్యం పెరిగినట్లు ఆ చైతన్యమే 1792వ సంవత్సరంలో "మేరీ ఒల్బ్సన్ క్రాఫ్టీ" రాసిన "ది విండికేషన్ ఆఫ్ ది రైట్స్" అనే గ్రంథంలో చోటుచేసుకుంది.

తర్వాత మహిళల హక్కుల గురించి పోరాడిన ఫ్రెంచి సఫ్రగెట్ ఒలింప్-డి-గూజే (1748-1793). ఈమె స్త్రీల సంపూర్ణ రాజకీయ ఆర్థిక స్వేచ్ఛకోసం కృషి చేసింది. స్త్రీలకు పూర్తి సమానత్వం వుండాలనడం, విశ్వవ్యాపిత మానవహక్కుల పర్యవసానమని ఒలింప్-డి-గూజే అభిప్రాయం. "మహిళల, మహిళా పౌరుల హక్కుల ప్రకటన" అనే గ్రంథాన్ని రాశారు.

భారతదేశానికి చెందిన పండిత రమాబాయి (1858 - 1922) హిందూ ఛాందస భావజాలాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. భారతదేశంలో స్త్రీల హక్కుల గురించి పోరాడిన తొలితరం స్త్రీలలో ఈమె ఒకరు. ఇండోనేషియాకు చెందిన 'కార్తిని' (1879-1904) స్త్రీ విద్య కోసం కృషిచేశారు. అక్కడి సంప్రదాయాలకు వ్యతిరేకంగా బాలికల పాఠశాల ప్రారంభించి స్త్రీ విముక్తి ఉద్యమాలకు దారిచూపారు. ఇరాన్‌లో "ఖర్రాత్ ఉల్ అయూన్ (1815-1851) బాబీ మతస్థులకు చెందిన మహిళ. ఈమె గృహ నిర్బంధాన్ని ధిక్కరించి 'పరదా' ను, కుటుంబాన్ని వదిలేసి అనేక ముస్లిం ఛాందసుల ఆగ్రహానికి గురైంది. చైనా దేశానికి చెందిన 'ఓయూజిన్' (1875-1907) చదువు కోసం టోక్యోకి వెళ్ళి అక్కడ స్త్రీ విముక్తి పోరాటాల్లోనూ, విప్లవ రాజకీయాల్లోనూ పాల్గొంది. వాటివల్ల అరెస్టయి చివరకు ఉరితీయబడింది.

తూర్పు దేశాల్లో పురుషులు కూడా చాలమంది స్త్రీ స్వేచ్ఛకోసం పోరాడారు. చైనాకి చెందిన 'కాంగ్ యూవియ్' చైనాలో స్త్రీల పాదాలు కట్టేసే పద్ధతికి వ్యతిరేకంగా పోరాడారు. ఈజిప్టుకి చెందిన 'అహమ్మద్ ఫారెన్ ఎల్ సిద్యక్' స్త్రీ విముక్తిని బలపరుస్తూ ఒక రచన చేశారు. "One leg crossed over the other" అనేది దానిపేరు. అదే కాలానికి చెందిన 'కాసిమ్ అమీన్' రచించిన "The new women" అనే రచన కూడా సంచలనం సృష్టించింది. ఇరాన్‌లో చాలామంది పురుష మేధావులు పరదాకి, బహు భార్యత్వానికి, స్త్రీల గృహనిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడారు. ప్రఖ్యాత రచయిత్రి 'మేరీ బల్బన్ క్రాఫ్ట్' కంటే

ముందే 18వ శతాబ్దంలో చైనా విద్యావేత్త 'చెన్‌హంగ్‌మో' స్త్రీ విద్య ఆవశ్యకతను తెలిపారు.

1942వ సంవత్సరంలో సైమన్-డి-బోరా రచించిన "The second sex" అనే గ్రంథం స్త్రీ స్వేచ్ఛకు సంబంధించిన మౌలికమైన అనేక అంశాల్ని బయటపెట్టింది. వివాహ, కుటుంబ వ్యవస్థలు స్త్రీల అణచివేతకు ఎలా కారణమయ్యాయో ఆ రచనలో విశదీకరించారు. దీని ఆధారంగానే స్త్రీవాదం బాగా అభివృద్ధిచెందింది. 'బెట్టీ ఫ్రైడన్' రచించిన 'ఫెమినైన్ మిస్టేక్', 'ది సెకండ్ ఫేం', 'కేట్ మిల్లెట్' 'సెక్సువల్ పాలిటిక్స్', జానెటోసీయర్స్ రాసిన 'బయలాజికల్ పాలిటిక్స్', 'షులామిత్ ఫెరోస్టోన్' రచించిన 'ది డైలక్టిక్స్ ఆఫ్ సెక్స్ ' మొదలైన గ్రంథాలు స్త్రీ వాదానికి సిద్ధాంత నిర్దుష్టతను చేకూర్చాయి.

భారతదేశంలో 20వ శతాబ్దాన్ని ఉద్యమాల యుగంగా చెబుతారు. సాంఘిక, ఆర్థిక, రాజకీయాది విషయాలలో అనేక మార్పులు వచ్చాయి. ఆంగ్లేయుల ప్రభావం అన్ని అంశాలపై పడింది. ఆ ప్రభావంతో భారతదేశంలోని మతాచార సంప్రదాయాలపై ఎదురు తిరిగారు. స్త్రీలపై ఉన్న అణచివేతను, లింగ వివక్షతను వ్యతిరేకించారు. బాల్యవివాహాలు, సతీ సహగమనం వంటి వాటిని తీవ్రంగా నిరసించారు. స్త్రీ విద్య ఆవశ్యకత గురించి ప్రచారం జరిగింది. ఈ ఉద్యమాలను మొదట్లో పురుషులే స్త్రీల కోసం నిర్వహించారు. వీటిపై విమర్శలు వచ్చాయి. అగ్రవర్ణ స్త్రీల కోసమే ఈ సంస్కరణలు వచ్చాయి కనుక స్త్రీలందరికీ సంబంధించినవి కావని తేల్చి చెప్పారు. స్త్రీ, పురుషుల మధ్య వున్న ఆర్థిక, కుటుంబ సంబంధ అసమానతల్ని కానీ, కార్మిక స్త్రీలను గురించి కానీ పట్టించుకోలేదని విమర్శించారు.

స్త్రీల ప్రగతికి విద్యని ప్రధానాంశంగా గుర్తించినప్పటికీ, అది కుటుంబ పరిధిని దాటలేదు. కుటుంబంలో స్త్రీల సంప్రదాయికతను పటిష్ఠం చేయడమే ఈ సంస్కరణల ముఖ్యోద్దేశం. సంస్కారాన్ని నిర్వహించడానికి శిశుపోషణ, పాతివ్రత్య ధర్మాన్ని సమర్థవంతంగా అమలుచేయడానికేనని ఈ ఉద్యమంలో జరిగిన చర్చలు స్పష్టం చేశాయి. ఈ సంస్కరణలు స్త్రీలు స్వతంత్ర వ్యక్తులుగా రూపొందడానికి దోహదం చేయలేదు. అయితే సతీ సహగమనం లాంటి జీవన్మరణ సమస్య నుంచి స్త్రీలు విముక్తలు కాగలిగారు.

ఈ ఉద్యమాలు స్త్రీ సమానత్వంతో నిమిత్తం లేనివి అయినందువల్ల బూర్జువా పితృస్వామ్య లక్షణాల్ని కలిగివున్నాయి. బ్రిటీష్ పాలన మూలంగా దేశంలో జాతీయ భావనలు పెంపొంది స్వాతంత్ర్య కాంక్షతో జాతీయోద్యమం పెల్లుబికింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడం, ప్రతిఘటించడం ఇందులో ముఖ్యమైన అంశాలు. ఈ ప్రతిఘటనకు పరిపుష్టిని చేకూర్చటానికి దేశ జనాభాలో సగభాగమైన స్త్రీల ప్రాతినిధ్యాన్ని గుర్తించడం జరిగింది. బ్రిటీష్ వలసపాలన ప్రభావంతో స్త్రీలు స్వయంగా ఉద్యమాల్లో పాల్గొనే స్థితి ఏర్పడింది. జాతీయోద్యమంలో పాల్గొని స్త్రీలు జైళ్ళకు కూడా వెళ్ళారు. అయితే ఈ ఉద్యమం కూడా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమమే తప్ప పితృస్వామ్య వ్యతిరేక ఉద్యమం కాకపోవటంతో ఇందులో పాల్గొన్న స్త్రీలకు కీర్తి ప్రతిష్ఠలు ఏర్పడ్డాలు తప్ప, వారుకానీ, మిగిలిన స్త్రీలు కానీ స్వతంత్ర వ్యక్తులుగా నిలబడలేకపోయారు.

స్వాతంత్ర్యానంతరం రాజకీయాల్లో ప్రవేశించి, ప్రజాస్వామ్య హక్కుల కోసం డిమాండ్ చేయగలిగే స్థాయికి ఎదిగారు. కానీ తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అవరోధంగావున్న పితృస్వామ్య వ్యవస్థని ప్రశ్నించే చైతన్యాన్ని పొందలేక పోయారు.

స్త్రీ కుటుంబ పరిధిని దాటి సామాజిక జీవితంలో ప్రవేశించినప్పటికీ వ్యాపార వస్తువుగా మిగిలింది తప్ప వ్యక్తిత్వాన్ని పెంచుకోలేక పోయింది. 1969వ సంవత్సరంలో నక్సల్బరీ ఉద్యమం ప్రారంభమవడంతో మళ్ళీ విప్లవాల యుగం మొదలైంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు, పాశ్చాత్యదేశాల్లో అప్పటికే స్థిరపడిన ఫెమినిజం ఇవన్నీ తీవ్ర ప్రభావాన్ని చూపించక పోయినప్పటికీ స్త్రీల సమస్యలపై ఏకాభిప్రాయం గల స్త్రీలు తాత్కాలిక ఉద్యమాలు నిర్వహించడం ప్రారంభించారు. ధరల

పెరుగుదలకు, వరకట్నానికి, రూప్ కన్వర్ సతీసహగమనానికి వ్యతిరేకంగా మహిళా ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. పర్యావరణ రక్షణకు చిప్‌కో ఉద్యమం, భోపాల్ మహిళా ఉద్యమం, స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాన్ని వ్యతిరేకించే ఉద్యమాలు, రైతాంగ పోరాటాల్లో స్త్రీలను అణచివేసే రాజ్యహింసను వ్యతిరేకించే ఉద్యమం, ఆంధ్ర ప్రదేశ్ సారా వ్యతిరేకోద్యమం ద్వారా స్త్రీలు సంచలనం సృష్టించారు.

స్త్రీల సమస్యల గురించి కందుకూరి, గురజాడ, చలం వంటి రచయితలు రచనలు చేశారు. స్త్రీలు తమ సమస్యలను తామే చెప్పాలనే దృక్పథంతో తమ అస్తిత్వం కోసం కలం పట్టారు.

## 13.2. స్త్రీవాదం – నిర్వచనం:

“ఫెమినిజం” అనే మాటకు తెలుగులో వ్యవహార నామం స్త్రీవాదం. స్త్రీవాదానికి 150 ఏళ్ళ చరిత్ర ఉంది. మానవ సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు పురుషుల కంటే తక్కువ సాంఘిక స్థితిలో ఉండటాన్ని ప్రశ్నిస్తూ వాళ్ళ అభ్యుదయాన్ని, విముక్తినీ వాంఛిస్తూ వచ్చిన స్త్రీవాద భావన 19వ శతాబ్ది ఉత్తరార్థానికి ఉద్యమ రూపాన్ని తీసుకొని విస్తరించింది. మధ్యతరగతి వారి భావజాలాన్ని ప్రభావితం చేయడం ద్వారా స్త్రీవాదం భారతదేశంలోకి ప్రవేశించింది, 1975 నుండి ప్రారంభమై కొనసాగిన అంతర్జాతీయ మహిళా దశాబ్దిలో స్త్రీవాదం ఒక బలమైన ధోరణిగా వెళ్ళూనుకొంది. తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగాలలో గొప్ప మార్పుకు లోను చేసింది. స్త్రీ వాదాన్ని ప్రాచ్యపాశ్చాత్యులు నిర్వచించారు.

**ప్రాచ్యులు:**

1) **ఫెమినిస్టు స్టడీ సర్కిల్:** “సమాజంలోనూ, కుటుంబంలోనూ, పనిలోనూ స్త్రీలు గురౌతున్న అణచివేత దోపిడీకి సంబంధించిన అవగాహన కలిగివుండి, ఈ పరిస్థితి మార్చడానికి స్త్రీలు, పురుషులు చేపట్టే చైతన్యవంతమైన కార్యక్రమం”.

2) **జయప్రభ:** “ఫెమినిజం స్త్రీ పురుష సమానత్వాన్ని కాంక్షిస్తుంటే గాని స్త్రీలనీ, పురుషులనీ విడదీయదు. ఇవాళ అన్ని రంగాల్లోనూ స్త్రీ పురుషుల మధ్య వున్నది ప్రధానంగా అధికారి – భానిస సంబంధాలే. ఈ తత్త్వాన్ని ఫెమినిజం ప్రశ్నిస్తుంది. సరిచేస్తుంది. సామాజికంగా, ఆర్థికంగా, లైంగికంగా, స్త్రీలను దోపిడీ నుండి విముక్తి చేసే రాజకీయ సిద్ధాంతమే ఫెమినిజం”.

3) **వసంతా కన్నాభిరాన్:** “స్త్రీలు తమ సెక్స్ వల్ల వివక్షతతో చూడబడుతున్నారనీ, స్త్రీలుగా వాళ్ళకున్న ప్రత్యేక అవసరాలు తిరస్కరించబడుతున్నాయనీ, తీరడం లేదనీ, ఆ ప్రత్యేక అవసరాలు తీరాలంటే ఇప్పుడున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ విధానాలలో మౌలిక మార్పులు రావాలని కోరుకునేది స్త్రీ వాదం”.

4) **ఓల్గా:** స్త్రీవాదం కొన్ని విషయాలను ముందుకుతెచ్చి చర్చకు పెట్టింది పితృస్వామ్యం, జండర్, అణిచివేత, ఇంటి చాకిరీ స్వభావం మొదలైన ఎన్నో విషయాల గురించి కొత్త ఆలోచనలు రేపింది. సమజంలో స్త్రీ పురుషులు ఎలా నిర్వచింపబడతారనే దాని మీద ఆధారపడిన సమాజంలో రకరకాల విషయాలు రూపొందుతాయని, మిగిలిన విషయాలు అన్నిటికీ నిర్ధిష్టమైన స్వరూప స్వభావాలనిచ్చేంత ప్రధానమైన విధానం జండర్ విధానమని స్త్రీ వాదం చెబుతోంది”.

5) **పొదుం జయరాం:** “ఇది పురుష పీడన సమాజం. ఆధిక్యతను కొంతకాలం పాటు భరించవచ్చు. కానీ పీడనను

ఎన్నాళ్ళని భరిస్తారు. తమకు జరిగే అన్యాయాలకు, అక్రమాలకు, పీడనకు వ్యతిరేకంగా ఆధునిక స్త్రీ తిరుగుబాటు చేస్తోంది. ఆ తిరుగుబాటులో భాగంగానే నేటి స్త్రీవాద కవిత్వాన్ని పరిగణించాలి".

6) **ఆచార్య కాత్యాయనీ విద్మహే:** "స్త్రీ పురుషుల మధ్య అసమానతలు ఉన్నాయని వాటి కారణంగా కుటుంబంలోను, సమాజంలోనూ స్త్రీలు అణచివేతకు, పీడనకు గురవుతున్నారని తెలిపి, ఆ విధమైన స్త్రీల జీవితాలను, అనుభవాలను వస్తువుగా చేసి రాస్తే అది స్త్రీ వాద కవిత్వం".

7) **పద్మలత:** "స్త్రీ వాద దృక్పథమంటే స్త్రీల జీవితాల్లోని సాంఘిక ఆర్థిక రాజకీయ అంశాలను పురోగామి దిశగా మలుపు తిప్పగల దృక్పథం".

8) **కె. సత్యవతి:** "ఈనాడు సమాజంలో అమలులో వున్న లైంగిక వివక్షనూ, జెండర్ మీద ఆధారపడే పితృస్వామ్యాన్నీ వ్యతిరేకించేదే ఫెమినిజం".

**పాశ్చాత్యులు:**

"Corline Ramazanoglu: Feminism was intended to develop as Universal theory to show women the nature of our oppression and as an international political practice to achieve our liberation".

స్త్రీవాదం స్త్రీ అణచివేత యొక్క స్వభావాన్ని మహిళలకు చూపించడానికి మరియు మహిళల విముక్తిని సాధించడానికి అంతర్జాతీయ రాజకీయ సాధనగా సార్వత్రిక సిద్ధాంతంగా అభివృద్ధి చేయడానికి ఉద్దేశింపబడింది.

Barbara Smith: "Feminism is a political theory and practice to free all women; women of colour, working class women, poor women, physically challenged women, lesbians, old women as well as white economically previlised hetro sexul women, any thing less than this is not Feminism, but merely female self-agg- randizement.

స్త్రీవాదం అనేది స్త్రీలందరినీ విడిపించే రాజకీయ సిద్ధాంతం మరియు అభ్యాసం; రంగురంగుల స్త్రీలు, శ్రామిక వర్గ మహిళలు, పేద మహిళలు, వికలాంగ మహిళలు, లెస్బియన్లు, వృద్దులు అలాగే శ్వేత జాతీయులు ఆర్థికంగా వెనుకబడి వున్న హెట్రో లైంగిక స్త్రీలు, దీనికంటే తక్కువ ఏదైనా స్త్రీవాదం కాదు, కేవలం స్త్రీ ఆత్మగౌరవం.

## 13.3. స్త్రీ వాదం-ప్రధానాంశాలు:

"తెలుగులో కవిత్వోద్యమాలు" లో స్త్రీ వాద ప్రధానాంశాలను ఈ విధంగా పేర్కొన్నారు.

1. పితృస్వామ్య వ్యవస్థ స్త్రీ పతనానికి, అణచివేతకు కారణమైన పురుషాధిక్య భావజాలాన్ని చారిత్రక నేపథ్యంలో గుర్తించడం
2. 'లైంగికత్వం' లో ఇమిడివున్న రాజకీయాలను, కంట్రోలును గుర్తించడం. అంతకుపూర్వం ఏ రాజకీయార్థిక సిద్ధాంతమూ పట్టించుకోని పునరుత్పత్తి, లైంగికత్వం అనే భావనలు స్త్రీ జీవితాన్ని ఎలా నియంత్రిస్తున్నాయో చర్చించడం.
3. సెక్స్ కూ, జండర్ కూ వున్న తేడాను స్పష్టం చేయడం. 'సెక్స్' స్త్రీ పురుషుల మధ్య శారీరక భేదాలను చెబుతుంది. జండర్ అన్నది సాంస్కృతికంగా, సాంఘికంగా స్త్రీ లక్షణాలు, స్వభావాలు, పురుష లక్షణాలు, స్వభావాలు వేరని చూపి, పురుషుల్ని పురుషులుగా, స్త్రీలను స్త్రీలుగా తయారుచేస్తుంది.

4. స్త్రీలపై సాంఘికంగా, సాంస్కృతికంగా జరుగుతున్న సెన్సార్‌షిప్‌ను గుర్తించి, తిరస్కరిస్తుంది. సమాజ జీవితంలో ప్రవర్తించే పద్ధతుల నుంచి సాహిత్యంలో అభివ్యక్తి వరకు అన్నింటా సెన్సార్‌షిప్‌ను స్త్రీ వాదులు గుర్తించడం వల్లే, దాన్ని ఛేదించి, కొత్త సాహిత్యాన్ని సృష్టించగలిగారు.
5. స్త్రీల శరీరాలకూ, మనస్సుకూ, వివాహ వ్యవస్థకూ సంబంధించి తరతరాలుగా విశ్వాసాలుగా నిలిచిపోయిన ఎన్నో మిత్‌లను స్త్రీవాదం భగ్నం చేసింది.
6. సంతానోత్పత్తి, పిల్లల పెంపకం, ఇంటి చాకిరీ మొదలైనవి కూడా ఉత్పత్తిలో భాగంగా చేర్చాలని, పునరుత్పత్తిలో ప్రజాస్వామిక ధోరణి ఏర్పడాలనీ స్త్రీవాదం చెబుతుంది.
7. మానవుల మధ్య వర్గ సంబంధాలతోపాటు జండర్ సంబంధాలు కూడా వున్నాయనీ, ఇవి వర్గ సంబంధమంత ప్రాథమికమైనవని స్త్రీవాదం చెప్పింది.
8. స్త్రీవాదులంటే స్త్రీలు మాత్రమే కాదని, స్త్రీ పురుషులిద్దరూ ఫెమినిస్టులు కావాలనీ, ఫెమినిజం అంతిమ లక్ష్యం సమాజంలోని అన్ని దృక్కోణాల్లోనూ పునరాలోచన, పున్నర్నిర్మాణం జరగడమేననీ స్త్రీవాదం చెబుతుంది.
9. జండర్ వివక్షకు, అసమానతలకు మూలకారణం పితృస్వామ్య వ్యవస్థ అని గుర్తించి, పితృస్వామ్యం నిర్మించిన కుటుంబం, మతం వంటి వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపడం తన కర్తవ్యంగా ఈ ఉద్యమం భావించింది.
10. స్త్రీని ఆమె పోషించే రకరకాల పాత్రల ద్వారా కాక, ఒక వ్యక్తిగా గుర్తించవలసిన సమయం ఆసన్నమైందని ఈ కవిత్వం చెబుతుంది.

## 13.4. స్త్రీ వాదం-విభిన్న ధోరణులు:

స్త్రీ స్వేచ్ఛా, సమానత్వానికి అందరూ పాటుపడినా వారు ఎన్నుకున్న మార్గాల్లో భిన్న ధోరణులు సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. అవి

1. ఉదారవాద ఫెమినిజం
2. రాడికల్ ఫెమినిజం
3. సోషలిస్టు ఫెమినిజం
4. సాంస్కృతిక ఫెమినిజం
5. కమ్యూనిస్టు ఫెమినిజం
6. మార్క్సిస్టు ఫెమినిజం
7. విప్లవాత్మక ఫెమినిజం
8. భౌతికవాద ఫెమినిజం
9. పర్యావరణ ఫెమినిజం

### 13.4.1. ఉదారవాద ఫెమినిజం:

ఉదారవాదం జీవితానికి సంబంధించిన అన్ని రంగాల్లో అంటే ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలన్నిటిలో స్త్రీ పురుషులకు మధ్య సమానత్వాన్ని కోరుకుంటుంది. ఓటు హక్కు విద్య ఉద్యోగం పరిపాలనాది రంగాల్లో సమానమైన ప్రాతినిధ్యం ఆశిస్తారు వీరు. గర్భస్రావపు హక్కు కావాలంటారు. కుటుంబ నియంత్రణను ఆమోదిస్తారు. వీరు సమాజ వ్యవస్థను మార్చదలచకపోయినా కొంతమేర స్త్రీ విమోచనకు వీరి కార్యక్రమాలు దోహదం చేస్తున్నాయి. కాబట్టి వీరు శ్లాఘనీయులే అని అంటారు మల్లాది సుబ్బమ్మగారు. "ఉదారవాదం" ఒక ఫిలాసఫీగా మానవుల విచక్షణ, ఆలోచనాశక్తుల మీద ఆధారపడి హక్కుల గురించి మాట్లాడుతుంది. ఫెమినిజం లిబరల్ సూత్రాల్ని కూడా వర్తింపచేయాలని ప్రయత్నం చేసింది. దీన్నే "లిబరల్ ఫెమినిజం" గా పేర్కొంటారని వసంతకన్నాభిరాన్ చెప్పారు.

**13.4.2. రాడికల్ ఫెమినిజం:**

స్త్రీ కి గల పునరుత్పత్తి శక్తి మూలంగా ఆమె అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని ఈ వాదం అభిప్రాయపడుతుంది. అందువల్ల దీనికి ప్రత్యామ్నాయంగా 'టెస్ట్‌ట్యూబ్ బేబి" లాంటి అత్యాధునిక శాస్త్ర విజ్ఞానం ద్వారా స్త్రీలు విముక్తులు కావాలని భావించింది. పురుషాధిపత్యానికి కారణమై పెళ్ళి మొదలైన విషయాలపై పోరాడాలని ఈ వాదం చెబుతుంది. స్త్రీ పురుషుల మధ్య వైరుధ్యం శత్రువైరుధ్యం అనీ, వారిరువురి మధ్య పోరాటం తప్పనిసరి అని నమ్ముతుంది. స్త్రీ అణచివేతకు ప్రధాన కారణమైన ఇంటిపని, భార్యను కొట్టడం, తిట్టడం, రేప్ చేయడం మొదలైన అంశాలపై రాజీలేని విధంగా పోరాడాలని "రాడికల్ ఫెమినిజం" ప్రతిపాదిస్తుంది.

ఉదారవాద స్త్రీ విమోచనోద్యమకారులు, మార్క్సిస్టు స్త్రీ విమోచనకారులూ శారీరకాంశాలకన్నా, సామాజికాంశాలకు ఎక్కువ ప్రాధాన్యత నిస్తారు. రాడికల్ స్త్రీ విమోచనోద్యమ సిద్ధాంతాల్లో జీవశాస్త్రం ఎక్కువ ప్రాధాన్యత వహిస్తుంది, పురుషుడి శారీరక బలాధిక్యత సంతానోత్పత్తి విషయంలో స్త్రీ పాత్ర ఈ రెండూ కలిసి స్త్రీని సమానత్వ స్థితికి దూరం చేశాయని వీరి విశ్వాసం. స్త్రీ పురుషుల మధ్య వర్గ విభజన, రాజకీయ విభజన ఉన్నాయని వీరి వాదం. స్త్రీల నుండి విప్లవం రావాలని వీరి ఆకాంక్ష. స్త్రీ విమోచనకు ద్వితీయ స్థానం ఇచ్చినందుకు మార్క్సిస్టుల్ని వీరు విమర్శిస్తారు. వీరి దృష్టిలో స్త్రీలు ఒక వర్గం. వీరు "శారీరక మౌలికసార సిద్ధాంతం' పై ఆధారపడతారని మల్లాది సుబ్బమ్మగారు అభిప్రాయపడ్డారు.

**13.4.3. సోషలిస్టు ఫెమినిజం:**

మార్క్సిస్టు విమోచనవాదం లోపాన్ని వీరు సవరిస్తారు. వీరికి ఉదారవాద సిద్ధాంతం సరిపడదు. దానితో వారు తృప్తిపడరు. అలాగే మార్క్సిజాన్ని స్త్రీ విమోచనోద్యమానికి కానీ, స్త్రీ విమోచనోద్యమాన్ని మార్క్సిజానికి కానీ లొంగేట్లు చేయరు. స్త్రీ ప్రతిపత్తి, ఉత్పత్తి సాధనాల స్థితిగతులతో సరాసరి ముడిపడి వుండి కూడా సాపేక్షంగా స్వతంత్రంగా నిర్ణయించబడుతుందని వీరి వాదన. లైంగిక అసమానత్వం, ఆర్థిక అసమానత్వానికి ముఖ్య కారణం అని వీరు అంగీకరించారు. కాగా వీరిలో చాలామంది మార్క్సిస్టు బంధాల్ని వీడలేకుండా ఉన్నారని మల్లాది సుబ్బమ్మగారు అంటారు.

ఏ సమాజంలోనైనా ఉత్పత్తి సంబంధాలు మాత్రమే పరిశీలిస్తే సరిపోదని, పునరుత్పత్తి సంబంధాల్ని కూడా పరిశీలించాలనీ చెప్పేవారు సోషలిస్టు ఫెమినిస్టులనీ, వీళ్ళు రాడికల్ ఫెమినిజంలోని కొత్త ఆలోచనల్ని తీసుకొని మార్క్సిస్టు పద్ధతిని ఉపయోగిస్తూ స్త్రీల అణచివేత గురించి సమగ్రమైన విశ్లేషణ కోసం ప్రయత్నించారని వసంత కన్నాభిరాన్ చెప్పారు.

**13.4.4. సాంస్కృతిక ఫెమినిజం:**

ఈ వాదాన్ని 'లెస్బియనిజం' అని కూడా అంటారు. ఈ వాదం పురుషుల కంటే స్త్రీలు ఉన్నతులని అభిప్రాయపడుతుంది. స్త్రీలు స్వజాతి లైంగిక సంబంధాలు పెట్టుకోవాలని ఈ సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది. ఈ వాదం స్త్రీలు పురుషులతో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకోవడం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. పురుషులతో సంబంధం లేకుండా స్త్రీలు అందరూ కలిసిమెలసి వుండాలని కోరుకుంటుంది. స్త్రీల లైంగిక ప్రాముఖ్యతను విశ్లేషించడమే ఈ వాదం ప్రధానోద్దేశ్యం. పశ్చిమదేశాల్లో అధికంగా ఈ వాదం కనబడుతుంది. ఈ వాదం భారతదేశంలో లేదు.

ఈ సిద్ధాంతం రాడికల్ ఫెమినిజానికి చాలా దగ్గరగా ఉంటుంది. మహిళా సంస్కృతిని వీరు శ్లాఘిస్తారు. స్త్రీల సృజనాత్మకశక్తిని సంతానోత్పాదనలో ఆమె సామర్థ్యాన్ని చూసి పురుషుడు ఈర్ష్యపడుతున్నాడని వీరి అభిప్రాయం. ఈ విషయంలో రాడికల్ ఫెమినిస్టులకు, సాంస్కృతిక ఫెమినిస్టులకూ ఏకీభావమే. స్త్రీ విమోచనకు ప్రధాన శత్రువు పురుషుడేనని వీరి నిర్ణయం. రాడికల్ ఫెమినిస్టు అయిన 'ఫైర్ స్టోన్' పురుషులతో సంపర్కం లేకుండా కృత్రిమ గర్భదారణకు పూనుకోవలసిందిగా విజ్ఞప్తి చేసింది. సాంస్కృతిక ఫెమినిస్టు అయిన 'రిచ్' సంతానోత్పాదన గురించి గర్వపడవలసిందిగా స్త్రీలకు ఉద్బోధించింది. ఈ రెండు శాఖల వారూ 'శారీరక మౌలికసార సిద్ధాంతాన్ని' ఆమోదిస్తారు. అంటే స్త్రీ కుండే సృజనాత్మక శక్తిని చూసి పురుషజాతి అసూయ చెంది వారిని అణచివేయటానికి పూనుకున్నదని ఈ వాదన ముఖ్యాంశం. వీరు పురుషతత్వాన్ని ద్వేషిస్తారు. వీరి సిద్ధాంతంలో ముఖ్యమైంది స్త్రీలకు స్త్రీత్వ లక్షణాన్ని ప్రకృతి ప్రసాదించిందని, వాటిని పురుషుల మానసిక లక్షణాల కన్నా గొప్పగా పరిగణించాలని, అంతగా కాకపోతే సమానంగా లెక్కలోకి తీసుకోవాలని వీరి విశ్వాసం

### 13.4.5. కమ్యూనిస్టు ఫెమినిజం:

స్త్రీ పురుషుల మధ్య పిల్లలకి తల్లిదండ్రులకి మధ్య నూతనమైన సంస్కారయుతమైన అనుబంధాలు నెలకొనాలంటే హింసాయుతమైన మార్పు అవసరమని ఈ ఉద్యమకారులు అంటారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం కింద అణచివేయబడుతున్న ప్రజలందరూ ఈ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని వీరు భావిస్తారు. దోపిడీకి గురైన కార్మికవర్గ స్త్రీలను, పురుషాధిక్యతకు లోనైన అన్ని సామాజిక తరగతులకు చెందిన స్త్రీలను మేల్కొలపడం వీరి లక్ష్యం. ప్రపంచవిప్లవమే స్వేచ్ఛకు ఏకైక మార్గం. అన్ని రకాలుగా అణచివేయబడే స్త్రీలు ఆ దిశగా కృషి చేయాలనే చెపుతారు.

కమ్యూనిస్టు స్త్రీ వాదానికి విప్లవం ద్వారా సంక్రమించే స్వేచ్ఛే అంతిమ లక్ష్యంగా నిర్ణయించారు. సంస్కరణల మూలంగా మహిళల సమస్యలు సంపూర్ణంగా తీరవని భావించారు. కమ్యూనిస్టు మహిళల్ని విడిగా సంఘటిత పరచడమనే అంశాన్ని ఉద్యమ మార్గదర్శకులు తిరస్కరించారు. కానీ కార్మిక మహిళల జీవితాలను వేధించే రోజువారి సమస్యల్ని పరిష్కరించడం కోసం కొన్ని డిమాండ్లను రూపొందించారు. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా శ్రామిక వర్గ స్త్రీలందరినీ సమీకరించడం లక్ష్యంగా అన్ని దేశాల కమ్యూనిస్టు పార్టీలు క్రమబద్ధంగా నిర్మాణయుతంగా చురుకైన కార్యక్రమాల్ని చేపట్టాలనేది అంతర్జాతీయ కమ్యూనిస్టు మహోద్యమం ముఖ్యమైన సూత్రం.

### 13.4.6. మార్క్సిస్టు ఫెమినిజం:

ఈ వాదం కుటుంబంలో జీవశాస్త్ర ప్రాధాన్యతను అంగీకరిస్తుంది. ఉత్పత్తి సాధనాల స్వభావంపై సమాజం ఆధారపడుతుందని వీరు చెబుతారు. దీనికి మూలపురుషులు మార్క్స్, ఎంగెల్స్‌లు, స్త్రీ పురుషుల మధ్య శారీరక విభేదాలు స్త్రీ పురుషుల పని విభజనకు దారి తీశాయని అంటుంది ఈ వాదం. స్త్రీ కి గర్భధారణ, ప్రసూతి సహజ ధర్మాలైనందున అవి పురుషాధిపత్యానికి దారితీశాయి. మాతృస్వామ్య వ్యవస్థ పోయి పితృస్వామ్య వ్యవస్థ వచ్చింది. పారిశ్రామికీకరణ జరిగి

సోషలిజం వచ్చిన తర్వాత పురుషాధిపత్యం సమసిపోతుందని అంటుందీ వాదం. ఆర్థిక స్వాతంత్ర్యం వస్తే స్త్రీకి దానంతట అదే సర్వవిధాలైన స్వేచ్ఛ వచ్చేస్తుందని వీరి ఆశ. పితృస్వామ్య వైరుధ్యం ముఖ్యమేకాని, వర్గమే ప్రధాన వైరుధ్యమని, ఉత్పత్తి విధానాల మార్పుతో స్త్రీ అణచివేత అదృశ్యమవుతుందని చెప్పేవారు "మార్క్సిస్ట్ ఫెమినిస్టులు".

**13.4.7. విప్లవాత్మక ఫెమినిజం:**

పితృస్వామిక వ్యవస్థలో స్త్రీలపై పురుషాధిక్యానికి అవధులు లేవు. అంతేకాక ఈ వ్యవస్థలో స్త్రీలు భూస్వాములు, కోటీశ్వరుల సామ్రాజ్యవాదుల దోపిడికి గురవుతున్నారని అభిప్రాయపడింది. స్త్రీలు విముక్తి సాధించాలంటే వ్యక్తిగత ఆస్తిహక్కుపై ఆధారపడిన ఆర్థికవ్యవస్థ మార్పుకోసం శ్రామిక పురుషులతో కలిసి పోరాడాలని చెబుతుంది

**13.4.8. భౌతిక వాద ఫెమినిజం:**

"డెల్ఫీ" అనే స్త్రీ రాసిన "The main enemy" అనే గ్రంథంలో "భౌతికవాద ఫెమినిజం" ప్రతిపాదించబడింది. పురుషుడు స్త్రీ ఉత్పత్తి పునరుత్పత్తి కార్యకలాపాలను నియంత్రించడం ద్వారా వారు అణచివేతకు దోపిడికి గురవుతున్నారని అభిప్రాయపడింది.

**13.4.9. పర్యావరణ పరిరక్షణ ఫెమినిజం:**

జర్మనీలో పర్యావరణ పరిరక్షణ స్త్రీవాదం వుంది. స్త్రీలు ప్రకృతిలో దొరికే సహజ వనరులతోనే జీవితానికి కావలసిన వస్తువుల్ని వుత్పత్తి చేయడం, పురుషులు ఆయుధాన్ని ఉపయోగించి శ్రమ శక్తిని కొల్లగొట్టడం చేస్తున్నారు. స్త్రీల ఈ జీవితావసరాల ఉత్పత్తిని పురుషులు కొల్లగొట్టే విధానం, దౌర్జన్యపూరిత సమీకరణం వివిధ రూపాల్లో కొనసాగుతూ వచ్చాయని అభిప్రాయపడుతుంది.

పైవే కాక ఇంకా అనేక స్త్రీవాద ధోరణులు కన్పిస్తాయి. నిర్మాణానంతర ఫెమినిజం, రాజకీయ ఫెమినిజం, విభిన్న ధోరణుల ఫెమినిజం, వేర్పాటువాద ఫెమినిజం. సమన్వయ ఫెమినిజం, అవకాశవాద ఫెమినిజం, దిగంబర వ్యతిరేక ఫెమినిజం, ప్రాచ్య పాశ్చాత్య దేశాల్లో పై స్త్రీవాద ధోరణులు చోటు చేసుకున్నాయి.

**తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం – ధోరణులు:**

ప్రముఖ విమర్శకులు ఆచార్య కాత్యాయనీ విద్మహే గారు "స్త్రీవాద ధోరణులు – సమకాలీన సాహిత్యం" లో తెలుగు సాహిత్యంలో స్త్రీ వాదంలో ప్రధానంగా మూడు ధోరణులున్నాయని అభిప్రాయపడ్డారు. ఒకటి లిబరల్ ఫెమినిజం, రెండు రాడికల్ ఫెమినిజం, మూడు సోషలిస్టు ఫెమినిజం.

**1. లిబరల్ ఫెమినిజం:**

"పురుషులతో స్త్రీలకు సమాన హక్కులు అవకాశాలు కావాలని వ్యవస్థా పరిధిలో చేసే ప్రయత్నాలు ఈ ధోరణిలోకి వస్తాయి. విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలలో స్త్రీల భాగస్వామ్యాన్ని కోరుకోవటం, వాటిని పొందటం కోసం ఉద్యమాలు నిర్మించడం ఇందులో భాగం. భారతదేశంలోని సంస్కరణోద్యమంలో ఈ లిబరల్ ఫెమినిజం ఛాయలే కన్పిస్తాయి. ఆ మేరకు స్త్రీ విద్యను గురించి, పురుషులతో సమానంగా ఉండాల్సిన సాంఘిక సాంస్కృతిక స్థాయిని గురించి భావిస్తూ వీరేశలింగంగారు రచించిన 'సత్యవతీ చరిత్ర' ఆడమళయాళం నవలలు ఉదార స్త్రీవాద సాహిత్యానికి నాందీ రచనలు అనవచ్చును".

**2. రాడికల్ ఫెమినిజం:**

"ఈ ధోరణిలో స్త్రీలను ప్రత్యేకమైన వర్గంగా భావించటం జరుగుతుంది. స్త్రీ పురుషుల మధ్య అసమానతను 'లైంగికత'

ప్రాతిపదికగా చర్చించటం ఈ ధోరణిలో ప్రత్యేకత, ఈ అసమ సామాజిక వ్యవస్థకు పితృస్వామ్యం మూలమని గుర్తించటంతో లిబరల్ ఫెమినిజం కంటే రాడికల్ ఫెమినిజం విప్లవాత్మకమైన ముందడుగు వేసింది. స్త్రీలకు తమ శరీరాల మీద, జీవితాల మీద అధికారం లేకుండా చేసి, ఆ అధికారాన్ని చెలాయించే సంస్థలుగా కుటుంబాన్ని, మతాన్ని, రాజ్యాన్ని రూపొందించిన పితృస్వామిక సామాజిక వ్యవస్థను గురించిన విశ్లేషణకు సమాచార సామగ్రిని అందించింది రాడికల్ ఫెమినిజం. "స్త్రీ కి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు వుంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం వుంది. దానికి అనుభవం ఇవ్వాలి" అని 1925వ సంవత్సరంలోనే చెప్పి "స్త్రీ" అన్న రచన ద్వారా స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గురించి ఉద్వేగంతో రాసిన చలం నవలలు రాడికల్ ఫెమినిస్టు ధోరణికి దగ్గరగా ఉంటాయి. స్త్రీ శరీరం మీద, లైంగిక ఆకాంక్షల మీద సమాజం విధించిన కట్టడిని, సంస్కృతిని నిర్మించిన నియమాలను ధిక్కరించి తమ జీవితాన్ని తమ ఆనందం కోసం, తమ ఇష్టం వచ్చిన పద్ధతులతో జీవించటానికి సిద్ధపడిన రాజేశ్వరి, శశిరేఖ, లాలస, అరుణ మొదలైన స్త్రీ పాత్రలను ప్రధానంగా చేసి చలం రాసిన నవలలు ఇటీవలి స్త్రీ వాద ధోరణి నవలలకు ఒరవడిని ఇచ్చాయి".

**3. సోషలిష్టు ఫెమినిస్టు:**

"లిబరల్ ఫెమినిజానికి సమాంతరంగా శ్రామికవర్గ ఉద్యమాలతో పాటు రూపుదిద్దుకున్న సోషలిస్టు ఫెమినిజం రాడికల్ ఫెమినిజం గుర్తించని ఆర్థిక అసమానతను స్త్రీపురుషుల మధ్య అసమానతకు మూలకారణంగా గుర్తించింది. లైంగిక వివక్ష కారణంగా కుటుంబంలోను, సామాజిక ఉత్పత్తి రంగాలలోను అస్తిత్వంలోకి వచ్చిన శ్రమ విభజనను, ఆ శ్రమకు తగిన విలువ లేకపోవటం అనే అంశాలను ప్రముఖంగా చర్చకు పెట్టింది. స్త్రీని ఇంటి పనికి పరిమితంచేసి, దానిని అనుత్పాదక శ్రమగా మార్చిన అసమ ఆర్థిక వ్యవస్థను ప్రశ్నించటం, దాని మార్పుకై ఉద్యమాలు నిర్మించడం సోషలిస్టు ఫెమినిజం యొక్క లక్ష్యాలు".

**13.5. స్త్రీవాద కవిత్వం – వస్తు వైవిధ్యం:**

స్త్రీవాద కవిత్వంలోని వస్తువును తొమ్మిది రకాలుగా విభజించవచ్చు. అవి:

1. వ్యక్తిగా, రచయిత్రిగా ఉనికి
2. వివాహ వ్యవస్థ
3. శారీరక స్పృహ
4. లైంగిక వివక్ష
5. మాతృత్వం
6. సామాజిక జీవితం
7. కుటుంబాల్లో హింస
8. తిరుగుబాటు చైతన్యం
9. ప్రపంచీకరణ

**13.5.1. వ్యక్తిగా, రచయిత్రిగా ఉనికి:**

వ్యక్తిగా తన అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారినపుడు స్త్రీ రచయిత్రిగాను అవతరించింది. స్త్రీ అస్తిత్వానికి సంబంధించి శ్రీమతి, రేవతీదేవి, వసంత కన్నాభిరాన్, వాణీ రంగారావు వంటి వారు కవితలు రచించారు.

ఈ సమాజంలో పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ పుట్టడమే పెద్ద పాపంలా, శాపంలా భావించింది. అంచేత తమ ఉనికే నిషిద్ధం అని చెబుతుంది శ్రీమతిగారు.

**"నేనమ్మలో వున్నప్పుడు**
**నేనే కావాలని అమ్మ కోరుకుంటున్నట్లు**
**నాన్నకు తెలియగానే**
**ఈడ్చి చెంప పగలగొట్టిన నాన్న దెబ్బకి**
**నేనెవరో నాకు తెలిసింది**
**నేనొక స్త్రీని**
**నేనొక నిషిద్ధ జీవిని**
**మొన్నటిదాకా నా నవ్వు నిషిద్ధం**
**నిన్న నా చదువు నిషిద్ధం**
**నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే"**

స్త్రీ ఏం మాటలాడాలో, ఏది మాటలాడకూడదో అంతా పురుషుడే నియంత్రించే సంస్కృతిని గురించి రేవతీదేవిగారు ఇలా వివరించారు.

**"ఇన్నాళ్ళూ గలగలా మాట్లాడితే**
**నే చెప్పాల్సిందేమీ లేనందున**
**నేనేం చెప్పినా విన్నారు**
**ఇప్పుడేమో నాకూ చెప్పాల్సిందేదో వుండి**
**మాట్లాడబోతే**
**ఎవరూ వినిపించుకోరు**
**అందుకో మరెందుకో**
**ఈ గొంతు మూగవోయింది".**

**13.5.2.** వివాహ వ్యవస్థ:

సావిత్రిగారి 'బందిపోట్లు' అనే కవిత భారతదేశంలోని వివాహ వ్యవస్థను చీల్చి చెండాడింది.

**"పాఠం ఒప్ప చెప్పకపోతే పెళ్ళి చేస్తానని**
**పంతులు గార్నప్పుడే భయం వేసింది**
**ఆఫీసులో నా మొగుడున్నాడు**

**అవసరమొచ్చినా సెలవివ్వడని**

**అన్నయ్య అన్నప్పుడే అనుమానం వేసింది**

**వాడికేం మగమహారాజని**

**ఆడా మగా వాగినప్పుడే అర్థమైపోయింది**

**పెళ్ళంటే పెద్ద శిక్ష అని**

**మొగుడంటే స్వేచ్ఛాభక్షకుడని**

**మనం పాలిచ్చి పెంచిన జనంలో సగమే**

**మమ్మల్ని విభజించి పాలిస్తోందని"**

సుధ, మందరపు హైమావతి, కె.వరలక్ష్మి గారు వివాహ వ్యవస్థ గురించి కవితలు రాశారు.

పెళ్ళి తర్వాత స్త్రీ ఎన్ని రకాల అవతారాలు ఎత్తవలసి వస్తుందో హైమావతిగారు చాలా చక్కగా చిత్రీకరించారు.

**"కుక్కర్ విజిల్స్‌లోనే**

**మనోజ్ఞ సంగీతం వింటాను**

**పతిదేవుని పే బిల్‌పై**

**కాఫీ కప్పుగా, మీల్స్ కేరియర్‌గా**

**పిల్లల లంచ్ బాక్సులుగా**

**బహు పాత్రాభినయం పోటీలో**

**నా చేతులకెప్పుడూ ఫస్ట్ ప్రైజ్"**

**13.5.3. శారీరక స్పృహ:**

కొండేపూడి నిర్మల, కె.గీత, జయప్రభ, పాటిబండ్ల రజని, విమల, రేవతీదేవి మొదలైనవారు ఈ రకమైన వస్తువును తీసుకొని కవితలు రాశారు.

"సౌందర్యాత్మక హింస " అనే కవితలో విమల స్త్రీల శరీరాన్ని భోగవస్తువుగా తీర్చిదిద్దడం వెనుక పితృస్వామ్యంలోని వ్యాపార దృక్పథాన్ని విడమరిచి చెప్పారు.

**"మన మంటే 34, 24, 35 కొలతలమైనచోట**

**మొటిమలు మొలవడం, జుట్టు రాలడం**

**నడుం సన్నగా లేకపోవడమే**

**మన నిరంతరాందోళనలైన చోట**

**అందం పోటీయైన చోట**

**అందం సరుకైన చోట**

**అందాల వ్యాపారాన్ని ద్వేషిద్దాం"**

"స్పర్శానురాగాన్ని ఆలపిస్తూ" అనే కవితలో జయప్రభగారు శృంగారానుభూతిని తాత్వికంతో రంగరించి కమనీయంగా రాశారు.

**"ఒక్కోసారి**
**నీ స్పర్శలో**
**నాకు మాత్రమే తెలిసే**
**సంకేతాలుంటాయి**
**ఏ యుగాల నాటివో తెలియని**
**లిపి సముదాయాలుంటాయి"**

**13.5.4. లైంగిక వివక్ష:**

జయప్రభ, శ్రీమతి, పాటిబండ్ల, రజియాభేగం గార్ల కవితలు దీనికి మంచి ఉదాహరణగా తీసుకోవచ్చు. మగపిల్లవాడికీ, ఆడపిల్లకూ మధ్యవున్న తేడాని చాలా తక్కువగా శ్రీమతిగారు చెప్పారు.

**"చీర ఒక అంచును గుండెలపై పదిలంగా అమర్చుకున్నట్లు**
**అమ్మ తమ్ముణ్ణి హృదయానికి హత్తుకొంటుంది**
**కాళ్ళకు అడ్డుపడే అంచులా**
**నన్ను మాటల్తో తన్నుతుంది"**

స్త్రీ పుట్టుక నుండి వృద్ధాప్యం వరకు పడే బాధలు వున్నవి వున్నట్లు వర్ణించారు రజియాబేగంగారు.

**"బాల్యంలో**
**'చిన్నపిల్లని నీకేం తెల్సు కూర్చో' అన్నారు'**
**యవ్వనంలో**
**'ఉడుకు రక్తం మంచీచెడూ తెలీదు కూర్చో' అన్నారు**
**వృద్ధాప్యంలో**
**'ముసల్దానివి ఇంకేం చేస్తావ్ కూర్చో' అన్నారు**
**అవకాశం రానందుకు కోపంగా లేదు నాకు**
**కూర్చొని, కూర్చొని బద్ధకం వచ్చినందుకు బాధగా వుంది"**

**13.5.5. మాతృత్వం:**

స్త్రీ వాద కవయిత్రులు మాతృత్వంపై మంచి కవితలు రాశారు. పితృస్వామ్య వ్యవస్థను తీవ్రంగా ఖండించారు స్త్రీవాదులు.

"లేబర్ రూమ్" కవితలో కొండేపూడి నిర్మల గారు స్త్రీ ని సంతానాన్ని కనే యంత్రంగా చూడడాన్ని నిరసించారు.

**"లేబర్ రూంలో అడుగు పెడితే చాలు**
**మీరంతా చెబుతున్న తెల్లచీర, మల్లెపూలు, పాలగ్లాసువూసుల్లో**
**పరాధీనతా బానిస కన్నీరు ద్వీపాంతరవాసం**
**కాళ్ళనలా ఎడంచేసి దీనంగా, హీనంగా, నీచాతినీచంగా**
**ఒక హింసాతల పరాకాష్ఠ కోసం ఎదురు చూడ్డమంటే**
**రైలు పట్టా మీద నాణెం విస్తరించిన బాధ"**

ఈ కవితలో ప్రసవ సమయంలో స్త్రీ పడే వేదన ఎంత తీవ్రంగా, భరించరానిదిగా ఉంటుందో నిర్మల తెలిపారు.

**13.5.6. సామాజిక జీవితం:**

సామాజిక జీవితాన్ని వస్తువుగా స్వీకరించిన కవయిత్రుల్లో చెప్పుకోదగ్గవారు జయప్రభ, మందరపు హైమవతి, రావులపల్లి సునీత, ఓల్గా, ఘంటసాల నిర్మల, కల్పనా రెంటాల, కె.గీత, పసుపులేటి గీత, అనిశెట్టి రజిత మొదలైనవారు.

ఇంట్లో భర్త నుంచి బయట 'ఏగుంట నక్కల' వరకు కుటుంబం, సమాజం బతకనివ్వడం లేదని బాధపడుతుంది రావులపల్లి సునీతగారు.

**"నాకూపిరి సలప నివ్వని**
**సామాజిక న్యాయం మీద**
**కాండ్రించి వూసిన ఉమ్మిలా**
**నా ప్రాణాన్ని ఉరితాడులో**
**బిగించాను**
**ఇప్పటికిదే నేనెరిగిన నిరసన"**

**13.5.7. కుటుంబంలో హింస:**

భారతీయ కుటుంబ వ్యవస్థలో స్త్రీ పడిన బాధల మీద అణచివేత మీద, అనేక కుటుంబ సమస్యలపై కవితలు వచ్చాయి.

విమలగారు రాసిన "వంటిల్లు" దీనికి మంచి ఉదాహరణగా తీసుకోవచ్చు.

**"మా అమ్మ మా అమ్మమ్మ**
**ఇంట్లో అమ్మలంతా ఇక్కడ స్త్రీలయ్యారట**
**భయం భయంగా నిశ్శబ్దంగా, నిరాశగా**
**మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ**
**అసలు మా అమ్మ నడుస్తున్న వంట గదిలా వుంటుంది**
**ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి**
**అయినా చివరకు వంటింటి గిన్నెలన్నింటిపైనా**
**మా నాన్న పేరే"**

కుటుంబ వ్యవస్థలోని కుళ్ళును బయట పెట్టిన స్త్రీ కవయిత్రుల్లో జయప్రభ, ఓల్గా, రజని, భవానీదేవి, వాణీ రంగారావు, రావులపల్లి సునీత, మొదలైనవారు చెప్పుకోదగ్గవారు.

**13.5.8. తిరుగుబాటు చైతన్యం:**

స్త్రీవాద కవయిత్రులు పురుషాధిక్యం వ్యవస్థపై తిరుగుబాటు చేశారు. జయప్రభ గారి "పైటను తగలెయ్యాలి" అనే కవిత తిరుగుబాటుకు మంచి శక్తినిచ్చింది.

**"నన్ను అబలని చేసిన**
**పితృస్వామ్యపు అదృశ్యహస్తం పైట**
**దోపిడీ సంస్కృతి**
**నా వ్యక్తిత్వాన్ని శవంగా చేసి**
**దానిపైన కప్పిన తెల్ల దుప్పటి పైట**
**నేను నడిచే శవాన్ని కాకుండా వుండాలంటే**
**ముందుగా పైటని తగలెయ్యాలి"**

**13.5.9.** **ప్రపంచీకరణ:**

ప్రపంచీకరణలో భాగమైన అందాల పోటీలు, శారీరక సౌందర్యం కాపాడుకోవడం కోసం వారు పడే యాతనపై కవితలు వచ్చాయి. కొండేపూడి నిర్మల రాసిన "మల్టీనేషనల్ ముద్దు" అనే కవితను దీనికి మంచి ఉదాహరణగా తీసుకోవచ్చు. మేధోవలసలు, డాట్ కామ్, ఇంటర్నెట్ సంస్కృతులపై రెంటాల కల్పన, కుప్పిలి పద్మగారు మంచి కవితలు రాశారు.

ఈ విధంగా స్త్రీ వాద కవిత్వం భిన్న వస్తువులతో విలసిల్లింది.

**ఆధార గ్రంథాలు:**

1) తెలుగు సాహిత్య విమర్శ, సిద్ధాంతాలు – ఆచార్య వెలమల సిమ్మన్న.

2) తెలుగులో కవిత్వోద్యమాలు – తెలుగు అకాడమి.

**– డా॥ జి. స్వర్ణలత**

## పాఠం - 14

# ప్రసిద్ధ స్త్రీ వాద కవయిత్రులు - రచనలు

**విషయ క్రమం:**

**14.1. స్త్రీ వాద కవిత్వం**

**14.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:**

స్త్రీ వాద కవయిత్రులను, వారి రచనలను విద్యార్థులకు పరిచయం చేయటం.

**14.1. స్త్రీ వాద కవిత్వం:**

తెలుగు కవిత్వంలో పూర్వం రాముడో, శ్రీకృష్ణుడో, శివుడో లేదా మరో పురాణ పురుషుడో కవితా వస్తువులు కాగా ఆధునిక యుగంలో శ్రీశ్రీ చెప్పినట్లు అగ్గిపుల్ల, సబ్బుబిల్ల, కుక్కపిల్ల కవితా వస్తువులయ్యాయి. స్త్రీ వాద కవిత్వంలో ఓణిలు, పైట, పురిటిళ్ళు, వంటిళ్ళు, పొయ్యిలు, గిన్నెలు, గరిటెలు కవితా వస్తువులయ్యాయి.

రేవతీదేవి, జయప్రభ, కొండేపూడి నిర్మల, ఈశ్వరి, విమలగార్లు స్త్రీ వాద కవిత్వాన్ని బలంగా రాశారు.

రేవతీదేవిగారు 1980వ సంవత్సరంలో "శిలాలోలిత" కవితా సంకలనం ప్రచురించారు. వీరు తమ భావాలను, ఆలోచనలను నిర్మొహమాటంగా, నిర్భయంగా వ్యక్తీకరించారు. తాము చెప్పదలచుకున్నదాన్ని చెప్పడానికి వీలులేకుండా ఈ సమాజం చేసిందని చాలా బాధపడతారు రేవతీదేవి గారు. ఈ సమాజం ఒక స్త్రీని కవిగా ఎదగడానికి వీలులేకుండా చేసిందని వాపోయారు. రేవతీదేవిగారు రాసిన కవితలు చిన్నచిన్నవే అయినప్పటికీ అందులో మంచిభావాన్ని వ్యక్తీకరించారు. మన సమాజంలో పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ కి మాత్రమే "శీలం" పరిమితం చేయబడింది. పురుషులకు శీలంతో పనిలేదు. ఒక పురుషుడి కంటే ఎక్కువమందితో లైంగిక సంబంధం ఉన్న స్త్రీ కి శీలం లేదంటారు. లేచిపోయిందంటారు. పురుషుడు ఎక్కువ మంది స్త్రీలతో సంబంధం పెట్టుకుంటే అతడిని చెడిపోయినవాడు అని ఈ సమాజం అనదు. అంతేకాదు రసికుడు, శృంగార రసజ్ఞ, రాజశేఖరుడు అని మరీ బిరుదులు కూడా ఇస్తుంది. స్త్రీలకు ఒక న్యాయం, పురుషులకు ఒక న్యాయం. ఈ ద్వంద్వనీతిని తీవ్రంగా నిరసిస్తారు రేవతీదేవిగారు. స్త్రీ పురుషులకు సమాజంలోని ప్రతి విషయాన్ని వర్తింపచేయాలని నొక్కి వ్యాఖ్యానిస్తారు. తొలితరం స్త్రీ వాదిగా రేవతీదేవిగారిని మనం పేర్కోవచ్చు.

జయప్రభగారు 1980వ సంవత్సరంలో సూర్యుడు కూడా ఉదయిస్తాడు. 1986వ సంవత్సరంలో " యుద్ధోన్ముఖంగా", "ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడి మేఘానిది", 1988వ సంవత్సరంలో "వామనుడి మూడోపాదం" అనే కవితా సంకలనాన్ని ప్రచురించారు. వీరు స్త్రీలపై జరుగుతున్న అణచివేతను వ్యతిరేకిస్తారు. "నా దేశంలో స్త్రీ", "ప్రతిచర్యగా", "మానవి", "విస్తరిస్తున్న ఎడారులం", "పైటను తగలెయ్యాలి" మొదలైన అనేక కవితా ఖండికలు వీరికి మంచి పేరును తెచ్చిపెట్టాయి. వీరి కవిత్వంలో సోషలిస్ట్, ఫెమినిస్టు ధోరణి కన్పిస్తుంది. "భావ కవిత్వంలో స్త్రీ" అనే విషయంపై వీరు ఎమ్.ఫిల్. చేశారు.

కొండేపూడి నిర్మలగారు 1986వ సంవత్సరంలో "సందిగ్ధ సంధ్య" 1990వ సంవత్సరంలో "నడిచే గాయాలు", "బాధాశప్త నది", " మల్టీనేషనల్ ముద్దు" అనే కవితా సంకలనాలు ముద్రించారు. నిర్మలగారు బలమైన స్త్రీ వాద కవయిత్రి. స్త్రీలు అనుభవిస్తున్న అన్ని విషయాలను ఉన్నది ఉన్నట్లుగా చెప్పగల స్త్రీవాది నిర్మల గారు. వీరు "నడిచే గాయాలు" అనే కవితలో వేశ్యల శారీరక, మానసిక హింసను వర్ణించారు. "లేబర్ రూం" ప్రసవ సమయంలో ఒక స్త్రీ పడే శారీరక బాధను ఎంతో సహజంగా వివరించారు. "మదర్ సీరియస్" లో ఒక వృద్ధ స్త్రీ ఆవేదనను చాలా చక్కగా వ్యక్తీకరించారు.

"ఆవిడెప్పుడూ సిద్ధంగా వుంటుంది, "మరణ వాజ్మూలం", యుద్ధ శిశువు", "కప్పల తక్కెడ", "వధూ గీతం", "గోడలు" మొదలైన కవితా ఖండికలు స్త్రీ వాదానికి ప్రతిబింబాలు.

"ఈశ్వరి కోసం సాహిత్య మైత్రి" అనే పేరుతో ఈశ్వరిగారి మిత్రులు కొందరు అచ్చువేశారు. ఈశ్వరి సేల్స్‌గర్ల్‌గా పనిచేశారు. "ఈ అనుభవంతో "నిన్ను నీవు ప్రశ్నించుకోకు" అనే కవిత రాశారు. సేల్స్ గర్ల్ అంటే చిన్నచూపు. అంతేకాక అందరికీ చిన్న చులకన కూడా. సేల్స్ గర్ల్ జీవితంలో ఎదురైన అనుభవాల్ని మన కళ్ళకు కట్టినట్లు వివరించారు. కదనం, మంచిరోజులు, నివేదన అనే కవితల్లో స్త్రీ ఆవేదనను ఆమె పడే బాధల్ని విపులీకరించారు.

1980-1988 మధ్యలో రాసిన విమల కవితల్ని "అడవి ఉప్పొంగిన రాత్రి" అనే పేరుతో విరసం సిటీ యూనిట్ వారు ముద్రించారు. సౌందర్యాత్మక హింస, వంటిల్లు కవిత మొదలైన మంచి కవితల్ని రాశారు. స్త్రీ సమస్యలకూ, విప్లవోద్యమానికీ ఉన్న సంబంధాన్ని అవగాహన చేసుకుని శాస్త్రీయమైన పరిష్కార మార్గాన్ని సూచించడం విమలగారి కవిత్వంలో విశిష్టత, ప్రత్యేకత కూడా. ఈమె రాసిన కొన్ని కవితలు "నీలి మేఘాలు" కవితా సంకలనంలో చేర్చబడ్డాయి.

ఈశ్వరి, విమల కవిత్వంలో మార్క్సిస్టు ఫెమినిస్టు ధోరణి కనిపిస్తుంది. మందరపు హైమావతిగారు "సూర్యుడు", "తప్పిపోయాడు" మొదలైన కవితా సంపుటాల్ని ముద్రించారు. పాటిబండ్ల "రజని ఎర్రజాబిల్ల ఎరీనా" కవితా సంపుటి వచ్చింది. కల్పన రెంటాల గారు నేను "కనిపించే పదం" లాంటి కవితా సంపుటిని ముద్రించారు.

స్త్రీవాద సిద్ధాంతాన్ని కాక, సాధారణంగా స్త్రీ సమస్యల్ని వ్యక్తీకరించే స్త్రీ వాదుల్ని సాధారణ స్త్రీ వాదులనవచ్చు. "ద్రవ భాష' అనే కవితా సంపుటాన్ని ప్రచురించారు కె. గీతా గారు.

కవితా సంకలనాలే కాక వివిధ పత్రికల్లో వచ్చిన స్త్రీ వాద కవిత్వం కూడా చెప్పుకోదగ్గదే.

సావిత్రి గారు 'బందిపోట్లు' కవితలో పురుషాధిపత్యాన్ని కుప్పపోసినట్లు చూపించారు. పాఠం ఒప్పచెప్పకపోతే 'పెళ్ళి' చేస్తానని పంతులు గారన్నప్పుడూ, ఆఫీసులో 'నా మొగుడున్నాడు' అని అన్నయ్య అన్నప్పుడూ, వాడికేం 'మగ మహారాజు అని ఆడామగా వాగినప్పుడు కవయిత్రికి అర్థమైపోయింది. "పెళ్ళంటే పెద్ద శిక్షని / మొగుడంటే స్వేచ్ఛాభక్షకుడని", పెళ్ళి అనేది స్త్రీ జీవితంలో తప్పనిసరి అవుతున్నది. పురుషుడికి పెళ్ళి జరగకపోతే 'పెళ్ళి చేసుకోలేదు' అంటారు. స్త్రీకి పెళ్ళి జరగకపోతే 'పెళ్ళి కాలేదు' అంటారు. స్త్రీకి పెళ్ళి జరగటం ఎన్ని కష్టాలతో కూడుకున్నదో మనకు తెలిసిన విషయమే. డబ్బుపెట్టి మరీ చేసుకున్న పెళ్ళి వల్ల స్త్రీకి ఒరిగిందేమిటంటే తనని హింసించేందుకు పురుషుడికి లైసెన్స్ ఇవ్వటమే. పెళ్ళి వల్ల స్త్రీకి లభించే మరి రెండు సంకెళ్ళు యింటి చాకిరీ, పిల్లల పెంపకం, నిర్బంధాలూ, ఆంక్షలూ ఎలాగూ తప్పవు. ఇంతకంటే పెద్ద శిక్షేం వుంటుంది. స్త్రీకి పంతులుగారు 'పెళ్ళి' చేస్తాను అనడంలో ఇంత అర్థం దాగివుంది

అబ్బూరి ఛాయాదేవి గారు "విన్నావా" అనే కవితలో స్త్రీ పట్ల ఈ సమాజం ఎలా ప్రవర్తిస్తోందో తెలిపారు. సమాజం స్త్రీని అనుక్షణం "నువ్వు ఆడదానివి, గీత దాటకూడని దానివి, మచ్చపడితే మాయని దానివి" అంటుందంటారు. ఈ గీతలూ, మచ్చలూ, స్త్రీకే గాని పురుషుడికి లేవంటుంది ఈ సమాజం. ఓ సాయంత్రం విజయవాడ సెంటర్‌లో మెళ్ళో వేశ్యల బోర్డుకట్టి ఊరేగించిన సంఘటనకు స్పందించి ఘంటశాల నిర్మల గారు "ఏ కాల్ గల్స్ మోనోలాగ్" రాశారు. ఈ కవితలో పడుపుకత్తె స్వగతాన్ని తన స్వరంలో వినిపించారు. హైదరాబాదులోని మెహిందీ బజారులో వేశ్యల మీద పోలీసులు జరిపిన బీభత్సాన్ని, అక్కడి వేశ్యల బాధల్నీ విన్న ఓల్గా గారు మెహిందీ స్త్రీల తరపున స్పందించి మంచి కవితను రాశారు.

పుట్ల హేమలత, రావులపల్లి సునీత, కె.గీత, చంద్రమల్లిక, కవితాభారతి, ఆర్. శశికళ, కె. వరలక్ష్మి, కోట్ల వనజాత మొదలైనవారు స్త్రీ సమస్యలపై మంచి కవితల్ని రాశారు.

1993 అక్టోబర్ 3వ తేదిన హైదరాబాద్‌లో "నీలి మేఘాలు" అనే కవితా సంకలనం వెలువడింది. ఇందులోని కవితలన్నీ స్త్రీవాద రచయిత్రులు రచించినవే. 1972 నుంచి 1992 మధ్య కాలంలో స్త్రీ వాద ధోరణలను వ్యక్తీకరించగలిగే పుస్తకంగా దీనిని భావించవచ్చు. ఈ కవితలన్నీ సంకలనం చేసినవారు ఓల్గా. రిసోర్స్ సెంటర్‌ఫర్ విమెన్ "అస్మిత", సికింద్రాబాద్ వారు ప్రచురించారు. దీనిని అంకితమిస్తూ అస్మిత

**"కవిత్వం మనకు విలాసంకాదు**
**మనకు కవిత్వం సరదా కాదు**
**మన ఉనికి కోసం మనం అత్యవసరంగా కవిత రాస్తాం**
**కవిత్వ కాంతి పుంజాలలో మనం**
**మన కలల్నీ కోరికల్ని చూస్తాం**
**మన మనుగడలో, మన జీవితాల్లో మార్పుల**
**గురించిన**
**ఆ కలలూ కోరికలకు**
**ఒక భాషను తెచ్చుకుంటాం**
**ఆ భాష నుంచి భావాల్నీ**
**ఆ భావాల నుంచి స్వతస్సిద్ధ చర్యల్నీ**
**కవిత్వంలో ముందుకు తెస్తాం!"** అంటూ

స్త్రీవాద కవిత్వాన్ని ముందుకు నడిపిన కవయిత్రి ఆడ్ర్ లార్డ్ స్మృతికి అంకితమిచ్చారు. ఈ పుస్తకాన్ని రావు బాలసరస్వతీ దేవి గారి చేత ఆవిష్కరింపజేశారు. స్త్రీ వాద కవిత్వానికి చిరునామా అనదగిన 'నీలిమేఘాలు' ఆవిష్కరణలు స్త్రీ వాద కవిత్వానికి విజయం చేకూరినట్ల అయింది. స్త్రీ వాద కవితలను స్త్రీల స్వంత సమస్యలుగా, స్వంత అసౌకర్యాల అనుభూతుల గొడవలుగా కాకుండా సామాజిక సమస్యలుగా గుర్తించాలని వీరు కోరారు. "స్త్రీల అణచివేతనూ, దాని స్వభావాన్నీ విశ్లేషించే పద్ధతీ, ఆ అణచివేతను వ్యతిరేకించే వుద్యమం, ఆ ఉద్యమపు వ్యూహం గురించిన వివేచన – ఇవీ యివాళ్టి చారిత్రక అవసరాలు! అంతేగాని ఉత్తి గాలి కబుర్లు, ఉక్రోషపు అరుపులు, వ్యక్తిగత నిందారోపణలు కావు" అంటారు ఓల్గా.

**కొన్ని స్త్రీ వాద కవితలకు ఉదాహరణలు:**

"ఆకలే మిగిలింది" అనే కవితలో ఓల్గా గారు

**"ఏపుగా పెరిగిన పైరును**
**నిండు యవ్వనంలోని నన్ను**
**ఒకే కంటిలో కామందు చూచినపుడు**

**గుండె పగిలేలా ఏడిస్తే**

**ఆ కన్నీళ్ళు ఈ భూమినే తడిపాయి**

**దూరంగా చెట్టుకింద ఉయ్యాలలో**

**ఆకలికి ఏడుస్తున్న బిడ్డ కోసం**

**నా గుండెలో పొంగిన తల్లిపాలు**

**ఈ భూమిలోనే ఇంకి పోయాయి**

**..................................**

**అన్నిసార్లూ**

**ఈ భూమి బంగారమే పండింది**

**బంగారమంతా కామందు పెట్టెలోకి వెళ్ళింది**

**నాకు మాత్రం ఆకలే మిగిలింది............"** అంటారు

వసంత కన్నబిరాన్ "అస్మిత" కవితలో స్త్రీగా ఉండటమంటే ఏమిటో ఎప్పుడు తెలుసుకున్నానని ప్రశ్నిస్తూ యవ్వనంలోకి అడుగుపెట్టినప్పుడా?, బిడ్డకు జన్మనిచ్చినప్పుడా?, అనారోగ్యంతో శరీరం శిథిలమైనా బాధను బిగబట్టి చిరునవ్వుని వెలయించినప్పుడా, అసత్యాలను తేరిచూసినప్పుడా అంటూ ప్రశ్నించుకుంటారు.

**"ఇది కాదు, ఇదికాదు అంటూ**

**ఇది కానే కాదు**

**ఇది అసలు కాదు అంటూ**

**ఒక పొర తర్వాత మరొకటి**

**నా భ్రమల పొరల్ని వలిచిపారేయటం**

**మొదలు పెట్టినపుడు కదూ –**

**నేతి నేతి అనే నిర్వచనంలో**

**నేను బందీనై వున్నానని తెలిసి**

**నా ఏమీలేని తనాన్ని**

**సూటిగా చూసుకోవటానికి ధైర్యం చేసినప్పుడు కదూ**

**శూన్యంలో వుండే సాహసం చేసినపుడు కదూ**

**నన్ను మొత్తంగా చెరిపేసుకునే**

**అపాయాన్ని ఎదుర్కొని నిల్చి**

**నా ఉనికిని మళ్ళీ కొత్తగా ఏర్పరుచుకున్నపుడు కదూ –**

**స్త్రీ గా వుండటమంటే అర్థం ఏమిటో**

**నేను తెలుసుకున్నది!"** అని సమాధానం చెప్పారు.

కొండపల్లి కోటేశ్వరమ్మ గారు

**"అశ్రు సమీక్షణం" లో**

**"నా కన్నీటిని తమ కన్నీట తుడిచే...**

**కారుణ్యం ఎందరికుందీ..?**

**నా అశ్రువులు మానవ విలువలకు ప్రేరణైతే...**

**నీ అశ్రువులు వాటి నావిష్కరించ గలిగితే..**

**తరతరాల నా కన్నీటి ధారల**

**సంక్షిప్తం చేసి చూపిస్తాను – సమీక్షించు సత్యం!!"** అంటూ

భారతీయ సాహిత్యంలోని స్త్రీ లైన సీత, శకుంతల, కుంతి, ద్రౌపదిల దీనగాథలను, ఆధునిక కావ్య స్త్రీ లైన పూర్ణమ్మ వంటి వారి వెలతలను ఉటంకిస్తూ తన ఆవేదనను వ్యక్తీకరించారు. ఇంకా

**"మరచాను నా కథ రాసే..... సాహసం నీకుందా..?**

**ఎదిగిన అమ్మణ్ణి ఏరు మింగేసిందంటూనే....**

**ఎదురీదే నీ చేతులకు నా కథ రాయమని**

**ఏరు దారిస్తుందా... శివసాగర్ ?**

**నీ రుచికే కళ్ళతో... నిజాన్ని చూడలేమనేగా......**

**నీ కన్నీళ్ళతో – నా కన్నీళ్ళు తుడుస్తానంటున్నావు?**

**నీవు సత్యంగా తుడిచేస్తే...**

**నేను నిజంగా చూస్తాను"** అని అంటారు.

కొండేపూడి నిర్మల గారు "నడిచే గాయాలు' అనే కవితలో

**"నడిచే గాయాలు నువ్వెప్పుడైనా చూశావా?**

**నడవడటమే కాదు**

**నవ్వుతాయ్**

**నగలు పెట్టుకుంటాయి**

**......................**

**గాయాలూ నదులై ప్రవహిస్తున్నాయి**

**పర్వతాలై ఘనీభవిస్తున్నాయి**

**నిద్రలేక ఎర్రబారినట్లనిపించే ఆ చూపులు**

**నిజానికెప్పుడే నిద్రపోయాయి.**

**గది కొక్కటి చొప్పున కర్టెన్ల**

**బ్యాండేజీ ముక్కలతికించుకుని**

**అసలేం జరగనట్టే కనిపిస్తున్నా**

**నిజానికెన్నో యుగాల నుంచీ నడుస్తూనే వున్నాయి"** అంటారు.

తుర్లపాటి రాజేశ్వరిగారు "ఊసరవెల్లి" అనే కవితలో

**"మౌన హృదయ భేషణలు**

**రసజ్వలనాలు**

**మరీచికలు కాగా**

**సంసార నిశావరణంలో**

**కన్ను పొడుచుకున్నా కానరాదు!**

**................**

**ఆమె కింశుక వృక్షమై**

**ముద్దమందారమై**

**సూర్యోదయానికి ఎదురు చూస్తుంటే**

**వీడు గార్ధభాకృతి వీడి.....**

**గజరాజమై**

**వీధి మొగలో దర్శనమిస్తాడు**

**వేదికపై తత్త్వోపన్యాసం చేస్తాడు"** అని మగవాడి రెండు ముఖాలను చూపించారు.

పుట్ల హేమలత గారు "జ్ఞాపకాల తెర" అనే కవితలో

**"చిన్నప్పుడు నిద్దట్లో**

**అమ్మ కప్పిన పైటకొంగు వెచ్చదనం**

**ఒక జ్ఞాపకమై**

**నా భుజాల చుట్టూ**

**శాలువాగా చుట్టుకుంటుంది**

**మూర్తీభవించిన యక్షిణిలా**

**ఆమె ఎక్కడో వుంటుంది**

**నేను మాత్రం**

**తియ్యని పలకరింపుల మాధుర్యాన్ని**

**జ్ఞాపకాల బైనాక్యులర్స్ లోంచి చూస్తుంటాను**

**........................**

**ఒక్క అమ్మ మాత్రమే**

**నన్ను మనిషిని చేసి**

**జీవిత రహదారిని చూపుతుంది**

**నేను తప్పటడుగులేస్తూ**

**అమ్మ చిటికెన వేలు పట్టుకొని**

**జీవన రేఖల సరిహద్దులు కొలత వేస్తుంటాను"** అంటారు.

మహెజబీన్ "నవ స్మృతి" అనే కవితలో

**"..........................................................**

**ఎవరైతేనేం? ధైర్యంగా నవమాసాలు మోయాలనుకున్నప్పుడు**

**గుండె చప్పుడు కడుపులో వినిపించే**

**అద్భుతాన్ని సొంతం చేసుకోవాలి**

**మన రక్తమాంసాల ఫలాల మీద**

**ఎవరి ఆధిక్యమూ వద్దు**

**వాళ్ళకే తెలియని అస్పష్ట బహిర్కణల మధ్య**

**నేను ఈ యుగం ముందు నిలబడి**

**మాతృత్వాన్ని ఆవిష్కరిస్తున్నాను"** అంటారు

మందరపు హైమవతి "సర్దుకుపో" కవితలో

**"...........................**

**ప్రపంచమంతటికీ**

**స్వాతంత్ర్యం వచ్చినా**

**నేనింకా బానిసత్వ అంధకారంలో**

**మగ్గిపోవలసిందేనా?**

**నీటిలోనే జీవిస్తుంది చేప**

**కాసేపు నేలపైన వుండమంటే**

**నశిస్తుంది మరుక్షణమే**

**నింగిలో విహరించే పక్షిని**

**"కాసేపు సర్దుకో నేల పైనే ఎగురు"**

**అంటే ఎంత అసహజం!**

**అంతకన్నా హీనమైనదా స్త్రీ జన్మ**

**"సర్దుకుపో" ఈ నాలుగు అక్షరాలే**

**స్త్రీ జీవితాన్ని బలి కోరే శాపాలు!**

**"సర్దుకుపో" ఈ నాలుగు అక్షరాలే**

**స్త్రీ ని అగ్నికాహుతి చేసే సాధనాలు!"** అంటారు.

"యుద్ధం" అనే కవితలో ఊర్మిళ

**"యుద్ధం మొదలవుతుంది అంతరంగంలో**

**శత్రువులెవరూ వుండరు**

**కళ్లెదుట నాకు నేనే**

**.........................**

**అంతా నేనే**

**కర్తను, క్రియా చైతన్యాన్ని కర్మ ఫలాన్ని కూడా నేనే**

**అయినప్పుడు నా కెందుకు వ్యధ"** అంటారు.

జయప్రభ "వంటింటి నించి వల్లకాటి దాకా" కవితలో

**"హాయిగా**

**ఇది కావాలని మారాం చేసే**

**చిన్నతనంలోంచి**

**ఇల్లాలి సయ్యాకా ఇంక**

**యుద్ధం చెయ్యడమే బతుకు!**

**పాశుపతాస్త్రాలు లేవు**

**పరుశురాముడిని కాను**

**బాహ్యేతర భావాల సంఘర్షణ నాది**

**మనశ్శరీరాగ్నులతో మాలిమి వాది**

**............................**

**కోటలో కూర్చుని**

**బోధలే గాని యుద్ధమే చెయ్యని**

**ఈ క్రిష్ణుళ్ళ రసవద్గీతలు మొత్తంగా మోసం!**

**తలవాకిలి కాస్తూన్న నా ముందు**

**వంటింటి నించి వల్లకాటి దాకా వెంబడించేది**

**వేయి పడగల రాజ్యం!"** అంటారు.

**ఆధార గ్రంథాలు:**


1) తెలుగు సాహిత్య విమర్శ, సిద్ధాంతాలు – ఆచార్య వెలమల సిమ్మన్న.

2) నీలి మేఘాలు (స్త్రీ వాద కవితలు) – ఓల్గా (సంకలనం).


**– డా॥ జి. స్వర్ణలత**

## పాఠం - 15

# దళితవాదం, మైనార్టీవాదం, ప్రాంతీయవాదం

**విషయ క్రమం:**

**15.1.** దళితవాదం

**15.2.** మైనార్టీవాదం

**15.3.** ప్రాంతీయవాదం

### 15.0. పాఠ్యభాగ ఉద్దేశ్యం:

తెలుగు సాహిత్యంలో తమ అస్తిత్వం కోసం వచ్చిన దళిత వాద కవిత్వం, మైనార్టీవాద కవిత్వం, ప్రాంతీయ వాద కవిత్వాల పట్ల విద్యార్థులకు అవగాహన కలిగించటం

### 15.1. దళిత వాదం:

తరతరాలుగా అగ్రవర్ణాల వారు దళితులను అణచి వేయడం సమాజంలో కనిపిస్తుంది. దళితులు సమానత్వానికి, మర్యాదకు, సంపదకు దూరమై ఊరి నుంచి కూడా దూరంగా నెట్టివేయబడి కటిక దరిద్రులుగా జీవించారు. ఆంగ్లేయుల రాకతో, ఎంతోమంది సంఘసంస్కర్తల ప్రభావంతో దళితుల జీవితాలలో చైతన్యం వచ్చింది. దానికనుగుణంగా తెలుగు సాహిత్యంలోను దళితాభ్యుదయం చోటుచేసుకుంది. 1975వ సంవత్సరం ప్రారంభమైన దళితవాదానికి ఒక దశాబ్దం తర్వాత 1985వ సంవత్సరం నాటికి ఒక రూపం వచ్చింది. దళితులు సాహిత్యం సృజించటం 20వ శతాబ్ది మొదటి నుంచే ఉంది. గుఱ్ఱం జాషువాగారు 1920వ సంవత్సరం నుంచి రచనలు చేస్తున్నా 1929వ సంవత్సరం దాకా సొంతగొంతుక ఏర్పడలేదు. తన వ్యక్తిత్వం ప్రతిబింబించే సాహిత్యం పుట్టేసరికి జాషువాగారు ఒక సాహిత్య చైతన్యం అయ్యాడు. బోయి భీమన్నగారు దళిత స్పృహ ఉన్న సాహిత్యం స్వాతంత్ర్యానికి పూర్వమే వచ్చింది. కొలకలూరి ఇనాక్‌గారు దళిత సాహిత్య దృక్పథాన్ని ప్రోత్సహించారు.

#### 15.1.1. దళిత సాహిత్యం:

1909వ సంవత్సరంలో "మాలవాంద్ర పాట" తో దళిత సాహిత్యం మొదలైంది. ఈ పాట ఆంధ్ర భారతి పత్రికలో ముద్రించబడింది. 1919వ సంవత్సరంలో 'పంచములు' అనే గీతం గరిమెళ్ళ సత్యనారాయణగారు రచించారు. 1915వ సంవత్సరంలో మంగిపూడి వెంకట శర్మగారు 'విరుద్ధ భారతం' రచించారు. ఈ గ్రంథం అస్పృశ్యతా నిర్మూలనాన్ని కోరుతుంది.

##### 15.1.1.1. దళిత సాహిత్యం–ప్రముఖుల అభిప్రాయాలు:

1) "దేశం సుభిక్షంగా ఉండాలంటే, దళితుడు పీడితుడిగా ఉండకూడదు. దళితుడు విముక్తి కావడం వెనుక దళితోద్ధరణమే కాదు. సమాజోద్ధరణ ఇమిడి ఉంది. తాను సుఖపడడం వెనుక దేశం సుఖపడడం ఉంది. కాబట్టి దేశ సౌఖ్యం కోరే దళితుడు దేశభక్తుడు. విమర్శకుడు ఈ సాహిత్యం దర్శిస్తూ దళితుడిలో స్వార్థపరుణ్ణి కాదు. పరార్థ పరాయణుణ్ణి, దరిద్ర నారాయణుణ్ణి, పీడిత లోక విమోచకుణ్ణి గుర్తించే సామర్థ్యం పెంచుకోవాలి." – ఆచార్య కొలకలూరి ఇనాక్.

2) "రచయితని తన కులం నుంచి తన వాళ్ళ స్థితిగతుల్నించి వేరుచేసే తత్వాన్ని దళితసాహిత్యం వ్యతిరేకిస్తుంది. కింది కులాల రాజ్యాధికారం భావనకు కళాత్మకమయిన మేధో అనుభూతిపరమైన వ్యక్తీకరణే దళిత సాహిత్యం. బహుజన భారతి ఆశల్నీ అవసరాల్నీ అద్దం పడుతుందీ సాహిత్యం. ఈ పనిచేయడంలో మొత్తం అగ్రకుల హిందూ సాహిత్య కళాతత్వాన్ని పక్కన పెట్టి తనదైన ప్రతిమల్నీ, ప్రతీకల్నీ, భిన్నమైన విమర్శా ధోరణుల్ని అభిరుచిని ప్రవేశపెడుతుంది". – జి. లక్ష్మీ నరసయ్య.

3) "దళితవాదం తనదైన సిద్ధాంతాన్ని రూపొందించుకొంది. తన వాదానికి పునాదిగా భారత ఉపఖండంలో సాగిన కుల వ్యతిరేక ఉద్యమాల నుండి భావజాల రంగాన్ని రూపొందించుకొంది. కులం దాని తాత్విక మూలమైన వైదిక, హిందూ భావజలాల మీద యుద్ధం ప్రకటించింది. –కత్తి పద్మారావు.

4) "దళిత సాహిత్యం ఒక సముద్రం. అది చూసే వాళ్ళ చూపును బట్టి నిశ్చలంగా కనబడుతుంది. సముద్రంలో మహానదులున్నాయి. ఉప్పెనలు ఉన్నాయి. అన్నిటిని మించి సహనం ఉంది. భూమిలో మూడుపాళ్ళు సముద్రమే ఆక్రమించింది. బి.సి., ఎస్సీ, ఎస్టీల సాహిత్యం కూడా మొత్తం భారతదేశ సాహిత్యంలో మూడుపాళ్ళు ఎదిగేదాకా ఈ కృషి నిరంతరం సమస్త రూపాల్లో కొనసాగించాలి" – బి.యన్. రాములు.

5) "హరిజన, గిరిజన, వెనుకబడిన, మైనారిటీ వర్గాలకు సంబంధించిన జీవన విధానానికి సంబంధించిన సాహిత్యం దళిత సాహిత్యమౌతుంది. దళిత వర్గాలు సృష్టించిందే దళిత సాహిత్యం అనే భావన సమంజసమైనది కాదు. దళితవర్గాల అభ్యున్నతికోసం అగ్రవర్ణాల వారు సృష్టించిన సాహిత్యం కూడా దళిత సాహిత్యమే అవుతుంది. అయితే దళితేతరులు సృష్టించిన సాహిత్యం కన్నా, దళితులు సృష్టించిన సాహిత్యం వాస్తవ రూపాలకి అద్దం పడుతుంది. ఆయా సమస్యల్ని అనుభవిస్తున్న దళితుడి అభివ్యక్తిలోనూ, ఆత్మాశ్రయరీతిలోనూ గాఢత చోటుచేసుకుంటుంది." – డాక్టర్ కొండపల్లి సుదర్శన రాజు.

6) "దళితులకే ప్రత్యేకమైన Poetic dialect లేదనేవారు. అలా రాయడం అనాగరికం అనుకునేవారు. తాము ఆమోదించే అగ్రకుల బ్రాహ్మణ భాషలోనే రాసుకోమనండి. ఎటొచ్చి మిగతా వాళ్ళందర్ని తమలాగే రాయమని సూత్రీకరించడమే వొద్దంటున్నాను. చాలా మంది ఆరోపిస్తున్నట్టు ఇప్పుడు బూతుగా ఆమోదించబడిన భాష బూతు కాదు. అనాదిగా అగ్రకుల సాహితీకారులు దళిత నుడికారాన్ని బూతుగా, Slangగా, Jargonగా చిత్రించారు". – మద్దూరి నగేష్ బాబు.

7) "అణగారిన కులాలన్నీ దళిత జెండా కింద ఏకమై దళిత కంఠం బలంగా విన్పించింది. విన్పిస్తూంది. దళితులకు సామాజిక, ఆర్థిక విముక్తి కలిగే వరకూ రాజ్యాధికారం సాధించేవరకూ ఈ దళిత సాహిత్యం పొంగిపొర్లుతూ హోరెత్తిస్తూనే ఉంటుంది. దీనికి ముగింపు కులనిర్మూలనమే. సమసమాజ స్థాపనే". – డాక్టర్ పిల్లి శాంసన్.

**15.1.1.2, దళిత సాహిత్య లక్షణాలు:**

దళిత సాహిత్యాన్ని పరిశీలిస్తే అందులో ప్రధానంగా రెండు లక్షణాలు కన్పిస్తాయి.

1. బ్రాహ్మణీయ సంస్కృతిని వ్యతిరేకించేవి
2. దళిత సంస్కృతిని ప్రతిష్ఠించేవి.

**1) బ్రాహ్మణీయ సంస్కృతిని వ్యతిరేకించేవి:**

భారతదేశంలో దళితులు నీచంగా చూడబడటానికి ప్రధాన కారణం 'బ్రాహ్మణిజం'. అందుచేత దళితాభ్యుదయాన్ని కోరుకునేవారు ముందుగా బ్రాహ్మణ సంస్కృతిని తీవ్రంగా వ్యతిరేకించారు. అవి:

1) హిందూ పురాణాలపై తిరుగుబాటు

2) బ్రాహ్మణిజంపై దాడి

3) సంస్కృత భాషపై వ్యతిరేకత

4) జంధ్యం వ్యవహారం

5) హిందూ మతంపై తిరుగుబాటు

6) మనువు "మను స్మృతి" పై తిరుగుబాటు

7) కర్మ, పునర్జన్మలపై తిరుగుబాటు

8) బ్రహ్మపై దాడి

9) నాస్తిక ధారణి

**1) హిందూ పురాణాలపై తిరుగుబాటు:**

భారతదేశంలో కులవ్యవస్థ ఏర్పడడానికీ, ఆ వ్యవస్థ ఎక్కువ అవడానికీ, సమాజంలో అస్పృశ్యత ఏర్పడడానికీ మన సమాజం మూఢ విశ్వాసాలతో మునిగి తేలడానికి, సాంఘిక అసమానతలకూ ముఖ్యమైన కారణం వైదిక సాహిత్యం, పురాణాలు. కాబట్టి దళిత సాహిత్యంలో హిందూ పురాణాలపై తీవ్రమైన విమర్శ చోటుచేసుకుంది.

**2) బ్రాహ్మణిజంపై దాడి:**

భారతదేశంలోని "బ్రాహ్మణిజం" వేల సంవత్సరాల నుంచి పాతుకుపోయింది. బ్రాహ్మణిజాన్నే మనదేశంలో "హిందూయిజం" గా పిలుస్తున్నారు. "బ్రాహ్మణిజం" స్వార్థం చోటుచేసుకుంది. ఈ సమాజాన్ని తమ బాగు కోసం ఉపయోగించుకున్నారు. ఇతరుల్ని కనీసం మనిషిగా చూడలేకపోయింది ఈ బ్రాహ్మిణిజం. అంచేత దళిత రచయితలు బ్రాహ్మణిజాన్ని చాలా నిశితంగా విమర్శించాను. ముద్ద పప్పు, తులసికోట, జంధ్యం, మడి, పిలక మొదలైన పదాల్ని వాడి వారిని హేళన చేస్తూ విమర్శించడం కన్పిస్తుంది. దళితులకు జరిగిన అన్యాయాన్ని ఇలాంటి పదాల్ని వాడి కసి తీర్చుకుంటున్నారు.

**3) సంస్కృత భాషపై వ్యతిరేకత:**

తెలుగు సాహిత్యంలో 11వ శతాబ్దం నుంచి 16వ శతాబ్ది వరకు అన్ని కావ్యాలు, సంస్కృతం నుంచి అనవదించబడ్డాయి. ఎప్పుడైతే సంస్కృతం నుంచి అనువదించబడ్డాయో అపుడే తెలుగు భాషపై సంస్కృత ప్రభావం ఉందన్నమాట. సంస్కృత భాషను దేశ భాషగా, అమర భాషగా చిత్రీకరించారు. అంతేకాదు అన్ని భాషలు సంస్కృతం నుండి పుట్టాయని గుడ్డిగా గట్టిగా వాదించారు కూడా. సంస్కృతంలోనే పురాణాలున్నాయి. ఈ పురాణాల్లో సమానత్వం లేదు. భారతదేశంలో ఒక వర్గం సృష్టించుకున్న సాహిత్యం సంస్కృతం అని దళిత రచయితలు ఎలుగెత్తిచాటారు. కాబట్టి సంస్కృతభాషపై దళిత రచయితలు ఎదురుతిరిగారు.

ప్రముఖ దళిత కవి, సుప్రసిద్ధ విమర్శకులు, ఉత్తమ సంపాదకులు శ్రీ సతీష్ చందర్‌గారు తన "పంచమ వేదం" లో

**"ప్రతిభావంతులు వాళ్ళు**
**మీ శ్లోకాలకు చప్పట్లు కొట్టేవారు**
**నాకు మాత్రం అని తిట్లలా అనిపించేవి**
**దేవుని నాలుగు శరీర మర్మాలూ**
**అశ్లీల భావచిత్రాల్లా కనిపించేది**

**నా జన్మరహస్యం మీ శాస్త్రాల్లో రాయనందుకు**

**నేనెప్పుడూ కృతజ్ఞుణ్ణే"** అని

సంస్కృత భాషపై తిరుగుబాటు ప్రకటించారు. "తేడా" అనే ఖండికలో శ్రీ రావూరి ఏకాంబరంగారు సంస్కృత భాషనూ, సంస్కృత సంస్కృతిని

**"సంస్కృత భాషలో సంస్కార శక్తులు**

**కాగడా పెట్టి వెతికిన కానరావు**

**సంస్కృతి మృగ్యము సమత మృగ్యము**

**అవలక్షణములన్ని యందె గలవు**

**బ్రహ్మణాధిక్యమే ప్రాణ సమానము**

**బ్రాహ్మణేతరులను పశులజేసె**

**గర్వించు ఘట్టాలు గీర్వాణమున సున్న**

**శవ సమానమ్ము సంస్కృతమ్ము"** అని విమర్శించారు.

**4) జంధ్యం వ్యవహారం:**

ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త శ్రీ కత్తి పద్మారావుగారు బ్రాహ్మణుల జంధ్యం వ్యవహారంపై తన కలాన్ని ఝుళిపిస్తూ జంధ్యం పేరుతో ద్విజన్మను సృష్టించి. సమాజంలో సమానత లేకుండా చేశారని బాధపడ్డారు. "ఆత్మ విమర్శ" అనే కవితలో శ్రీ కత్తి పద్మారావుగారు

**"యజ్ఞోపవీతం పేరుతో**

**ద్విజన్మను సృష్టించి**

**యాచక వృత్తికి**

**నన్ను సంకేతం చేశారు .....**

**.........జనం అంతా కలిసి పోతారని**

**నాయీ, నయా నామాలతో**

**జందేల స్వాముల్ని పెంచేసాదు**

**మానవత్వాన్ని హత్యచేస్తున్న ముద్దాయిరా"** అంటారు.

శ్రీనగేష్ బాబుగారు "ఊరూవాడ" అనే కవితలో బ్రాహ్మణిజాన్ని వదులుకోవాలని పిలుపు ఇచ్చారు. అంతేకాక బ్రాహ్మణిజం నుంచి బయట పడినవారు ధన్యులు అని కొనియాడారు.

**"బ్రాహ్మణత్వాన్ని వొదులుకున్నవారు ధన్యులు**

**వారు దళిత ప్రేమను చవిచూచెదరు**

**జందెముచే బంధింపబడక**

**విముక్తి పొందినవారు ధన్యులు**

**దళిత రాజ్యములో వారికి ప్రత్యేకముకాని చోటుండును"**

**5) హిందూమతంపై తిరుగుబాటు:**

దళితరచయితల సంస్కృతి పేరుతో హిందువులు చేస్తున్న మూఢవిశ్వాసాల్ని విమర్శించారు. పెళ్ళిపేరుతో, గర్భాదానం పేరుతో బ్రాహ్మణుడు చేస్తున్న అరాచకాన్ని తీవ్రంగా నిరసించారు. "పెండ్లి మంత్రాలు" అనే ఖండికలో శ్రీ రావూరి ఏకాంబరం గారు పెండ్లి మంత్రాల్లోని బండారాన్ని బట్టబయలు చేశారు.

**"బ్రాహ్మణుల్ చదువు వైవాహిక శ్లోకాలు**

**బ్రాహ్మణ నైచ్యమున్ బట్టి యిచ్చు**

**భూసురుల్ వల్లించు బూతు శ్లోకాలలో**

**వధువు ప్రథమ భర్త బ్రాహ్మణుండు**

**విప్రులు వల్లించు పెండ్లి శ్లోకాలలో**

**వరుడు కన్యాదాత తార్పుగాండ్రు"**

**6) మనువు "మను స్మృతి" పై తిరుగుబాటు:**

భారతదేశంలో మనువు రాసిన 'మను ధర్మ శాస్త్రం" ధర్మశాస్త్రంగా కొనసాగింది. ఒక వర్గం కొరకే రాయబడిన ధర్మాలు మరో వర్గానికి పనికి రాకుండా పోయాయి. అందరికీ సమన్యాయం లేకపోవడాన్ని గుర్తించి ఈ దళిత రచయితలు మను ధర్మశాస్త్రంపై తమ వ్యతిరేకతను ప్రదర్శించారు. "పంచమవేదం" లో శ్రీ సతీష్ చంద్రగారు

**"దేవుడి కాళ్ళలోంచి భుజాల వరకూ**

**ఎగబాకిన ధమనులు మీరు**

**మనుధర్మాన్ని మనీ పర్సులో**

**ముగ్గబెట్టే వుంటారు**

**........................**

**మనిషినే కాదన్న నన్ను**

**రాజకీయ స్పర్శ గురించి అడిగితే**

**చర్మం వలిచి సోదాహరణంగా చెబుతాను"** అంటూ

దళితులందరూ ఏకమై దళితులకు అన్యాయం చేసిన మను స్మృతికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. అలాగే ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారు

**"నేనింకా నిషిద్ధ మానవుణ్ణే**

**నాది బహిష్కృత శ్వాస**

**నా మొలకు తాటాకు చుట్టి**

**నా నోటికి ఉమ్మి ముంత కట్టి**

**నన్ను నలుగురితో**

**అసహ్య మానవ జంతువుని చేసిన మనువు"** అంటూ

మనువుపై విరుచుకుపడ్డారు. అలాగే పగడాల నాగేందర్ గారు

**"ఇప్పుడు ద్విజుడి వేషాన్ని ధిక్కరిస్తూ**

**'ఛండాలుడా'**

**పద్యంలోకి వైతాళికుడివై రా**

**నిన్ను బహిష్కరించిన చరిత్ర చెవుల్లో**

**సలసల కాగే సీసాన్ని పోద్దువురా**

**వర్తమాన మనువు నోట్లో**

**ఉచ్చ పోసేందుకురా"** అని నిరసన తెలిపారు.

**7) కర్మ, పునర్జన్మలపై తిరుగుబాటు:**

భారతీయ సంస్కృతిలో భాగమైన కర్మ, పునర్జన్మలను దళిత రచయితలు వ్యతిరేకించారు. కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలు అబద్ధమనీ, ఈ సిద్ధాంతాలు బ్రాహ్మణవాదులు తమ మనుగడ కోసమే ఏర్పాటు చేశారని దళిత కవులు విమర్శించారు. గుర్రం జాషువాగారు కర్మ సిద్ధాంతాన్ని

**"కర్మ సిద్ధాంతమున నోరు కట్టివేసి**

**స్వార్థలోలురు నా భుక్తి ననుభవింత్రు**

**కర్మమననేమొ దానికీ కక్షయేమొ**

**ఈశ్వరుని చేత ఋజువు చేయింపవమ్మ"** అని ప్రశ్నించారు.

"భగవద్గీత" అనే ఖండికలో రావూరి ఏకాంబరంగారు కర్మ, పునర్జన్మలను వ్యతిరేకించిన బౌద్ధమతం గురించి

**"బౌద్ధమత ధర్మ వ్యవస్థ బలము పుంజుకొనుచు**

**నాసేతు హిమగిరి నాక్రమింప**

**ఆర్యకుల వ్యవస్థ కవసాన దశవచ్చె**

**కుల పునాదులు కూలెపోయె**

**ద్వైతాది సిద్ధాంతత్రయ మారిపోయెను**

**ధర్మపీఠమ్ములు దద్దరిల్లె**

**కర్మ పునర్జన్మ ఘోర సిద్ధాంతాలు**

**కాలదోషమును బట్టి కంపుగొట్టె"** అని విశదీకరించారు.

**8) బ్రహ్మపై దాడి:**

దళిత రచయితలు దాదాపుగా అందరూ బ్రహ్మపై తిరుగుబాటు చేశారు. మన పురాణాలు చెప్పినవన్నీ తప్పు అన్నారు. చాతుర్వర్ణ్య వ్యవస్థ పుట్టుకను ప్రశ్నించారు.

గుర్రం జాషువా గారు

**"ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు**
**నలుగురు కుమారులనుట విన్నాము కాని**
**పసరము కన్న హీనుడభాగ్యుడైన**
**అయిదవ కులస్థుదెవరమ్మ సవిత్రి"** అని ప్రశ్నించారు.

ఎ. దుర్గా ప్రసాద్ "ఎండిన చర్మంపై వార్త" అనే కవితలో

**"చీమూ నెత్తురూలేని ఈ మీడియాలన్నీ**
**పంగనామాలు పెట్టుకున్న**
**బ్రహ్మ ముడ్డి కింద పద్మ దళాలే**
**పుర్రె, రెండెముకలున్న చిత్రపటాన్ని**
**ఈ దేశ ముఖానికి తగిలిస్తున్నాం**
**ఇక మా డప్పుల చాటింపుతోనే**
**వార్తల్ని పదునెక్కిస్తాం"** అని బ్రహ్మపై వ్యతిరేకతను చాటారు.

**9) నాస్తిక ధోరణి:**

దళిత రచయితలు రాముడు, శ్రీ కృష్ణుడు, శివుడు మొదలైన వారిపై దుమ్మెత్తిపోస్తూ తమ నాస్తిక ధోరణిని చాటుకున్నారు. రాంరెడ్డిగారు "కాస్త సిగ్గు పడదాం" అనే ఖండికలో

**"భక్తుడి శిరశ్ఛేదనం చేసేవాడు**
**వాడు రాముడైనా దేవుడెట్టా అవుతాడ్రా!**
**శిష్యుడి బొటనవేలునే కోసేసినోడు**
**వాడు బాపనోడైనా గురువెట్లా అవుతాడు**
**సాటి మనుషుల్ని కీటకాలకన్నా తక్కువ చేసి మనం**
**అసలు మనం మనుషులమెట్లా అవుతాంరా!**
**.......................................**
**మన బుర్రలో దేవుళ్ల పెంటనింపి**
**ఇంతకాలం మనమొకాళ్ని పీతిరిగుట్టల్ని చేసిన**
**ఈ ముక్కోటి దేవతల్ని ఎగిరితందాం రండి"** అని

అసమానతకు ప్రధాన కారణమైన దేవుళ్ళను తీవ్రంగా విమర్శించారు.

**2) దళిత సంస్కృతిని ప్రతిష్ఠించేవి:**

దళిత సంస్కృతిని ప్రతిబింబించే కవితల్ని దళిత కవులు వెలయించారు. ఇందులో దళిత సాహిత్యానికి సంబంధించిన సిద్ధాంతాలు దర్శనమిస్తాయి. అవి

1. దళిత నాయకస్తుతి
2. దళిత సంఘీభావ కాంక్ష
3. దళితులకు విద్యావకాశాన్ని ప్రబోధించడం
4. దళితులకు కర్తవ్య బోధ
5. దళిత స్త్రీ – సౌందర్య వర్ణన
6. వర్ణాంతర వివాహాల ప్రోత్సాహం
7. శంబుకుణ్ణి స్మరించడం
8. ఏకలవ్యుణ్ణి స్మరించడం
9. రిజర్వేషన్ల పరిరక్షణ
10. దళితులకు రాజ్యాధికారం

**1) దళిత నాయక స్తుతి:**

దళిత కవులు దళితుల అభ్యుదయం కోసం కృషిచేసిన దళిత నాయకులను స్తుతించారు. అంతేకాక దళిత ఉద్యమ నిర్మాతలను, నిరంతరం నిర్విరామంగా దళిత అభ్యున్నతి కోరుకునే వారిని స్తుతించారు, స్మరించారు.

పద్మశ్రీ బోయి భీమన్న గారు రాసిన పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇది రాని దళితుడు లేడంటే అతిశయోక్తి కాదు. దళిత సభలకు, సమావేశాలకు ఇదే ప్రార్థనాగీతమైంది,

**"జయ జయ అంబేద్కర**
**జయ జయ భారత భాస్కరా**
**నవభారత సంవిధాన**
**ధర్మపదక నిర్మాతా**
**వేదాలను శోధించి**
**వేదాంతము నధిగమించి**
**మనిషి మనిషి గా బ్రతుకుటె**
**మహితమన్న మహాశయా"**

మాష్టార్జీ రాసిన దళిక నాయక ప్రశంసతో కూడిన పాట కూడా ప్రచారం పొందింది. ఈ పాట కూడా దళిత సభల్లో సమావేశాలలో వింటుంటాం.

**"అందుకో దండాలు – బాబా అంబేద్కర**

**అంబరాన ఉన్నట్టి – సుక్కలు గురువంగో**

**ముందుగా నిను దలచి – పాటలు పాడేము**

**చీకటిమా బ్రతుకుల్లో – సూర్యుడు పొడవంగో"**

అలాగే 'సవేరా' గారు దళిత ఉద్యమాలకు ప్రధాన కారకులైన నాయకుల్ని

**"దళిత సింహము మేలుకొన్నది**

**భరత ఖండము నేలనున్నది**

**దళిత మానవ మార్గదాతగు**

**గౌతముని బోధనల నెరిగి**

**దళిత విప్లవ పితామహుడగు**

**పూలె మహాత్ముని స్మరించి**

**దళిత ఉద్యమ నాయకుడు పెరి**

**యార్ రామస్వామి నరసి**

**దళిత బహుజన వైతాళికుడగు**

**డాక్టరంబేద్కరుని తలచి"** అని స్తుతించారు.

**2) దళిత సంఘీభావ కాంక్ష:**

దళితులంతా ఏకం కావాలని దళిత కవులు ఆకాంక్షించారు. దళితుల్లో ముఖ్యంగా రెండు వర్గాలున్నాయి. ఒకటి మాల వర్గం, రెండు మాదిగ వర్గం. రెండు వర్గాలకూ ఎప్పటి నుండో వైరమున్నా అందరూ కలిసి మెలసి ఉన్నారు. రాజకీయ నాయకులు స్వార్థంతో వీరిని రెండుగా చీల్చారు. రాజకీయ నాయకుల కుట్రగ్రహించి రెండు వర్గాలు ఏకం కావాలని దళిత కవులు కాంక్షించారు, గుర్రం జాషువాగారు రెండు చర్చులు, రెండు విధాలు ఉండకూడదని పిలుపునిచ్చారు. భీమన్న గారు మాల, మాదిగలు ఏకం కావాలని 'మామాలు' అనే పేరుతో కవిత్వం రాశారు.

సతీష్ చందర్ "కలవని కనుపాపలు" అనే కవితలో

**"నేను నా సహచరుడు**

**నలుదిక్కులా ప్రయాణించి**

**ఒకే ఒక్క తామర పువ్వును కోసుకొచ్చి మేమిక**

**ఎన్ని కిరణాలతో గణించుకున్నా**

**మా చుట్టు ఒకే ఒక సూర్యోదయం"** అంటూ

దళిత ఐక్యతను మనసారా కోరుకున్నారు.

**3) దళితులకు విద్యావకాశాన్ని ప్రబోధించడం:**

దళితులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే విద్యే ముఖ్య సాధనమని అంబేద్కర్ అనేక సందర్భాలలో చెప్పారు. తమకు జరిగిన అన్యాయాలని ఎదుర్కోవడానికి, తాము బాగుపడటానికి దళితులు విద్యావంతులవ్వటమే మార్గమని ప్రబోధించారు. ఎప్పుడైతే చదువు వస్తుందో అప్పుడే పోరాడే శక్తి కలుగుతుంది. అందరూ ఏకమై తమ హక్కుల సాధన కోసం, న్యాయం కోసం పోరాడగలరని చెప్పారు అంబేద్కర్. ఇవే భావాలను దళిత కవులు తమ కవితల్లో చెప్పారు.

జి. ఆర్. కుర్మెగారు "వాణ్ణి గుర్తించడం మానుకో' అనే కవితలో

**"నువ్వు వాణ్ణి ఆరాధిస్తున్నన్నాళ్ళూ**
**వాడు నిన్ను అణగదొక్కుతూనే వుంటాడు**
**నువ్వు సంకోచమైనప్పుడల్లా**
**వాడు వ్యాకోచిస్తూనే వుంటాడు**
**నువ్వు అడిగే స్థాయికి ఎదిగావనుకో**
**వాడు తోక ముడుచుకుంటాడు**
**నువ్వు అధిగమించే స్థితికి చేరావనుకో**
**వాడిక అలుపులేకుండా పోతాడు**
**నువ్వు మేధావిగా రూపొందేదాక**
**వాడు తన మెదడు బూజు దులుపుకోడు"** అని

దళితులు చదువుకుంటే ఆత్మగౌరవంతో బ్రతకవచ్చని ప్రబోధించారు.

**6. దళితులకు కర్తవ్య బోధ:**

దళిత కవులు దళితులకు స్వార్థం కోసం కులాన్ని వాడుకోవద్దని, పాలక వర్గాల చేతిలో పావులుగా మారవద్దని, వారికి దళారులుగా, కిరాయి గూండాలుగా, కీలు బొమ్మలుగా తయారుకావద్దని కర్తవ్య బోధ చేశారు.

శ్రీ రావురి ఏకాంబరం గారు "దళిత మేధావులు" అనే ఖండికలో

**"దళిత మేధావులు కలమెత్తి గళమెత్తి**
**ధ్వజ మెత్తవలె జాతి ప్రగతి కొరకు**
**దళిత మేధావులు దాసోహములుమాని**
**సిగబట్టి హక్కులు నూకవలయు**
**దళిత మేధావులు దండకమ్ములుమాని**
**దళితుల గాథలు తవ్వవలెను**
**దళిత మేధావులు దాస్యభాష్యాల్‌మాని**
**సూటిగా సత్యమున్ చాటవలెను"** అని

దళితులకు కర్తవ్య బోధ చేశారు.

**5) దళిత స్త్రీ సౌందర్య వర్ణన:**

దళిత స్త్రీ వర్ణనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు దళిత కవులు. దళిత స్త్రీ సౌందర్యాన్ని అభినందించడం మెచ్చుకోదగింది. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారు

**"నీ నెత్తి మీద ఇనుప గమేళం**
**విశ్వసుందరి కిరీటాన్ని సైతం వెక్కిరిస్తోంది**
**పదునెక్కిన కొడవలివై**
**సివంగిలా నువ్వుకోతకు పోతూవుంటే**
**నీ చుట్టూరా ఆవరించిన ప్రకృతి వర్ణాలు**
**నీకు పాదాక్రాంతం అవుతున్నట్టే వుంటాయి**
**తాటాకు గొడుగుకింద**
**సగం తడుస్తూ నువ్వు నిలబడ్డప్పుడు**
**నిన్ను పొదుగుకునేందుకు**
**పొడిమబ్బులు నేలకు దిగుతాయి"** అని

దళిత స్త్రీ శ్రమ సౌందర్యాన్ని అభివర్ణించారు. ఇంకా ఎండ్లూరి సుధాకర్ గారు 'నీలిక" అనే కవితలో

**"ఓనా చండాలికా**
**నీ వెండి కడియాల కాళ్ళముందు**
**వెయ్యేళ్ళ కావ్య నాయకులు వెలవెలబోతున్నారు**
**అలంకార శాస్త్రాలన్నీ నీపాటి మట్టి మెరుపు ముందు**
**బలాదూరే**
**నా నల్ల పిట్టా**
**నిన్ను వరాంగివనీ, కృశాంగివనీ**
**లతాంగివనీ మభ్యపెట్టను**
**నా జాతి పుష్పమా ! నా నీలమణీ**
**నీ అందాన్ని బహిష్కరించిన అక్షరాల్ని**
**ఇవాళ నేను వశీకరించుకున్నాను"** అని

మన ప్రాచీన కావ్యాల్లో ముఖ్యంగా సంప్రదాయ సాహిత్యంలో దళిత స్త్రీ లేకపోవడాన్ని నిరసించారు.

**6) వర్ణాంతర వివాహాల ప్రోత్సాహం:**

భారతదేశంలో కులవ్యవస్థ పోవాలంటే వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించాలని దళిత కవులు అభిప్రాయపడ్డారు.

అందుకే వర్ణాంతర వివాహాలను తమ సాహిత్యం ద్వారా ప్రోత్సహించారు. "అంబేద్కరో సమర సింహో" అనే కావ్యంలో శ్రీ రావూరి ఏకాంబరంగారు బ్రాహ్మణులు వర్ణాంతర వివాహాలకు సిద్ధపడుతున్నా శూద్రులు ముందుకు రావటంలేదని, మాల, మాదిగలు కూడా తమలో తాము అంతర వివాహాలను ఆహ్వానించడం లేదని వాపోయారు.

**"బాహ్మణులు నయము బారులు దీరుదు**
**రస్పృశ్యులను బెండ్లియాడగాను**
**కత్తుల దూయును కడముకులజులెల్ల**
**రస్పృశ్యులను బెండ్లియాడుటన్న**
**వేలాది చిల్లరకులములు వారెల్ల**
**వర్ణ సాంకర్యమున్ జేరనీరు**
**మాలలు మాదిగల్ మడి గట్టుకొందురు**
**అంతర్వివాహేల గొంతునులము"**

**7. శంబుకుడిని స్మరించడం:**

దళితకవులు హిందూమత సిద్ధాంతాలకు బలైన శంబుకుణ్ణి స్మరించారు తమ రచనల్లో. గురుకులంలో విద్య నభ్యసిస్తున్న శంబుకుడు కులం కారణంగా, అకారణంగా రాముడి చేతిలో వధింపబడడాన్ని తీవ్రంగా నిరసించారు.

**8. ఏకలవ్యుడిని స్మరించడం:**

కులం కారణంగా బ్రొటనవేలు ఖండించబడిన ఏకలవ్యుడిని దళిత ఉద్యమ ప్రేరకుడిగా గ్రహించి హిందూమత సంకుచిత వైఖరిని తీవ్రంగా ఖండించారు దళితకవులు. "పంచమవేదం" అనే కవితలో శ్రీ సతీష్ చందర్ గారు

**"నిజం చెప్పండి.**
**పంచముడంటే అయిదోవేలు లేని వాడనేనా అర్థం?**
**మా ముత్తాత ఏకలవ్యుడు చెప్పాడు**
**ఏకలవ్యుడు కూడా**
**భారతంలో ఓ దిష్టిబొమ్మ**
**...........................**
**ఏకలవ్యుడు దేవుళ్ళకు కాకుండా**
**తల్లికే పుట్టాడు**
**...........................**
**వీరుడు ఏకలవ్యుడు**
**శవాలను చంపడు**

**రేపు అడవిలో ఏకలవ్యుడు**

**వాళ్లను ఉచితంగా దహనపరచి**

**నా రుణం తీర్చుకుంటాడు"** అని ఏకలవ్యుణ్ణి ప్రస్తావించారు

**9) రిజర్వేషన్ల పరిరక్షణ:**

దళితులకు వున్న రిజర్వేషన్లని వ్యతిరేకించే వారిని దళితకవులు తీవ్రంగా నిరసించారు. రిజర్వేషన్లు ఉండటంవలన కొంతమేరకు దళితులు బాగుపడుతున్నారని దళితకవులు అభిప్రాయ పడ్డారు. రిజర్వేషన్లు పరిరక్షించుకోవాలని దళిత సాహిత్యం కోరుకుంటుంది. ఆచార్య కె. సుదర్శన్ రాజుగారు రిజర్వేషన్ల పేరుతో ఇచ్చే రాయితీలు కేవలం వడ్డీ మాత్రమే, అసలు ఎప్పుడు తీరుతుందని ప్రశ్నించారు.

**"తరతరాల శ్రమదోసిన**

**రుణగ్రస్తపు దొరలారా**

**అసలు ఎప్పుడు తీరుస్తారు**

**వడ్డీ మాత్రమే రిజర్వేషన్లు"**

"ప్రాథమిక హక్కు" అనే కవితలో శ్రీ మద్దూరి నగేష్ బాబుగారు

**"మీరంతా మొత్తుకుంటున్నట్టు**

**రిజర్వేషనంటే సౌకర్యమో సదుపాయమో కాదు తండ్రీ**

**అదొక పచ్చబొట్టు**

**అదొక ప్రాథమిక హక్కు"** అని

రిజర్వేషన్లను ప్రాథమిక హక్కుగా పరిగణించమన్నారు.

**10) దళితులకు రాజ్యాధికారం:**

భారతదేశంలో ఎక్కువ జనాభా గలవారు దళితులు. తక్కువ సంఖ్యలో ఉండే వారు అగ్రవర్ణాలవారు. ఈ దేశాన్ని పాలిస్తున్నవారు తక్కువ జనాభాకు చెందిన అగ్రవర్గాల వారు ఇది అన్యాయం. నూటికి ఎనభై ఐదు శాతానికి పైగా హరిజన, గిరిజన, వెనుకబడిన, మైనార్టీ వర్గాలకు చెందినవారు ఈ దేశంలో నివసిస్తున్నారు. కాబట్టి వీరంతా కలిసి దళిత వర్గానికి రాజ్యాధికారం సాధించడం కోసం పోరాడాలని దళిత సాహిత్యం ప్రబోధిస్తుంది.

"పిలుపు" అనే కవితలో దర్భశయనం శ్రీనివాసాచార్యగారు కేంద్ర బిందువు దగ్గర, నీ అస్తిత్వాన్ని ప్రకటించాలి అని అనడం రాజ్యాధికారానికి రమ్మని పిలుపునివ్వడమే.

**"నిన్ను నువ్ పిల్చుకో**

**నువ్వేమిటో తేల్చుకో**

**లోనుంచి కదలికతో**

**తలెత్తుకుని నడచిరా**

**కేంద్ర బిందువు దగ్గర**
**నీ పాట విన్పించు**
**నీ అస్తిత్వాన్ని ప్రకటించు"**

అందుకే దళితకవులు మాకు ఎర్రకోట కావాలని కోరుతున్నారు.

**"ఢిల్లీ మీదికి దండు కదిలితే**
**గుండె చెదిరివాడు కోటా ఇస్తున్నాడు**
**ముందుంది ముసళ్ళ పండగ**
**కోటాకాదు – వాటా కాదు**
**ఎర్ర కోటే కావాలి మాకు"** అని

రాజ్యాధికారం కావాలని ఆకాంక్షిస్తున్నారు.

## 15.2. మైనార్టీ వాదం:

భారతదేశంలో భిన్నమతాలున్నాయి. అత్యల్ప సంఖ్యలో ఉన్న మతాలను మైనార్టీలు అంటారు. జైనం, బౌద్ధం స్వీకరించిన వారు అత్యల్ప సంఖ్యలో ఉన్నప్పటికీ వారి అస్తిత్వం ప్రశ్నార్థకం అయిన సందర్భాల కన్నా వారికంటే అధిక సంఖ్యలో ఉన్న ముస్లింల అస్తిత్వం ప్రశ్నార్థకం అయిన సందర్భాలు ఎక్కువగా కనిపిస్తాయి. కనుక మైనార్టీ వాదం అంటే ఇక్కడ ముస్లింవాదంగానే పరిగణిస్తాం. తెలుగు సాహిత్యంలో ముస్లీములు ఎక్కువగానే రచనలు చేశారు. వీరు భారతదేశంలో మైనార్టీలుగా పిలువబడుతున్నారు. ముస్లిం కవులు ఎప్పుడూ తమ స్వార్థం కోసం కానీ, తమ తమ మత ప్రచారం కోసం కానీ కలం పట్టలేదు. విశ్వమానవ కళ్యాణమే వారి ధ్యేయం. వజీర్ రహ్మాన్, ఇస్మాయిల్, స్మైల్, దేవిప్రియ, సుగమ్ బాబు, కౌముది మొదలైన ముస్లిం కవుల కవిత్వంలో ఎక్కడా ముస్లింవాద భావాలు లేవు. భారతదేశంలోని అనేక అంశాలను తీసుకొని అద్భుతంగా కవిత్వాన్ని రాశారు. భారతదేశంలో మతతత్వం రోజు రోజుకు ఎక్కువై ఇతర మతాలవారిని దూషించడం, కించపరచడం, కొట్టడం చేశారు. ఆ ప్రభావం ముస్లిం కవులపై పడింది. 1992 డిశంబర్ 6వ తేదీన బాబ్రీ మసీదును మత ఛాందసులు ధ్వంసం చేయగా ముస్లిం హృదయాలు గాయపడ్డాయి. భారతదేశంలో ముస్లింలకు రక్షణలేదని భయపడ్డారు, ఈ దేశంలో బ్రతకలేమని ఆందోళన చెందారు. ముస్లిం సోదరులు అందరూ సంఘీభావంతో ఏకమయ్యారు. ముస్లింలకు జరిగిన అన్యాయాల్ని ఆక్రమాల్ని వ్యతిరేకించడం కోసం హిందూ మత ఛాందసభావాల్ని నిరసించడం కోసం ముస్లిం కవులు కలాన్ని కత్తిగా వాడారు. ముస్లిం స్పృహతో తమ కలాన్ని బలంగా వాడిన ముస్లిం సోదరులు అనేకమంది ఉన్నారు. ఖాదర్, అఫ్సర్, ఖాజా, స్కైబాబా, జువేద్, ఇక్బాల్ చంద్, యాకుబ్, ఖాదర్, గౌస్, మహమూద్ ఆలి, అబ్బాస్, అక్బర్ షాజహాన్, అన్వర్, గఫార్, కరీముల్లా మొదలైనవారు మంచి ముస్లింవాద కవిత్వాన్ని సృష్టించి అందరి మన్ననల్ని, ప్రశంసలను అందుకున్నారు. ముస్లింవాద కవిత్వం కోసం మహిళా ముస్లింలు కలంపట్టారు. షాజహాన్, మహెజబీన్, షెహనాజ్, షంషాద్, జవేరియా మొదలైన కవయిత్రులున్నారు.

### 15.2.1. ముస్లిం కవిత్వం – దృక్పథాలు:

ముస్లింవాద కవిత్వంలో మూడు కోణాలు కన్పిస్తున్నాయి.

1) మైనారిటీలుగా తమపై వివక్షను, అణచివేతను నిరసించడం

2) ఇస్లాం పేరిట మత పెద్దలు, మైనారిటీ నాయకులు అనుసరిస్తున్న అవకాశవాద ధోరణిని వ్యతిరేకించడం

3) ఇస్లాం మహిళల్ని అవమానపరచే ధోరణిని తిరస్కరిస్తూ సంస్కరణల్ని ఆశించడం

ముస్లిం కవులు తమ ఉనికిని గుర్తించమంటూ కవితలు రాశారు. మాపై ఎవరైనా కుట్రలు వగైరాలు చేస్తే చెల్లుబాటు కావని బలమైన కేకవేశారు. ఈ కేకతో అందరూ ఆలోచనలోపడ్డారు, చైతన్యవంతులు అయ్యారు. తమ స్వంతగడ్డ అయిన భారతదేశంలో పరాయి వాళ్ళుగా బతక వల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు ముస్లింవాద కవులు.

**"నా దేశంలోనే కాందిశీకుణ్ణి"** అని ఖాదర్ గారు ఆందోళన చెందారు.

ఎమ్.డి. యాకూబ్ బాషా గారు

**"ఇక ఎలాంటి కుట్రా చెల్లుబాటు కాదు**
**ఏ నీతి నన్ను 'డెమోక్రీస్ చెయ్యదు**
**ఇప్పుడు నేను ఇమామ్‌ను – రసూల్‌ను"** అని

తమ స్వరాన్ని వినిపించి ముస్లింలలో ఆత్మవిశ్వాసాన్ని నెలకొల్పారు.

జావెద్ గారు –

**"పుట్టక పోవడంకన్నా**
**పుట్టిన చోట బతకలేకపోవడం దారుణం"** అని

తన బాధను వ్యక్తం చేశారు. గత చరిత్రల కుట్రల నుంచి బయటపడలేక పోతున్నానని వాపోయారు.

**"నా మాతృదేశంలో – నేను**
**సమూహంలో ఒకడిగా జీవించడం నా జన్మహక్కు**
**ఈ నేలలోనే నాటుకొని మొలకెత్తినవాణ్ణి"** అంటూ

ఇంకా

**"మొలతాళ్ళు రిబ్బన్లు పిన్నీసులు**
**పిల్లన గ్రోవులను వేలాడేసుకొని**
**వూరూరా తిరిగే మా ప్రభ**
**నా దీర్ఘకాల దరిద్రదశని ఉపన్యసిస్తుంది**
**పువ్వులమ్మి, అమ్మి పుప్పొడిని కోల్పోయిన వాళ్ళం**
**గిన్నెలకు మాట్లేసి, మాట్లేసి సొట్టబోయినవాళ్ళం**
**పాన్ బీడీలమై ఎవరెవరి దవడలకిందో**
**నలుగుతున్న వాళ్ళం"** అని

చిన్న చిన్న పనులు చేసుకొని బ్రతకవలసిందే అని తన బాధను వ్యక్తం చేశారు సయ్యద్ గఫార్ రారు. ముస్లింలపై ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా నెరవేరవని తమ దృక్పథాన్ని నిర్మొహమాటంగా

**"విభజించి పాలించేనా శత్రువుల్లారా**
**నన్నెవరూ రెండుగా చీల్చలేరు**
**నా కనుపాపల్ని ఎవరూ పేల్చలేరు"** అని తెలిపారు.
**"ఈ దేశపటాన్ని చుట్టిచుట్టి నీకింద పెట్టుకోవడానికి**
**అది నీ అయ్య జాగీరు కాదు**
**అంగట్లో దొరికే కుంకుమకాదు దేశభక్తి**
**తెగిన దేశ సరిహద్దు రేఖని**
**అతికిన వీరజవానుల్లో మేము వున్నాం"** అంటూ

ముస్లింవాద కవి తమ అస్తిత్వాన్ని గురించి ఆందోళన చెందుతారు.

గౌస్ గారు

**"ఈ మట్టి నీ ఒక్కడి దేహమేనని బుకాయిస్తూ**
**ఈ భూమిపై నా అస్తిత్వాన్నే**
**అనుమానిస్తున్నంత కాలం**
**అవే అవే ఖచ్చితంగా నీ కాందీశీకుణ్ణే"** అంటారు.

హిందూమతం నాలుగు వర్ణాలవారిని సృష్టించింది. ఆ తర్వాత మాలమాదిగల్ని పంచమవర్ణంగా పిలిచారు. అసలు పంచమ వర్ణమే తప్పంటే ముస్లింలు ఆరోవర్ణంగా పిలవబడుతున్నారు.

ఇక్బాల్ చంద్ గారు "ఆరోవర్ణం' అనే కవితలో

**"నా తెగిన వేళ్ళను తిరిగి ఇవ్వొద్దుకానీ**
**నా మెడకు తగిలించిన నీచ వర్ణపుబిళ్ళ**
**నా బిడ్డలకూ తగిలించమని నాకు మాటివ్వండి"** అన్నారు

దిలావర్ గారు ముస్లింవాద దృష్టితో

**"నేను కసాయిబును కాదు**
**అనివార్య హింసావృత్తిలో జీవన పరమార్థాన్ని**
**దర్శించే ముస్లిం ధర్మవ్యాధుణ్ణి"** అన్నారు.

అఫ్సర్ గారి మైనార్టీ కవిత్వంలో ఎన్నో చేదునిజాలు చెప్పారు.

**"నలభై ఏడుతో కాదు**
**నాతో నన్నే**
**భాగించమంటాను**
**నా నవ్వులూ ఏడ్పులూ**

**నా అవయవాలూ**

**అనుమానాలూ**

**నా మానభంగాలూ హత్యలూ**

**అన్నీ మీవి కూడా అంటాను.**

**నా తల్లి ఉమ్మనీరును ఉమ్మి చెయ్యొద్దంటాను"**

అని ఆవేదన వ్యక్తీకరించారు.

ముస్లిం రచయిత్రులు ముస్లిం మహిళకు జరిగిన అన్యాయాలను, అక్రమాలను విమర్శిస్తూ రచనలు చేశారు. షాజహానా, ఎన్. రజియా షంషాద్, మహెజబీన్ మొదలైనవారు కవిత్వాన్ని రచించారు. తెలుగులో ముస్లిం స్త్రీ గురించి రాసిన మొట్టమొదటి ముస్లిం స్త్రీ షాజహానా గారు. ఈమె "పర్దా హఠాకే దేఖో" అనే కవితలో

**"వెర్రి ఆచారాలు మత్తి వృక్షాలు**

**అరబ్ కబేళాలలో ఆడదాని మాంసానికింత రేటుందని తెలియనిదాన్ని**

**కలలో అనుభవించడానిక్కూడా అర్హతలేనిదాన్ని"** అంటూ

పుట్టిన దగ్గర నుంచి ఆంక్షల్లో, హద్దుల్లో పెరిగి ఆడబానిసగా తయ్యారయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు.

**"మాటలు రానప్పుడు ఏమోకానీ**

**పోరాటం చేయగలిగినప్పుడూ**

**చేతులు కట్టుకొని కూర్చోవడం ఇకపై**

**నావల్లకాదు ..........."** అంటూ షాజహానాగారు,

ఎన్. రజియా గారు "అలాగే అన్నారు" అనే కవితలో

**"బాల్యంలో**

**చిన్న పిల్లవి నీకేం తెల్సు కూర్చో" అన్నారు**

**యవ్వనంలో**

**"ఉడుకు రక్తం – మంచీ చెడూ తెలీదు కూర్చో" అన్నారు**

**వృద్ధాప్యంలో**

**"ముసల్దానివి ఇంకేం చేస్తావ్ కూర్చో" అన్నారు**

**అవకాశం రానందుకు కోపంగా లేదు నాకు**

**కూర్చుని, బద్ధకం వచ్చినందుకు బాధగా వుంది"** అంటూ

భారతీయ స్త్రీ స్థితిని తెలిపారు.

**"నాన్నను చూస్తుంటే**

**అజ్నబీని చూస్తున్నట్లుంటుంది**
**ప్రేమలేని తనంలో రక్తసంబంధం**
**ఆనవాలు లేకుండా పోయింది"** అంటారు. మహెజబీన్.

షంషాద్ బేగంగారు "పర్సనల్ లా" అనే కవితలో

**"అయిదు నెలలకే నాలుగు నెలల కడుపుచేసి**
**తలాక్ ఇచ్చి వెళ్ళగొడతాడని నాకేం తెలుసు**
**చేసిన మోసానికి**
**షాదీలో నానీ చేయించిన ఛల్లా లాయర్ ఫీజుగా చేసి**
**కోర్టు వరకు వెళుతుంది**
**తలాక్ ఇవ్వగానే ఏ బంధాలతో సంబంధం లేదనే**
**మగతనపు ధీమా మరోసారి సెహరా కట్టించుకుంది**
**క్రాస్ ఎగ్జామిన్‌లో వకీలడిగే ప్రశ్నలు పోలీస్ లాఠీపై**
**నా సమాధానాన్ని లాకప్‌డెత్ చేస్తాయి.**
**మూడు నెలల ఇద్దత్ కాలానికి మనోవర్తి చెల్లించాలనే**
**తీర్పు మరో మూడేళ్ళకొచ్చింది**
**నా "పర్సనల్ లా" యే నాకిది చాలన్నప్పుడు**
**ఇక దేనికి మొరపెట్టుకోవాలి సగటు ముస్లిం స్త్రీ"**

అంటూ ముస్లిం స్త్రీల వివాహం, విడాకులు వారి జీవితాలకు ఎలా శాపంగా మారుతున్నాయో తెలిపారు.

ఈ విధంగా ముస్లింవాద కవిత్వం కూడా తెలుగు సాహిత్యంలో తనదైన ప్రాధాన్యతను నిలుపుకుంటుంది. ఈ కవిత్వంలో ప్రత్యేకత ఉర్దూ పదాలను ఎక్కువగా ఉపయోగించటం. అంటే తెలుగు కవిత్వానికి ఉర్దూ భాషా సౌందర్యాన్ని జతచేసి రాస్తారు. ముస్లిం సంస్కృతి – సంప్రదాయాలను ముస్లింవాద కవిత్వం ప్రతిబింబిస్తుంది.

## 15.3. ప్రాంతీయ వాదం:

ప్రాంతీయ వాదం అనేది ఒక ప్రాంతంవారు తమకు జరిగే వివక్షను గుర్తించి దాన్ని గురించి ప్రశ్నించడం, నిరసించడం, ధిక్కరించడం. ప్రాంతీయ భావన ఈ రోజుల్లో శాస్త్రీయంగా అవగాహన చేసుకోలేనివారు దీనిని వేర్పాటువాదం అంటున్నారు. వాస్తవానికి ఈ ప్రాంతీయ భావన అనేది ప్రపంచ వ్యాప్తంగా ఉంటుంది. ఒక ప్రాంతంలో పుట్టి, పెరిగి, ఆ భౌగోళిక ప్రాంతాన్నే నమ్ముకొని జీవిస్తున్న ప్రజలపై ఆ ప్రాంతాలకు వలస వచ్చినవారు అధికారం చెలాయిస్తే ప్రాంతీయ భావం జనిస్తుంది. అది తీవ్ర రూపం దాలిస్తే ప్రాంతీయవాదంగా రూపుదాలుస్తుంది. అక్కడి ప్రజలు తమ అస్తిత్వాన్ని, గుర్తింపుని కోరుకుంటారు. అక్కడి సామాజిక సమస్యలను తీసుకొని రాసే సాహిత్యం ప్రాంతీయ అస్తిత్వ సాహిత్యం అవుతుంది.

మొదట్లో ఒక ప్రాంతం జీవన విధానాన్ని, సంస్కృతిని, స్థితిగతుల్ని ప్రతిఫలించే విధంగా ప్రాంతీయ సాహిత్యం

వచ్చింది. దానిలో అస్తిత్వ చైతన్య ధోరణి ఉండకపోవచ్చు. ఒక సామాజిక చైతన్యంతో వచ్చేది అస్తిత్వ సాహిత్యం అవుతుంది. తెలుగు భాష మాట్లాడేవారు స్వతంత్ర్యం లభించిన తర్వాత ప్రత్యేక భాష, ప్రత్యేక భౌగోళిక ప్రాంతాన్ని ఆధారంగా చేసుకొని ప్రత్యేక రాష్ట్రంగా మారాలని కోరుకున్నారు. అప్పటి కవిత్వంలో ఈ స్పృహ మనకు కనిపిస్తుంది.

**"కోటి తమ్ముల కడ రెండు కోట్ల తెల్గు**
**టన్నలను గూర్చి వృత్తాంమందజేసి**
**మూడు కోటల నొక్కటే ముడి బిగించి**
**పాడినాను మహాంధ్ర సౌభాగ్య గీతి"** అని

నాటి కవులు తెలుగువారు ఏకం కావాలని ఆకాంక్షించారు.

తమ అస్తిత్వం కోసం

**"మాకెవ్వల సొమ్ము అక్కర్లేదు**
**మాయి మాకు దక్కితే సాలు**
**మా ఆరాటంలో అలజడి ఉన్నది**
**అన్నాలమైపోయిన మొత్తుకోలున్నది**
**బొండిగల నిండా బాధలున్నాయి**
**నడిమిట్ల పెత్తనం దొరికిచ్చుకొని**
**చెలాయించే టోల్లకాడ**
**అనిగి మనిగి పడ్డది సాలు**
**మాకు సోయి లేదనుకోకండ్రి**
**అనుభవాలు మాకు అన్ని నేర్పినయి"** అని కవులు నినదించారు.

**15.3.1. ప్రాంతీయవాద సాహిత్య లక్షణాలు:**

అ) అన్నిటినీ పునర్మూల్యాంకనం చేయటం

ఆ) తమ స్థితిని తలచుకొంటూ ఆయా చారిత్రక, ఆర్థిక, రాజకీయ కారణాల్ని అన్వేషించడం

ఇ) తమ అభివృద్ధికి ఇతర ప్రాంతాలవాళ్ళే ఆటంకమనే ఆరోపణలు చేసి, అవి నిజమని నిరూపించే ప్రయత్నంలో అప్పటికున్న ప్రమాణాలను తిరస్కరిస్తూనే కొత్త ప్రమాణాల్ని తయారుచేయటం.

ఈ) దైనందిన జీవితంలోని అనేక అంశాల్ని సాహిత్యీకరిస్తూ కొత్త సూత్రీకరణల్ని అందించటం

ఉ) ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తమ ప్రాంత రచయితలు కూడా ఇతర ప్రాంతాల వాళ్ళ ప్రభావం వల్ల స్వీయ అస్తిత్వాన్ని కోల్పోతున్నారని ఆవేదన చెందటం

ఊ) ప్రతి సమస్యనీ ప్రాంతంతో ముడిపెట్టి చూడటం

**"ఇప్పుడు**

**నాకు నా నేల కావాలి**

**నాకు నా గాలి కావాలి**

**నాకు నా నీరు కావాలి**

**నా ఊరు కావాలి"** అని ప్రాంతీయవాద కవులు నినదించారు.

రాష్ట్రంలోని రాయలసీను, కళింగాంధ్ర, మధ్యాంధ్రలతో ప్రాంతీయవాదం కనిపిస్తున్నా ఎక్కువమంది రచయితలు దీనిని ప్రపంచీకరణలో భాగంగానే చూస్తున్నారు. కరువు, ఈ మూఢ విశ్వాసాలు వంటి విషయాల్లో స్పందించే రాయలసీమ, కళింగాంధ్ర కవులు తమ సాంస్కృతిక అంశాలపట్ల కూడా దృష్టి కేంద్రీకరించాలి.

"తూరుపు" (కళింగాంధ్ర కవిత్వం), "పొరువు" (రాయలసీమ కవిత్వం) వచ్చాయి. కవిత్వం కన్నా ప్రాంతీయ వాదంతో కథలే ఎక్కువ వచ్చాయి.

**ఆధార గ్రంథాలు:**

1) తెలుగు సాహిత్య విమర్శ, సిద్ధాంతాలు – ఆచార్య వెలమల సిమ్మన్న.

2) తెలుగులో కవిత్వోద్యమాలు – తెలుగు అకాడమి.

3) వివక్షధిక్కార స్వరమే ప్రాంతీయ అస్తిత్వ సాహిత్యం (వ్యాసం) – ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

**– డా॥ జి. స్వర్ణలత**